www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి

మంగళవారం | 2-1-2018 | పేజీలు: 16 + 20 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 173 | శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి ఉ. 7.54 వరకు తదుపరి పాడ్యమి తె.4.08; నక్షత్రం: ఆరుద్ర ఉ. 11.47 వరకు తదుపరి పునర్వసు; వర్జ్యం: రా. 10.18-11.42; దుర్ముహూర్తం: ఉ. 9.02-9.46, రా. 10.16-10.56; అమృతఘడియలు: ఉ. 6.52-8.06; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 5.49 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai


వాగు వట్టిపోతోంది. ఊరి దాహం తీర్చే చెలిమెలో చెమ్మ ఆవిరవుతోంది. నీరే ఆధారమైన రైతు నిస్సహాయుడై చూస్తుండగా.. వాగుల్లోని ఇసుక... ప్రభుత్వ పనుల పేరుతో ఊరు దాటి.. ప్రైవేటు పరం అవుతోంది. ఒక్క వే బిల్లు మీద డజన్ల సంఖ్యలో ట్రాక్టర్లు, లారీలు ట్రిప్పుల మీద ట్రిప్పులు కొడుతున్నాయి. వాగులో ఇసుకను తోడేస్తున్నాయి. రోజుకు కొన్ని వందల లారీల/ట్రాక్టర్ల ఇసుక అర్ధరాత్రి అడవుల్లో చెట్ల పొదల చాటునో.. గడ్డి వాముల మాటునో దాగి.. తెల్లారేక లారీల్లో దర్జాగా నగరాలకు చేరి.. అపార్ట్‌మెంట్ల నిర్మాణంలో భాగమవుతోంది!

ట్రాక్టర్ల యజమానులు, అక్రమాలు జరగకుండా చూడాల్సిన అధికారులు.. జరుగుతూంటే పట్టుకోవాల్సిన పోలీసులు.. ప్రజల సొమ్మును కాపాడాల్సిన స్థానిక నేతలు.. అసలు నిజాలను బయటపెట్టాల్సిన విలేకరులు.. కుమ్మక్కై, నడుపుతున్న దందా ఇది! ఈ అందరికీ అనుసంధానకర్తగా ఊరికో బ్రోకర్.

నిలువరించే వాళ్లను, నిలదీసే రైతులను బెదిరిస్తూ సాగుతున్న ఓ ఇసుక దందా మాఫియా రూపం దాలుస్తోంది. ఊరికి, ఊరి జనాలకు చెందాల్సిన సహజవనరు అంగడి సరుకుగా మారి.. అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తున్నది.

రాష్ట్రంలో ఇసుక దందాపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాలు

బిల్లు ఒకటే.. ట్రిప్పులు అనేకం!!



సిరిసిల్ల పట్టణ పరిధిలోని మానేరువాగులో.. ట్రాక్టర్లలోకి ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం. ఇక్కడ ఒక్క వేబిల్లుతో నాలుగైదు ట్రాక్టర్ల ఇసుక తోడుకెళ్లడం ఇక్కడ సర్వసాధారణం

గడ్డి వాము కాదు.. ఇసుక డంపు



ఇది గడ్డివాము అనుకుంటున్నారా? అయితే మీరు తుప్పల్లో కాలేసినట్టే. గడ్డి పైపైనే ఉంటుంది. ఆ గడ్డిని తీసేస్తే కింద టన్నుల్లెక్కన ఇసుక ఉంటుంది. కరీంనగర్ మండలం ఖాజీపూర్‌లో మానేరు వాగు వద్ద కనిపించిన అక్రమ ఇసుక డంప్ ఇది.

రైతు కంట్లో ఇసుక

ప్రభుత్వ పనుల ముసుగులో ఇసుక దందా

అధికారిక పర్మిషన్.. అనధికారిక అమ్మకం

ఒక్కవే బిల్లుతో పదుల లారీలు, ట్రాక్టర్లకు ఇసుక.. నిబంధనలకు మించి లోడింగ్

అర్ధరాత్రి సమీప అడవుల్లోకి రవాణా

తెల్లారి దర్జాగా ప్రైవేటు అమ్మకాలు

బ్రోకర్లకు రెవెన్యూ అధికారులు, నేతల అండ

రైతులు ప్రశ్నిస్తే బెదిరిస్తున్న పోలీసులు

(ఇసుక రీచ్‌ల నుంచి ఆంధ్రజ్యోతి ప్రత్యేక ప్రతినిధి)

ఒక విలన్. ఆ విలన్‌కి వంతపాడే అధికారులు. ఆ విలన్ ఏ తప్పు చేసినా కాపు కాసే పోలీసులు. పాత సినిమాల్లో చాలా రెగ్యులర్ ఫార్మాట్ ఇది! రాష్ట్రంలో పేదల కోసం చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకం కోసం ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను దుర్వినియోగం చేసేందుకు ఊళ్లలో ఇలాంటి కూటములే ఏర్పడ్డాయి! వాటిలో కీలక పాత్రధారి బ్రోకర్. ప్రధాన పాత్రధారులు ట్రాక్టర్లు, లారీల యజమానులు. సూత్రధారులు కొందరు రెవెన్యూ అధికారులు, కొందరు పోలీసులు, స్థానిక నాయకులు, కొందరు పాత్రికేయులు. బ్రోకర్లు, ట్రాక్టర్ల యజమానుల అక్రమాలకు వీరంతా అండ. తవ్వకాలకు అనుమతులు అధికారులు ఇస్తే.. తవ్వకాల్లో అక్రమాలకు అండగా నేతలు ఉంటున్నారు! 'ఇంత ఇసుక తోడేస్తున్నారేంటి?' అని రైతులెవరైనా అడ్డుకుని ప్రశ్నిస్తే వారిని బెదిరించడానికి పోలీసులు రంగంలోకి దిగుతున్నారు. ఊరికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రపంచానికి తెలియజెప్పాల్సిన పాత్రికేయులు చూసీచూడనట్టు పోతున్నారు. కారణమేదైనా.. ఇలా టన్నులకొద్దీ ఇసుకను తోడుకుంటూ పోతే నీరు నిల్వ ఉండక భూగర్భజలాలు అడుగంటిపోతాయని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "ఒకవైపు రైతు క్షేమం కోరి ముఖ్యమంత్రి 24 గంటల కరెంటు ఇస్తున్నారు. కానీ.. భూగర్భ జలాలు లేకపోతే, ఎంతసేపు

మిగతా 6వ పేజీలో...

ఇసుక పొర ఏర్పడటానికి కోట్ల సంవత్సరాలు

ప్రతి వాగులో.. వంకలో.. నది అడుగున.. సముద్రపుటొడ్డున.. కనపడే ప్రతి ఇసుక రేణువు వెనుకా కొన్ని కోట్ల సంవత్సరాల చరిత్ర, ఈ భూమి చరిత్ర ఉందంటారు ప్రముఖ పర్యావరణ వేత్త రాచెల్ కార్సన్. అసలు ఇసుక ఎలా ఏర్పడుతుంది? వాగుల్లోకి, నదుల్లోకి ఎలా వస్తుంది? అంటే.. పెద్ద పెద్ద శిలలు నిత్యం కోతకు గురై చిన్నచిన్న రేణువులుగా విడిపోతాయి. ఇందుకు కొన్ని వేల ఏళ్ల నుంచి కోట్ల ఏళ్లు పడుతుంది. ఆ రేణువులు నీటితోపాటు నదుల్లోకి, వాగుల్లోకి కొట్టుకెళ్తాయి. అంటే ఒక పొర ఇసుక ఏర్పడటానికి అన్ని కోట్ల ఏళ్లు పడుతుంది. అలాంటి ఇసుకను అక్రమార్కులు ధనదాహంతో టన్నుల్లెక్కన తోడేసి వాగుల కడుపు కొడుతున్నారు.



16

మాతృభాషలోనే సైన్స్ బోధన!

యువతలో ఆసక్తి పెంచేందుకిదే మార్గం: మోదీ

ఎస్‌బీఐ గృహ రుణాలు చౌక

80 లక్షల మందికి ప్రయోజనం

11

టన్ను ఉక్కు ధర రూ. 50,000

తగ్గించాలంటే.. పెంపా!

'ప్రైవేటు' ఫీజులపై ఇదేం పద్ధతి?

ఫీజులు ఖరారు కాకముందే అనుమతులెలా ఇచ్చారు?

విద్యాశాఖది ద్వంద్వ విధానం.. తల్లిదండ్రుల ఆగ్రహం

నేటి నుంచే అడ్మిషన్లు ప్రారంభం

ఫీజు ఎంతో ముందే ఖరారు చేసుకోకపోతే అడ్మిషన్ దక్కదు

ఈ ఏడాదీ 'నియంత్రణ' లేనట్టేనా!



హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను తగ్గించండి మహాప్రభో.. అని తల్లిదండ్రులు వేడుకుంటుంటే.. వాటిని తగ్గించకపోగా.. ఏటా 10 శాతం పెంచుకోవచ్చని కమిటీ నివేదిక ఇచ్చింది. ఫీజుల నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన తిరుపతి రావు కమిటీ విద్యార్థుల తల్లిదండ్రుల గోసను పట్టించుకున్నట్లు కనిపించడం లేదు! కమిటీ నివేదికపై సర్కారు ఇంకా నిర్ణయం తీసుకోనప్పటికీ.. తల్లిదండ్రులు మాత్రం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లకు పాఠశాల విద్యాశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. కాకపోతే గత ఏడాది వరకు నవంబరు, డిసెంబర్లలో అడ్మిషన్లు చేపట్టే పాఠశాలలు ప్రస్తుతం జనవరిలో చేపడుతున్నాయి. తిరుపతిరావు కమిటీ, ఫీజుల నియంత్రణ చట్టం.. ఇలా వేటితో సంబంధం లేకుండానే ప్రైవేటు పాఠశాలలకు అనుమతి ఇచ్చేయడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. ప్రభుత్వ ద్వంద్వ విధానంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాల విద్యాశాఖ నిర్ణయంతో చిన్న చిన్న ప్రైవేటు పాఠశాలల కన్నా కార్పొరేట్, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ పాఠశాలలు

ప్రైవేటు, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు తేదీలు

నోటిఫికేషన్ విడుదల	02-01-2018
దరఖాస్తుల విక్రయం	3-8 వరకు
దరఖాస్తుల పరిశీలన	9, 10 తేదీల్లో
అడ్మిషన్ల ఖరారు	11న
అడ్మిషన్ల తుది జాబితా	12న

మిగతా 5వ పేజీలో...

5





తెలంగాణ రాష్ట్ర జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావును ఆలింగనం చేసుకుని అభినందిస్తున్న సీఎం; ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌తో జనసేన అధినేత పవన్ కల్యాణ్

సాగుకు వెలుగు

అన్నదాతకు కరెంటు కష్టాలు తీర్చాం

24 గంటల విద్యుత్తు మహాద్భుతం

ఈ ఘనత విద్యుత్తు ఉద్యోగులదే: సీఎం

ప్రత్యేక ఇంక్రిమెంటు ప్రకటించిన కేసీఆర్

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్తును ఉచితంగా అందించడం ద్వారా తెలంగాణ రాష్ట్రం అద్భుత విజయం సాధించిందని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన మూడున్నరేళ్లలోనే ఈ ఘనత సాధించడం మహాద్భుతమన్నారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న విద్యుత్తు రంగాన్ని నేడు అన్ని

మిగతా 6వ పేజీలో...

ఈ ఘనత మావల్లే సాధ్యమైంది: ఉత్తమ్

5

ఇందులో ఏదో మతలబు ఉంది: కోదండ

రాష్ట్రం వేరేవాళ్ల చేతిలో ఉంటే ఎలా ఉండేదో: పవన్

తెలంగాణ 24 గంటల విద్యుత్తు సరఫరా పథకాన్ని దేశంలో ఒక కేస్ స్టడీగా తీసుకోవాలి. కేసీఆర్ పాలన చూస్తుంటే రాష్ట్రం వేరే వాళ్ల చేతిలో ఉంటే పరిస్థితి ఎలా ఉండేదోననే భావన కలుగుతోంది. ఉద్యమం నాటి నుంచి నాకు కేసీఆర్, టీఆర్‌ఎస్, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిపై ఎంతో గౌరవం ఉండేది. జనసేన ఆవిర్భావ సభలోనూ ఆ విషయం చెప్పా.

- పవన్ కల్యాణ్

కేసీఆర్ పాలన భేష్

అసాధ్యాలు సుసాధ్యం చేస్తున్నారు.. టీఆర్‌ఎస్ సర్కారు బాగా పనిచేస్తోంది

24 గంటల విద్యుత్తు ఆశ్చర్యం కలిగించింది.. జానా మాట గుర్తుకొచ్చింది

తెలంగాణ అంధకారమవుతుందన్నారు..జనసేన అధినేత పవన్ కల్యాణ్

తొలిసారి ప్రగతి భవన్‌కు రాక.. సీఎంకు న్యూ ఇయర్ శుభాకాంక్షలు

కేసీఆర్ రాక కోసం గంటసేపు ఎదురుచూపు.. అరగంట ఏకాంత చర్చ

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణలో నాకు అభిమానులున్నారు. నా బలం నాకు ఉంది. టీఆర్‌ఎస్ ప్రభుత్వం బాగా పనిచేస్తోందని నేను నా అభిమానులకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు" అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. "రాష్ట్రం విడిపోతే తెలంగాణ అంధకారం నాడు కొందరన్నారు. కానీ, నేడు 24 గంటల పాటు నిరంతరాయంగా రైతులకు విద్యుత్తు అందిస్తున్నారు. పొద్దున పత్రికల్లో చూస్తే ఆశ్చర్యమేసింది. అంతపెద్ద టాస్క్ ఎలా సాధ్యమైందో తెలుసుకుందామనే సీఎం కేసీఆర్‌ని కలిసేందుకు వచ్చా" అని పవన్ చెప్పారు. అసాధ్యం అనుకున్న

మిగతా 5వ పేజీలో...



కందికి మద్దతు దొరికేనా?

సేకరణకు నెలాఖరు వరకే గడువు

ఎక్కువ పంట చేతికొచ్చేది ఆ తర్వాతే

కేంద్రం గడువు పెంచకుంటే రైతుకు దెబ్బే

5



అర్ధరాత్రి దుర్గగుడిలో కనిపిస్తున్న అపరిచిత అర్చకుడి చిత్రం (సీసీ కెమెరాల్లో)

దుర్గ గుడిలో తాంత్రికం

అర్ధరాత్రి రహస్యంగా 'భైరవీ పూజ'

నలుగురు తమిళ తాంత్రికుల రాక

తతంగం నడిపించిన స్థానిక పూజారి

కష్టాలు తొలగేందుకు అధికారి నిర్వాకం

అంతరాలయాన్ని తెరిచి కార్యక్రమం

2



54 పోలీస్ సేవలతో కాప్ యాప్

ఆవిష్కరించిన డీజీపీ

అన్ని రకాల సమాచారం ఈ యాప్‌లోనే నిక్షిప్తం

మహేందర్ రెడ్డి ఉద్ఘాటన

2

S & D



నాగ దోషాలు పోవాలంటే..



పరంజ్యోతి Paramjyothi

కాళీదేవి అనంత స్వరూపాలలో 'నాగకాళి' రూపం కూడా ఒకటి. నాగశక్తి స్వరూపిణిగా, నాగులు సైతం పూజించే దేవతగా 'నాగకాళి'గా ఆ మాత అనుగ్రహిస్తున్నది. కామాఖ్యలో కామాఖ్యకాళిగా అమ్మవారిని పూజిస్తారు. అక్కడ నాగమాత అయిన మానసాదేవి కూడా ఉన్నది. నాగమాత అయిన మానసాదేవి కాళిని అర్చించినట్లుగా అక్కడి కథలు చెపుతున్నాయి. ఆమెను అనుగ్రహించడానికి అమ్మవారు ప్రత్యక్షమయ్యింది. నాగకిరీటాన్ని ధరించి, అనంతమైన నాగులు పడగలు పడుతూ ఉండగా, ఆమె శరీరం మీద అనేక నాగులు ఆభరణాలుగా ప్రకాశిస్తూ ఉండగా.. నాగ మహా శక్తిస్వరూపిణిగా ఆమె దర్శనం యిచ్చిందిట. ఆ తల్లి అనుగ్రహం వలన మానసాదేవి అనేక శక్తులను పొందడంతోపాటు, నాగమాత అయ్యే అర్హతను పొందింది. పాతాళంలో ఉన్న నాగులు మొదలైన వారు పాతాళకాళిగా అమ్మవారిని పూజించి ఆమె అనుగ్రహం పొందారు. నాగదోషాలు ఉన్నటువంటి వారికి చర్మ వ్యాధులు, ఎముకల వ్యాధులు, కర్ణ వ్యాధులు మొదలైన అనారోగ్యాలు, వివాహం కాకపోవటం లేదా వివాహం అయినా భార్యాభర్తల సఖ్యత లేకపోవటం విశేషించి సంతానం లేకపోవటం మొదలైన ఇబ్బందులు ఉంటాయి అని నాగతంత్రం చెపుతున్నది. నాగ దోషాలు ఉన్నవారు నాగకాళిగా అమ్మవారిని కొలిస్తే వాటిని తొలగిస్తుంది. వంశపారంపర్యంగా వచ్చే నాగ దోషమైనా, పాములను చంపడం వలన వచ్చిన నాగదోషమైనా, పూర్వ జన్మలో చేసిన నాగహాని వలన కలిగిన నాగ దోషమైనా.. నాగకాళీ మాత ఆరాధనతో పోతాయి. ఎటువంటి కాలసర్ప దోషమైనా, రాహుగ్రహ కేతు గ్రహ దోషాలున్నా "నాగకాళి" అమ్మను ఆరాధిస్తే ఆమె తొలగిస్తుంది. ఎన్నోచోట్ల, విశేషించి తమిళనాట 'నాగకాళి' అమ్మ దేవాలయాలు కనిపిస్తున్నాయి. ఆమెను అర్చించి శీఘ్రంగా దోష నివారణ, సంకల్ప సిద్ధి పొందవచ్చు.

-మాతా రమ్యానంద భారతి

'సాయ్' ధ్రువీకరించలేదు

- అందుకే మెడికల్ సీటు దక్కలేదు
- 'తొండి ఆట'పై ప్రభుత్వానికి నివేదిక!
- బంగారు పతకం పేరుతో టోకరా?

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): 'వైద్య సీట్లలో తొండి ఆట' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ప్రభుత్వానికి నివేదిక అందింది. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ సమర్పించిన నివేదికను సమీక్షించేందుకు సాంస్కృతిక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం సమావేశాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ కథనంపై స్పందించిన సీఎం కార్యాలయం పరిశీలన జరిపి నివేదిక సమర్పించాలని కోరింది. క్రీడా కోటాలో వైద్య సీట్లు పొందే సిఫార్సుల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సంస్థ వివరణ ఇచ్చింది. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్న ఇద్దరు విద్యార్థులను పక్కన పెట్టడమే వివాదానికి కారణమైంది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయి) ధ్రువీకరించనందునే ఈ విద్యార్థులను పక్కన పెట్టామని పేర్కొన్నట్లు తెలిసింది. తాము కోరిన వివరణపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా స్పందించిందని, తాము ఆమోదించి, నిర్వహించిన క్యాంపుల్లో పాల్గొన్నవారికి మాత్రమే ధ్రువీకరణ ఇస్తామని పేర్కొన్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలోనే సమాఖ్య (రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నా వారు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను పరిగణనలోకి తీసుకోలేదని సంస్థ పేర్కొన్నట్లు సమాచారం. కానీ ఓ విద్యార్థి 'సాయి' నుంచి తెచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని జత చేసినా దాన్ని కూడా సంస్థ పరిగణనలోకి తీసుకోకుండా బుట్టదాఖలు చేసిందన్న ఆరోపణ ఉంది. 2015లోనూ అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు సంబంధించి 101 పత్రాలను ధ్రువీకరణ కోసం 'సాయి'కి పంపారు. జాతీయస్థాయిలో జరిగిన రోలర్‌స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ఒక విద్యార్థికి బంగారు పతకం వచ్చినట్లుగా చూపించి వైద్య సీటుకు సిఫార్సు చేశారన్న వివాదం తాజాగా వెలుగులోకి వచ్చింది. భాగస్వామి అవడం కంటే బంగారు పతకం పొందిన వారికి(టీంలో అయినా) ఎక్కువ ర్యాంకు ఇస్తారు. ఎక్కువ ర్యాంకు ఇచ్చినపుడు వైద్య సీటు పొందడానికి వీలు ఉంటుంది. సంస్థలోని కొందరు ముడుపులకు ఆశపడి ఈ విధంగా చేశారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. దీనిపైనే ప్రభుత్వం కూడా ఈ విషయమై ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

దుర్గ గుడిలో తాంత్రికం

సాత్విక పూజల స్థానంలో 'భీకరం'.. అర్ధరాత్రి రహస్యంగా 'భైరవీ పూజ'

- నలుగురు తమిళ తాంత్రికుల రాక
- తతంగం నడిపెంచిన స్థానిక పూజారి
- కష్టాలు తొలగేందుకని అధికారి నిర్వాకం
- గుట్టుచప్పుడు కాకుండా తతంగం



అర్ధరాత్రి సమయంలో దుర్గగుడిలో కనిపిస్తున్న అపరిచిత అర్చకుడు. ఈ చిత్రం సీసీ కెమెరాల్లో రికార్డయింది

విజయవాడ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సాత్విక రూపం తో చల్లని చూపులతో భక్తులను కరుణించే బెజవాడ కనక దుర్గమ్మ గుడిలో సంప్రదాయ విరుద్ధమైన పూజలు జరిగాయి.అమ్మవారిలోని భీకర స్వరూపాన్ని మేల్కొలుపుతూ, ఆ తల్లికి మరో రూపమైన 'భైరవి'ని ప్రసన్నం చేసుకునేందుకు కొందరు రహస్య క్రతువులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా, అనధికారికంగా అంతరాలయ తలుపులు తెరిచి, అర్ధరాత్రి రహస్యంగా పూజలు జరిపారు. ఇంద్రకీలాద్రిపై ఇప్పుడు దీనిపై తీవ్ర చర్చ జరుగుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. విజయవాడ కనకదుర్గ ఆలయ ముఖ్య అధికారి ఒకరు ఇటీవల తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన చర్యలు వివాదాస్పదమయ్యాయి. ప్రభుత్వానికి ఫిర్యాదులుకూడా వెళ్లాయి. ఈ నేపథ్యంలో ఆ అధికారికి సన్నిహితంగా మెలిగే అర్చకుడొకరు 'భైరవీ పూజ చేస్తే మీకు అదనపు శక్తులు వస్తా యి. కష్టాలు పోతాయి' అని సలహా ఇచ్చారు. ఆ అధికారి సరే అన్నారు. దీంతో భైరవీ పూజ నిర్వహణలో నిష్ణాతులైన తాంత్రికులను తమిళనాడు నుంచి రప్పించారు. గట్టువెనుక నివసిస్తున్న ఆలయ అర్చకుడి ఇంటికి ఆ అధికారి డిసెంబరు 26వ తేదీ రాత్రి 9 గంటలకు వెళ్లారు. ఆలయంలో భైరవీ పూజను ఎలా పూర్తి చేయాలన్న దానిపై చర్చించి వెళ్లిపోయా రు. తర్వాత అసలు తంతు మొదలైంది. తమిళనాడు నుంచి రప్పించిన నలుగురు తాంత్రికులతోపాటు దుర్గమ్మ ఆలయం లో పూజలు చేసే తండ్రీకొడుకులు గుడిలోకి చేరుకున్నారు. అమ్మవారికి పవళింపు సేవ ముగిసిన తర్వాత మూసేసిన గర్భగుడి తలుపులు తెరిచారు. రాత్రి 11 గంటల నుంచి అర్ధరాత్రి దాటాక 12.45 గంటల వరకు అత్యంత రహస్యంగా భైరవీ పూజ నిర్వహించారు.

ఘోరమైన తప్పు...

ఇంద్రకీలాద్రిపై కొలువైన అమ్మవారికి శైలిపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంటా, కూష్మాండా, స్కంధమాత, కాత్యాయని, కాలరాత్రి, భైరవీ, సర్వసిద్ధి అనే 9 పేర్లు ఉన్నాయి. ఈ పేర్లతో వామాచార విధానంలో అమ్మ వారికి పూజలు జరిగేవి. వామాచారం అంటే జంతు బలుల వంటి తాంత్రిక విధానాలు. ఇలా చేయడం వల్ల అమ్మవారు భీకర స్వరూపిణిగా ఉంటారనే ఉద్దేశంతో ఆదిశంకరాచార్యుల వారు ఆ పేర్లను మార్చి అమ్మవారికి లలితా రూపాన్ని ఇచ్చారు. అప్పటి నుంచి ఇక్కడ సాత్విక పూజలు మాత్రమే జరుగుతున్నాయి. గుడిలో స్మార్త ఆగమంతో అర్చనలు నిర్వహిస్తారు. కానీ, ఓ అర్చకుడు అంతరాలయంలో భైరవీ పూజలు నిర్వహించిన మరుసటిరోజే ప్రచారం జరిగింది. ఆలయ పాలకవర్గం సభ్యులు కార్యనిర్వహణాధికారి సూర్యకుమారిని ప్రశ్నించారు. 'అలాంటిదేమీ జరగలేదు' అని ఆమె బదులిచ్చారు. అయితే, ఆ తరువాత సీసీ టీవీ ఫుటేజీలో అంతరాలయం ముందు దుర్గగుడితో సంబంధంలేని వ్యక్తులు కాషాయ వస్త్రాలతో కనిపించడంతో కలకలం రేగింది.

అంతా రహస్యమే...

దుర్గగుడి ఆలయాలను రాత్రి 10 గంటలకు మూసేస్తారు. తరువాత ఎవ్వరూ తెరవకూడదు. తెరిచినా అక్కడున్న ప్రత్యేక పోలీసులకు, సెక్యూరిటీకి, గుమాస్తాకు, ఆలయ ముఖ్య అర్చకులకు లిఖితపూర్వకంగా సమాచారం ఇవ్వాలి. గుడి మూసేసిన తర్వాత రిజిస్టర్‌లో బాధ్యులంతా సంతకాలు చేయాలి. ఈ రిజిస్టర్‌ను పరిశీలిస్తే డిసెంబరు 26వ తేదీ రాత్రి 10.15 గంటల మధ్య ఆలయాన్ని మూసేసినట్లు ఉంది. తిరిగి తెల్లవారు జామున నిర్ణీత సమయానికే తలుపులు తెరిచినట్లు ఉంది. కానీ.. 26వ తేదీ రాత్రి ఆలయాన్ని శుభ్రం చేయించేందుకు అనుమతి ఇచ్చామని దేవాలయ ఉన్నతాధికారులు చెబుతున్నారు. రిజిస్టర్‌లో ఆ విషయాన్ని నమోదు చేయాలి. మరోవైపు ఆలయం శుభ్రం చేసిన దృశ్యాలేవీ సీసీ కెమెరాల్లో నమోదు కాలేదు. పూజ విషయం ఎవరికీ తెలియకుండా ఉండేందుకు ఆలయాన్ని అంటిపెట్టుకుని ఉన్న సిబ్బందిని ఏవో సాకులు చెప్పి బయటకు పంపించినట్లు తెలుస్తోంది. ఈ తతంగంపై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

54 పోలీస్ సేవలతో కాప్ యాప్



టీఎస్ కాప్ మొబైల్ యాప్‌ను ప్రారంభిస్తున్న డీజీపీ మహేందర్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణను నేర రహిత రాష్ట్రంగా మార్చడమే తమ లక్ష్యమని డీజీపీ మహేందర్ రెడ్డి తెలిపారు. టీఎస్ కాప్ యాప్ ద్వారా ప్రస్తుతం 54 సేవలు అందిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని సేవల్ని జతచేస్తామన్నారు. 2018 సంవత్సరాన్ని తెలంగాణ పోలీసుకు ఇయర్ ఆఫ్ టెక్నాలజీగా ప్రకటించిన నేపథ్యంలో టీఎస్ కాప్ మొబైల్ అప్లికేషన్ యాప్‌ను డీజీపీ మహేందర్ రెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడైనా, ఏదైనా చిన్న ఘటన జరిగినా పోలీసులు పసిగట్టేస్తారన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పిస్తామని, నేరం చేస్తే 100% పోలీసులకు దొరుకుతామని, శిక్ష పడుతుందన్న భయాన్ని నిందితుల్లో కల్పిస్తామన్నారు. తక్కువ సమయంలో, తక్కువ కష్టంతో ఎక్కువ ఫలితాలు సాధించేందుకు టీఎస్ కాప్ యాప్ ఉపయోగపడుతుందన్నారు. ఈ యాప్‌ను పోలీసు శాఖలోని అన్ని విభాగాల అధికారులు ఉపయోగించుకునే విధంగా రూపొందించామన్నారు. క్రైం సీన్‌కు వెళ్లి విచారించే పోలీసులకు అవసరమైన పూర్తి సమాచారం ఈ మొబైల్ యాప్‌లో లభిస్తుందన్నారు. ఘటనా స్థలానికి చేరుకునేలోపే అక్కడి సమాచారమంతా యాప్ ద్వారా విచారణాధికారికి తెలుస్తుందన్నారు. దీంతో నేరం జరిగిన తర్వాత కేసును త్వరగా ఛేదించే అవకాశం లభిస్తుందన్నారు. సరైన ఆధారాలు సేకరించి, నిందితులకు శిక్ష పడేలా చేసేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పని విధానంలోనూ పెను మార్పులు వస్తాయన్నారు. దేశంలోని 19 వేల కోర్టుల్లో ఎక్కడైనా, ఎవరికైనా ఇలాంటి కేసుల్లో ఎలాంటి శిక్షలు పడ్డాయనే సమాచారాన్ని కూడా యాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఉద్యోగం, పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్న వారి సమాచారాన్ని ఆధార్ కార్డు, పాస్‌పోర్టు నెంబరు, ఫోన్ నెంబరు ఆధారంగా ఆ వ్యక్తిపై దేశంలో ఎక్కడైనా కేసులు ఉన్నాయా అనే సమాచారాన్ని ఈ యాప్ ద్వారా తెలుసుకుంటామని డీజీపీ తెలిపారు. ఈ కొత్త విధానం స్మార్ట్ పోలీసింగ్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నేరాల నియంత్రణకు 8 సేవలను పొందు పరిచామని, పాత నేరస్తుల ఇళ్లను జియో ట్యాగింగ్ చేస్తున్నామన్నారు. జియో ట్యాగింగ్‌తో అనుసంధానమైన బీట్ కానిస్టేబుల్ ఎన్ని ఇళ్లు తనిఖీ చేశాడనే సమాచారం వెంటనే తెలుస్తుందని, సిబ్బంది పని తీరును ఎప్పటికప్పుడు లెక్కగట్టి పైఅధికారికి నివేదిస్తామన్నారు. ఫింగర్ ప్రింట్ వెరిఫికేషన్ ట్యాబ్ ద్వారా అనుమానితుడి జాతకమంతా క్షణాల్లో తెలుస్తుందన్నారు. కోర్టులో నేరం రుజువైన సమాచారాన్ని ఈ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే అతడు విడుదలైన తర్వాత మళ్లీ నేరం చేసినప్పుడు గత నేరాలు, శిక్షల వివరాలు తెలుస్తాయన్నారు. ట్రాఫిక్ విభాగంలో ప్రమాదం జరిగిన చోట గత రికార్డులను యాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అంతేకాదు.. సిబ్బంది పే స్లిప్‌లు, సెలవులు, భద్రత తదితర అంశాలు కూడా టీఎస్ కాప్ యాప్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. అందరికీ ట్యాబ్‌లు ఇచ్చి అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ యాప్‌ను ఉపయోగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. నార్త్, వెస్ట్‌జోన్‌తో పాటు రాచకొండ కమిషనరేట్ పరిధిలో ప్రస్తుతం 1700 ట్యాబ్‌లు పంపిణీ చేశామని, మిగిలిన పోలీసు స్టేషన్లకు దశలవారీగా అందిస్తామన్నారు. ట్యాబ్, టీఎస్ కాప్ యాప్ వాడకంపై అధికారులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తామని డీజీపీ మహేందర్ రెడ్డి చెప్పారు.



మృతుడు మొడే సందీప్



తీవ్రంగా గాయపడిన సతీశ్

విషాదం మిగిల్చిన విహారయాత్ర

- విద్యుత్ తీగలు తగిలి విద్యార్థి మృతి

అశ్వారావుపేటరూరల్/టౌన్, జనవరి 1: విద్యార్థుల విహారయాత్ర విషాదంతో ముగిసింది. కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపిన తమ స్నేహితుడు కళ్లముందే ప్రాణాలు కోల్పోవడంతో శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ సంఘటన అశ్వారావుపేట మండలం ఊటపల్లి ముత్యాలమ్మ ఆలయం వద్ద సోమవారం ఉదయం చోటుచేసుకుంది. కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని శ్రీ రేణుకా వృత్తివిద్యా కళాశాలకు చెందిన 72 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు డిసెంబరు 29న విహారయాత్రకు వెళ్లారు. బాన్సువాడ వెళ్లే క్రమంలో అశ్వారావుపేట మండలం ఊటపల్లి ముత్యాలమ్మ ఆలయం వద్ద స్నానాలకు ఆగారు. రహదారిపై బస్సు ఉండగా, తుఫాన్ వాహనం ఆలయం ముందు ఆగింది. 11 మంది దిగిన తర్వాత బ్యాగులు తీసేందుకు మొడే సందీప్(17), గుండా సతీశ్ వాహనంపైకి ఎక్కారు.అక్కడ 11 కేవీ విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండడాన్ని గమనించని సందీప్ విద్యుదాఘాతానికి గురవగా, వాహనానికీ విద్యుత్ ప్రసారమై సతీశ్ కిందపడిపోయాడు. తీవ్రగాయాలైన వారిద్దరినీ అశ్వారావుపేట ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా సందీప్ మృతిచెందాడు, మెరుగైన చికిత్స కోసం సతీశ్‌ను హైదరాబాద్‌కు తరలించారు.

కొబ్బరి చెట్టు విరిగిపడి బాలుడు దుర్మరణం

కమ్మర్‌పల్లి(నిజామాబాద్), జనవరి 1: దైవదర్శనానికి ఆలయానికి వచ్చిన బాలుడు కొబ్బరి చెట్టు విరిగిపడి దుర్మరణం చెందాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ సోమవారం చోటు చేసుకుంది. కమ్మర్‌పల్లికి చెందిన పోతన్కార్ రాము, రాణి దంపతులకు రాహుల్, మణికంఠ(13) ఇద్దరు కుమారులు. హైదరాబాద్‌లో చదువుతున్న పిల్లలు.. క్రిస్మస్ సెలవులకు గత శనివారం స్వగ్రామానికి వచ్చారు. కాగా, సోమవారం ఉదయం తల్లీకొడుకులు ఉప్లూర్‌లోని శ్రీ రాజరాజేశ్వరస్వామి దర్శనార్థం ఆలయానికి వెళ్లారు. భక్తులతో కలిసి ప్రదక్షిణలు చేస్తుండగా ఆలయ ప్రాంగణంలోని కొబ్బరి చెట్టు విరిగి మణికంఠపై పడింది. దీంతో అతడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నీళ్లు మేమే వాడుకుంటాం

తుంగభద్రపై కర్ణాటక ప్రతిపాదన..ఏపీ, తెలంగాణల్లో 2.3 లక్షల ఎకరాలకు ముప్పు

- తొందర పడని ఇరు రాష్ట్రాల అధికారులు
- ముప్పును ముందే ఊహించిన రైతులు



తుంగభద్ర డ్యామ్ (ఫైల్)

గద్వాల/అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రైతులు అనుమానించినట్లే జరిగింది. ఏపీ, తెలంగాణలకు రబీ కింద కేటాయించిన తుంగభద్ర నికర జలాలను తామే వాడుకుంటామని కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మేరకు ఏపీ సర్కారుకు లేఖలు రాసింది. దాంతో ఏపీ, తెలంగాణల్లో 2.3 లక్షల ఎకరాల్లో రబీపం ట ప్రమాదంలో పడింది. కర్ణాటకలోని తుంగభద్ర నుం చి రబీ నీటి విడుదల కోసం తెలంగాణ, ఏపీ రాష్ట్రాల రైతాంగం ఎదురు చూస్తోంది. ఆ జలాశయం నుంచి రెండు రాష్ట్రాలకు 9.36టీఎంసీల నీరు వదలాల్సి ఉంది. తొలి విడత కింద 8.92 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఇరు రాష్ట్రాలు తుంగభద్ర వాటర్ బోర్డుకు లేఖలు ఇవ్వాల్సి ఉంటుంది. ఏపీకి కెసీ కెనాల్ ద్వారా, తెలంగాణకు తుంగభద్ర కాల్వల నుంచి నీరు రావాల్సి ఉంటుంది. ఈ నీటిని నమ్ముకొని ఏపీలో 2 లక్షల ఎకరాలు, తెలంగాణలోని అలంపూర్‌లో 30 వేల ఎకరాల్లో పంటలు సాగుచేశారు. రెండు రాష్ట్రాల ఇరిగేషన్ ఈఎన్‌సీలు తుంగభద్ర వాటర్ బోర్డుకు లేఖ రాస్తే గానీ నీటి విడుదల జరగదు. ఏపీ, తెలంగాణల సర్కార్ల నుంచి స్పందన లేకపోవడంతో కర్ణాటక మొత్తం నీటిని వాడుకొనే ప్రమాదం ఉందని మొదటి నుంచే రైతులు అనుమానిస్తున్నారు. రైతు సంఘాల ఒత్తిడితో మంత్రి హరీశ్‌రావు అనుమతి తీసుకొని 3 రోజుల్లో లేఖలు పంపిస్తామని తెలంగాణ ఈఎన్‌సీ ఇరిగేషన్ టెక్నికల్ మురళీధర్ ప్రకటించారు. ఏపీ కూడా తుంగభద్ర డ్యామ్ వాటర్ బోర్డుకు లేఖలు పంపితే తప్పనీటి విడుదల సాధ్యం కాదన్నారు. ఇదే సమయంలో కర్ణాటక ఏపీకి లేఖ రాసింది. సుంకేశుల రిపేరులో ఉన్నందున తుంగభద్ర నీటిని ఏపీ సద్వినియోగం చేసుకోవడం లేదని.. అందుచేత ఆ జలాలన్నిటినీ తాము వాడుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరింది. తుంగభద్ర ఎగువన తీవ్ర కరవు పరిస్థితి నెలకొందని ప్రస్తావించింది. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, పబ్లిక్ వర్క్స్ ముఖ్య కార్యదర్శి ఉమేశ్‌లు ఏపీకి పదేపదే ఈ అంశంపై లేఖలు రాశారు. రాయలసీమలోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ఏపీ జల వనరుల శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రతి మూడు నాలుగు రోజులకోసారి శశిభూషణ్‌కు ఉమేశ్ లేఖలు రాస్తున్నారు. దీనిపై ఉమేశ్ నేతృత్వంలోని బృందం 4న విజయవాడ రానుంది.

ప్రముఖ వైద్యుడు విశ్వనాథరావు కన్నుమూత

- బీపీ ఆచార్య సంతాపం



కాజీపేట, జనవరి 1 : కాజీపేటకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ వి. విశ్వనాథరావు(75) సోమవారం కన్నుమూశారు. కేన్సర్ వ్యాధి రావడంతో నాలుగు నెలల కిందట మెరుగైన వైద్యం కోసం వెళ్లిన ఆయన అక్కడే తుదిశ్వాస విడిచారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు దగ్గరి బంధువు, అత్యంత సన్నిహితుడు. ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావుకు స్వయాన తమ్ముడు. హుస్నాబాద్ ఎమ్మెల్యే వి.సతీశ్‌బాబుకు చిన్నాన్న. ఆయన కాజీపేటలో ఆస్పత్రి స్థాపించి ఎంతోమందికి వైద్య సేవలు అందించారు. రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్న విశ్వనాథరావు ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు తన వంతుగా కృషి చేశారు. విశ్వనాథరావు మరణవార్తతో కాజీపేటలో విషాదఛాయలు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్.. కాజీపేట వెళ్లి విశ్వనాథరావు కుటుంబీకులను పరామర్శించారు. కాగా, విశ్వనాథరావు కుటుంబసభ్యులకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీపీ ఆచార్య ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. ఓ గొప్ప వ్యక్తిని కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. వరంగల్‌లో ఉన్నపుడు ఆయనతో కలిసి చాలా సందర్భాల్లో పనిచేశానని నాటిరోజులను గుర్తుచేసుకున్నారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	06.6	30.5
నల్లగొండ	14.4	29.2
హైదరాబాద్	14.9	31.5
వరంగల్	15.0	31.0
ఖమ్మం	17.0	32.0

తగ్గిన చలి తీవ్రత!

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా తెలంగాణను వణికిస్తున్నచలి సోమవారం కాస్త తగ్గుముఖం పట్టింది. నిన్న, మొన్నటివరకు రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 7 డిగ్రీలు తక్కువగా నమోదైన ఖమ్మం, భద్రాచలంలో సోమవారం 3 డిగ్రీలే తక్కువగా నమోదయ్యాయి. నల్లగొండలో 3 డిగ్రీలు, మెదక్‌లో 2 డిగ్రీలు, హన్మకొండలో ఒక డిగ్రీ తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రామగుండం, నిజామాబాద్, హైదరాబాద్‌లో సాధారణ ఉష్ణోగ్రతలు, మహబూబ్‌నగర్‌లో ఒక డిగ్రీ ఎక్కువగా నమోదయ్యాయి. రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం ఉంటుందని వాతావరణశాఖ తెలిపింది.


సర్జికల్ స్ట్రయిక్ ఓ డ్రామా



'భారత సైన్యం గత ఏడాది పాక్ ఉగ్రవాద స్థావరాలపై జరిపిన మెరుపుదాడి 'సర్జికల్ స్ట్రైక్' ఓ డ్రామా. పాక్‌తో ఎలా వ్యవహరించాలనే అంశంపై మోదీ సర్కారుకు నిర్దిష్ట విధానం లేదు. ఇలాంటి డ్రామాలు పాక్‌పై ఏ మాత్రం పనిచేయడం లేదు. సరిహద్దులో భద్రత ఈ సర్కారు వల్ల సాధ్యం కాదు.'

- కాంగ్రెస్ మాజీ ఎంపీ సందీప్ దీక్షిత్

మీసం కట్టు.. తోక కుచ్చుకు ఉన్నంత తేడా..



'ప్రధాని మోదీకి, కాంగ్రెస్ నాయకులకు మీసంలోని వెంట్రుకలు, తోక కుచ్చులో ఉండే వెంట్రుకలకు ఉన్నంత తేడా ఉంది. కాంగ్రెస్ నాయకులు ఎంత ప్రయత్నించినా, మోదీ లాంటి నాయకులు కాలేరు. ఆ పార్టీ పతనం 2014 నుంచే ప్రారంభమైంది. అదే సమయంలో ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారు'

- కేంద్ర మంత్రి నరేంద్రసింగ్ తోమర్

నేటి పెట్రో ధరలు (లీ.)


పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.74.09	పాత ధర 64.79
కొత్త ధర రూ.74.09	కొత్త ధర 64.79
మార్పులేదు	మార్పులేదు

హృద్రోగాలను గుర్తించే స్మార్ట్‌బ్రష్!



లండన్, జనవరి 1: రోజూవారి పనులు చేసుకుంటూనే ఇకపై హృద్రోగాలను గుర్తించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇందుకోసం స్పెయిన్‌లోని రమోన్ వై కజల్ ఆస్పత్రికి చెందిన శాస్త్రవేత్తలు ఓ స్మార్ట్‌బ్రష్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ బ్రష్ నోట్లోని లాలాజలాన్ని పరిశీలించి ప్రాణాంతకరమైన హృద్రోగాలు వచ్చే ప్రమాదాలను గుర్తిస్తుంది. అంతేకాకుండా హృద్రోగులు వాడే మందుల్లో మార్పులు చేయాల్సి ఉన్న ఈ స్మార్ట్ బ్రష్ గుర్తించడంతో పాటు హెచ్చరిస్తుంది.

మధుమేహం మందుతో అల్జీమర్స్‌కు చెక్



లండన్, జనవరి 1: మధుమేహం చికిత్సకు ఉపయోగించే మందులతో అల్జీమర్స్‌పై పోరాడటంలో దోహదపడుతాయని అంటున్నారు శాస్త్రవేత్తలు. టైప్-2 మధుమేహం చికిత్సలో వాడే మందులను ఎలుకలపై ప్రయోగించినపుడు వాటిలో మతిమరుపు దూరమై.. మెరుగైన ఫలితాలు రావడం గమనించామని యూకేలోని లాన్‌కాస్టర్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు చెబుతున్నారు. అల్జీమర్స్ వంటి దీర్ఘకాలిక న్యూరోడెనెరేటివ్ రుగ్మతల నివారణకు కచ్చితంగా ఇదో కొత్త వాగ్దానామని వర్సిటీ శాస్త్రవేత్త ప్రొఫెసర్ క్రిస్టియన్ హోల్స్‌చెర్ వెల్లడించారు.

S & D

కోవెలలో 'కొత్త' సందడి



వేములవాడలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

వరుస సెలవులు, ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి సన్నిధి సోమవారం భక్తులతో కిక్కిరిసి యింది.ధర్మదర్శనానికి 3 గంటల సమయం పట్టింది. అధ్యయనోత్సవాల్లో భాగంగా సోమవారం నారసింహుడిని చిన్ని కృష్ణుడి అలంకారంలో సేవించారు. భద్రాచలంలో సుమారు 20 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే స్వామి వారి నిత్య కల్యాణ సేవలో కూడా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రామచంద్రుడిని శ్రీ అభయాంజనేయస్వామి వారి ఆలయం ప్రాంగణంలోని శ్రీరామదూత మండపంలో రాపత్తు సేవ నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి దేవస్థానం భక్తులతో సందడిగా మారింది. మేడారం జాతర ముందు రాజన్న దర్శనం కోసం వచ్చిన భక్తులకు నూతన సంవత్సరం సందర్భంగా వచ్చిన భక్తులు తోడు కావడంతో వేముల వాడ పుణ్యక్షేత్రం కిక్కిరిసిపోయింది. 25 వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క-సారలమ్మను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. **- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్**

పరిశుభ్రతే పరమాత్మ స్వరూపం

▸▸ స్వచ్ఛ శబరిమల కోసం స్వాముల శపథం

పరిశుభ్రతే పరమాత్మ స్వరూపం అని స్వచ్ఛ శబరిమల యాత్ర కోసం అయ్యప్ప స్వాములు శపథం చేశారు. సోమవారం జగిత్యాల జిల్లా కోటిలింగాలలోని కోటేశ్వర స్వామి ఆలయంలో మహా పడిపూజ నిర్వహించారు. పవిత్ర పంబా నదిని కాపాడుకుందాం, శబరిమలను పరిశుభ్రంగా ఉంచుకుందాం అంటూ అయ్యప్ప స్వాములు ప్రతిజ్ఞ చేశారు. శబరిమల యాత్రలో ప్లాస్టిక్ వస్తువులు వాడబోమని ప్రతినబూనారు. శబరిమలను స్వచ్ఛంగా ఉంచడానికి ఏబీఎన్ ఆంధ్రజ్యోతి పిలువునివ్వడం అభినందనీయమన్నారు. **- వెల్గటూర్**



ప్రతిజ్ఞ చేస్తున్న అయ్యప్ప స్వాములు

కేసీఆర్ పాలనలో అభివృద్ధి పరుగు: మంత్రి తుమ్మల

▸▸ ఖమ్మంలో టీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

ఖమ్మం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. తెలంగాణలోని ప్రతి బిడ్డకు మేలు చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఖమ్మంలో నూతనంగా నిర్మించిన టీఆర్ఎస్ జిల్లా కార్యాలయం 'తెలంగాణ భవన్'ను తుమ్మల ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మట్లాడుతూ పార్టీలకు అతీతంగా తెలంగాణలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు. టీఆర్ఎస్‌లో కొత్తగా చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. మిషన్ భగీరథ, డబుల్ బెడ్ రూం ఇళ్లు, సాగునీటి ప్రాజెక్టులతో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని వెల్లడించారు. అన్ని జిల్లాలోనూ కొత్తగా పార్టీ కార్యాలయాలు నిర్మాణం కాబోతున్నాయని పేర్కొన్నారు.



ఖమ్మంలో టీఆర్ఎస్ భవన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నిరంతర విద్యుత్ నిష్ప్రయోజనం

▸▸ సమస్యలపై దృష్టి పెట్టాలి: జీవన్‌రెడ్డి

▸▸ గిట్టుబాటు ధర ఏదీ..?: గండ్ర

జగిత్యాల/భూపాలపల్లిటౌన్, జనవరి 1: తెలంగాణ ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి లేదని సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి అన్నారు. దోమపోటుతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.4 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జగిత్యాలలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు అడుగంటాయని అన్నారు. కనీసం ఇప్పుడు 7 గంటలు కూడా పంపుసెట్లు నడిచే పరిస్థితులు లేవన్నారు. 24 గంటలు కరెంట్ ఇస్తామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని, దీని వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. రైతులకు కావాల్సింది పంటలకు గిట్టుబాటు ధరతో పాటు పెట్టుబడి రాయితీ అని అన్నారు. బ్యాంక్ ద్వారా సకాలంలో రైతులకు రుణాలు అందించాలని కోరారు. రైతు బంధు పథకం అమలు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. దీర్ఘకాలిక రుణాలపై 6 శాతం వడ్డీ రాయితీ ఉంటుందని, తెలంగాణ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఒక్క రూపాయి విడుదల చేయలేదని వెల్లడించారు. 2017, మార్చి 31న నిధులు విడుదల చేస్తున్నట్లు జీవో వచ్చి 9 మాసాలైనా ఒక్క రూపాయి రాలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతు సమస్యలపై దృష్టి పెట్టి ఆదుకోవాలని కోరారు. వ్యవసాయానికి 24గంటల కరెంటు సరే.. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఏది? అని టీపీసీసీ అధికార ప్రతినిధి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోకాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి గండ్ర వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రైతులు 24గంటల కరెంటు ఇవ్వాలని సీఎం కేసీఆర్‌ను అడగలేదని.. తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి, గండ్ర



ప్రగతిభవన్‌లో అర్చక సమాఖ్య డైరీ ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్

అర్చక సమాఖ్య డైరీ ఆవిష్కరించిన సీఎం

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అర్చక సమాఖ్య- 2018 డైరీని సీఎం కేసీఆర్ సోమవారం ఆవిష్కరించారు. ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సమాఖ్య ప్రతినిధులు సీఎం కేసీఆర్‌ను ప్రగతిభవన్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. పే స్కేల్ వేతనాలు కొందరికే అందుతున్నాయని, అర్చక, ఉద్యోగులందరికీ వేతనాలు వచ్చే విధంగా దేవాదాయశాఖను ఆదేశించాలని సీఎం కేసీఆర్‌కు సమాఖ్య సభ్యులు విజ్ఞప్తి చేశారు. అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్ర శర్మ, గౌరవ అధ్యక్షుడు భాస్కరభట్ల రామశర్మ తదితరులు సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

వేడుకల సొమ్మును.. విరాళమిచ్చారు

▸▸ దివ్యాంగులకు ఖమ్మం డీఆర్‌డీఏ ఉద్యోగుల సాయం

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి1 : నూతన సంవత్సర వేడుకలు అంటే చాలామంది పార్టీలు చేసుకునేందుకు డబ్బును వృథాగా ఖర్చు చేస్తుంటారు. అయితే తమ ఆనందం కోసం వేడుకల పేరిట డబ్బును వృథా చేయడం కంటే.. అవసరం ఉన్నవారికి ఇస్తే వారికైనా ఉపయోగపడుతుందని భావించారు ఖమ్మం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులు. దీంతో నూతన సంవత్సర వేడుకల కోసం ఖర్చు చేద్దామని అనుకున్న డబ్బును కనీస సౌకర్యాలు లేని దివ్యాంగులకు అందించాలని నిర్ణయించారు. తమ వద్ద ఉన్న డబ్బుతో పాటు స్థానికంగా ఉన్న బ్యాంకు సిబ్బంది, టీఎన్జీవోస్, ఇతర ఉద్యోగ సంఘాల నాయకుల నుంచి రూ.30వేలు సేకరించి ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో దివ్యాంగుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వికాసం కేంద్రాలకు సోమవారం డీఆర్‌డీవో మురళీధర్‌రావు, ఏపీడీ ఇందుమతి ఆధ్వర్యంలో అందజేశారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

ఓదెల, జనవరి 1: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం రూపునారాయణపేటలో దుబాసి రమేష్(41) అనే రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రమేష్ తన ఎకరంతోపాటు మరో ఎకరం కౌలు తీసుకొని వ్యవసాయం చేశాడు. ఖరీఫ్‌లో వేసిన పంట దిగుబడి రాకపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో రబీ సాగు చేసుకుందామంటే ఆర్థిక స్థితి బాగాలేదు. మనస్తాపం చెంది ఆదివారం రాత్రి పురుగు మందు తాగాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రైతులు మృతి

ఆమనగల్లు, జనవరి 1: రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం కోనాపూర్ గేటు వద్ద శ్రీశైలం -హైద్రాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రైతులు దుర్మరణం చెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లికి చెందిన చిందం ముత్తయ్య(46), తాడూరు మండలం గుట్టలపల్లికి చెందిన కెంచ పర్వతాలు(25)బొలేరోలో కూరగాయలను విక్రయించడానికి హైదరాబాద్ వస్తుండగా వీరి వాహనాన్ని కారు ఢీకొనటంతో ఇద్దరూ మృతి చెందారు. డ్రైవర్లు గాయపడ్డారు.

అప్పాజోస్యులకు సారస్వత భాస్కర పురస్కారం

గుంటూరు(సాంస్కృతికం), జనవరి 1: అజోవిభో కందాళం ఫౌండేషన్ అధ్యక్షుడు, సాహితీవేత్త, ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణను సారస్వత భాస్కర పురస్కారంతో ఘనంగా సత్కరించారు. గుంటూరులో సంస్కృతి సంగీత సాహిత్య నృత్యనాటక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నాటకోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథి ఏపీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ అప్పాజోస్యుల బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. వారి సంస్థ ద్వారా వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి అందించే పురస్కారం తెలుగువారికి జ్ఞానపీఠ పురస్కారం వంటిదన్నారు. ప్రముఖ సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగువారికి అప్పాజోస్యుల వారు గొప్ప వరం అన్నారు. తెలుగు పద్యానికి, గద్యానికి, నాటక రంగానికి వారు చేసిన సేవలు అభినందనీయమన్నారు. కేయూ పూర్వాచార్యులు డాక్టర్ కాత్యాయని విద్మహే, అమెరికా రోవెన్ విశ్వవిద్యాలయం రసాయనిక శాస్త్ర ఆచార్యులు డాక్టర్ కందాళం రామానుజాచారి, సంస్థ నిర్వాహకులు సర్రాజు బాలచందర్ తదితరులు పాల్గొని ఆచార్య అప్పాజోస్యులను ఘనంగా సత్కరించారు.



అప్పాజోస్యులను సత్కరిస్తున్న ఏపీ ఉపసభాపతి మండలి

నారసింహుడి ఆదాయం రూ. 108 కోట్లు

▸▸ గత ఏడాది కంటే 24.57 కోట్లు అధికం

▸▸ బాలాలయంలోనూ తగ్గని భక్తుల రాక

యాదాద్రి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఈ ఏడాది భక్తుల నుంచి కాసుల వర్షం కురిసింది. ఆలయ పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నా.. స్వామివారు బాలాలయంలోనే కొలువై భక్తులకు దర్శనమిస్తున్నా.. కొండపై దర్శన, పూజా, వసతి సదుపాయాలు సక్రమంగా అందుబాటులో లేక తీవ్ర అసౌకర్యాలు ఉన్నప్పటికీ.. భక్తుల రాక ఏమాత్రం తగ్గలేదు. రోజు రోజుకూ స్వామివారిని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో లక్ష్మీనరసింహ స్వామి వారి వారికి ఈ ఏడాది 108.88 కోట్ల వార్షిక ఆదాయం సమకూరింది. 2017లో స్వామివారి సన్నిధిలో జరిగే వివిధ పూజా కైంకర్యాలు, ప్రసాదాల విక్రయం, దర్శన రుసుములు, హుండీల్లో కానుకలు, వసతి సదుపాయాలు, అద్దెల ద్వారా ఈ ఆదాయం వచ్చింది. ఇది



గత ఏడాది కంటే రూ. 24 కోట్ల 57లక్షల 38వేల 453 అధికం. 2016లో స్వామివారికి వచ్చిన ఆదాయం రూ.84కోట్ల 31లక్షల 20వేల 860. ఈ ఏడాది స్వామివారికి గత ఏడాది కంటే ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1కోటి 39లక్షల 25వేల 670, వ్రత పూజల ద్వారా రూ.34లక్షల81వేలు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ. 60 లక్షల 40వేల 300, భక్తులు తలనీలాలు సమర్పించే కల్యాణ కట్ట ద్వారా రూ.21లక్షల 95వేల 620 అధిక రాబడి వచ్చింది. అదే విధంగా ఇతర ఆదాయ పద్దుల కింద గత ఏడాది కంటే రూ.22 కోట్ల 40లక్షల 80వేల 262 అధికం ఆదాయం సమకూరింది. కాగా, వసతి గదుల అద్దెల ద్వారా రూ.16లక్షల 65వేల 526 రాబడి తగ్గింది. కొండపై వసతి గదులు కూల్చివేసిన కారణంగా ఈ ఆదాయంలో తగ్గుదల ఉందని అధికారులు తెలిపారు. రెండేళ్లుగా ఆలయ పునర్నిర్మాణం జరుగుతున్నా భక్తుల రాకమాత్రం తగ్గలేదు. 2016 ఏప్రిల్‌లో స్వామివారి ఉత్సవమూర్తులను గర్భాలయం నుంచి శాస్త్రోక్తంగా బాలాలయంలో ప్రతిష్ఠించారు. బాలాలయంలో స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తుల సంఖ్య తగ్గుతుందని భావించారు. అయితే భక్తుల సంఖ్య యేటా పెరుగుతోంది. దాదాపు రూ.1000 కోట్లతో ఆలయ పుననిర్మాణ పనులు పూర్తయితే ఆలయానికి మరింత శోభతో పాటు భక్తుల రద్దీ కూడ పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

గ్రూపులను ప్రోత్సహిస్తోంది మీరే

▸▸ ఉత్తమ్‌పై ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డి ధ్వజం



యాదాద్రి, జనవరి1 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో గ్రూపులను ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్సీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ఆయన యాదాద్రి లక్ష్మీనారసింహుడిని దర్శించుకున్నారు. అనంతరం భువనగిరిలో విలేకరులతో మాట్లాడారు. భువనగిరి, మునుగోడు నియోజకవర్గాల ఇన్‌చార్జిలుగా టీపీసీసీ నియమించిన వారిని తాము గుర్తించడం లేదని ప్రకటించారు. భువనగిరి పరిధిలో అభ్యర్థులను ఏప్రిల్‌లో ప్రకటించి, వారిని గెలిపించే బాధ్యత కూడా తామే తీసుకుంటామన్నారు. నయీం కేసులో 2వేల కోట్ల నగదు, 20వేల కోట్ల ఆస్తులపై సీఎం కేసీఆర్ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ రాజగోపాల్‌రెడ్డి ఆరోపణలను ఆ పార్టీ భువనగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఖండించారు.



కోరుట్లలో రెపరెపలాడుతున్న జాతీయ జెండాలు

కొలనూర్‌లో ఇక నిత్య జనగణమన

▸▸ కోరుట్లలో 101 జాతీయ జెండాల రెపరెప

ఆంగ్ల సంవత్సరం తొలిరోజున రాజన్న సిరిసిల్ల జిల్లా కొలనూర్ గ్రామ ప్రజలు కొత్త సంప్రదాయానికి నాంది పలికారు. నిత్యం జనగణమనను ఆలపించే ఏర్పాట్లు చేశారు. సోమవారం గ్రామ పంచాయితీ అవరణలో జాతీయ పతాకాన్ని కలెక్టర్ ఆవిష్కరించి జనగణమన గీతాలాపన చేశారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని కోనరావుపేట మండలంలోని మర్తనపేట, సుద్దాల గ్రామాల్లో కూడా త్వరలోనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని గ్రామ సర్పంచ్‌లు పేర్కొన్నారు. కాగా, జగిత్యాల జిల్లా కోరుట్లలో నిత్యం జనగణమన ఆలపించడానికి పట్టణ కిరాణ వర్తక సంఘం శ్రీకారం చుట్టింది. సోమవారం జాతీయ రహదారి వెంట 101 త్రివర్ణ పతాకాలను ఎగురవేసి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, పుర ప్రముఖులు, వర్తక, వాణిజ్య, వ్యాపారులు ప్రారంభించారు. కోరుట్లలో 101 జాతీయ జెండాల ఆవిష్కరణ, నిత్య జనగణమనతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు సంపాదించుకుంది. **- సిరిసిల్ల/కోరుట్ల**

మద్యం అమ్మితే గ్రామ బహిష్కరణ

▸▸ భద్రాద్రి జిల్లా నడికూడి గ్రామస్థుల తీర్మానం

దుమ్ముగూడెం, జనవరి1: 'గ్రామంలో మద్యం అమ్మొద్దు. అమ్మితే రూ.20వేల జరిమానా.. చెల్లించని వారికి గ్రామ బహిష్కరణ విధిస్తాం. తాగిన వారికి కూడా జరిమానా వేస్తాం.' అంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం నడికుడి గ్రామ గిరిజనులు తీర్మానం చేశారు. సోమవారం సమావేశమైన గ్రామస్థులు మద్యానికి బానిసవుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని, ఫలితంగా రోడ్డు ప్రమాదాలు, అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనంతటికి కారణం మద్యమేనని, తమ గ్రామంలో మద్యాన్ని అమ్ముతున్న 8 బెల్ట్‌షాపులను వెంటనే మూసివేయించాలని నిర్ణయించారు. మరో రెండు రోజుల్లో ఆ షాపులను తొలగించాలని నిర్వాహకులను హెచ్చరించారు. ఇదే క్రమంలో గ్రామస్థులు కూడా ఎవరూ మద్యం ముట్టుకోవద్దని, పండుగలు, పెళ్లిళ్ల సమయంలోనూ దాని జోలికి వెళ్లొద్దంటూ గ్రామపెద్దలు హెచ్చరించారు. దీంతో తమ గ్రామం మీదుగా అవతలి గ్రామాలకు మద్యం తీసుకెళ్లే వారుంటే వారి నుంచి గ్రామపన్ను (సెస్) వసూలు చేయాలని తీర్మానం చేశారు. తమ నిర్ణయానికి విరుద్ధంగా మద్యం సరఫరా చేయొద్దని సరఫరాకు తప్పనిసరిగా గ్రామసభ అనుమతి తీసుకోవాల్సిందేనని ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు.



గ్రామసభకు హాజరైన మహిళలు

మహిళా కాంగ్రెస్ కమిటీల పూర్తి: శారద

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మహిళా కాంగ్రెస్‌కు సంబంధించి 31 జిల్లాల్లో కమిటీలు వేశామని, మండల కమిటీల ఏర్పాటు కూడా పూర్తయిందని టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద తెలిపారు. గాంధీభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నూతన కమిటీలతో జనవరి 8న గాంధీభవన్‌లో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనికి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా కూడా హాజరవుతారని చెప్పారు.

సేంద్రియ సేద్యంలోనూ లోపాలే: పాలేకర్

రసాయన ఎరువులతో 50 లక్షల కోట్ల నష్టం

గుంటూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల దేశ ప్రజలు ఏటా రూ.50 లక్షల కోట్లు నష్టపోతున్నట్లు వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ చెప్పారు. హరిత విప్లవం పేరుతో దేశవ్యాప్తంగా ఆహార ఉత్పత్తులను పెంచాలని ప్రభుత్వాలు రసాయనిక ఎరువులు, పురుగు మందులను విచ్చలవిడిగా ఉపయోగిస్తున్నాయన్నారు. గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలోని బైబిల్ మిషన్ గ్రౌండ్‌లో రెండో రోజైన సోమవారం జరిగిన శిక్షణ తరగతుల్లో ఆయన ప్రసంగించారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకం వల్ల వ్యవసాయ ఉత్పత్తులు విషతుల్యంగా మారి ప్రజలు ఆనారోగ్యం పాలవుతున్నారని పాలేకర్ చెప్పారు. దేశవ్యాప్తంగా రసాయనిక ఎరువులతో పాటు సేంద్రియ వ్యవసాయం పేరుతో అనేక లోపాలు జరుగుతున్నట్లు తెలిపారు. వర్మి కంపోస్టు పేరుతో కార్పొరేట్ కంపెనీలు రైతుల బలహీనతలను సొమ్ము చేసుకుంటున్నాయని అన్నారు. ప్రధానంగా ప్రకృతిలోని సహజ వనరుల వలనే వ్యవసాయానికి మేలు జరుగుతుందని, సహజ సిద్ధమైన వ్యవసాయాన్ని చేపట్టాలన్నారు. పశు పోషణ మంచిదని, ఆవుల పెంపకం వలన రైతులు ఆర్థికంగా లబ్ధి పొందడంతో పాటు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను పెంచవచ్చని వివరించారు.



సదస్సులో ప్రసంగిస్తున్న సుభాష్ పాలేకర్

ప్రకృతి సేద్యంతోనే అభివృద్ధి: మారిషస్

పాలేకర్ సలహాలు, సూచనలు పాటించి పెట్టుబడి లేని వ్యవసాయాన్ని అమలు చేయడం వల్లనే మారిషస్ అభివృద్ధి చెందినట్లు ఆ దేశ హైకమిషనర్ జగదీశ్ ప్రకాశ్ తెలిపారు. అంతర పంటల సాగు వలన ఎంతో ఉపయోగం ఉందన్నారు. దేశీయ వానపాముల పెంపకాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనర్ డాక్టర్ హరిజవహర్‌లాల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా 13 జిల్లాల్లో పెట్టుబడి లేని సేద్యం కార్యాలయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు, తమ సమస్యలను ఈ సందర్భంగా పాలేకర్ దృష్టికి తెచ్చారు.

రజనీ రాక!

కొత్త సంవత్సరం అడుగుపెట్టేలోగా, రెండు దశాబ్దాల ఊగిసలాటనూ, సంశయాన్నీ కాలగర్భంలో కలిపేసి సినీనటుడు రజనీకాంత్ రాజకీయ రంగ ప్రవేశాన్ని ప్రకటించారు. నలభై ఐదోఏట అనుకున్నది, అరవై ఐదో ఏట జరుగుతోందని రజనీ నవ్వుతూ చెప్పుకున్నారు. అప్పుడొద్దనుకున్నది ఇప్పుడు ఎందుకు కావాలనుకున్నారో ఆయన చెప్పకపోయినా, సినీరంగంలో వెలుగుతున్న అప్పటి రజనీకీ, వయసు మీదపడిన ఇప్పటి రజనీకీ తేడా వున్నది. ఇప్పటికీ ఈ నిర్ణయం తీసుకోకపోతే అపరాధ భావన తనను తినేస్తుందని అంటున్న రజనీ, ఎట్టకేలకు ఆ రంగంలో కూడగట్టుకున్న కీర్తిని ఈ రంగంలో పెట్టుబడిగా పెట్టాలని నిశ్చయించుకున్నారు. మరో సందర్భంలో ఆయన ఈ పరీక్షకు సిద్ధపడివుంటే అంచనాలు దొరికివుండేవేమో కానీ, రాజకీయ శూన్యత స్పష్టంగా ఉన్న ప్రస్తుత స్థితిలో ఆయన రాక తమిళ రాజకీయాన్ని మార్చే అవకాశాలున్నాయి.

ఏడాదికాలంగా రాష్ట్రంలో పరిణామాలు చూస్తూ దేశం నవ్విపోతోంది అంటూ సూపర్‌స్టార్ చేసిన ప్రస్తావనలోనే జయలలిత అనంతర రాజకీయ వాతావరణం నుంచే తన భవిష్యత్తును వెతుక్కుంటున్న సందేశం ఉన్నది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోగా పార్టీని ఆరంభించి అన్ని స్థానాలనుంచి పోటీచేస్తాననీ, పార్లమెంటు సంగతి అవసరం వచ్చినప్పుడు తేలుస్తానని ప్రకటించారు. కొత్తసంవత్సరం తొలిరోజున వెబ్‌సైట్ ఆరంభించి ఈ విషయంలో తాను వేగంగా కదులుతున్న సందేశాన్ని కూడా ఇచ్చారు. మహారాష్ట్ర మూలాలతో, కర్ణాటకలో పుట్టి, తమిళనాడులో హిట్టయిన శివాజీరావ్ గైక్వాడ్ రాకను వ్యతిరేకిస్తూ ఒకటి రెండు తమిళ సంస్థలు ఇప్పటికే ఆత్మగౌరవం పేరిట విమర్శలు ఆరంభించాయి. తమిళ రాజకీయాల్లో తమిళేతర నాయకులు ఎదిగివచ్చిన విషయం చూసిందే కనుక, తలైవా విజయావకాశాలమీద ఆ విమర్శలూ, వాదనలూ పెద్దగా ప్రభావం చూపకపోవచ్చు. రజనీ రాకను అన్ని పార్టీలూ ఉపరితలంలో స్వాగతిస్తున్నా, వెనుక ఏవో శక్తులున్నాయని వ్యాఖ్యానించడానికి వెనుకాడటం లేదు. ముఖ్యంగా, బీజేపీ ఆయనను ముందు పెట్టి కొత్త కథ మొదలెట్టిందన్న ప్రచారం బలంగా ఉన్న నేపథ్యంలో, తాను బీజేపీ మనిషిని కానని చెప్పుకోవడానికి రజనీ ప్రయత్నించారు. డీఎంకె అధినేత కరుణానిధి క్రియాశీలంగా ఉన్నంత కాలం తాను రాజకీయాల్లో రావద్దని నిర్ణయించుకున్నానని వివరణ ఇచ్చారు. కరుణ ఇప్పుడు చురుకుగా లేకపోవచ్చు కానీ, ఆయన పార్టీకీ, సిద్ధాంతాలకు వారసుడిగా స్టాలిన్ ఉన్నారు. రజనీ ఇంతకాలం ఇచ్చిన మినహాయింపు కేవలం కరుణకే తప్ప, డీఎంకె పార్టీకి కాదని అనుకోవాలి.

ఇక, కులాతీత ఆధ్యాత్మిక రాజకీయం అంటూ రజనీ చేసిన వ్యాఖ్య, ఆయన యోగ ముద్ర, వేదిక వెనుక ఉన్న భగవద్గీత శ్లోకం, ప్రసంగంలో దాని ఉటంకింపు, చో రామస్వామి ప్రస్తావన ఇత్యాదివి బీజేపీతో ఆయనకు ప్రచ్ఛన్న అనుబంధం ఉన్నదని విమర్శించేందుకు వీలుకల్పించాయి. వీటికితోడు, ఎన్నికల తరువాత రజనీ పార్టీ ఎన్డీయేలో భాగస్వామి అవుతుందని బీజేపీ రాష్ట్రపార్టీ నేత ఓ వ్యాఖ్య చేసి ఈ వాదనకు మరింత ఊతం ఇచ్చారు. ఈ విషయంలో సుబ్రహ్మణ్యస్వామి మాత్రమే తెలివిగా రజనీ వచ్చి సాధించేదేమీ ఉండబోదని కఠినవ్యాఖ్యలతో దూరం పెట్టారు.

తమిళ రాజకీయాల్లో ఎన్నడూ లేనంత రాజకీయశూన్యత ఇప్పుడున్న మాట వాస్తవం. జయమరణం నాటినుంచి ఆమె పార్టీలో తలెత్తిన పరిణామాలు ప్రజలకు విసుగుతెప్పించాయి. జయవారసురాలిగా ఆమె పార్టీనీ, ముఖ్యమంత్రి పదవినీ సునాయాసంగా అందుకోగలిగిన శశికళను బీజేపీ ముప్పుతిప్పలు పెట్టి చివరకు జైలుపాల్జేసిన పరిణామాలు తమిళులు చూశారు. చిన్నమ్మ మీద ప్రజలకు ప్రేమాభిమానాలు ఉండకపోవచ్చు కానీ, తమిళనాట కాలూనేందుకు బీజేపీ అన్నాడీఎంకెను ముక్కలు చెక్కలు చేసి, శశి కుటుంబంపై సర్వవ్యవస్థలను ఉసిగొల్పిన కోపం వారిలో ఉన్నది. బీజేపీ కారణంగా రెండాకులు చీలిపోయి, ఇప్పుడు తిరిగి ఒక్కటైనప్పటికీ, ఆర్కే నగర్ ఉప ఎన్నికలో ప్రజలు దినకరన్‌కు ఓట్లు కుమ్మరించి పళని–పన్నీరులు తమిళుల ఆత్మగౌరవాన్ని మోదీకి తాకట్టుపెట్టినందుకు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఉప ఎన్నిక తమిళులకు బీజేపీ పొడ ఏమాత్రం గిట్టదని మరోమారు తెలియచెప్పింది. బీజేపీతో ఏమాత్రం సాన్నిహిత్యం ఉన్నట్టు కనిపించినా రజనీకి ప్రమాదం. ఇప్పుడు ఆయనది రాజకీయ ప్రవేశ ప్రకటన మాత్రమే. త్వరలో ఆయన ప్రకటించబోయే విధానాలు, సిద్ధాంతాల ఆధారంగా ప్రజలూ, పార్టీలూ ఆయనను తూస్తాయి. భవిష్యత్ వ్యూహాలేమిటో పసిగట్టి ఎవరికి తోచిన విశ్లేషణలు వారు చేస్తారు. అవినీతి లేని పూర్తిభిన్నమైన రాజకీయం చేస్తానని మిగతా నాయకుల్లాగానే చెప్పుకోవడం వేరు, వివిధ రంగాల అభ్యున్నతి విషయంలో తన మార్గాన్ని చెప్పడం వేరు. రజనీకాంత్ జనసమ్మోహన శక్తి, ప్రజాదరణ తీసిపారేయగలిగేవి కావు. ఆయన రాక ప్రభావం రాష్ట్ర రాజకీయాలపై కచ్చితంగా ఉంటుంది. సినీరంగం నుంచి రాజకీయంలోకి వచ్చినవారు తమిళనాట ఎక్కువే కానీ, ఉన్నతస్థానానికి చేరి నిలబడినవారు తక్కువ. ఎంజీఆర్, కరుణ, జయవంటివారు రాజకీయంలో ఢక్కామొక్కీలు తిన్నాకే కుర్చీలో కూర్చోగలిగారు. వీరాభిమానులున్న శివాజీ గణేషన్, వీరత్వాన్ని చూపిన విజయకాంత్ వంటివారు ఈ రంగంలో నిలబడలేక చతికిలబడ్డారు. ఇప్పుడు జయ–కరుణ పోటాపోటీ రాజకీయ శకం ముగిసిపోయి, శూన్యత కనిపించి ఉండవచ్చు కానీ, ఏమాత్రం అనుభవం లేకుండా నేరుగా ఎన్నికల బరిలోకి దిగడం ప్రమాదకరమైన విన్యాసమే. పాలనపైనా, పార్టీలపైనా ప్రజల్లో ఆగ్రహం ఉండటం, వారు ప్రత్యామ్నాయంవైపు చూడటం సహజమే. కానీ, క్షేత్రస్థాయి వాతావరణాన్ని ఓట్లుగా మార్చుకోవడం అందరికీ అందని విద్య. పళని–పన్నీరు ప్రభుత్వాన్ని మూడునెలల్లో కూల్చేస్తానని భీష్మప్రతిజ్ఞ చేసిన దినకరన్, రజనీ ప్రవేశంతో ఆ పనికి ఎప్పుడు సిద్ధపడతారో తెలియదు కానీ, రజనీ కనుక దిగితే తొలిపరీక్ష వచ్చే ఏడాది జరగబోయే పార్లమెంట్ ఎన్నికలే.

S& D

రైతులకు మంచిరోజులొచ్చేనా?

భరతవాక్యం



■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

నిశ్చింతగా ఉండేలా రైతులకు సంక్షేమాన్ని సమకూర్చగలమా? కొత్త సంవత్సరంలో దేశ పాలకులు ప్రప్రథమంగా ఎదుర్కోవాల్సిన సవాల్ ఇది. స్వాతంత్ర్యానంతరం వ్యవసాయక దిగుబడులు ఇతోధికంగా పెరిగాయి. అయితే రైతుల జీవన స్థితిగతులు దిగజారాయి. ఇంకా దిగజారుతున్నాయి. సమస్యల నుంచి బయటపడడానికి చాలా మంది సాగుదారులకు ఆత్మహత్యలే గత్యంతరమవుతున్నాయి. కారణమేమిటి? దిగుబడుల పెరుగుదలతో పాటే ధరల తగ్గుదల కూడా చోటు చేసుకోవడమే. రైతులు తరచూ తమ పంట పెట్టుబడులను సైతం రాబట్టుకోలేకపోతున్నారు. గత ఏడాది పాలంపూర్ (గుజరాత్) పొటాటో రైతులు తమ ఉత్పత్తులను రోడ్లపై కుప్పలు పోశారు! గిట్టుబాటు ధరలు లభించక పోవడం వల్లే వారు ఆ విపరీత చర్యకు పాల్పడ్డారు. ఏదో ఒక పంట విషయంలో ప్రతి రెండో సంవత్సరమూ ఇటువంటి నిస్సహాయత పునరావృతమవుతూనే ఉంది. రైతుల దుస్థితి పట్ల మన ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. అయితే గత పలు సంవత్సరాలలో విఫలమైన విధానాల బాటలోనే ముందుకు వెళుతోంది. ప్రతి వ్యవసాయక్షేత్రానికీ సాగునీటి వసతి సమకూరుస్తామని ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చారు. నీటిపారుదల సదుపాయాలను మెరుగుపరిస్తే దిగుబడులు పెరుగుతాయని, తత్ఫలితంగా రైతులకు అధికాదాయం సమకూరి సంక్షేమం లభిస్తుందనేది పాలకుల సునిశ్చితాభిప్రాయం. అయితే అలా జరగడం లేదు. ఉత్పత్తులు పెరిగినా ధరలు పతనమవుతుండడంతో రైతులకు అల్పాదాయాలు మాత్రమే సమకూరుతున్నాయి.



రైతుల సమస్యలకు మౌలిక పరిష్కారాలు అవసరం ఎంతైనా ఉన్నది. అంతేగాని పదే పదే పంట రుణాల మాఫీ వల్ల ఎలాంటి ప్రయోజనముండదు.

నీటిపారుదల వసతులు పెంపొందించే వ్యూహం అనేకానేక పర్యావరణ సమస్యలనూ సృష్టిస్తోంది. నదుల నుంచి నీటిని కృత్రిమంగా తోడివేస్తుండడంతో నదులు నిర్జలమవుతున్నాయి. యమునానదీ జలాలను హత్నికుండ్ బ్యారేజ్ వద్ద, గంగానది నీటిని నరోరా బ్యారేజ్ వద్ద దాదాపు పూర్తిగా ఉపసంహరించుకోవడం జరుగుతోంది. నర్మదా నీరు సర్దార్ సరోవర్ డ్యామ్‌కు తీసుకువెళ్ళి అక్కడ నుంచి రైతులకు సరఫరా చేస్తున్నారు. కృష్ణా, గోదావరి, కావేరీ జలాలు సాగర సంగమం కావడమే లేదు. మన నదులు నిర్జీవ నదులు. గతంలో వలే అవి మత్స్య జాతులకు నెలవుగా ఉండడం లేదు. లక్షలాది మత్స్యకారులు తమ సంప్రదాయ జీవనోపాధిని కోల్పోయి వేరే వృత్తులను చేపడుతున్నారు. మన నదులు అవక్షేపాలను తీరప్రాంతాలకు మోసుకు వెళ్ళడం లేదు. నదీప్రవాహాలతో వచ్చే అవక్షేపాలే మన తీరప్రాంతాలకు రక్షణగా ఉంటున్నాయని మరి చెప్పనవసరం లేదు. అయితే ఇప్పుడు కృష్ణా, నర్మదా, గంగానదీ ముఖద్వారాల వద్ద తీర రేఖలు వెనక్కి పోతున్నాయి. నీటిపారుదల సదుపాయాల రూపేణా మనం మన భూమిని 'భుజిస్తున్నాం' సుమా!

ఇక కాల్వల వ్యవసాయం ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుదలకు దారితీయడం లేదు. ఇదొక విచారకరమైన వాస్తవం. కాల్వల ద్వారా సరఫరా అవుతోన్న నీటిని రైతులు చాలావరకు వృధా చేస్తున్నారు. కాల్వల ద్వారా సరఫరా చేస్తున్న సాగునీటికి ధరకు ఆ నీటితో సాగవుతున్న భూమి వైశాల్యం ప్రాతిపదికన నిర్ణయిస్తున్నారే గానీ ఎన్ని పంటలకు ఉపయోగించుకొంటున్నారనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీనివల్ల రైతులు కాల్వల నీటిని మితిమీరిన స్థాయిలో వినియోగించుకొంటున్నారు. అందుకు అదనంగా నయాపైసా చెల్లించవలసిన అవసరం లేకపోవడం వల్లే వీరు ఈ విధంగా వ్యవహరిస్తున్నారనేది స్పష్టం. ఇరిగేషన్ వల్ల ఉత్పన్నమవుతున్న రెండో పర్యావరణ సమస్య భూగర్భజలాల అడుగంటిపోవడం. రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు విద్యుత్తును ఉచితంగా సమకూరుస్తున్నాయి. ఈ ఉచిత లబ్ధితో రైతులు భూగర్భజలాలను మితిమీరిన స్థాయిలో వినియోగించుకొంటున్నారు. ఫలితంగా కొన్ని ప్రాంతాలలో భూగర్భజలాలు 2000 అడుగుల లోతుకు అడుగంటిపోయాయి. మరింత అధికస్థాయిలో విద్యుత్తును వాడుకోవడం ద్వారా తరిగిపోతోన్న భూగర్భజలాలను తోడుకొంటున్నారు.

ధరల పతనం, సాగునీటిని మితిమీరిన స్థాయిలో వినియోగించుకోవడం మన వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న జంట సమస్యలు. రైతులు కాల్వల ద్వారా, గొట్టపు బావుల ద్వారా వినియోగించుకొంటున్న నీటికి ఘన పరిమాణం (వాల్యూమెట్రిక్) ప్రాతిపదికన తగిన మొత్తంలో వెలకట్టి వసూలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అయితే దీనివల్ల సాగు ఖర్చులు పెరిగిపోతాయి. ఈ కారణంగా కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పీ)ను ఉత్పత్తి వ్యయాలకు అనుగుణంగా పెంచవలసి ఉన్నది. ఈ రెండు చర్యలు రైతుల సంక్షేమానికి దోహదం చేస్తాయి. అంతేగాక మన నదులను, భూగర్భజలాలను కాపాడతాయి. మరి కనీస మద్దతుధరను పెంచడం సులువైన వ్యవహారం కాదు. అందులో ఒక సమస్య ఉన్నది. మార్కెట్‌లో ఆహార ధాన్యాల ధరలు పెరిగిపోవడమే ఆ సమస్య. దీనివల్ల పట్టణ ప్రాంత పేదలు, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలు దెబ్బతింటాయి. ముఖ్యంగా కాయకష్టంపై ఆధారపడిన పేదలు, ఇతర అల్పాదాయ వర్గాల వారు తీవ్ర సమస్యల పాలవుతారు. ప్రత్యామ్నాయమేమిటంటే సాగు చేస్తున్న వ్యవసాయక్షేత్రాల విస్తీర్ణం ప్రాతిపదికన రైతులకు నేరుగా సబ్సిడీలు సమకూర్చడమే. అమెరికా మొదలైన సంపన్న దేశాలు తమ రైతులకు ఇటువంటి సబ్సిడీలు అందిస్తున్నాయి. ప్రతి రైతుకు నేరుగా నగదు రూపేణా ఆర్థిక సహాయం అందించాలి. కేంద్రప్రభుత్వం భారత ఆహారసంస్థకు 2015–16 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,24,419 కోట్ల సబ్సిడీని అందించింది. ప్రస్తుతం ఇది రూ. 1,50,000 కోట్లుగా ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతులకు ఏటేటా అందిస్తున్న విద్యుత్, ఇరిగేషన్ సబ్సిడీలు మొత్తం రూ. 2,00,000 కోట్ల మేరకు ఉండవచ్చు. ఈ సబ్సిడీల మొత్తం రూ. 3,50,000 కోట్లను దాదాపు పదికోట్ల మంది రైతులకు ఏటా రూ. 35,000 చొప్పున నేరుగా పంపిణీ చేయవచ్చు. అలా అందించినప్పుడు రైతులు వినియోగించుకొనే నీటికి ఘన పరిమాణం ప్రాతిపదికన ధర వసూలు చేయవచ్చు. రైతులకు ఎలాగూ కనీస మద్దతు ధర విషయమంలో హామీ ఉంటుంది గనుక ఈ పద్ధతి వల్ల ఎటువంటి సమస్య ఉండదు. రైతుల సమస్యలకు మౌలిక పరిష్కారాల అవసరం ఎంతైనా ఉన్నది. అంతేగాని పదే పదే పంట రుణాల మాఫీ వల్ల ఎలాంటి ప్రయోజనముండదు.

(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగుళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)

జనవాక్యం

రైతుల్లో ఆనందం

రోజుకు గంట విద్యుత్తే గగనమైన రాష్ట్రంలో ఇప్పుడు 24 గంటలూ విద్యుత్.. అదీ నాణ్యమైన విద్యుత్ అందుతోంది. సాగుకు 24X7 విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా 2018 జనవరి 1 నుంచి తెలంగాణ ఆవిర్భవించింది. తెలంగాణ రైతాంగానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అందించిన నూతన సంవత్సర కానుక ఇది. మూడున్నరేళ్లలో విద్యుత్ రంగంలో ఇంతటి పురోగతిని సాధించిన ఏకైక రాష్ట్రం దేశంలోనే అతి చిరుప్రాయమున్న, చిన్న రాష్ట్రమైన తెలంగాణ సాధించిన ప్రగతి నిజంగానే ఒక అద్భుతం. దేశానికే ఆదర్శం అని కేంద్రం సహ దేశంలోని రాష్ట్రాలన్నీ కొనియాడుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం దార్శనికత, రాష్ట్రప్రగతి పట్ల రాజకీయ సంకల్పం ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ కృషే కారణమనడంలో సందేహం లేదు. అసలు విద్యుత్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని స్థితి నుంచి కేవలం మూడున్నరేళ్ల వ్యవధిలో నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించే స్థాయికి రాష్ట్రం చేరుకుని సాధించిన ఘనతను ఎంత పొగిడినా తక్కువే.

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 23 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు నూతన సంవత్సర కానుకగా జనవరి 1 నుంచి నిరంతరాయంగా రోజుకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది. పవర్ కట్‌లు, పవర్ హాలీడే రోజులకు నేటితో చరమగీతం పాడింది తెలంగాణ సర్కార్. నేటి నుంచి తెలంగాణ అన్నదాతలకు ఎవ్రీడే పవర్ డే.

సాగు బాగు పరిస్థితి తీసుకురావాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం. దశాబ్దాల తరబడి నీటికి, విద్యుత్‌కు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసి డస్సిపోయిన రైతాంగంలో ఉత్సాహం నింపాలనీ, తెలంగాణ సిరులు పండే మాగాణంగా మార్చాలన్న లక్ష్యంతో రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీరందించేందుకు కేసీఆర్ కంకణ బద్ధులయ్యారు. కేవలం నోటి మాటగా కోటి ఎకరాలకు సాగు నీరు అన్న చందంగా కాకుండా మాటతప్పని వ్యక్తిత్వం ఉన్న వ్యక్తిగా దానిని ఆచరణలోకి తీసుకు వచ్చేందుకు నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తయ్యేలా పథకాలకు రూపకల్పన చేశారు. రాష్ట్రంలో భారీ ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టారు. ఆ ఎత్తి పోతల పథకాలకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేయడానికి ఇప్పుడు రాష్ట్రం సర్వసన్నద్ధమైంది. నేటి నుంచి రోజూ ఎత్తిపోతల పథకాలకు అవసరమైన 12 వేల మెగా వాట్ల విద్యుత్ నిరాటంకంగా సరఫరా అవుతుంది.


రాష్ట్ర ఆవిర్భావ సమయంలో తెలంగాణ అంధకారంలో మగ్గడం ఖాయమంటూ ఎకసెక్కాలు ఆడిన వారే నేడు ఔరా! తెలంగాణ అంటూ నిబిడాశ్చర్యంతో చూస్తున్నారు. బంగారు తెలంగాణ సాధన క్రమంలో సస్య తెలంగాణ, వెలుగుల తెలంగాణలను సాకారం చేసిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఇప్పుడు అన్ని రంగాల సమగ్రాభివృద్ధిని సమతుల్యం చేస్తూ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ దిశగా పరుగులు పెట్టిస్తున్నారు.

– పాడి కల్పనా దేవి
వరంగల్ ఉమ్మడి జిల్లా పరిషత్ విప్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన మెయిల్:
editpage@andhrajyothy.com

రాజ్యాంగం పౌరులకు యే వివక్ష లేకుండా సమానత్వ హక్కు యిచ్చినప్పటికీ అమలుపరిచే వారికి హృదయం లేకపోతే అవి కాగితాలకే పరిమితమై, అస్థిపంజరంలా మిగులుతాయని అంబేడ్కర్ పేర్కొన్న అంశాలు రాధికమ్మ, గుల్రుఖ్ గుప్తా, హదియా వంటి యెందరో స్త్రీల విషయంలో మళ్ళీ రుజువవుతున్నాయి. కుల, మతపరమైన అంశాలలో మహిళా ఉద్యమాలు యింకా ఉధృతంగా పనిచెయ్యాల్సిన అవసరాన్ని ఆ మహిళల ఉదంతాలు హెచ్చరిస్తున్నాయి.

రాజ్యాంగ హక్కులపై పితృస్వామ్య పెత్తనం



akbar



భారత రాజ్యాంగం (ఆర్టికల్స్ 25–28) యే భేదం లేకుండా పౌరులందరికీ తమకిష్టమైన మతాన్ని పాటించే హక్కునిచ్చింది. రాజ్యాంగం ప్రకారం స్త్రీ పురుషులిద్దరూ అన్ని విషయాలలోనూ సమానమే. ఆచరణలో మాత్రం కుల, మత అంశాలలో పురుషుడిని 'యెక్కువ సమానం'గా రాజ్య వ్యవస్థలు పరిగణిస్తూ స్త్రీని రెండవ తరగతి పౌరురాలిగా చూస్తుండడం గమనించవచ్చు. ఆ ధోరణి దళిత, మైనారిటీ స్త్రీల విషయంలో యిటీవల జరిగిన కొన్ని సంఘటనలలో స్పష్టంగా కనిపిస్తుంది. గుజరాత్‌లో పార్సీ మతస్థురాలైన గుల్రూఖ్ గుప్తా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి రోహిత్ వేముల తల్లి రాధికమ్మ, కేరళలో హదియా, రాజస్థాన్‌లో జరిగిన 'పరువు హత్య'ల విషయంలో సంబంధిత స్త్రీల పట్ల పోలీసులు, కోర్టులు కూడా పితృస్వామిక ధోరణితో మెలగడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

గుజరాత్ రాష్ట్రంలో గుల్రుఖ్ గుప్తా అనే పార్సీ మతస్థురాలు యితర మతస్థుడిని వివాహం చేసుకున్నాక ఆమె తన పాత మతపరమైన గుర్తింపును, ఆచారాలను కొనసాగించుకోవడానికి కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. అయితే గుజరాత్ హైకోర్టు 1954 స్పెషల్ మ్యారేజ్ చట్టం ప్రకారం మతాంతర, కులాంతర వివాహాలు చేసుకున్న స్త్రీలు తమ పాత కుల, మత పరమైన గుర్తింపులను యథావిధిగా కొనసాగించుకోవచ్చనే హక్కును తిరస్కరించి గుల్రుఖ్ గుప్తా పార్సీయేతర మతస్థుడైన తన భర్త మతాన్నే అవలంబించాలని తీర్పునిచ్చింది.

ఇటీవల కేరళ రాష్ట్రంలో మెడిసిన్ విద్యార్థిని అయిన అఖిల(హదియా) మత మార్పిడి, వివాహం కేసు కూడా స్త్రీల మత హక్కును ప్రశ్నార్థకం చేసి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. హిందూ తల్లిదండ్రులకు పుట్టిన 24 సంవత్సరాల అఖిల తన స్నేహితురాలి ప్రభావంతో ఇస్లాం మతం పైన వ్యక్తిగతంగా అభిమానం పెంచుకుని తన మతం మార్చుకుని తన పేరును 'హదియా'గా మార్చుకుంది. ఆ తర్వాత హదియా మ్యారేజ్ బ్యూరో ద్వారా 'జహాన్' అనే ముస్లిం మతస్థుడిని వివాహం చేసుకుంది. ఆమె మత మార్పిడి, వివాహం నచ్చని ఆమె తల్లిదండ్రులు తమ కుమార్తె విషయంలో 'లవ్ జిహాద్' అనే కుట్ర దాగి వుందని, ఆమెను మోసపూరితంగా మతం మార్చి పెళ్ళి చేశారని, జహాన్‌కు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయని, అతడు తమ కుమార్తెని అరబ్ దేశాలకు తరలించి మాయ చేస్తాడని, ఆ వివాహాన్ని రద్దు చేసి ఆమెని తిరిగి తమకు అప్పగించమని కోర్టుని ఆశ్రయించారు.

కేరళ హైకోర్టు హదియా 24 సంవత్సరాల మేజర్ అయినప్పటికీ ఆమె యితరుల చేత మోసగించబడటానికి అవకాశాలున్నాయని భావించి ఆమెకు జహాన్‌తో జరిగిన పెళ్ళిని రద్దు చేసి హదియాను ఆమె తల్లిదండ్రుల కస్టడీకి అప్పగించింది. సుమారు సంవత్సర కాలం పాటు హదియా తన భర్తను కానీ, స్నేహితులను కానీ కలవకుండా ఆమె తల్లిదండ్రులు కట్టుదిట్టం చేసినప్పటికీ తర్వాత హదియా తాను మేజర్‌నీ తన మత మార్పిడి, వివాహం పూర్తిగా తన మనోభీష్టం ప్రకారం జరిగాయని, తనని తిరిగి భర్త దగ్గరకు వెళ్ళనివ్వమని సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఆమె భర్త జహాన్ కూడా తన భార్యను అప్పగించమని కోర్టుకు అప్పీల్ చేశాడు. హదియా మతమార్పిడి, వివాహం విషయంలో సుప్రీం కోర్టు ఆమె తండ్రి ఆరోపిస్తున్నట్టు 'లవ్ జీహాద్' వంటి కోణంపైన దర్యాప్తు చెయ్యడానికి నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీని ఆదేశించి, నివేదిక వచ్చాక తన తీర్పును వెలువరించింది. అందులో హదియా చదువు చెన్నై మెడికల్ కాలేజీలో సగంలో వున్నందున ఆమెని తన మొదటి పేరైన 'అఖిల'గా హాస్టల్‌లో వుంటూ చదువు పూర్తి చెయ్యమని ఆదేశించింది.

ఈ రెండు కేసుల్లో కోర్టులు పూర్తిగా పితృస్వామిక ధోరణితోనూ, హిందూ మెజారిటీ మత ప్రయోజనాలను కాపాడే విధంగానూ వ్యవహరిస్తుండం గమనించవచ్చు. అంతే కాకుండా కోర్టులు ఆ స్త్రీల రాజ్యాంగపరమైన హక్కులను కాలరాస్తూ వారి వ్యక్తిగత జీవితాన్ని సంక్షోభంలోకి నెట్టి వేస్తున్నాయి. యిటీవల 'త్రిపుల్ తలాక్' పద్ధతిని రద్దు చేస్తూ ముస్లిం స్త్రీల పట్ల సుప్రీం కోర్టు కొంత ప్రగతిశీలకంగా వుందనే ఆశాభావం వ్యక్తమవుతున్న దశలో గుల్రుఖ్ గుప్తా, హదియా విషయాలలో కోర్టులు ఆ స్త్రీల మత స్వేచ్ఛని గుర్తించకపోగా హైందవేతరులను బోనులో నిలబెడుతున్నాయి. హదియా కేసులో 'లవ్ జిహాద్' అనే కొత్త అంశాన్ని తెరమీదకు తీసుకొచ్చి ముస్లిం మతస్థులను పాపాల భైరవుల్ని చెయ్యడం లౌకిక ప్రజాతంత్రవాదుల్ని కలవర పెడుతుంది.

1954 స్పెషల్ మ్యారేజ్ చట్టం ప్రకారం కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న దంపతుల్లో స్త్రీలు తమ కుల, మతపరమైన గుర్తింపులను యథావిధిగా కొనసాగించవచ్చు. కులాంతర వివాహం చేసుకున్న వారిలో పురుషుడు అగ్ర కులస్తుడు, స్త్రీ అణగారిన కులానికి చెందిన వ్యక్తి అయితే వారికి పుట్టిన బిడ్డలకు కుల సమాజంలో అగ్ర కులం వారి ఆదరణ దొరికే అవకాశం వుండదు కాబట్టి వారు తల్లికి సంబంధించిన కుల గుర్తింపును పొందవచ్చునే ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు వున్నాయి. అయినప్పటికీ ఆచరణలో అవి బాధితులకు అందుబాటులోకి రాకపోవడం గమనార్థం. ఆధిపత్య కులాలకు కొమ్ముకాసే ప్రభుత్వ యంత్రాంగం బాధిత స్త్రీలకు ఆ మాత్రపు వెసులుబాటును అందనివ్వకుండా వేధించడం సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి రోహిత్ ఆత్మహత్య సందర్భంగా చూశాం. అందరూ కలిసి రోహిత్‌ని తన కుటుంబానికి యే విధంగానూ అండగా నిలబడని అతని తండ్రి కులానికి అంటగట్టడం తెలిసిందే!

వివాహం, విడాకులు, మనోవర్తి వంటి విషయాలలో న్యాయస్థానాలు స్త్రీల పట్ల యెంతో పితృస్వామిక వైఖరితో వ్యవహరిస్తూ వారికి రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను కాలరాస్తున్నాయి. కొన్ని ప్రత్యేక తీర్పుల ద్వారా స్త్రీలకు బిడ్డల సంరక్షణ వంటి విషయాలలో కల్పించిన హక్కులను అమలు జరపడంలో ప్రభుత్వ యంత్రాంగం యెంతో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తూ తిరిగి పితృస్వామిక స్వభావాన్నే అంతటా ప్రదర్శించడం జరుగుతుంది. యిది కులధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు, పాస్ పోర్ట్, వీసాలు పొందే విషయంలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇటీవలి కాలంలో 'పరువు హత్య'ల పేరుతో కులాంతర మతాంతర వివాహాలు చేసుకునే వారిని నిర్దాక్షిణ్యంగా చంపడం, భయభ్రాంతులకు గురిచెయ్యడం వంటి సంఘటనలు తరచుగా కనిపిస్తున్నాయి. మన సమాజం తిరిగి మధ్యయుగాల చీకటి లోయల్లోకి వెళ్ళిపోతుందేమోననే భయం అంతా ఆవహిస్తుంది. యీ 'పరువు హత్యలు' అణగారిన కులాల, మైనారిటీ యువతను బలితీసుకుంటున్నాయి. అవి వారి కుల మత హక్కులనే కాక వారి జీవించే హక్కును కూడా హరించడమే! యిటీవల రాజస్థాన్‌లో జరిగిన 'పరువు హత్య' మైనారిటీలను తీవ్ర అభద్రతా భావానికి గురిచేసిందనవచ్చు.

స్త్రీ బాల్యంలో తండ్రి సంరక్షణలోనూ, యవ్వనంలో భర్త సంరక్షణలోనూ, వృద్ధాప్యంలో కొడుకు అధీనంలోనూ వుండాలని మనుస్మృతి పేర్కొంది. భారతదేశంలో న్యాయస్థానాలు కూడా స్త్రీల విషయంలో తు.చ తప్పకుండా మనుస్మృతినే పాటిస్తున్న భావన కలుగుతుంది. ప్రభుత్వ యంత్రాంగం అవలంబించే పితృస్వామిక ధోరణి దళిత, బహుజన, మైనారిటీ స్త్రీల విషయంలో మరింత దారుణమైన పరిణామాలకు దారితీస్తూ ఆ స్త్రీలను వంటరితనానికీ, అభద్రతకూ గురిచేస్తోంది. అందుకే కాబోలు అంబేడ్కర్ 'రాజ్యాంగ నైతికత' అనే భావనను చర్చకు పెట్టారు.

రాజ్యాంగం పౌరులకు యే వివక్ష లేకుండా సమానత్వ హక్కు యిచ్చినప్పటికీ అమలుపరిచే వారికి హృదయం లేకపోతే అవి కాగితాలకే పరిమితమై, అస్థిపంజరంలా మిగులుతాయని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ పేర్కొన్న అంశాలు రాధికమ్మ, గుల్రుఖ్ గుప్తా, హదియా వంటి యెందరో స్త్రీల విషయంలో మళ్ళీ రుజువవుతున్నాయి. మన దేశంలో మహిళా ఉద్యమాలు యెంత పెద్ద యెత్తున జరిగినా, అవి కుల, మతపరమైన అంశాలలో యింకా ఉధృతంగా పనిచెయ్యాల్సిన అవసరాన్ని పై సంఘటనలు హెచ్చరిస్తున్నాయి.

■ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి
ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ

అందెశ్రీ పాటకు పట్టం కట్టరా?


సబ్బండ కులాలు, వర్గాలు, సకల జనులు సమైక్యంగా చేసిన మహోన్నత పోరాటమే తెలంగాణ ఉద్యమం. లోతుగా విశ్లేషిస్తే సమస్త తెలంగాణ ఉద్యమం దళిత బహుజనుల గుండెల్లోంచి వచ్చిన సాంస్కృతిక సాహిత్య విప్లవంగా కనిపిస్తది. తమ మాటలను, పాటలను, ఆటలను కలగలిపి ఒక గొప్ప ప్రజా ఉద్యమాన్ని నిర్మించిన దాఖలాలు బహుశా ప్రపంచ చరిత్రలోనే లేదంటే అతిశయోక్తి కాదేమో. పేదోళ్ల ఆట, పాట, మాట కలబోసి ఆత్మగౌరవ పోరాటమైతే తెలంగాణ రాష్ట్రం సాకారమైంది.

తెలంగాణ అస్తిత్వ పోరాటానికి, ఆత్మగౌరవానికి జానపద గేయాలు, దళిత బహుజన కవిత్వం, సాహిత్యం ప్రాణం పోశాయన్నది వాస్తవం. వారే స్వయంగా గజ్జెకట్టి, గోశిపోసి, గొంతులు సవరించుకున్నారు. ఆడి, పాడి సకల జనులను ఉత్తేజపరిచిన్రు. నాటి పాటల సేనానులు సుద్దాల హనుమంతు, బండి యాదగిరి, గద్దర్, గూడ అంజయ్యల నుంచి నేటి జయరాజ్, గోరటి వెంకన్న, అందెశ్రీ, విమలక్క, నేర్నాల కిషోర్, రసమయి, మిట్టపల్లి సురేందర్, పసునూరి రవీందర్, ఏపూరి సోమన్నల వరకు ఎందరో దళిత బహుజన కవులు తెలంగాణ భాష, యాస, సంస్కృతి ప్రతిబింబించేలా పోరాటపటిమతో సామాజిక సమస్యలను, అణచివేతను ఎత్తిచూపుతూ తెలంగాణ ఉద్యమానికి ఊపిరినిచ్చింన్రు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను జానపద పాటల రూపంలో పదునైన ఆయుధాలుగా మార్చి పాలకుల గుండెల్లోగుచ్చుకునేలా చేశారు. "దెబ్బకు దెబ్బ వెయ్యి, వెయ్యిర.. వెయ్యి" అని ఎలుగెత్తి పాడిన సుద్దాల హనుమంతు, "బండెనుక బండిగట్టి, పదహారు బండ్లు గట్టి, ఏ బండ్ల వస్తవు కొడుకో" అంటూ పోరాటానికి సైరనూదిన బండి యాదగిరి, దొరల దోపిడీని, అణిచివేతను నిరసిస్తూ "దొరఏందిరో వాని పీకుడేందిరో" అని గూడ అంజన్న రాసిన తూటాల్లాంటి పాటలు ఉద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించి నిరంకుశత్వాన్ని సునిశితంగా ప్రశ్నించాయి. తెలంగాణ సమాజమంతటిని కార్యోన్ముఖులను చేసి ఉద్యమ ఉధృతిని రాష్ట్ర ఎల్లలు దాటించి, దేశ, విదేశాల్లో మార్మోగిపోయేలా చేశాయి. "బరిగీసి బడితందుకోర రాజన్న ఒరె రాజన్న, తెలంగాణ రాకుంటె ఒట్టు... రాజన్న మా రాజన్న" అంటూ ఉద్యమం విఫలమవుతున్నప్పుడల్లా... తెలంగాణ వచ్చి తీరుతుందన్న అపారమైన విశ్వాసాన్ని కల్పించిన మట్టి మనుషుల సాహిత్యం మనది.

తెలంగాణ ఆడబిడ్డలు విమలక్కతో సహా అనేక మంది సివంగుల్లా, గోచిపోసి, గజ్జెకట్టి, ధూంధాం వేదికల మీద ఫిరంగి తూటాల్లాంటి తమ పాటలతో ఆడిపాడారు. తెలంగాణ ఉద్యమ తీవ్రతను పెంచేందుకు కారణమయిన్రు. బంగారు తెలంగాణ వస్తే తమ బతుకులు బాగుపడుతాయనుకున్నరు.

"అయ్యోనివా.... నువ్వు అవ్వోనివా" అంటూ ఆంధ్రా పెట్టుబడిదారుల దోపిడీని నిలదీసినతీరు; "చార్మినారుకు సున్నమేసినవా... గోలుకొండకు రాళ్లు మోసినవా" అంటూ హైదరాబాద్ అంతా మేమే అభివృద్ధి చేశామన్న ఆంధ్ర పెత్తందార్లను సునిశితంగా విమర్శించి, ప్రశ్నల వర్షం కురిపించి దళిత బహుజన కవిత్వం యావత్ తెలంగాణ సమాజానికి అండగా నిలబడ్డది.



akbar

అసలు తెలంగాణ ఉద్యమమే దళిత బహుజనుల ఉద్యమం.. గిరిగీసి బరిలో నిలబడి కొట్లాడింది, ప్రాణత్యాగాలకు పాల్పడ్డది దళిత గిరిజన బహుజనులు. కాని ఇవాళ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో దళిత గిరిజన బహుజన కవులను, మేధావులను టీఆర్ఎస్ ప్రభుత్వం అవమానిస్తున్న తీరు విచారకరం. స్వచ్ఛమైన సంస్కృతులకు నెలవైన తెలంగాణ మాగాణంలో తెలంగాణ భాషా వికాసంలో వెలుగులు పంచిన వారికి సమున్నత స్థానం కల్పించడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

తమ సాహిత్యాన్ని పదునైన ఆయుధంగా మలుచుకుని ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసిన కవులు, సాహిత్యకారులు నేడెందుకు పనికిరాకుండా పోయారో అర్థంకావడం లేదు. పాటల తూటాలను సమైక్యవాదుల గుండెల్లో గురిపెట్టి గుబులు పుట్టించిన మట్టి మనుషుల పొడ కూడా తెలంగాణ పాలక వర్గాలకు గిట్టడం లేదు? తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పోరాటాలలో రామబాణాల్లా పనిచేసిన పాటలు ఇవాళ టీఆర్ఎస్ నాయకులకెందుకు గుచ్చుకుంటున్నాయి?

కర్ణాటక, తమిళనాడు లాంటి పొరుగు రాష్ట్రాల్లో ప్రత్యేక రాష్ట్ర గీతం, రాష్ట్ర పతాకాన్ని ఏర్పాటు చేసుకుని గౌరవిస్తున్నా.. మనమెందుకు మన రాష్ట్ర గీతాన్ని పాడుకోలేక పోతున్నం? నాలుగుకోట్ల మంది నాలుకలపై నాట్యమాడి, ఉద్యమానికి ఊపిరిగా మారిన పాటను తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రకటిస్తమన్న కేసీఆర్, ఇప్పుడా ఊసే లేకుండా, ప్రపంచ తెలుగు మహాసభలకు నిర్వహించి ఎవరిని మెప్పించినట్లు?

తెలంగాణ సాహిత్యానికి ఉద్యమ చిహ్నాలుగా తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వాలి. తెలంగాణ ఉద్యమానికి "తెలంగాణా తల్లి' ' అస్తిత్వరూపమిస్తే, పాటలే జీవనాడులయింది నిజం కాదా? అలాంటి పాటలను, వాటిని రాసిన కవులను నామరూపాల్లేకుండా చేయాలనుకోవడం బ్రహ్మదేవుడి తరం కూడా కాదు. కానీ తెలంగాణ వచ్చిన తరువాత, ఉద్యమ సాహిత్యం పట్ల టీఆర్ఎస్ ప్రభుత్వ అనుచిత వైఖరి ఓడలో ఉన్నంత వరకు ఓడ మల్లయ్య, ఒడ్డు చేరగానే బోడ మల్లయ్య అన్న సామెత గుర్తుకు తెస్తుంది. కోటి ఆశలతో కొట్లాడి తెచ్చుకున్న కొత్త రాష్ట్రంలో దళిత బహుజన కవుల పట్ల టీఆర్ఎస్ ప్రభుత్వం చూపుతున్న వివక్ష యావత్ తెలంగాణ సమాజాన్ని అవమానించడమే.

అలనాడు స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో బంకిం చంద్ర చటోపాధ్యాయ రాసిన వందేమాతరం పాట ఆయుధంగా మారి, బ్రిటిష్ దాస్య శృంఖలాల నుండి విముక్తి ఏవిధంగా ప్రసాదించిందో, అదే మాదిరిగా, తెలంగాణ ఉద్యమ కాలంలో తెలంగాణ వాగ్గేయకారుడు, దళిత కవి, అందెశ్రీ రాసిన "జయజయహే తెలంగాణ జననీ జయకేతనం" పాట, తెలంగాణ ఉద్యమానికి ఊపిరినిచ్చింది, తెలంగాణ ఆత్మ గౌరవానికి పట్టం కట్టి, వలస పాలకుల నుండి విముక్తి కలిగించింది. ఈ పవిత్రమైన పాటను రాష్ట్ర గీతంగా అమలు చేద్దామని ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చెప్పిన మాటలను నమ్మి, పల్లె పల్లెల్లో, బడి పిల్లలు, ప్రభుత్వ కార్యాలయాలలో సకల జనులంతా జాతీయ గీతంతో సమానంగా పాడుకున్నారు.. సకలజనులు సైతం అదే స్ఫూర్తిగా ముందుకు కదిలి రాష్ట్రం సాధించుకున్నరు. కానీ గడిచిన మూడున్నరేళ్లుగా "జయ జయహే తెలంగాణ" ఉద్యమగీతాన్ని మరుగున పెట్టింన్రు. కేవలం టీఆర్ఎస్‌ను స్తుతించే విధంగా, జయ జయహే గీతంలో మార్పులు, చేర్పులు, కూర్పులు చేయాలన్న ముఖ్యమంత్రి కోరికను అందెశ్రీ తిరస్కరించడంతో, మొత్తం జనంగుండెల్లో గూడుకట్టుకున్న పాటనే పాతరేసింన్రని తెలంగాణ యావత్తు కోడై కూస్తుంది. అదే నిజమైతే తెలంగాణ ఆత్మగౌరవాన్ని మనవాడనుకున్న ముఖ్యమంత్రే స్వయంగా అణచివేసినట్లే.

కర్ణాటక, తమిళనాడు లాంటి పొరుగు రాష్ట్రాల్లో ప్రత్యేక రాష్ట్ర గీతం, రాష్ట్ర పతాకాన్ని ఏర్పాటు చేసుకుని గౌరవిస్తున్నా.. మనమెందుకు మన రాష్ట్రగీతాన్ని పాడుకోలేక పోతున్నం? నాలుగుకోట్ల మంది నాలుకలపై నాట్యమాడి, ఉద్యమానికి ఊపిరిగా మారిన పాటను తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రకటిస్తమన్న కేసీఆర్, ఇప్పుడా ఊసే లేకుండా, ప్రపంచ తెలుగు మహాసభలకు నిర్వహించి ఎవరిని మెప్పించినట్లు?

ఉద్యమ సాహిత్యానికి ప్రాధాన్యం ఇవ్వకుండా, ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడం ఘోరమైన అపరాధం. గొప్పసాహిత్య అభిమానినని తరుచూ చెప్పుకునే ముఖ్యమంత్రి ఎంతో అట్టహాసంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలకు గద్దర్, విమలక్క, అందెశ్రీ, ఉద్యమ కవులను ఆహ్వానించకపోవడం తీరని అన్యాయం.

తెలుగు మహాసభల్లో జరిగిన తప్పును టీఆర్ఎస్ ప్రభుత్వం సరిదిద్దుకుంటుందని ఆకాంక్షిస్తూ, ఇకనైనా బేషజాలు వీడి "జయ జయహే తెలంగాణ" అంటూ జంగ్ సైరన్ మోగించి గల్లీనుంచి ఢిల్లీ దాకా దద్దరిల్లేలా చేసిన అందెశ్రీ పాటకు పట్టం కట్టాలని, కేసీఆర్ ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని, విజ్ఞప్తి. అంతేకాదు, దళిత బహుజన ఉద్యమ కవుల రచనలను, అమరుల ఆత్మత్యాగాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి. తెలంగాణ రాష్ట్రం అలుపెరుగని పోరాటం, అనన్య త్యాగాల ఫలమన్న సత్యాన్ని, భవిష్యత్తు తరాలకు అందించేలా చర్యలు తీసుకోవాలి.

ఉద్యమ సాహిత్యాన్ని, తెలంగాణ నుంచి వేరుచేయడమంటే "తల్లి నుంచి పిల్లను వేరుచేయడం లాంటిదే"ననో నగ్నసత్యాన్ని ముఖ్యమంత్రి గ్రహించాలి. తెలంగాణ జాతిని ఆత్మ న్యూనత భావం నుండి తల ఎత్తుకుని ఆత్మ గౌరవంతో నిలబడి వలస పాలకులతో కలబడేందుకు బలాన్నిచ్చిన "జయజయహే తెలంగాణ" గీతాన్ని రాష్ట్రగీతంగా ప్రకటించి గౌరవించాలి.

లేనిపక్షంలో వందేమాతర నినాదంతో నడిచిన స్వాతంత్ర పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని, యావత్ తెలంగాణ సమాజాన్ని మేల్కొలిపి "జయ జయహే తెలంగాణ" ఉద్యమాన్ని నిర్మిస్తాం. సామాజిక తెలంగాణకు బాటలు వేస్తాం.

■ డాక్టర్ శ్రవణ్ దాసోజు
ముఖ్య అధికార ప్రతినిధి, తెలంగాణ కాంగ్రెస్

మాదిగలకు ద్రోహం చేసిన కడియం

▸ ఎస్సీ వర్గీకరణకు నేటి నుంచి దీక్షలు: మందకృష్ణ



బౌద్ధనగర్/హైదరాబాద్, జనవరి 1: మాదిగలకు ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ద్రోహం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. సోమవారం పార్సిగుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో దీక్ష చేపడితే టీఆర్ఎస్ మద్దతు ఇస్తుందా? అని 48గంటల ముందు కేసీఆర్, కడియంను ప్రశ్నించగా.. ఇప్పటికీ సమాధానం రాలేదన్నారు. మహబూబాబాద్ నుంచి కడియం శ్రీహరి తన కుమార్తెకు ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నిస్తున్నాడని, ఇందు కోసం రాజయ్యకు టికెట్ రాకుండా అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని గాంధేయ మార్గంలో మంగళవారం నుంచి హైదరాబాద్‌లో ఉపవాస దీక్షలు మొదలు పెడుతున్నామన్నారు. ఇందిరా పార్కు, బాపూఘాట్ కానీ హైదరాబాద్‌లో ఎక్కడైనా అనుమతి ఇప్పించాలని కోరామన్నారు. మంగళవారం 10గంటలలోపు అనుమతి రాకపోతే తామే ఓ ప్రాంతాన్ని నిర్ణయించుకుని దీక్షలు మొదలు పెడతామన్నారు.

బీసీ కులాలకు భూమి కేటాయించాలి: కృష్ణయ్య

హైదరాబాద్, జనవరి1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 66 బీసీ కుల సంఘాలకు ఒక్కొక్క కుల సంఘానికి 10 ఎకరాల స్థలం చొప్పున కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన లేఖ రాశారు. మాల, మాదిగ, లంబాడీ, ఎరుకల, గోండు, రెడ్డి, కుర్మలతోపాటు వీరశైవులు, క్రిస్టియన్ సంఘానికి నిధులు కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అదే స్ఫూర్తితో బీసీలోని మిగిలిన కులాలకు కూడా భూమి, నిధులు కేటాయించాలని లేఖలో కోరారు.

నేడు అరుణ్‌సాగర్ అవార్డుల ప్రదానోత్సవం

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ జర్నలిస్ట్, రచయిత అరుణ్‌సాగర్ పురస్కారాల ప్రదానోత్సవం తెలుగు విశ్వవిద్యాలయంలో మంగళవారం జరగనుంది. ఈ పురస్కారాన్ని ప్రముఖ గాయకుడు గోరటి వెంకన్న అందుకోనున్నారు. కార్యక్రమానికి మంత్రులు హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, శాసనమండలిలో విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరవుతారని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. అలాగే ఉత్తమ జర్నలిస్టుల ఎంపిక కమిటీ ప్రతినిధులు ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, సాక్షి మీడియా గ్రూప్ ఎడిటోరియల్ డైరెక్టర్ కె.రామచంద్రమూర్తి, నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె.శివారెడ్డి, పాలగుమ్మి సాయినాథ్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

24గంటల విద్యుత్తులో మతలబు ఉంది: కోదండ



హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): "రైతులకు 24గంటల విద్యుత్తు ఇవ్వడంపై టీఆర్ఎస్ ప్రభుత్వానికి అంత ఆసక్తి ఎందుకు? అసలు ఈ విద్యుత్తును ఎలా ఇవ్వగలుగుతోంది? ఇదంతా మన ముఖ్యమంత్రి దీక్షాదక్షతేనా? అన్ని అంశాల్లో విఫలమైన ప్రభుత్వం ఈ అంశంలో సఫలమైందంటే నమ్మశక్యంగా లేదు. ఇందులో అసలు మతలబు ఏమిటో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది" అని టీజేఏసీ చైర్మన్ కోదండరాం వ్యాఖ్యానించారు. అధికారంలోకి రాగానే విద్యుత్ సమస్యను పరిష్కరించామని, అదంతా తమ గొప్పేనని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమని సోమవారం ఆయన ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. అనేక రాష్ట్రాల్లో మిగులు విద్యుత్తు ఉండడం, రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులు 2015 నుంచి కరెంట్ ఉత్పత్తి ప్రారంభించడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత మొదలు పెట్టిన ఒక్క ప్రాజెక్టులోనూ ఉత్పత్తి మొదలు కాలేదని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా 19 రాష్ట్రాల్లో అసలు విద్యుత్ కోతలే లేవని, 2017-18లో 1.08లక్షల మిలియన్ యూనిట్ల మిగులు విద్యుత్తు అందుబాటులో ఉందని వివరించారు. రైతులు కూడా 9గంటల విద్యుత్తును సక్రమంగా సరఫరా చేయాలని అడుగుతున్నారే తప్ప 24గంటలు ఇవ్వాలని కోరడం లేదని వెల్లడించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి నిరంతర విద్యుత్తును ముందుకుతెచ్చిన ప్రభుత్వం 24 గంటలు ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు. సీఎం సొంత నియోజకవర్గంలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా పట్టించుకున్న వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

కేసీఆర్ పాలన భేష్

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నో అంశాలను సీఎం కేసీఆర్ సుసాధ్యం చేస్తున్నారని కొనియాడారు. కేసీఆర్ పాలనా సామర్థ్యాన్ని తెలుసుకునేందుకే తాను ప్రగతిభవన్‌కి వచ్చానన్నారు. సోమవారం సాయంత్రం ఆయన ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇద్దరూ అరగంటసేపు ఏకాంతంగా భేటీ అయ్యారు. వారి మధ్య ప్రధానంగా రాజకీయ అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. తర్వాత ఇద్దరూ కలిసి భోజనం చేశారు. దాదాపు రెండు గంటలపాటు పవన్ ప్రగతిభవన్‌లో ఉన్నారు. గతంలో ఆయన ఒకసారి కాపు సమస్యపై చర్చించేందుకు సీఎం కేసీఆర్ అపాయింట్‌మెంట్ అడిగినట్లు తెలిసింది. కానీ, వారి మధ్య అప్పుడు భేటీ కుదరలేదు. ఇటీవల రాజ్‌భవన్‌లో కేసీఆర్, పవన్‌లు పరస్పరం ఎదురుపడినప్పుడు కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. తాజాగా పవన్ ప్రగతి భవన్‌లో తొలిసారి అడుగుపెట్టడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. జనసేన ఆవిర్భావం సందర్భంగా పవన్ రెండు తెలుగు రాష్ట్రాల్లో పోటీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజా భేటీపై పలు ఊహాగానాలు చెలరేగుతున్నాయి. ఇరువురి మధ్య ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. 24 గంటల విద్యుత్తు సరఫరాపై అడగ్గా.. సీఎం కేసీఆర్ గణాంకాలతో సహా పవన్‌కి వివరించారు. అనంతరం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు.

కేస్‌స్టడీగా 24 గంటల కరెంట్

తెలంగాణలో అమలు చేస్తున్న 24 గంటల విద్యుత్తు సరఫరా పథకాన్ని భారత దేశంలో ఒక కేస్‌స్టడీగా తీసుకోవాలని పవన్ పేర్కొన్నారు. 24 గంటల విద్యుత్తు ఇస్తే వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ తరఫున ప్రచారం చేస్తానన్న ప్రతిపక్ష నేత జానారెడ్డి మాటలు తనకు గుర్తుకొచ్చాయన్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌కి మద్దతిచ్చే ఆలోచన లేదని చెప్పారు. కేసీఆర్ పాలన చూస్తుంటే రాష్ట్రం వేరే వాళ్ల చేతిలో ఉంటే పరిస్థితి ఎలా ఉండేదోననే భావన కలుగుతోందని తెలిపారు. ఉద్యమం జరిగినప్పటి నుంచి తనకు కేసీఆర్, టీఆర్ఎస్, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిపై ఎంతో గౌరవం ఉండేదని స్పష్టం చేశారు. జనసేన ఆవిర్భావ సభలోనూ ఆ విషయాన్ని చెప్పానన్నారు. ఇప్పటికీ ఏపీలో జరిగే జనసేన సమావేశాల్లో ఈ విషయాన్ని చెబుతుంటానన్నారు.

గంటసేపు ఎదురుచూపు..

పవన్ కల్యాణ్ సాయంత్రం 6.20 గంటల ప్రాంతంలో ప్రగతి భవన్‌కు చేరుకున్నారు. సరిగ్గా అదే సమయానికి సీఎం కేసీఆర్ గవర్నర్ నరసింహన్‌ను కలిసేందుకు రాజ్‌భవన్‌కు వెళ్లారు. దీంతో పవన్ సుమారు గంట సేపు కేసీఆర్ కోసం ఎదురుచూశారు. గవర్నర్‌ని కలిసి ప్రగతి భవన్‌కు వచ్చిన కేసీఆర్ నేరుగా పవన్ కళ్యాణ్‌ను కలుసుకున్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న టీఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, టీఎస్ఎండీసీ చైర్మన్ శేరి సుభాష్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల శ్రవణ్‌కుమార్‌రెడ్డిలను కేసీఆర్ పవన్‌కు పరిచయం చేశారు.

ఆకాంక్షలను నెరవేరుస్తున్నారు

తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను కేసీఆర్ ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వెళ్తున్నారని పవన్ చెప్పారు. రాష్ట్రపతికి గవర్నర్ ఇచ్చిన విందులో తాను కేసీఆర్‌ని కలిశానని.. త్వరలోనే భేటీ అవుదామని చెప్పారని తెలిపారు. ప్రపంచ తెలుగు మహాసభలకు తాను రాలేకపోయిన విషయం కూడా సీఎంతో చర్చించానన్నారు. ఎన్నికల్లో పొత్తులపై చర్చించే స్థాయిలో ఈ భేటీ జరగలేదన్నారు. తాను పార్టీ ఏర్పాటు చేసినప్పటి నుంచి అందరినీ కలుస్తున్నానని.. అవగాహన పెంచుకునేందుకు, సమస్యల పరిష్కారానికి ఈ సమావేశాలు ఉపకరిస్తాయని తెలిపారు. సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లాలంటే సుహృద్భావ వాతావరణం ఉండాలని చెప్పారు. మంత్రి కేటీఆర్‌ని తాను చాలాసార్లు కలిశానని తెలిపారు.

తగ్గించాలంటే.. పెంపా!

(మొదటి పేజీ తరువాయి)

ఫీజులు పెంచుకొనేందుకు రాజమార్గం చూపినట్లైంది. విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వుల్లో పాత నిబంధనలే తప్ప ఎలాంటి నూతన నిబంధనలు పెట్టకపోవడం గమనార్హం. రాష్ట్రంలో చిన్న చిన్న ప్రైవేటు పాఠశాలలు మినహాయిస్తే కార్పొరేట్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ, ఒకటో తరగతి ప్రవేశాలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఈ విషయం అధికారులతో సహా అందరికీ తెలిసిందే. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ప్రీ ప్రైమరీ అడ్మిషన్ల వ్యవహారంలోనే విద్యాశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణం. ప్రైవేటు పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలోనే ఫీజులను నియంత్రించకపోతే తర్వాత సాధ్యం కాదనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఇదేం విధానం..?

ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం ద్వంద్వ విధానం అవలంబిస్తోంది. ఓ వైపు ఫీజుల నియంత్రణ సమస్య తేలకముందే ప్రైవేటు పాఠశాలలకు అడ్మిషన్లకు అవకాశం ఇవ్వడం దారుణం. విద్యార్థుల తల్లిదండ్రులతో ఆడుకుంటోంది. ఎల్‌కేజీ, యూకేజీ, ప్రైమరీ తరగతుల్లో ఫీజులను నియంత్రించకుంటే అవి పై తరగతులకు వెళ్లే సరికి తడిసి మోపెడవుతాయి. ఫీజుల విషయం తేలే వరకు ఎలాంటి అడ్మిషన్లకు, ఫీజుల నిర్ధరణకు అవకాశం ఇవ్వొద్దు.

– ఆశిష్, హెచ్ఎస్‌పీఏ ప్రతినిధి

ఫీజు ఫిక్స్ చేసుకోవాల్సిందే..



ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై తిరుపతిరావు కమిటీ శనివారం ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఏటా 10శాతం ఫీజు పెంచుకోవచ్చని ప్రతిపాదించింది. అయితే ఈ నివేదికకు ప్రభుత్వ అనుమతి లభించలేదు. ఈ నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ జారీ చేయడాన్ని కొందరు అధికారులు సమర్థించుకుంటున్నారు. ప్రస్తుతం ఆ పాఠశాలలు ఫీజును ఖరారు చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి తిరుపతిరావు కమిటీకి ఆమోదం లభిస్తే అందుకు తగ్గట్లుగానే ఫీజులు వసూలు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇక్కడే అసలు మతలబు దాగి ఉంది. ప్రీ ప్రైమరీలో ప్రవేశాలకు విద్యాశాఖ అనుమతి ఇవ్వడంతో ఇక పాఠశాలలు అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేస్తున్నాయి. ఇప్పటికే దరఖాస్తులు కూడా విక్రయిస్తున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలకు అడ్మిషన్ కోసం వెళ్లినప్పుడు పాఠశాల యాజమాన్యంతో ఫీజుకు సంబంధించి ఒక ఒప్పందం చేసుకోవాల్సిందే. లేదంటే అడ్మిషన్ దొరకదు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు ఒకసారి ఒప్పందం చేసుకుంటే ఆ మొత్తం ఫీజు చెల్లించకుంటే యాజమాన్యాలు ఊరుకుంటాయా..? అలాగే తిరుపతిరావు కమిటీ అంశాలు ఆ పాఠశాలలకు వ్యతిరేకంగా ఉంటే వాటిని అమలు చేస్తాయా..? అనేది ప్రశ్నార్థకమే!

ఫీజుల నియంత్రణ అటకెక్కినట్లేనా..?

విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న ఫీజుల నియంత్రణ అంశం ఈ ఏడాది కూడా అటకెక్కినట్లే కనిపిస్తోంది. హడావిడిగా.. ఏదో ఒక నివేదిక ఇవ్వాలి అనే విధంగా తిరుపతిరావు కమిటీ ఒక నివేదికను అందజేసింది. దాంతో సంబంధం లేకుండానే సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ ప్రవేశాలకు పాఠశాల విద్యాశాఖ అనుమతి ఇచ్చింది. అంటే ఈ పాఠశాలలు ప్రస్తుతం ఫీజుల నియంత్రణ అంశం పరిధిలోకి రావు. కమిటీ నివేదికపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం, ఇంత తక్కువ వ్యవధిలో అది అమల్లోకి రావడం సాధ్యం కాదనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. మొత్తమ్మీద ఈ ఏడాది కూడా ఫీజుల నియంత్రణ అంశం అటకెక్కడం ఖాయం.



తెలంగాణకు 3 ఫొరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లు!

▸ మహబూబ్‌నగర్, మంచిర్యాల, ఖమ్మం జిల్లాల్లో ఏర్పాటు

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 3 ప్రాంతీయ ఫొరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లు త్వరలో ప్రారంభం కానున్నాయి! మహబూబ్‌నగర్, మంచిర్యాల, ఖమ్మం జిల్లాల్లో వీటి ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి! రాష్ట్రం ఆవిర్భవించిన తొలినాళ్లలోనే ప్రభుత్వం మూడు ప్రాంతీయ ఫొరెన్సిక్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మంచిర్యాల, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో 3 ఫొరెన్సిక్ ల్యాబ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం గతంలోనే జీవో జారీ చేసింది. అయితే, హైదరాబాద్‌లోని ఫొరెన్సిక్ ల్యాబ్ ఏపీ పునర్విభజన చట్టం 10వ షెడ్యూల్‌లో ఉండటంతో ప్రాంతీయ ల్యాబ్‌ల ఏర్పాటుకు అడ్డంకిగా మారింది. తాజాగా ప్రభుత్వం ఒక్కో ల్యాబ్‌కు రూ.50లక్షలు కేటాయించడంతో ఉన్నతాధికారులు పరికరాలు కొనుగోలు చేయడంలో తలమునకలయ్యారు. ఈ ల్యాబ్‌లను తొలుత తాత్కాలిక భవనాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ఈ ల్యాబ్‌ల కోసం 54 కొత్త పోస్టులను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. 43 పోస్టులను పదోన్నతుల ద్వారా, 11 పోస్టులకు నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తారు. సెరాలజీ, టాక్సికాలజీ విభాగాల్లో పరిశోధన చేసే ఈ ల్యాబ్‌ల ఏర్పాటుకు 7 నెలలు పడుతుందని అదనపు డీజీపీ(టెక్నికల్ సర్వీసెస్) రవిగుప్తా తెలిపారు.

ఒక పరీక్ష.. 77 తప్పులు

▸ తొమ్మిదేళ్ల పోరాటం.. అభ్యర్థులకు దక్కని న్యాయం

▸ రివైజ్డ్ సెలక్షన్ లిస్టు ఇవ్వాలని హైకోర్టు ఆదేశం

▸ ఇటీవలే ఏపీలో 36 మందికి కొత్తగా ఉద్యోగాలు

▸ తెలంగాణ విద్యాశాఖలో కనిపించని కదలిక

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2008లో చేసిన తప్పిదానికి జూనియర్ లెక్చరర్ ఎకనమిక్స్ సబ్జెక్టు అభ్యర్థులు ఇంకా శిక్ష అనుభవిస్తున్నారు. ఎకనమిక్స్ జూనియర్ లెక్చరర్స్ నోటిఫికేషన్‌లో ఏపీపీఎస్సీ తప్పిదాలపై న్యాయపోరాటంతో న్యాయం జరుగుతుందని భావించిన తెలంగాణ అభ్యర్థులు ఇంకా నిరాశలోనే ఉన్నారు. త్వరగా పరిష్కరించే అవకాశం ఉన్నా ఇంటర్ బోర్డు, విద్యాశాఖ జాప్యం చేస్తున్నాయి. 93 ఎకనామిక్స్ జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి 2008లో నోటిఫికేషన్ జారీచేసిన ఉమ్మడి ఏపీపీఎస్సీ నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలను 2012 జూన్ 8న విడుదల చేసింది. ఆగస్టు, సెప్టెంబర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించి నియామక ప్రక్రియను పూర్తి చేసింది. ప్రిలిమినరీ కీ, ఫైనల్ కీని విడుదల చేయకుండానే భర్తీ ప్రక్రియను పూర్తి చేసింది. కీ విడుదల చేయాలని అభ్యర్థులు ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోలేదు. దాంతో అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు తీర్పు 2014లో వెలువడింది. అప్పటికే ఏపీపీఎస్సీ భర్తీ ప్రక్రియను పూర్తి చేసింది. అయితే అభ్యర్థులు అనుమానించినట్లే ఎకనామిక్స్ పేపర్ 150 ప్రశ్నలకు 77 ప్రశ్నలు తప్పుగా ఇచ్చినట్లు కోర్టు ఆదేశాల ప్రకారం ఏర్పాటైన ఏపీపీఎస్సీ నిపుణుల కమిటీ తేల్చింది. రాత పరీక్ష మొత్తం 500 మార్కులకు నిర్వహించగా, ఎకనమిక్స్ సబ్జెక్టు ప్రశ్నాపత్రంలోని 150 మార్కులకుగానూ 77 తప్పులు ఉన్నట్లు నిపుణుల కమిటీ తేల్చింది. అనగా 154 మార్కులకు సంబంధించి కీలో తప్పుల కారణంగా మెరిట్ అభ్యర్థులకు నష్టం జరిగింది. కోర్టు తీర్పు ఆలస్యం కావటం, అప్పటికే నియామక ప్రక్రియ పూర్తి కావటంతో అభ్యర్థులు మళ్లీ కోర్టును ఆశ్రయించారు. తప్పులు దొర్లిన 77 ప్రశ్నలను పరిగణనలోకి తీసుకుని రివైజ్డ్ మెరిట్ లిస్టులు తయారు చేసి ఉద్యోగాలు ఇవ్వాలని, అర్హత లేకుండా ఇప్పటికే ఉద్యోగాలు పొందిన వారిని తొలగించాలని హైకోర్టు ఏపీపీఎస్సీని ఆదేశించింది. కోర్టు ఆదేశాల ప్రకారం రివైజ్డ్ సెలక్షన్ లిస్టులు సిద్ధం చేసిన ఏపీపీఎస్సీ తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలకు జాబితాలను పంపించింది. ఇందులో ఏపీలో 51 పోస్టులు, తెలంగాణలో 38 పోస్టులు ఉన్నాయి. రివైజ్డ్ జాబితాలో ఎంపిక కాకుండా ఉద్యోగం చేస్తున్న వారికి సైతం ఏపీపీఎస్సీ నోటీసులు పంపించింది. దాంతో 2012లో నియమితులైన ఎకనమిక్స్ లెక్చరర్స్ కోర్టును ఆశ్రయించారు. నాలుగేళ్లుగా ఉద్యోగం చేస్తున్నామని, ఇప్పుడు తొలగిస్తే రోడ్డున పడతామని కోర్టును వేడుకొన్నారు. వారిని తొలగించకుండా కొత్తగా ఎంపికైన వారికి ప్రస్తుతం ఉన్న ఖాళీల్లో నియామకం చేపట్టాలని, కొత్తగా ఎంపికైన వారి తర్వాత స్థానంలోనే వారికి సీనియారిటీ ఇవ్వాలని కోర్టు ఇరు ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం రివైజ్ సెలక్షన్ లిస్టు ప్రకారం ఎంపికైన 36 మందికి రెండు రోజుల క్రితం ఏపీ ఇంటర్మీడియట్ బోర్డు ద్వారా పోస్టింగులు ఇచ్చింది. తెలంగాణలో మాత్రం ఇప్పటి వరకు పోస్టింగులు ఇవ్వలేదు. ఏపీపీఎస్సీ 2017 జూన్‌లో రివైజ్డ్ సెలక్షన్ లిస్టును తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డుకు పంపించింది. ఇంటర్మీడియట్ బోర్డు విద్యాశాఖ అనుమతి కోసం ఫైలును పంపించింది. కొర్రీల మీద కొర్రీల కారణంగా ఆరు నెలలుగా ఇంటర్ బోర్డు, విద్యాశాఖ మధ్య ఫైలు చెక్కర్లు కొడుతుందే తప్ప అభ్యర్థులకు న్యాయం జరగడం లేదు. దాంతో అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొమ్మిదేళ్లు కోర్టుల చుట్టు తిరిగి, న్యాయం జరిగే విధంగా ఆదేశాలు తెచ్చుకున్నప్పటికీ... విద్యాశాఖ పోస్టింగులు ఇవ్వటంతో తాత్సారం చేస్తోందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా 2008 రివైజ్డ్ సెలక్షన్ జాబితాలో ఎంపికైన వారికి న్యాయం చేయాలని కోరుతున్నారు.



సూర్యాపేట జిల్లా ఫణిగిరి వద్ద ఆత్మీయ సమ్మేళన సభలో మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

విద్యుత్తు పుణ్యం కాంగ్రెస్‌దే

▸ సీఎం కేసీఆర్‌ది ప్రచార ఆర్భాటం: ఉత్తమ్

▸ నిరంతర కరెంట్‌తో భూస్వాములకే లాభం: కోమటిరెడ్డి

▸ నీళ్లు లేకుండా ఏం చేసుకోవాలి?: కోదండరెడ్డి

▸ నేడు టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం

నల్లగొండ/హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యుత్తు వెలుగుల పుణ్యం కాంగ్రెస్‌దేనని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని ఫణిగిరి వద్ద నూతన సంవత్సరం సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో విద్యుత్తు ప్రాజెక్టులు నిర్మించి చివరి దశకు తీసుకొస్తే, సీఎం కేసీఆర్ సీటులో కూర్చుని స్విచ్ ఆన్ చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. మూడేళ్లలో కొత్తగా ఒక్క యూనిట్ విద్యుత్తు ఉత్పత్తి అయినా జరిగిందా అని ప్రశ్నించారు. ఆదిలాబాద్ జిల్లా జైపూర్‌లో 1200 మెగావాట్లు, భూపాలపల్లిలో 600 మెగావాట్లు, పులిచింతలలో 90 మెగావాట్ల ప్రాజెక్టులు తమ హయాంలోనే చివరి దశకు చేరాయని గుర్తు చేశారు. నాలుగేళ్లుగా బీసీలకు ఏమీ చేయని ప్రభుత్వం ఇప్పుడు రోజుకో కపట నాటకం ఆడుతోందని విమర్శించారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కమీషన్ కోసం మిషన్ భగీరథను తీసుకొచ్చారని ఆరోపించారు. హుజూర్‌నగర్‌లో 4 వేల డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లకు దిక్కులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాగా, వ్యవసాయానికి నిరంతర విద్యుత్తుతో భూస్వాములకే మేలు జరుగుతుందని, చిన్న రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదు గంటలు కరెంట్ ఇచ్చేందుకే ఇబ్బందిగా ఉందని విద్యుత్తు అధికారులు చెబుతున్నా... సీఎం కేసీఆర్ మూర్ఖుడిలా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. 24గంటల విద్యుత్‌తో భూగర్భ జలాలు అడుగంటి పోతుందని గతంలోనే సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లామన్నారు. రాష్ట్రంలో 90 శాతం భూగర్భ జలాలు అడుగంటిపోయిన పరిస్థితుల్లో నిరంతర కరెంట్‌ను ఏం చేసుకోవాలని టీపీసీసీ కిసాన్ సెల్ చైర్మన్ కోదండరెడ్డి ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ విద్యుత్తు ఇవ్వడం కన్నా భూగర్భ జలాలు పెంచేందుకు కృషి చేయాలన్నారు. కాగా, రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు మంగళవారం గాంధీభవన్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు.

కందికి మద్దతు దొరికేనా?



హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికైనా, పండిన పంటను అమ్మేందుకైనా అదను ముఖ్యం. అదనులో విత్తనం పడకుంటే మొలకలే రావు. పండిన పంటను అదను ప్రకారం అమ్ముకోకుంటే నష్టాలు తప్పవు. అయితే, ప్రభుత్వం అదను ప్రకారం వ్యవహరించకుండా అతి జాగ్రత్తతో వ్యవహరించడంతో రాష్ట్రంలోని మెజారిటీ కంది రైతులకు మద్దతు ధర దక్కని పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో మెజారిటీ కంది పంట రైతు ఇంటికి, మార్కెట్లకు ఫిబ్రవరి నెలలో వస్తుంది. రాష్ట్రంలోని ప్రధాన పంటల్లో ఒకటైన కందికి మార్కెట్లో ప్రస్తుతం మద్దతు ధర కన్నా తక్కువ పలుకుతోంది. ముందు చూపుతో వ్యవహరించిన రాష్ట్ర ప్రభుత్వం పీఎస్ఎస్ పథకం కింద కందుల సేకరణ కోసం కేంద్రానికి నవంబరులోనే ప్రతిపాదన పంపింది. ఆ ప్రతిపాదనను వెంటనే ఆమోదించిన కేంద్రం డిసెంబరు 1 నుంచి జనవరి 31 వరకు కందులను మద్దతు ధరకు సేకరించాలని నాఫెడ్‌ను ఆదేశించింది. రాష్ట్రంలో కందుల దిగుబడి అంచనాకు అనుగుణంగా 33,500 మెట్రిక్ టన్నుల కందులు సేకరించాలని సూచించింది. నాఫెడ్ తరఫున కందులు సేకరిస్తున్న మార్క్‌ఫెడ్, హాకాలను నోడల్ ఏజెన్సీలుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. మార్క్‌ఫెడ్ 73, హాకా 46 కేంద్రాల ద్వారా కందుల సేకరణకు ప్రణాళిక సిద్ధం చేశాయి. కేంద్రం అనుమతించి నెల దాటినా రైతుల చేతికి కంది పంట ఇంకా రాకపోవడంతో హాకా ద్వారా 15 సేకరణ కేంద్రాలే పనిచేస్తున్నాయి. మెజారిటీ పంట రైతు చేతికి ఫిబ్రవరి నెలలో రానుండగా మద్దతు ధర (క్వింటాలుకు రూ.5,450) గడువు జనవరి 30తో ముగియనుంది. దీంతో మెజారిటీ రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. పంట కొద్ది రోజుల్లో చేతికి వస్తుందనగా మార్కెట్లో ఆయా పంటలకు కాస్త మంచి ధర పలకడం సహజం. కందులకు మాత్రం మద్దతు ధర కంటే రూ.1000 తక్కువగా పలుకుతోంది. దీంతో రైతులను ఆదుకోవాలంటే మద్దతు ధరకు కంది పంట సేకరణ కీలకంగా మారింది.

వ్యాపారులకు అవకాశం..!

కందుల సేకరణ కోసం తెరిచిన 15 కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 31,730 క్వింటాళ్ల కందుల సేకరణ జరిగింది. రాష్ట్రంలో కందుల దిగుబడి అంచనాల ప్రకారం ఈ సీజన్‌లో 33,500 టన్నుల కందులను పీఎస్ఎస్ పథకం కింద మద్దతు ధరకు సేకరించేందుకు కేంద్రం ముందుకొచ్చింది. కంది పంట పూర్తిగా రైతుల చేతికి రాని నేపథ్యంలో సేకరణ కేంద్రాలు వ్యాపారులకు వరంగా మారకుండా చర్యలు చేపట్టాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గత సీజన్‌లో పడిపోయిన కందుల ధర ఇంతవరకూ కోలుకోని సంగతి తెలిసిందే. గత సీజన్‌లో కంది పంటను కొనుగోలు చేసి నిల్వ చేసుకున్న వ్యాపారులు ఆ సరుకును మద్దతు ధరకు సేకరణ కేంద్రాలకు అంటగట్టే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నాయి. రైతుల పాసు పుస్తకాలు, ఇతర మార్గాల ద్వారా సేకరణ కేంద్రాల్లో పంటలను వ్యాపారులు అమ్ముకోవడం చాలా చోట్ల జరుగుతోంది. ఈ సారి కూడా అలాగే జరిగితే అసలైన కంది రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మద్దతు ధరకు కందుల సేకరణలో వ్యాపారులు, దళారుల ప్రమేయం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

సేకరణ గడువు పెంచాలంటూ కేంద్రానికి హరీశ్‌రావు లేఖ

మద్దతు ధరకు కందుల సేకరణకు తుది గడువును మార్చి 31 వరకు పొడిగించాలని కోరుతూ కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్ సింగ్‌కు మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు ఇటీవల లేఖ రాశారు. అలాగే రాష్ట్రంలో కంది దిగుబడులు ఎక్కువగా ఉండే అవకాశం నేపథ్యంలో సేకరణ పరిమితిని లక్షన్నర టన్నులకు పెంచాలని కోరారు. అయితే దీనిపై కేంద్రం ఇంతవరకూ స్పందించలేదు.

సీపీఎం ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ వేదిక

▸ 25న హైదరాబాద్‌లో విస్తృత సమావేశం

▸ హాజరు కానున్న సీతారాం ఏచూరి, రాఘవులు

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్, టీఆర్ఎస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా తెలంగాణలో సీపీఎం ఏర్పాటు చేయనున్న రాజకీయ వేదిక ఏర్పాటుకు ముహూర్తం ఖరారైంది. ఈ మేరకు వేదిక పేరు, విధివిధానాలను ఈ నెల 25న హైదరాబాద్‌లో నిర్వహించే విస్తృత స్థాయి సమావేశంలో అధికారికంగా ప్రకటించనుంది. కాగా, వేదికకు బహుజన వామపక్ష ప్రజాస్వామ్య వేదిక అని పేరు పెట్టినట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి సీపీఎం అగ్రనేతలు సీతారాం ఏచూరి, బీవీ.రాఘవులుతోపాటు బీఆర్.అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్‌తోపాటు ఆమ్‌ఆద్మీ, బహుజన సమాజ్‌వాదీ పార్టీ, లోక్‌సత్తా తదితర పార్టీల, టీమాస్ ప్రతినిధులు హాజరు కానున్నారు. బీజేపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్‌కు దీటుగా దాదాపు 31 పార్టీలు, ప్రజసంఘాలతో కలిసి సీపీఎం ప్రత్యామ్నాయ రాజకీయవేదికను ఏర్పాటు చేసింది. అయితే, ఇందులో ప్రధాన వామపక్షం సీపీఐ చేరలేదు. వేదిక విధివిధానాలను అధికారికంగా ప్రకటించే ముందు ప్రత్యామ్నాయ వేదికపై రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయాలని నిర్ణయించారు.

ప్రభుత్వ తీరుపై లెఫ్ట్ ఐక్య ఉద్యమం

▸ నేడు గవర్నర్‌ను కలవనున్న నేతలు

▸ 6న సిద్దిపేట నుంచి నేరెళ్లకు పాదయాత్ర

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): టేకులపల్లి ఎన్‌కౌంటర్, నేరెళ్ల దళితులపై దాడి ఘటనల్లో ప్రభుత్వ తీరును నిరసిస్తూ వామపక్షాలు ఐక్య ఉద్యమానికి సిద్ధమవుతున్నాయి. టేకులపల్లి ఎన్‌కౌంటర్ బూటకమని, అది ప్రభుత్వం చేపట్టిన సామూహిక హత్యాకాండ అని ఆయా పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. ఘటనపై న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై గవర్నర్ నరసింహన్‌ను కలవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డితోపాటు ఇతర వామపక్షాలు, ప్రజాసంఘాల అగ్రనేతలు నిర్ణయించారు. అలాగే, నేరెళ్ల ఘటన బాధితులకు సరైన వైద్యం అందించాలని, వారిపై అక్రమ కేసులును ఎత్తివేయాలన్న డిమాండ్‌తో ఈ నెల 6న సిద్ధిపేట నుంచి నేరెళ్ల వరకూ పాదయాత్ర నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు మగ్దూం భవన్‌లో వామపక్షాలు, టీమాస్ తదితర ప్రజా సంఘాలు సోమవారం సమావేశం కానున్నాయి.

వామపక్ష వేదికపై సీపీఐ కసరత్తు

▸ లౌకిక, ప్రజాతంత్ర పార్టీలతో ఏర్పాటు చేసే యోచన

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): లౌకిక, ప్రజాతంత్ర పార్టీలు, శక్తులతో విస్తృత వేదికను నిర్మించాలన్న యోచనలో సీపీఐ రాష్ట్ర నాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటైన బహుజన వామపక్ష ప్రజాస్వామ్య వేదిక తమకు ఆమోదయోగ్యంగా లేనందున అందులో చేరేందుకు విముఖత వ్యక్తం చేసినట్లు సీపీఐ అగ్రనేత ఒకరు చెప్పారు. ఈ విషయంలో సీపీఎం అగ్రనాయకత్వంలోనే విభేదాలున్నాయని చెప్పుకొచ్చారు. కాగా, ప్రత్యామ్న్యాయ వేదికలో కుల సంఘాలు, టీమాస్ వంటి ప్రజాసంఘాలకు చోటు కల్పించటంపైనా సీపీఐ నాయకత్వం అసంతృప్తితో ఉంది. అధికార టీఆర్ఎస్ పార్టీని ఓడించేందుకు బలమైన లౌకిక శక్తులతో కలిసి పనిచేయటం అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే సమయంలో ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉన్నందున ముందుగా ప్రజా సమస్యలపై పోరాడాలని సీపీఐ నాయకత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో అధికార టీఆర్ఎస్‌పై ఉద్యమించేందుకు లౌకిక, ప్రజాతంత్ర, పార్టీలు, శక్తులతో కలిసి ఉద్యమించేందుకు వీలుగా వేదిక నిర్మాణానికి సీపీఐ కృషి చేస్తోంది.

భవిష్యత్తు బ్రహ్మాండం!

- అభివృద్ధి, సంక్షేమం జతగా మరిన్ని పాలనా సంస్కరణలు
- ఇప్పుడు వేస్తున్నది పునాదులే..
- వచ్చే దఫాలో అసలైన బంగారు తెలంగాణ నిర్మాణం
- 2024 తర్వాత చేయటానికి ఏమీ మిగలొద్దు
- ఇది సీఎం కేసీఆర్ ఆలోచన

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరిన్ని పాలనా సంస్కరణలు తీసుకురావాలని సీఎం కేసీఆర్ యోచిస్తున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి.. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలన్నీ సత్ఫలితాలు ఇస్తున్న క్రమంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. కొత్త ఏడాది 2018లో మరింత అభివృద్ధి, సంక్షేమం జతగా పాలనా సంస్కరణలను పరుగులు పెట్టించాలని సీఎం బలంగా కోరుకుంటున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఇప్పటికే దేశంలో ఎక్కడాలేని విధంగా 50కిపైగా వినూత్న పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్న సీఎంగా కేసీఆర్ వినతికెక్కటాన్ని గుర్తుచేస్తున్నారు. తెలంగాణ భవిష్యత్తు బ్రహ్మాండంగా తీర్చిదిద్దటం లక్ష్యంగా ఆయన ఆలోచనలు సాగుతున్నాయని చెబుతున్నారు. వచ్చే దఫా (2019-2024) కూడా టీఆర్ఎస్ అధికారంలో ఉంటుందనే ధీమాతో ఉన్న సీఎం కేసీఆర్, ఇప్పుడు వేసుకుంటున్నది పునాదులు మాత్రమేనని, అప్పుడు అసలైన బంగారు తెలంగాణ నిర్మాణం జరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. 'ఇంకా మంచిగా చేసుకుందాం. అన్నీ ఇప్పుడే చెప్పను' అంటూ కొంత గోప్యతను పాటిస్తున్నారు. '2024 తర్వాత రాజు ఎవడో.. రాకాసి ఎవడో.. అప్పటికి చేయటానికి ఏమీ మిగలొద్దు' అనే పట్టుదలతో సీఎం కేసీఆర్ ఉన్నట్లు నిత్యం ఆయన వెంట ఉండే వారు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రం వరదాయినిగా భావిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా అన్ని ఊళ్లకు నీళ్లు వచ్చేలా చేసుకోవాలని, అయినా నీళ్లు రానటువంటి ఎత్తయిన ప్రాంతాలకు ఏ రకంగా నీళ్లు తెచ్చుకోవాలో ఆలోచన చేద్దామని ముఖ్యమంత్రి అంటున్నారు. ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటితో చెరువులు, కుంటలు నింపుకోవాలంటూ ఆయన పదే పదే అధికార పార్టీ ఎమ్మెల్యేలను అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పటివరకు అంతగా సాగునీటికి నోచుకోని జిల్లాలు కూడా తొందర్లోనే సస్యశ్యామలం అవుతాయని సీఎం చెబుతున్నారు. పరిశ్రమలకు అనుమతులు ఇవ్వటానికి తీసుకొచ్చిన సరళమైన, పారదర్శకమైన విధానాలు మంచి ఫలితాలు ఇస్తున్న దరిమిలా మిగిలిన పాలనా విభాగాల్లోనూ పారదర్శకతకు పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్లు ఉన్నత స్థాయి అధికార వర్గాలు చెబుతున్నాయి. 'రాష్ట్రంలోని ప్రతి వ్యక్తి విద్యార్హతలు, జీవన స్థితిగతులు నమోదు చేసి, వారికి డబుల్ బెడ్ రూం ఇల్లు వంటి ప్రభుత్వ ప్రయోజనాలు అందాయా ? లేదా ? అనేది గుర్తించాలి. లేకపోతే వారికి ఏ పథకం ఎప్పటికి మంజూరు అవుతుందో ముందే వెల్లడించాలి' అనేది సీఎం ఆలోచనగా చెబుతున్నారు. ఈ దిశగా ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. అలాగే సిటిజన్ చార్టర్‌ను సమర్థంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లిన ప్రజల పనులు ఏ రోజుకు ఆ రోజే పూర్తయ్యేలా సిబ్బందిని సిద్ధం చేయాలనేది ఆయన ఆలోచన. ఒకవేళ గడువు ప్రకారం పనులు చేయకుండా జాప్యం చేసే అధికారులు/సిబ్బందిలో జవాబుదారీతనం తీసుకురావటానికి వారికి జరిమానా విధించేలా ప్రభుత్వ నిబంధనలను మార్చాలని అనుకుంటున్నారు. తద్వారా ప్రజల మనసులు సులువుగా గెలుచుకోవచ్చని సీఎం కేసీఆర్ భావిస్తున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

'టిక్కెట్ల' కమిటీలో నిర్మాతలకు చోటా?: వ్యాజ్యం

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సినిమా టిక్కెట్ల ధరల నిర్ణయ కమిటీలో ఫిలిం చాంబర్ సభ్యులు దగ్గుబాటి సురేష్‌బాబు, సి.కల్యాణ్‌లను సభ్యులుగా చేర్చడాన్ని సవాల్ చేస్తూ అఖిల భారత సినీ ప్రేక్షక వినియోగదారుల సంఘం అధ్యక్షుడు జీఎల్ నరసింహారావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వం ఒక కమిటీ వేస్తూ గత మార్చి 24న జీవో జారీ చేసిందన్నారు. ఈ జీవోలో సినీ నిర్మాతలు, ఫిలించాంబర్ సభ్యులుగా ఉన్న దగ్గుబాటి సురేష్, సి. కల్యాణ్‌లను సభ్యులుగా చేర్చడం సరికాదన్నారు. కొత్త సినిమా రిలీజైన రెండు వారాల వరకు టికెట్ల ధరలను భారీగా పెంచి ప్రేక్షకులను దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. రూ.10 నేల టికెట్‌ను రూ.100కు, రూ.50, 70గా ఉన్న బాల్కనీ టిక్కెట్ల ధర రూ.200కు పెంచి విక్రయిస్తున్నారని వివరించారు.

సాగుకు వెలుగు

(మొదటి పేజీ తరువాయి)

రంగాలకు 24 గంటల నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేలా తీర్చిదిద్దిన ఘనత రాష్ట్రంలోని విద్యుత్తు సంస్థల ఉద్యోగులకే దక్కుతుందని ప్రశంసించారు. దేశమంతా తెలంగాణవైపు చూసేవిధంగా విద్యుత్తు రంగంలో విప్లవాత్మక విజయాలు సాధించారని అభినందించారు. జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు సరఫరా చేస్తున్న నేపథ్యంలో సోమవారం ప్రగతిభవన్‌లో జెన్‌కో- ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు, ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, టీఎస్ఈఆర్‌సీ చైర్మన్ ఇస్మాయిల్ అలీఖాన్, ఇతర అధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావును ఆలింగనం చేసుకుని అభినందించారు. విద్యుత్తు సంస్థల డైరెక్టర్లు, సీనియర్ ఉద్యోగులను పేరుపేరునా పలకరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

జనవరి నుంచే ఇంక్రిమెంటు

విద్యుత్తు ఉద్యోగులు రాష్ట్రంలోని రైతులతోపాటు అన్ని వర్గాలకు నూతన సంవత్సర ఆనందాన్ని రెట్టింపు చేశారని కేసీఆర్ ప్రశంసించారు. అందుకే విద్యుత్తు ఉద్యోగులకు కానుకగా ఒక ప్రత్యేక ఇంక్రిమెంటు ఇస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రానికి ఇంత గొప్ప ఖ్యాతిని సముపార్జించి పెట్టిన విద్యుత్తు ఉద్యోగులకు అభినందన పూర్వకంగా జనవరి 2018 నుంచి వర్తించేలా ఈ ఇంక్రిమెంటు ఇస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రజానీకమంతా విద్యుత్తుశాఖ పనితీరు పట్ల ఆనందంగా ఉన్నారని చెప్పారు.

చరిత్రలో తెలంగాణ..

"వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు సరఫరా చేయడంతో అన్ని రంగాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుంది. దశాబ్దాల పాటు రైతులు అనుభవించిన కరెంటు కష్టాలకు శాశ్వత విముక్తి కల్పించాలనే లక్ష్యంతో వ్యయ, ప్రయాసలకోర్చి సాగుకు 24 గంటల విద్యుత్తు అందించాలని నిర్ణయించాం. టీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోలో లేకపోయినా వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇవ్వాలని నిర్ణయించాం. 2018 ఫిబ్రవరి లేదా మార్చి నుంచి ఇవ్వాలని మొదట భావించాం. కానీ, జనవరి 1 నుంచే యాసంగి పంటలు వేసుకునేందుకు వీలుగా 24 గంటల సరఫరా ప్రారంభించడం సంతోషకరం. దేశంలో కొన్ని రాష్ట్రాలు వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు అందిస్తున్నప్పటికీ, పరిమిత గంటల్లో మాత్రమే ఇస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో 24 గంటలు సరఫరా చేస్తున్నా చార్జీలు వసూలు చేస్తున్నారు. ఇలా 24 గంటల పాటు ఉచితంగా వ్యవసాయానికి కరెంటు ఇచ్చే రాష్ట్రం దేశంలో తెలంగాణ ఒక్కటే. ఇది మనకు గర్వకారణం మాత్రమే కాదు. తెలంగాణ రైతులకు అత్యంత ఆవశ్యకమైన విషయం. రైతు సంక్షేమం కోసం తీసుకున్న గొప్ప నిర్ణయమని నాకు చాలా రాష్ట్రాల నుంచి శుభాకాంక్షలు అందుతున్నాయి. పక్కా ప్రణాళిక, పకడ్బందీ కార్యాచరణతో ముందుకుపోవడం వల్లే ఈ విజయం సాధ్యమైంది" అని సీఎం చెప్పారు.

సీఎండీకి ఉద్యోగ సంఘాలు..

విద్యుత్ ఉద్యోగులకు ఇంక్రిమెంటు ప్రకటించడం పట్ల తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(1104) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావును సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పద్మారెడ్డి, సాయిబాబాలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సీఎండీ కృషి ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం విద్యుత్తు వెలుగులతో విరాజిల్లుతోందని గుర్తు చేశారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరాను అందించేందుకు కృషి చేసిన ట్రాన్స్‌కో, జన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుకు రాష్ట్ర పవర్ ఇంజనీర్స్ అధ్యక్ష, కార్యదర్శులు పి.రత్నాకర్, పి.సదానందం, శ్రీనివాస్, తదితరులు అభినందనలు తెలియజేశారు. ప్రత్యేక ఇంక్రిమెంటు ప్రకటించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యమంత్రికి సీఎండీ కృతజ్ఞతలు

విద్యుత్తు శాఖ ఉద్యోగులందరికీ ప్రత్యేక ఇంక్రిమెంటు ప్రకటించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం విద్యుత్తు శాఖ ఉద్యోగుల్లో మరింత ఆత్మస్థైర్యాన్ని నింపుతుందన్నారు. వారంతా రెట్టింపు ఉత్సాహంతో విధులు నిర్వహిస్తారని చెప్పారు.

జాతరలా ప్రగతిభవన్!

- మంత్రులు, ప్రముఖులు, ఉన్నతాధికారులతో కిటకిట
- సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షల వెల్లువ
- ఎస్‌టీయూ, ట్రెసా డైరీలను ఆవిష్కరించిన కేసీఆర్
- సాఫల్య నామ సంవత్సరం కావాలి: నరసింహన్

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం తొలి రోజు ప్రగతి భవన్ జాతరను తలపించింది. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రముఖులు పోటెత్తారు. పలువురు మంత్రులు, అధికారులు కేసీఆర్‌కు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. దేవాదాయ మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి, సలహాదారు రమణాచారి తదితరులు సీఎంకు పూర్ణకుంభంతో శుభాకాంక్షలు తెలిపారు. యాదాద్రి, పెద్దమ్మగుడి, గణేశ్ ఆలయ వేదపండితులు ఆయనను ఆశీర్వదించారు. శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, డిప్యూటీ సీఎంలు కడియం శ్రీహరి, మహ్మద్‌అలీ, మంత్రులు మహేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి, తలసాని శ్రీనివాసయాదవ్, ఉపసభాపతి పద్మా దేవేందర్‌గౌడ్, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు, టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, డీజీపీ మహేందర్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి తదితరులు సీఎంకు కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం నేతలు వి.శ్రీనివాస్‌గౌడ్, వి.విష్ణువర్ధన్‌రావు, కారం రవీందర్‌రెడ్డి, మామిళ్ల రాజేందర్, ఎంబీ కృష్ణయాదవ్.. కేసీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను వారు ప్రస్తావించగా.. త్వరలో సమావేశమవుదామంటూ సీఎం హామీ ఇచ్చారు. అలాగే, చేనేత వర్గాల తరపున వీవర్స్‌డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ముఖ్య సలహాదారు జెల్లా మార్కండేయ, ప్రతినిధులు సీఎంను కలుసుకుని కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కాగా, సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో ఎస్‌టీయూ, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భుజంగరావు, సదానందంగౌడ్, ట్రెసా అధ్యక్ష, కార్యదర్శులు మఠం శివశంకర్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మరోవైపు నూతన సంవత్సర వేడుకల సందర్భంగా దర్బార్‌హాల్‌లో తెలుగురాష్ట్రాల గవర్నర్ నరసింహన్ ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ ఏడాది కొత్త మార్పులు రావాలని, సాఫల్య సంవత్సరం(ఇయర్ ఆఫ్ ఫుల్‌ఫిల్‌మెంట్)గా నామకరణం చేస్తున్నానని గవర్నర్ పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల ప్రజల ఆశలు నెరవేరాలని, సుఖసంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. గవర్నర్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పలువురు మంత్రులు, ఉన్నతాధికారులతో పాటు ఏపీ మండలి పూర్వచైర్మన్ చక్రపాణి, సమాచార హక్కు కమిషనర్ రాజా సదారాం, మండలి సభ్యుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి, బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు గవర్నర్ నరసింహన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



కేసీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చిన అధికారులు, నాయకులు, కార్యకర్తలు

రైతు సంక్షేమానికే నిరంతర విద్యుత్

- విద్యుదుత్పత్తిలో రాష్ట్రం ముందంజ
- సీఎం వ్యూహాత్మక నిర్ణయాలతో పురోగతి
- విపక్షాలవి పస లేని ఆరోపణలు: జగదీశ్

చివ్వెంల, జనవరి 1: రైతులను ఆదుకోడానికే నిరంతర విద్యుత్ సరఫరాను ప్రారంభించామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం అర్ధరాత్రి సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం కోమటికుంటలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ పంపిణీని ప్రారంభించారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా కోసం అదనంగా ఖర్చు చేయడాన్ని ప్రభుత్వం భారంగా భావించడం లేదన్నారు. 'విద్యుత్ రంగంలో ఇప్పుడు సాధించిన పురోగతి గత ప్రణాళికల ఫలితమే. కేసీఆర్ వ్యూహాత్మక నిర్ణయాల వల్లే విద్యుత్ ఉత్పత్తి, కోతల్లేని విద్యుత్‌ను అందిస్తూనే సాంకేతికతకు ప్రాధాన్యమివ్వడంతో వృథా కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. దేశంలోనే విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్రాన్ని ముందంజలో నిలిపామన్నా'రు. 'వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందిస్తామన్నప్పుడు ఎద్దేవా చేసినవారే ఇప్పుడు నోరెళ్లబెడుతున్నారు. ప్రతిపక్షాలవి అర్థరహిత ఆరోపణలు. అధికారం చేపట్టిన ఆర్నెళ్లలోనే కోతలు లేని విద్యుత్‌ను అందించిన ఘనత టీఆర్ఎస్‌దే. రాష్ట్రంలో భవిష్యత్ అవసరాలకు సరిపడా విద్యుత్‌ను సమకూర్చుకొనేందుకు ఒక ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం' అన్నారు. అనంతరం స్థానిక సమీకృత బాలుర వసతి గృహంలో విద్యార్థులతో కలిసి మంత్రి కొత్త సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు.



కోమటికుంటలో 24 గంటల విద్యుత్‌ను ప్రారంభిస్తున్న జగదీశ్‌రెడ్డి

రైతు కంట్లో ఇసుక



జయ శంకర్ జిల్లా కాటారం మండలం దామెరకుంటలో ఇసుక క్వారీలో ఇసుక లోడింగ్, బారులు తీరిన కొన్ని లారీలు

(మొదటి పేజీ తరువాయి)

కరెంటు ఇస్తే ఏం ఉపయోగం?" అని ఆవేదన వెలిబుచ్చుతున్నారు.

అక్రమం ఇలా..

ఊరి వాగులోని ఇసుకను ఊరి ప్రజలు సొంత అవసరాలకు వాడుకోవాలి. ప్రభుత్వ పథకాలకు కూడా వాడుకోవచ్చు. ఈ క్రమంలోనే.. రాష్ట్రంలో పేదల కోసం చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక కోసం ప్రత్యేక రీచ్‌లను ప్రభుత్వం కేటాయించింది. ఉదాహరణకు.. హైదరాబాద్, సిరిసిల, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మేడ్చల్, యాదాద్రి, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో 'డబుల్ ఇళ్ల' నిర్మాణానికి సిరిసిల్ల సమీపంలోని మానేరు నదిపై ఉన్న కోడిముంజ రీచ్‌ను ప్రత్యేకంగా కేటాయించారు. మరికొన్ని జిల్లాలకు భూపాలపల్లిలోని రీచ్‌ను కేటాయించారు. మిగిలిన జిల్లాలకు ఆయా ప్రాంతాల్లో ఉన్న స్థానిక నదుల్లోని ఇసుకను జిల్లా కలెక్టర్లు డబుల్ ఇళ్లకు కేటాయించారు. ఈ స్కీంకు కేటాయించిన ఇసుకను నేరుగా సంబంధిత నిర్మాణ ప్రాంతాలకు తరలించి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి మాత్రమే ఉపయోగించాలి. ప్రైవేటులో విక్రయించకూడదు. కానీ, ప్రస్తుతం ఆలా జరగట్లేదు. బ్రోకర్ రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసమంటూ ఇసుక తవ్వకాలకు వే బిల్లు తెస్తాడు. దాన్ని తీసుకుని నేరుగా ట్రాక్టర్/లారీ యజమానుల వద్దకు వెళ్తాడు. ఆ ఒక్క వే బిల్లు మీదే వందల వాహనాల ఇసుక తోడేస్తారు. ఆ వాహనాల్లో సైతం ఇసుకను వాటి సామర్థ్యాన్ని బట్టి నింపాల్సి ఉంటుంది. 6 టైర్ల లారీలో 6 క్యూబిక్ మీటర్ల ఇసుక, 10 టైర్ల లారీలో 10.5 క్యూబిక్ మీటర్లు, 12 టైర్ల లారీలో 13.5 క్యూబిక్ మీటర్ల ఇసుక, 14 టైర్ల లారీలో 17 క్యూబిక్ మీటర్ల ఇసుకను నింపాల్సి ఉంది. కానీ ప్రతి లారీలోనూ అదనంగా మూడు, నాలుగు క్యూబిక్ మీటర్ల ఇసుకను ఎక్కువగా నింపుతున్నారు. లారీలో ఎంత ఇసుకను నింపారనే విషయంలో ఏలాంటి పర్యవేక్షణ లేదు. అందునా ఇసుకను అధికారుల పర్యవేక్షణ లేకుండా నేరుగా కాంట్రాక్టర్లే తమ సొంత జేసీబీలతో నింపుకుంటున్నారు. అక్కడ వే బ్రిడ్జిలు లేవు. లారీలో ఇసుకను నింపిన తర్వాత అందులో ఎంత లోడ్ ఉందన్న సంగతిని చెక్ చేయడానికి ఎక్కడా అవకాశం లేదు. ఉదాహరణకు ఒక లారీలో 10 టన్నుల ఇసుకను నింపినట్టు అధికారిక వే బిల్లును అధికారులు జారీ చేస్తున్నారు. కానీ, లారీలో ఉన్న ఇసుక 15 టన్నుల వరకు ఉంటున్నది. కోడిముంజల రీచ్ వద్ద వే బిల్లును తీసుకుని బయలు దేరిన లారీని చెక్ చేయడానికి వీలుగా సిరిసిల్ల సమీపంలోని జిల్లెల్ల వద్ద చెక్‌పోస్టు ఉంది. కానీ, అక్కడ లారీకి వే బిల్లు ఉందా? లేదా అనే విషయాన్ని మాత్రమే పరిశీలించి పంపేస్తున్నారు. లారీలో ఎంత లోడ్ ఉందో తెలుసుకోవడానికి వీలుగా అక్కడ వే బ్రిడ్జి లేదు. ఈ చెక్ పోస్టు దాటిన తర్వాత సదరు లారీ ఎక్కడికి వెళుతుందనే విషయంలో ఏలాంటి నిఘా లేదు. ఈ లారీలకు ముందు తగిలించిన డబుల్‌బెడ్ రూమ్ స్కీం ఇసుక అనే బ్యానర్‌ను తొలగించి వీటిని నేరుగా హైదరాబాద్‌కు తీసుకువచ్చి ప్రైవేట్‌లో విక్రయిస్తున్నట్టు తెలుస్తున్నది.

వే బిల్లులు ఇవ్వడమే మా బాధ్యత

'డబుల్ ఇళ్ల' ఇసుక కోసం వచ్చే లారీలకు వే బిల్లులను ఇవ్వడం మాత్రమే మా పని. లారీల్లో ఇసుకను నింపుకునేది కాంట్రాక్టర్లే. అలాగే లారీల్లో ఎంత ఇసుక ఉందనే విషయాన్ని పరిశీలించడానికి ఏలాంటి అవకాశం లేదు. ఆ బాధ్యత మాది కాదు. రికార్డు బుక్‌లో నమోదైన నెంబర్ గల లారీలు వస్తే వాటికి వే బిల్లులను ఇస్తున్నాం. ఈ వే బిల్లుల ఆధారంగా కాంట్రాక్టర్లే ఇసుకను నింపుకొని వెళుతున్నారు. తర్వాత ఆ ఇసుక ఎక్కడికి వెళుతుందన్న అంశంతో మాకు సంబంధం లేదు.

– అసీఫ్ (ఆర్ఐ), శాయిప్రసాద్ (ఏఈ), కోడిముంజల ఇసుక రీచ్

లెక్క తేడా రాదీ

డబుల్‌బెడ్ రూమ్ పథకానికి ఉద్దేశించిన ఇసుకను ప్రైవేట్‌లో అమ్ముకుంటే.. ప్రభుత్వ ఇళ్లకు ఇసుక తక్కువ కాదా ? అనే అనుమానం వస్తుంది. అయితే అక్రమార్కులు ఇక్కడే తెలివిని ఉపయోగిస్తున్నారు. రీచ్‌లో ఇసుకను లోడ్ చేసే సమయంలోనే దీనికి పునాది వేస్తున్నారు. వే బిల్లులో చూపిస్తున్న ప్రతి 100 టన్నుల ఇసుకకూ అదనంగా 50 టన్నుల ఇసుకను లారీల్లో తరలిస్తున్నారు. 100 టన్నులను 'డబుల్ ఇళ్ల'కు తరలించి.. మిగిలిన 50 టన్నులను బయట మార్కెట్లో అమ్మేసుకుంటున్నారు. అంటే.. సగటున ప్రతి పది లారీల్లో రెండు మూడు లారీల ఇసుక అక్రమంగా తరలిపోతున్నట్టే. బయట టన్ను ఇసుక రూ.1400 నుంచి రూ.1600 వరకు ఉండడంతో ఒక్క ట్రిప్పులోనే ఖర్చులు పోను రూ. 15 వేల వరకు మిగులుతుంది. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు ఉద్దేశించిన ఇసుక పక్కదారి పడుతున్న విషయం తెలిసినా ప్రభుత్వపరంగా కఠిన చర్యలు తీసుకోవట్లేదు. దీని వెనుక ఎమ్మెల్యేలు, మంత్రుల స్థాయి వ్యక్తులు కూడా ఉన్న కారణంగానే ప్రభుత్వం దీన్ని అంత సీరియస్‌గా తీసుకోవట్లేదనే విమర్శలు కూడా ఉన్నాయి. ఈ అక్రమాన్ని అడ్డుకోవడానికి కొన్ని కఠిన చర్యల్ని తీసుకోవాలన్న ప్రతిపాదనలున్నాయి. ముఖ్యంగా లోడింగ్ చేసే పద్ధతిలో మార్పు తీసుకురావడం, అక్కడే వే బ్రిడ్జిలను ఏర్పాటు చేయడం వల్ల దీనిని కొంత వరకు నియంత్రించవచ్చని భావిస్తున్నారు. అలాగే చెక్ పోస్టు వద్ద కూడా ప్రత్యేక వే బ్రిడ్జిని ఏర్పాటు చేసి, ప్రతీ లారీని తూకం వేస్తే...అసలు గుట్టు బహిర్గతం అవుతుందని చెబుతున్నారు.

వచ్చిన లారీలే మళ్లీ..

ఊరి నుంచి తెచ్చిన ఇసుకను.. హైదరాబాద్ శివార్లలో మరో లారీలోకి డంప్ చేసి నగరం లోపలికి పంపిస్తున్నారు. డంప్ చేయడానికి వాడుకుంటున్న లారీలన్నీ కమర్షియల్ ఇసుక రీచ్‌ల నుంచి వచ్చినవే. ఆ లారీలన్నీ అప్పటికే ఊళ్లోకి వెళ్లి తాము తెచ్చిన ఇసుకను వినియోగదారుల వద్ద అన్‌లోడ్ చేసి.. మళ్లీ శివార్లలోకి వస్తాయి. డబుల్ ఇళ్ల కోసమంటూ తెచ్చిన ఇసుకను వాటిలోకి డంప్ చేసి అవే లారీలను ఊళ్లోకి పంపిస్తున్నారు. కమర్షియల్ వే బిల్లు కాల పరిమితి ఒక రోజు వరకూ ఉండడంతో ఎవరికీ అనుమానం రావట్లేదు. అంటే.. రీచ్ వద్ద 'అధికారిక ప్రయోజనాల నిమిత్తం నింపిన ఇసుక లారీలో కొంత మొత్తం.. గంట వ్యవధిలోనే అనధికారిక నిర్మాణాల కోసం తరలిపోతోంది. ఈ దందాలో రూ.కోట్లు చేతులు మారుతున్నాయి. ఇందులో కింది స్థాయి అధికారుల నుంచి ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉన్న వారి ప్రమేయం ఉన్నట్లు సమాచారం.

భూగర్భజలాలు తగ్గి.. రైతులకు నష్టం

నీటి అడుగున ఇసుక మేట వేస్తే.. పైనుంచి ప్రవాహాలు వచ్చినప్పుడు అవి నేరుగా పల్లానికి వెళ్లిపోకుండా అడ్డుకుంటుంది. స్పాంజిలా పని చేసి.. ఆ నీటిని చాలావరకూ పీల్చుకుంటుంది. ఆ నీరు అలాగే భూమిలోకి ఇంకుతుంది. తద్వారా భూగర్భ జలాలు పెరిగి రైతుకు మేలు జరుగుతుంది. అలా కాకుండా ఇసుకను అడ్డదిడ్డంగా తవ్వేస్తే వాగులు, నదుల అడుగు భాగంలో ఇసుక శాతం తగ్గిపోయి భూగర్భ జలాలు కూడా తగ్గిపోతాయి. మరీ ముఖ్యంగా ఇటీవలికాలంలో ప్రభుత్వాలు చెక్ డ్యాములను నిర్మిస్తున్నాయి. వీటివల్ల కలిగే ప్రమాదం ఏమిటంటే.. రెండు చెక్ డ్యాముల మధ్యలో ఉండే ఇసుక మొత్తాన్నీ ఒక సారి తోడేస్తే అక్కడ మళ్లీ ఇసుక ఏర్పడే అవకాశమే ఉండదు. ఫలితంగా కొన్నేళ్ల వ్యవధిలోనే ఆ చుట్టుపక్కల భూగర్భజలాలు అడుగంటిపోతాయి.





కరీంనగర్ మండలం ఖాజీపూర్‌లో మానేరు వాగు సమీపంలో గడ్డివాము కింద దాచిన ఇసుక ఇది.. అవసరమైనప్పుడు ఆ ఇసుకను ఇలా లారీల్లో తరలిస్తారు

పంట పొలాల్లో విద్యుత్ వెలుగులు..!

- వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు
- నిరంతర సరఫరాపై అన్నదాతల ఆనందం
- సవాల్‌గా మారిన ఆటో స్టార్టర్ల తొలగింపు

జోగులాంబ గద్వాల/సూర్యాపేట/ నిజామాబాద్/జగిత్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల దగ్గర కరెంటు కోసం నిరీక్షణ లేదు. రాత్రిళ్లు జాగారాలు అసలే లేవు. ఎప్పుడు అవసరమైతే అప్పుడు బోరు మోటారుతో రైతులు పొలానికి నీళ్లు పారిస్తున్నారు. తెలంగాణ పంట భూముల్లో సోమవారం కనిపించిన దృశ్యాలివి. నూతన సంవత్సర వేళ ప్రారంభమైన 24 గంటల వ్యవసాయ కరెంటు రాష్ట్రమంతటా విజయవంతంగా అమలవుతోంది. 23 లక్షల వ్యవసాయ కనెక్షలకు విద్యుత్ సంస్థలు నిరంతరంగా నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాయి. డిసెంబరు 31 అర్ధరాత్రి తర్వాత విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి సూర్యాపేట జిల్లాలో నిరంతర విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. అనంతరం కేక్ కట్ చేసి రైతులతోనే కొత్త సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. ఇక నిరంతర విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌కో అధికారులు ముందుస్తు ప్రణాళిక తయారు చేసి పక్కాగా అమలు చేశారు. చాలా చోట్ల రెండు రోజుల ముందు నుంచే ట్రయల్ నిర్వహించి విజయవంతమయ్యారు. అవసరమైన చోట విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేసి.. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఇంజనీర్లు, అధికారులు నిరంతర విద్యుత్‌ను పరిశీలిస్తూ సిబ్బందికి అవసరమైన సూచనలు అందించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కాగా, నిరంతర కరెంటు సరఫరాపై రాష్ట్రవ్యాప్తంగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట పడిగాపులు కాసే పని తప్పిందని.. పగటి పూటే పొలాలకు నీళ్లు పెట్టవచ్చని అన్నారు. 24 గంటల కరెంటు వలన పంటపై దిగులు చెందాల్సిన పరిస్థితి లేదని అభిప్రాయపడ్డారు.



జగిత్యాల జిల్లా శంకలపల్లెలో పొలం వద్ద నీరు పెడుతున్న రైతు

లోవోల్టేజీ సమస్య లేదు

వ్యవసాయానికి 24 గంటలు కరెంటు ఇవ్వడం సంతోషంగా ఉంది. లోవోల్టేజీ లేకుండా సరఫరా అవుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆటో స్టార్టర్లను తొలగించాం. నిరంతర కరెంటు ఇలాగే కొనసాగితే రైతులకు ఎంతో మేలుగా ఉంటుంది.

– శ్రీనివాసరావు, రైతు, ఉండవెల్లి (జోగులాంబ గద్వాల)

24 గంటల విద్యుత్ ఇవ్వడం సంతోషం

వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ ఇవ్వడం సంతోషంగా ఉంది. బావుల్లో నీళ్లు ఉన్నవారికైతే ఉపయోగం. నాకు 5 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. శంకులపల్లె శివారులో 2 ఎకరాల పొలంలో నాట్లు వేసిన.

– ఏనుగుల సురేష్, రైతు, శంకులపల్లె (జగిత్యాల జిల్లా)

ట్రెండ్

హరీస్... చలికాలం హాట్ ఫేవరెట్!

శీతాకాలం ఒంట్లో చలి బయటికి పోవాలంటే వేడివేడిగా ఏదైనా లోపల పడాల్సిందే. చలికాలం వచ్చిందంటే హైదరాబాద్‌లోని బార్కాస్, మల్లేపల్లి ఏరియాల్లో 'హరీస్'కు బాగా డిమాండ్ ఉంటుంది. ఉదయమే కొన్ని హోటళ్లలో మాత్రమే దొరికే 'హరీస్'ను తినేందుకు జనం క్యూలు కడతారు. చూడటానికి అచ్చంగా హలీమ్‌లాగే కనిపించినప్పటికీ 'హరీస్' భిన్నమైన ఫుడ్. అరబ్ దేశాల నుంచి దిగుమతి అయిన ఈ ఫుడ్ నెయ్యి, మటన్, వివిధరకాల ధాన్యాల కలయికతో తయారవుతుంది. దీని గురించి 10వ శతాబ్దంలోనే బాగ్దాద్ రచయిత సయ్యర్ అల్ వరఖ్ 'కితాబ్ అల్ తాబిఖ్ (ది బుక్ ఆఫ్ డిషెస్)'లో ప్రస్తావించారు.



'హరీస్' తయారీ కూడా దాదాపుగా 'హలీమ్' తయారీలాగే ఉంటుంది. అయితే హలీమ్ రంజాన్‌లో దొరికితే, 'హరీస్' చలికాలంలో మాత్రమే లభిస్తుంది. "ఇది టేస్టీగా ఉండటమే కాదు... బలవర్ధకమైనది కూడా. ఇందులో చాలా పోషకాలుంటాయి. స్వచ్ఛమైన నెయ్యితో పాటు డ్రైఫ్రూట్స్‌ను కూడా మిక్స్ చేస్తారు. శరీరానికి వెచ్చదనం కోసం చలికాలంలో దీన్ని తీసుకుంటారు" అని బార్కాస్ బజార్‌లో కొన్నేళ్లుగా హరీస్‌ను అమ్ముతున్న హోటల్ యజమాని కైసర్ అంటున్నారు. ఉదయం ఐదుగంటలకే మొదలయ్యే 'హరీస్' అమ్మకాలు మూడుగంటల్లోనే ముగుస్తాయి. బోన్స్ లేకుండా మెత్తగా పేస్టులా ఉండే ఈ ఆహారం రెండు రకాలుగా ఉంటుంది. వాటిలో ఒకటి స్పైసీ, మరొకటి స్వీట్. తొలుత పాతబస్తీ చుట్టుపక్కల నుంచే 'హరీస్'ను తినేందుకు ఉదయమే బార్కాస్‌కు వెళ్లేవారు. కానీ దీని రుచి తెలిసిన వాళ్లంతా ప్రస్తుతం అక్కడికి వెళ్లి వేడివేడిగా లాగిస్తూ 'ఆహా... హరీస్' అంటున్నారు.

ప్రతిభ



ఆమె
మువ్వల సవ్వడి నుంచి జాలు
వారిన 'లకుమ', ' రాణి రుద్రమ'
తెలుగునాట నృత్యలోగిలిలో ప్రత్యేకమైనవి.
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నృత్య
బోధకురాలిగా అనేకమందికి నృత్యశిక్షణ ఇచ్చారు.
ఇప్పుడు అదే యూనివర్శిటీలో రిజిస్ట్రార్ హోదాని
అలంకరించిన తొలి మహిళ అలేఖ్య పుంజాల. ఓ వైపు
నృత్య బోధన... మరో వైపు యూనివర్సిటీ నిర్వహణ
బాధ్యతలు.. ఇంకోవైపు నృత్య ప్రదర్శనలు...
వీటన్నింటితో పాటు గృహిణిగా... జుగల్‌బందీ
చేస్తున్న అలేఖ్య' నవ్య'తో ముచ్చటిం
చారు. ఆ విశేషాలే ఇవి...

అప్పుడు విద్యార్థిని.. ఇప్పుడు రిజిస్ట్రార్‌ని..

ఇంట్లో ఉన్నప్పుడు గృహిణిగా నా భర్త, పిల్లల బాగోగులు మాత్రమే ఆలోచిస్తాను. విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టగానే బోధకురాలి హోదాలో ఇమిడిపోతాను. ప్రదర్శన సమయంలో వేదికపై నేను కేవలం నృత్యకారిణిని మాత్రమే. అయితే కొన్నిసార్లు విధి పరీక్షలు పెడుతుంటుంది. 'యూనివర్సిటీలో జరిగే ముఖ్యమైన సమావేశాలకు హాజరుకావాల్సి ఉంది. సాయంత్రం వేళ రవీంద్రభారతిలో ప్రదర్శన చేసేందుకు అంగీకరించాను. అదే రోజు మా చిన్నబ్బాయికి జ్వరం... ఆ సమయంలో నేను దేనికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి? ఈ పాతికేళ్ల వృత్తిజీవితంలో ఇలాంటి సమస్యలు ఎన్నో ఎదురయ్యాయి. అవి తారసపడుతున్న ప్రతిసారీ ఎదిరించి ముందుకుసాగుతూనే ఉన్నాను. నేనే కాదు, నాలాంటి ఎంతోమంది మహిళలు ఎదుర్కొనే సమస్యలే ఇవి. వాటన్నింటినీ వివేచనతో ఎలా దాటుకొని ముందుకెళ్లాలో నృత్యం నాకు నేర్పింది. అందుకే, అదంటే నాకు ప్రాణం. ఎప్పుడు ఏ పని చేయాలన్న దానిపై ఖచ్చితమైన స్పష్టత ఉంటే, మన వృత్తిజీవితానికి, కుటుంబ జీవితానికి న్యాయం చేయగలమని భావిస్తాను. ఏ పనికి ఎంత సమయం ఇవ్వాలి, ఆ సమయంలో దానిపట్ల ఎంత నిబద్ధతతో ఉన్నామన్న విషయాలు చాలా అవసరం. ఆ బాధ్యతలన్నింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లడంలోనే ఆనందం ఉందనుకుంటున్నాను. 2017 నవంబర్‌లో తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా కొత్త బాధ్యతలను చేపట్టాను. 30 ఏళ్ల విశ్వవిద్యాలయ చరిత్రలో ఆ హోదాను అలంకరించిన తొలి మహిళను నేనే కావడం ఆనందంగా ఉంది. లలిత కళా పీఠం నుంచి ఓ కళాకారిణిగా విశ్వవిద్యాలయ పరిపాలనా బాధ్యతలను చేపట్టే అవకాశం దక్కడం నా అదృష్టం. ప్రస్తుతం లలితకళా పీఠం డీన్ బాధ్యతలనూ నిర్వర్తిస్తున్నాను.

❖ **విద్యార్థిగా మొదలై...**

తెలుగు విశ్వవిద్యాలయంతో నా అనుబంధం మొదట విద్యార్థిగా మొదలైంది. 1989నాటి మాట.. అప్పటికే 'ప్రాచీన చరిత్ర, కళలు' అనే అంశంపై పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాత ఇంగ్లీషు లిటరేచర్, సైకాలజీలోనూ ఎంఏ చదివాను. మా గురువు ప్రముఖ నాట్యాచార్యులు ఉమారామారావు వద్ద చిన్ననాటి నుంచి నృత్యశిక్షణ తీసుకున్నాను. వారు నాకు కేవలం గురువు మాత్రమే కాదు, ఆత్మీయులు, మార్గనిర్దేశకురాలు కూడా. లలితకళాపీఠం విభాగాధిపతిగా వ్యవహరిస్తున్న ఉమారామారావు ప్రోత్సాహంతో తెలుగు విశ్వవిద్యాలయం, ఎంఏ కూచిపూడిలో చేరాను. కొద్దిరోజుల తర్వాత యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలు ఖాళీలున్నాయని ప్రకటన వెలువడింది. ఆత్మీయుల సలహాతో దరఖాస్తు చేశాను. ఆ విషయం తెలిసిన అప్పటి వీసీ సి.నారాయణరెడ్డిగారు "ఏంటి.! అలేఖ్య అప్లై చేసిందా" అని ఆశ్చర్యం వ్యక్తం చేశారట.! అలా 1990లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా యూనివర్సిటీతో నా ప్రయాణం ప్రారంభమైంది. ఓ విశ్వవిద్యాలయంలో ఉద్యోగం చేస్తాననిగానీ, ఆ తర్వాత పలు బాధ్యతలు చేపడతాననిగానీ ఎన్నడూ ఊహకందని విషయమే. పెళ్లైన తర్వాత కొద్దిరోజులు నృత్యానికి దూరంగా ఉన్నాను. అలాంటిది, నా కుటుంబం, గురువు ప్రోత్సాహంతో మళ్లీ నాకిష్టమైన రంగంలో ప్రవేశించడం నాకు దక్కిన గొప్ప అవకాశం. నాకు అత్యంత ఇష్టమైన నృత్య రంగంలోనే నాట్యాచార్యులుగా కొనసాగే అవకాశం దక్కడం గర్వంగా అనిపిస్తుంది. ఎప్పుడూ ఎవర్నీ నాకు ఫలానా హోదా ఇవ్వండి అని అడగలేదు. ఇప్పటివరకూ నాకు వచ్చిన అవకాశాలన్నీ పూర్తిగా నా పనితనం, నిబద్ధత వల్ల పొందినవే.

❖ **విధి నిర్వహణ, కర్తవ్యం...**

గతంలో నృత్యశాఖ విభాగాధిపతి బాధ్యతలు చేపట్టినా, ఆ తర్వాత టూరిజం స్టడీస్ డైరెక్టరుగా, లలితకళాపీఠం డీన్‌గా.. ఏ హోదాలో ఉన్నా, నన్ను నేను నిరూపించుకునేందుకు ప్రయత్నించాను. ప్రతి ఏటా ప్రపంచ నృత్యోత్సవాలు నిర్వహించడం వంటి పలు కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించాను. ఇన్నేళ్ల నా వృత్తి జీవితంలో ఇప్పుడు ఇదొక కొత్త కోణం. నా యూనివర్సిటీకి ప్రత్యేక సేవ చేసుకునే అవకాశం దక్కింది. ఇక్కడున్న ప్రతి విభాగాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలనుకుంటున్నాను. తెలుగు యూనివర్సిటీలోని అన్ని కోర్సులకు తగిన ప్రాచుర్యం కల్పించాలన్నది నా అభిమతం. విలక్షణమైన కోర్సులకు తగిన ప్రాచుర్యం కల్పించి, ఎక్కువ మంది విద్యార్థులు వాటిని అభ్యసించేవిధంగా ప్రణాళికలు రూపొందించాలనుకుంటున్నాను. కళారంగానికి, పరిపాలనా విభాగానికి పొంతన ఉండదని పెద్దలు అంటారు. కానీ స్వతహాగా కళాకారిణైన నేను ఈ బాధ్యతలు చేపట్టడం సవాల్ లాంటిదే. సహజంగా కళాకారులు సున్నితత్వంతో మసులుకుంటారు. సున్నితంగా వ్యవహరించడమన్నది అన్ని సందర్భాల్లో పనికిరాకపోవచ్చు. కానీ నేటి సమాజానికి సున్నితత్వం చాలా అవసరం అని భావిస్తాను. ప్రస్తుతం పది మంది పరిశోధనా విద్యార్థులకు గైడ్‌గా ఉన్నాను. వారిలో ఐదుగురు విద్యార్థులు ఇప్పటికే పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.

❖ **'రాణీ రుద్రమ' కూచిపూడి నృత్యరూపకం అనలేదు...**

ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై ఓరుగల్లు వీరవనిత "రాణీరుద్రమ" నృత్యరూపకాన్ని ప్రదర్శించడం ఆనందంగా ఉంది. అదొక అదృష్టంగా కూడా భావిస్తున్నాను. చరిత్రలో స్ఫూర్తిమంతమైన పాత్రపోషించిన మహిళల గురించి తెలుసుకోవాలి, వారి విశిష్టతను భావితరాలకు తెలియజెప్పాలన్నది నా కోరిక. రుద్రమ పోరాట పటిమ, ధైర్యసాహసాల గురించి నృత్యరూపకం ద్వారా ప్రజలకు చెప్పాలన్న కోరిక చాలా ఏళ్ల నుంచి నాలో ఉంది. రాజ్యాన్ని సక్రమంగా నడిపించడంతోపాటు, శత్రుసేనల్ని తిప్పికొట్టడం, రాజ్య క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఓ మాతృమూర్తిగా పాలన సాగించడంలో ప్రధాని భూమిక పోషించిన కాకతీయ వీర వనిత రాణీ రుద్రమ జీవితం నన్ను బాగా ప్రభావితం చేసింది. ఆ క్రమంలో రుద్రమ గురించిన అనేక అంశాలను, వెలుగులోకి వచ్చిన పలు విషయాలను తెలుసుకున్నాను. వాటన్నింటినీ అధ్యయనం చేసి... 'రాణీ రుద్రమ' నృత్యరూపకం రూపొందించాను. మదిలోని ఆలోచన, వేదికపై ఆవిష్కృతమయ్యేందుకు రెండేళ్లు పట్టింది. వేదాంతం రామలింగశాస్త్రి రచన, కృష్ణవాస సంగీత దర్శకత్వంలో 25 మంది కళాకారులతో ఆ నృత్య రూపకాన్ని రూపొందించాను. కళ, రంగాలంకరణ, వస్త్రాలంకరణ వంటి వాటన్నింటినీ పరిశోధన చేసి, సాధ్యమైనంతవరకూ కాకతీయుల సంస్కృతి ప్రతిబింబించే విధంగా రూపొందించాం. నృత్యప్రదర్శనలో భాగంగా, కాకతీయుల చిహ్నా ద్వారాన్ని వేదికపైకి తెచ్చేందుకే పదిమంది కళాకారులు మోయాల్సివచ్చింది. అందులోని ప్రతి సన్నివేశం ఓ ప్రత్యేకమైంది. అదంతా కళాకారుల సమష్టి కృషి ఫలితం. 'రాణీ రుద్రమ' కూచిపూడి నృత్య రూపకం అని నేను ఎక్కడా చెప్పలేదు. నేను అనుకున్న విషయాన్ని అందంగా, ప్రేక్షకులకు ఆసక్తి కలిగించేలా పలు రకాల నృత్యరీతుల సమాహారంతో ఆ నృత్యరూపకాన్ని రూపొందించాను. ఇప్పటి వరకూ 'రాణీ రుద్రమ' దేశవ్యాప్తంగా పది ప్రదర్శనలు ఇచ్చాం. 'లకుమ', 'నాయకి', 'సత్యభామా విలాసం', 'అలిమేలు మంగావిలాసం', 'దుర్గాసుర సంహారం', 'ద్రౌపతి', 'చిత్రకూట మహత్యం', 'ఆండాల్ కళ్యాణం' వంటి పలు పురాణ పాత్రల ఆధారంగా నృత్యప్రదర్శనలు రూపొందించి, ప్రదర్శించే అవకాశం నాకు లభించింది. అందులో విభిన్నమైన పాత్రలు పోషించే అదృష్టం నాకు కలిగింది.



రుద్రమదేవిగా..

ఇదీ నా కుటుంబం...

నేను పుట్టిపెరిగిందంతా హైదరాబాద్‌లోనే. నా తల్లిదండ్రులు మార్గం నరసింగరావు, సుగుణలు ఎగ్జిబిషన్ సొసైటీ శాశ్వత గౌరవ సభ్యులు కూడా. మా అమ్మ ప్రముఖ రంగస్థల నటులు స్థానం నరసింహారావుగారితో కలిసి రేడియో నాటికలో నటించారు. నేను ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు కారణం నా తల్లిదండ్రులు, నా గురువు ఉమారామారావు. నా మెట్టినిల్లు కూడా భాగ్యనగరమే. వారిది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం. మామయ్య పుంజాల శివశంకర్ ఇందిరాగాంధీ కేబినేట్‌లో మంత్రిగా పనిచేశారు. నా భర్త వినయ్‌కుమార్ గ్యాస్ట్రోఎంటరాలజీ వైద్యనిపుణులు. మాకు ఇద్దరు అబ్బాయిలు. పెద్దబ్బాయి శాశ్వత్ రాంశంకర్ న్యాయవాది వృత్తిలో ఉన్నారు. కోడలు సంజన కూడా న్యాయవాది. చిన్నబ్బాయి దేవాన్ష్ కృష్ణశంకర్ అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నాడు. వృత్తి, ఉద్యోగ జీవితంలో రాణిస్తున్నానంటే నా కుటుంబసభ్యులందించిన సహకారమే.

● వెంకటేశ్
ఫొటోలు: రాజేష్ జంపాల, నరసింహ

పలువరుసకు పాలిష్!

బ్యూటీ



గారపట్టిన పళ్లతో నవ్వినప్పుడు, నలుగురిలోకి వెళ్లినప్పుడు ఇబ్బందికరంగా ఉంటుంది. ఇతరులతో కలవలేకపోతారు. పొగాకు ఉత్పత్తులు నమలటం, రంగులతో చేసిన ఆహార పదార్థాలు తినటం, రోజూ పళ్లు తోమకపోవటం, కలుషిత ఆహారాన్ని తీసుకోవటం వంటివి ఈ సమస్యకు కారణాలు. అయితే కొన్ని పద్ధతులను పాటించటం ద్వారా పలువరుసను తెల్లగా మిలమిల మెరిసేలా చేసుకోవచ్చు.

❖ దంతాలు పసుపు రంగులో ఉన్నవాళ్లు, కాఫీ టీలకు బదులు పాలు తాగితే ప్రయోజనం. దంత సంరక్షణకు మార్కెట్లో చాలా ఉత్పత్తులు ఉన్నా వాటి వల్ల నష్టమే ఎక్కువ. పాల లాంటి సహజ ఉత్పత్తులు దంతాలను శుభ్రపరుస్తాయి. ఇందులో ఉండే కాల్షియం దంతాలకు పుష్టినిస్తుంది. పాల ఉత్పత్తులు పళ్లపై ఏర్పడే పసుపు రంగును తొలగిస్తాయి కూడా.

❖ ఉప్పులో సోడియం క్లోరైడ్ అధిక మోతాదులో ఉంటుంది. ఇది పళ్లపైన ఉండే పచ్చదనాన్ని తగ్గిస్తుంది. కొంచెం ఉప్పును టూత్‌పేస్ట్ పైన వేసుకోని పళ్లు తోమితే కొన్ని రోజుల్లోనే దంతాలు తెల్లగా మారతాయి.

❖ నిమ్మ నోటిలో సూక్ష్మజీవులను నిర్మూలించి దంతాలను తెల్లగా చేస్తుంది. ఏదైనా తిన్న వెంటనే నిమ్మతొక్కతో దంతాలను శుభ్రం చేస్తే ప్రయోజనం ఉంటుంది. రోజూ వీలుకాకపోతే కనీసం వారానికోసారి చేసినా దంతాలపై ఉండే పాచి, నోటి దుర్వాసన పోతుంది. అలాగే కొన్ని నీళ్లలో నిమ్మరసం కలిపి రాత్రి భోజనం చేశాక నోరు పుక్కిలించాలి.

❖ పళ్లు తోమేందుకు ఉప్పుకు బదులు బేకింగ్ సోడాను వాడాలి. కొంచెం బేకింగ్ సోడాను బ్రష్ పైన వేసుకోని పండ్లు తోమాలి. ఇలా కొన్ని రోజులు చేస్తే పసుపు పొర తొలగిపోయి పళ్లు మెరిసిపోతాయి.

పుస్తకాలు చదివించాలంటే..


పేరెంటచ్



ఎవరైనా, పూర్తిగా కొత్త విషయానికి సంబంధించిన ఒక పుస్తకాన్ని హఠాత్తుగా చేతిలోకి తీసుకున్నప్పుడు, అందులోని విషయం ఏ మాత్రం అర్థం కాకపోవచ్చు. పెద్దవారికే ఈ సమస్య ఉంటే, ఇక చిన్న పిల్లల పరిస్థితి ఏమిటి? పిల్లలు సిలబస్ బుక్స్ అయితే ఎలాగూ చదువుతారు. టీచర్ చెప్పిన పాఠాలే కాబట్టి వాటిని అర్థం చేసుకోవడం అంత కష్టమేమీ అనిపించకపోవచ్చు ఒకవేళ అందుకు భిన్నంగా మరేదైనా చదవమని చెప్పారనుకోండి. అది కథల పుస్తకం అయితే తప్ప చాలా సార్లు "నాకేమీ అర్థం కావడం లేదు" అనే చెబుతారు. అదేదో తప్పించుకోవడానికి అనే మాటగా కూడా అనుకోవడానికి లేదు. అందులోని విషయం అప్పటిదాకా వినని, చూడని పూర్తిగా కొత్త విషయం అయినప్పుడు నిజంగానే అర్థం కాకపోవచ్చు. అందుకే ఒక కొత్త పుస్తకాన్ని చదవడం ఎలాగో చెప్పగలిగే శక్తి పేరెంట్స్‌కు ఉండాలి.

కొత్త విషయానికి సంబంధించిన పుస్తకాన్ని చదవాలనుకున్నప్పుడు ముందుగా కొన్ని పదాలు లేదా పద బంధాలు మాత్రమే అర్థమవుతాయి. రెండవసారి చదివినప్పుడు అక్కడో వాక్యం ఇక్కడో వాక్యం అర్థమవుతాయి మూడవసారి, ఒక్కో పేరాగ్రాఫ్ చొప్పున అర్థమవుతాయి. మొదటిసారి చదివినప్పుడు కలిగిన భయాందోళనలు కనుమరుగవుతాయి. కాకపోతే అలా రెండు మూడు సార్లు చదివే ఓపిక పట్టుదల ఉండాలి. ఆ లక్షణాలు అలవడేలా చిన్నప్పటినుంచే తల్లిదండ్రులు పిల్లలకు చెవిన వేయాలి. అలాంటి పుస్తకాలు జీవితాన్ని ఎలా నిలబెడతాయో, ఎలా ముందుకు నడిపిస్తాయో ఆసక్తి కలిగేలా చెప్పగలగాలి.

ముత్యాల ముగ్గులు



21 చుక్కలు
11 వచ్చే వరకు

గిఫ్ట్ హ్యాంపర్ విజేత



పి.లావణ్య
తిరుపతి




మా చిరునామా: నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.
navya@andhrajyothy.com



అయిలబోయిన భారతమ్మ
దబ్బీర్ పేట,
వరంగల్


21 చుక్కలు
సందు చుక్క
11 వచ్చే వరకు





కె. పద్మజ
యడవోలు
ప.గో.జిల్లా

19 చుక్కలు
3 వరుసలు, 3 చుక్కలు
చుక్క పక్క చుక్క





బోయినీ తిరుమల
శ్రీరాంపూర్ కాలనీ

26 చుక్కలు
10 వరుసలు
10 వచ్చే వరకు





ఎన్. గిరిజమ్మ
హిందూపురం,
అనంతపురం

21 చుక్కలు
11 వచ్చే వరకు
మధ్య చుక్కలు

కొత్త సంవత్సరం సంబరాలు జరిపేసుకున్నాం! కొత్త ఏడాదంతా ఆయురారోగ్యాలతో సాగాలని ఒకరినొకరం అభినందించుకున్నాం! మరి ఆ అభినందనలు ఫలవంతమవ్వాలంటే ఆరోగ్యకరమైన జీవనశైలి అనుసరించాలి. అందుకోసం ఆహారం మొదలుకుని వ్యవహారం వరకూ ఆరోగ్యకరమైన రీతిలో సాగాలి. అప్పుడే రాబోయే కొత్త సంవత్సరాన్ని ఆనందంగా జరుపుకోగలుగుతాం!

365 రోజుల ఆరోగ్యం



ఆరోగ్యానికి అడ్డంకులు

వేధించుకోరాని థైరాయిడ్

పెరుగుతున్న క్యాన్సర్ బెడద

మీకు తెలుసా?



సమతులాహారంతో సక్రమం

సమతులాహారం ఎందుకు?

సమతులాహారం అంటే?

సమతులాహారం ఎలా?

వీటితో ఆరోగ్యకర జీవితం సొంతం

పళ్లలో ఉండే ప్రక్టోజ్ మీద ఓ కన్నేయాలి!

హోమియో



నోటి దుర్వాసనకు దూరం

పొగాకు నమలటం, దంతక్షయం, పండ్లను సరిగా శుభ్రం చేయకపోవటం లాంటి కారణాల వల్ల నోటి దుర్వాసన వస్తుంది. అలాంటి కారణాలు, లక్షణాలను బట్టి నోటి దుర్వాసనను నివారించే పలు రకాల ఔషధాలు హోమియో వైద్యంలో ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి..

పల్సటిల్లా: నోటి దుర్వాసనతో పాటు గొంతు పొడిబారిపోవటాన్ని నివారిస్తుంది.

మెర్క్ సోల్: నోటి దుర్వాసనతో పాటు లాలాజలం అధికంగా ఊరటాన్ని, దంతక్షయాన్ని నివారిస్తుంది.

కార్బోవెజ్: నోటి దుర్వాసనతో పాటు ఇన్ఫెక్షన్‌లు, చిగుళ్లవాపు, రక్తం కారటాన్ని తొలగిస్తుంది.

ఫిట్‌నెస్

సైకిల్ తొక్కేయ్! హెల్త్ పట్టేయ్!

ఫిట్‌నెస్‌కి దగ్గరి దారి సైక్లింగ్. బరువును తగ్గించటంతోపాటు డిప్రెషన్, ఒత్తిడి, ఆందోళనలను కూడా సైక్లింగ్ అదుపులో ఉంచుతుంది. సైక్లింగ్ గురించి మరిన్ని ఆసక్తికరమైన విషయాలున్నాయి. అవేంటంటే...

❑ కీళ్ల నొప్పులున్నవాళ్లు 'స్టాటిక్ సైక్లింగ్' చేయాలి. అంటే....జిమ్‌లో ఉండే సైకిల్ తొక్కాలి.

❑ మధుమేహులు సైక్లింగ్ తొక్కాలనుకుంటే ...



తుమ్ములు, జలుబులు, దగ్గులు...ప్రతి ఇద్దర్లో ఒకరిది ఇదే పరిస్థితి. చలికాలం ఇవన్నీ మామూలే! అని సర్దుకుపోతుంటాం. కానీ అలర్జీ తత్వం ఉన్నవాళ్లు ఇలా సర్దుకుపోతే మరిన్ని ఇబ్బందులు కొని తెచ్చుకున్నట్టే! చలికాలం అలర్జీ ఇక్కట్లకు గురికాకుండా ఉండాలంటే కాస్త ముందుచూపు, మరికాస్త అప్రమత్తతతో వ్యవహరించాలి. ఈ చలర్జీకి చెక్ పెట్టాలి.!

చలర్జీకి చెక్!

శీతాకాలం సమస్యలు

కూల్ డ్రింక్స్ లాంటి చల్లని పదార్థాలు తీసుకోకూడదు. కొందరికి కొన్ని రకాల ఆహార పదార్థాలు తినటం వల్ల అలర్జీ లక్షణాలు మొదలవుతాయి. అవేంటో...ఎవరంతట వాళ్లే గుర్తించి వాటికి దూరంగా ఉండాలి. కొందరికి గుడ్లు, మరికొందరికి తీపి పదార్థాలు పడకపోవచ్చు.

● **పులుపు, కారం, తీపి:** రుచుల్లో విపరీతమైన తత్వం... అంటే, అతి పుల్లని, అతి తీపి, అతి కారం...ఇలాంటి పదార్థాలు అలర్జీ తత్వం ఉన్న వాళ్లు తినకపోవటమే మంచిది.



ఈ జాగ్రత్తలు తప్పనిసరి!

డాక్టర్ ఎమ్.మోహన్ రెడ్డి,
ఇ.ఎన్.టి సర్జన్,
నోవా ఇ.ఎన్.టి హాస్పిటల్,
ఎర్రమంజిల్, హైదరాబాద్.

పొట్ట అంతా హాయిగా...

ఎంతసేపూ, కడుపులోంచి వస్తున్న శబ్దాలవైపే మనసు వెళుతుంటే, ఎదురుగా ఉన్నది ఏం కనపడుతుంది! ఎదుటివాళ్లు చెప్పేది ఏం వినపడుతుంది!

నిరంతరం మలబద్ధకంతో సతమతమయ్యే వారి పరిస్థితి ఇలాగే ఉంటుంది మరి!

మనం తీసుకునే ఆహారం ఎంత గొప్పదైనా కావచ్చు. అందులో ఏదో ఒక మోతాదులో వ్యర్థాలు లేకుండా ఉండవు కదా!

ఆ వ్యర్థాలన్నీ పూర్తిస్థాయిలో విసర్జించబడుతున్నాయా, లేదా అని ఎంత మంది ఆలోచిస్తారు?

నిజానికి, అనేక రుగ్మతలకు ఆరంభ దశ, మూలకారణం మలబద్ధకమే.

● ● ● ●

శరీరంలోని ఇతర జీవక్రియల్లాగే జీర్ణక్రియ, విసర్జన క్రియలు కూడా సహజంగా సాగిపోవాల్సినవే. కానీ, కొన్నిసార్లు ఎక్కడో తేడా వస్తుంది. ఆ వెంటనే సహజ ధర్మాలన్నీ కుంటుబడతాయి. ఈ స్థితిలో ఎక్కువ మందిని వేధించే ఒక ప్రధాన సమస్య ...



డాక్టర్. జి. లక్ష్మణ్ రావు,
మూలికా వైద్యులు,
ఆర్గానిక్ హెర్బల్ క్లినిక్, హైదరాబాద్

మీకు తెలుసా?

రెమెడీ

కాలిన గాయాలకు కలబంద



పరిశోధన

కాలుష్యంతో తగ్గే ఐక్యు



పరిశోధన

విటమిన్ 'డి' లోపిస్తే...



డైలీ సుడోకు - 66

5		3	9			7	2	
1								9
				4		6	5	
				5			4	7
					4			
	8	2			3			
		6	1		4			
	9							3
			7	3		2	1	9

ఎలా పూరించాలి?

సుడోకు- 65 సమాధానం

సెక్సువల్ హెల్త్

సెక్స్ ఎంత తరచుగా?

హెల్త్ న్యూస్

ఊపిరితిత్తులకు టమాటా వైద్యం!




అల్లు అర్జున్

నేనో సైనికుణ్ణి...

బోర్డర్‌కి వెళ్లి చచ్చిపోతా

'హూ ఆర్ యూ?(నువ్వెవరు?)' అనడిగితే... 'ఐయామ్ ఎ సోల్జర్(నేనో సైనికుణ్ణి)' అని గర్వంగా చెబుతాడు సూర్య. దాంతో పాటు అతడికి కోపమూ ఎక్కువే. ఇతరులు చెప్పేదీ అదే. 'ప్రపంచానికి సూర్య అంటే కోపమ'ని అంటుంటారు. ఆ కోపం వల్ల పై అధికారులతో తిట్లు, తన్నులు తిన్న సందర్భాలున్నాయి. అవన్నీ గమనించిన సూర్య శ్రేయోభిలాషి 'ఇలాగే కొన్ని రోజులైతే చచ్చిపోతావురా!' అంటే... 'ఇక్కడ కాదు సార్. బోర్డర్‌కి వెళ్లి చచ్చిపోతా' అనేంత దేశభక్తి అతడిది. అసలు, ఆ సూర్య కథేంటి? అనడిగితే... ఏప్రిల్ 27 వరకూ ఆగమంటున్నారు వక్కంతం వంశీ. ఆయన దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. అల్లు అర్జున్ హీరోగా లగడపాటి శిరీషా శ్రీధర్ నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్ ఇంపాక్ట్(టీజర్)ను సోమవారం విడుదల చేశారు. ఫస్ట్ ఇంపాక్ట్‌కి ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభిస్తోందని నిర్మాత తెలిపారు. అనూ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్-శేఖర్, సహనిర్మాత: 'బన్నీ' వాసు, సమర్పణ: కె. నాగబాబు.

నన్నందుకే గౌరవిస్తారు

\- కాజల్



"అల్లాటప్పాగా నోటికి ఏది వస్తే అది నేనెప్పుడూ మాట్లాడను. ఉన్నత స్థానంలో ఉన్నంత మాత్రాన చుట్టూ ఉన్నవారిని హేళనగా చూడను. నా చుట్టూ ఉన్నవారితో నా ప్రవర్తన ఆత్మీయంగా ఉంటుంది. అధికారాన్నీ, అహంకారాన్ని ఎక్కడా వ్యక్తం చేయను. మాట తీరును బట్టి వ్యక్తిత్వాన్ని అంచనా వేయొచ్చని చిన్నప్పుడు మా అమ్మ చెప్పింది. ఆ విషయాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకుని మసలుకుంటుంటాను" అని అంటున్నారు కాజల్. ప్రస్తుతం ఆమె ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో 'ఎం.ఎల్.ఎ', ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో 'అ!' చిత్రంలో నటిస్తున్నారు. తమిళంలో రమేశ్ అరవింద్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'ప్యారిస్ ప్యారిస్'లో ఆమే నాయిక. కాజల్ మాట్లాడుతూ "మనసులో ఒకటి ఉంచుకుని, పైకి నటించడం నాకు చేతకాదు. అందుకే నా అభిప్రాయాన్ని ఎప్పుడైనా, ఎక్కడైనా నిర్భయంగా వెల్లడించడానికి వెనకాడను. ఏ విషయాన్నైనా అక్కడికక్కడే తేల్చేస్తాను. అంతేగానీ నాన్చుడు వ్యవహారం నా దగ్గర ఉండదు. కాబట్టే నన్నందరూ గౌరవిస్తారు. నా ముక్కుసూటితనాన్ని చాలా మంది ఇష్టపడతారు" అని తెలిపారు.



చైతూ... లైఫ్‌లో ఒక్క ఛాన్స్!


సమంత, నాగచైతన్య

"జీవితంలో మనకు ఒక్క ఛాన్సే వస్తుంది! అప్పుడు ఎటువంటి తప్పులు చేయకుండా సరైన నిర్ణయం తీసుకున్నామా? లేదా? అనేది మన చేతుల్లోనే ఉంది" అంటున్నారు సమంత. మరి, అటువంటి సందర్భంలో ఆమె సరైన నిర్ణయం తీసుకున్నారా? లేదా? అంటే... 'యస్' అంటున్నారు. ఇంతకీ సమంత తీసుకున్న నిర్ణయం ఏంటో తెలుసా? స్పెషల్‌గా చెప్పాలంటారా... ఫోటోలో సమంతతో ఉన్న హ్యాండ్సమ్ హీరో అండ్ హజ్బెండ్‌ని చూశారా!! అక్కినేని నాగచైతన్య. అతణ్ణి పెళ్లి చేసుకోవడమే అట! "నేను తీసుకున్న నిర్ణయాల్లో సరైన నిర్ణయమిదే. అలాగే, భవిష్యత్ గురించి ఎదురు చూస్తున్నా. జీవితం మీరు తీర్చుకున్నట్లే ఉంటుంది. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు" అని నాగచైతన్యతో ఉన్న ఫోటోని సమంత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఈ కొత్త దంపతులు ఇద్దరూ గోవాలో న్యూ ఇయర్ సెలబ్రేట్ చేసుకున్నారు.



విష్ణు, శ్రీయ

అనుబంధాల అల్లిక... 'గాయత్రి'!

కొన్ని దృశ్యాలను ఎన్నిసార్లు చూసినా వెగటు పుట్టదు. అమ్మాయి తల్లో అబ్బాయి పువ్వులు తురమడం, అమ్మాయికి అబ్బాయి గోరింటాకు పెట్టడం, గోరుముద్దలు తినిపించడం... బారైన జుట్టు దువ్వి జడ అల్లడం.. ఇలాంటివన్నమాట. తాజాగా విడుదలైన 'గాయత్రి' స్టిల్ కూడా ఈ కోవలోనిదే. ఈ స్టిల్‌లో పై మెట్టు మీద విష్ణు, కింది మెట్టు మీద శ్రియ కూర్చున్నారు. విష్ణు దువ్వెనను నోట పట్టుకుని శ్రియ జడను శ్రద్ధగా అల్లుతున్న దృశ్యం ఉంది. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ పోస్టర్‌ని విడుదల చేశారు. డా. మంచు మోహన్‌బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. మదన్ దర్శకత్వం వహిస్తున్నారు. తమన్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. అనసూయ భరద్వాజ్, నిఖిల విమల్, బ్రహ్మానందం కీలక పాత్రధారులు. వచ్చేనెల 9న విడుదల కానున్న ఈ చిత్రాన్ని శ్రీలక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ పతాకంపై అరియానా, వివియానా, విద్యా నిర్వాణ సమర్పిస్తున్నారు. విజయ కుమార్.ఆర్. ఎగ్జిక్యూటివ్ నిర్మాత.



ఏనుగు తోడు... కొత్త కథ చెప్పాలని!


రానా

ఆరడుగుల ఎత్తు... అలవోకగా ఒక్క దెబ్బకు ఆరుగుర్ని కొట్టేస్తాడన్నట్లుండే బాడీ... రానా కటౌట్ చూస్తే కమర్షియల్ సినిమాలకు కరెక్ట్ ఫిగర్ అన్నట్టుంటుంది. కానీ, రానా మాత్రం ఎప్పుడూ కొత్త కథల్లో నటించడానికి ఓటేస్తుంటారు. గతేడాది 'బాహుబలి-2', 'ఘాజీ', 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రాలతో అలరించిన రానా ఈ ఏడాదీ మూడు విభిన్నమైన చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రావడానికి ప్రయత్నిస్తున్నారు. మూడింటిలో 'హాథీ మేరే సాథీ' (తెలుగులో 'ఏనుగు నా తోడు ఉంది' అనే అర్థం వస్తుంది) ఒకటి. 1971లో ఇదే టైటిల్‌తో విడుదలైన హిందీ చిత్రానికి రీమేక్ ఇది. ప్రభు సాల్మన్ దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రూపొందుతోన్న ఈ చిత్రంలో బాందేవ్ పాత్రలో నటిస్తున్నారు రానా. సోమవారం న్యూ ఇయర్ సందర్భంగా 'హాథీ మేరే సాథీ'లో ఆయన ఫస్ట్ లుక్ విడుదల చేశారు. "కొత్త కథ చెప్పాలని కొత్త ఏడాదిలో అడుగు పెడుతున్నా" అని రానా పేర్కొన్నారు. ఇది కాకుండా తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న '1947', మలయాళంలో రూపొందుతోన్న 'రాజా మార్తండ వర్మ' చిత్రాల్లో రానా నటిస్తున్నారు.


సూర్య, సెల్వ రాఘవన్

సూర్య ఒక్కరే యాప్ట్

సూర్య, సాయిపల్లవి జంటగా సెల్వ రాఘవన్ దర్శకత్వంలో నూతన చిత్రం సోమవారం ప్రారంభమైంది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్.ఆర్.ప్రభు, ఎస్.ఆర్. ప్రకాశ్ నిర్మిస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం సూర్య మాట్లాడుతూ "సెల్వ రాఘవన్ చెప్పిన కథ ఆకట్టుకుంది. నా 35 చిత్రాలకు భిన్నంగా ఉండే సినిమా. సాయి పల్లవి క్యారెక్టర్ ఇంపార్టెన్స్ ఉంది" అని తెలిపారు. ఈ కథకు సూర్య ఒక్కరే యాప్ట్ అవుతారు. ఆయనతో ఈ కథ చెయ్యడం ఆనందంగా ఉంది" అని సెల్వ రాఘవన్ అన్నారు. ఈ నెల 18న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. దీపావళికి సినిమాను విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నాం" అని నిర్మాతలు వెల్లడించారు.



ఈ నలుగురే కీలకం...


సిద్ధూ, సీరత్ కపూర్, మాస్టర్ విక్రమ్, పృథ్వీ

రచయితగా గుర్తింపు తెచ్చుకున్న శ్రీధర్ సీపాన 'బృందావనమది అందరిది' చిత్రంతో దర్శకుడిగా మెగాఫోన్ పట్టబోతున్న విషయం తెలిసిందే. డిసెంబర్‌లో షూటింగ్ మొదలుపెట్టారు. గుంటూర్ టాకీస్ ఫేం సిద్ధూ, సీరత్ కపూర్, పృథ్వీ, మాస్టర్ విక్రమ్ ఈ చిత్రంలో కీలక పాత్రధారులు. లగడపాటి శ్రీధర్ ఆశీస్సులతో జస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై శ్రీనివాస్ వంగాల, కూతురు ప్రభాకర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. శ్రీధర్ సీపాన మాట్లాడుతూ "నేను రాసుకున్న కథకు అంతా కొత్తవారినే తీసుకోవాలనుకున్నా. సిద్ధూ, సీరత్ కపూర్, పృథ్వీ, మాస్టర్ విక్రమ్(లగడపాటి శ్రీధర్ తనయుడు)మినహా మిగిలిన వారంతా కొత్తవారే. నూతన సంవత్సరంలో ప్రధాన తారాగణం గురించి పరిచయం చేయడం ఆనందంగా ఉంది. ఈ నలుగురు కథకు పర్ఫెక్ట్‌గా యాప్ట్ అవుతారు. నలుగురూ సినిమాకు మూలస్తంభాలు అవుతారు. డిసెంబర్‌లో పూజా కార్యక్రమాలు నిర్వహించి కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. జనవరి 20 నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్తాం" అని తెలిపారు.

ఆంధ్రజ్యోతి

బిజినెస్

11 | నిజామాబాద్ • మంగళవారం 2 జనవరి 2018 | andhrajyothibusiness@gmail.com

నేటి నుంచి బిఎస్ఎన్ఎల్ మెగా మేళా

హైదరాబాద్ : ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) ఈ నెల 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు మెగా మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. మెగా మేళాలో భాగంగా కస్టమర్ సర్వీస్ సెంటర్, ప్రీపెయిడ్ రిటైల్ ఔట్‌లెట్లలో ఉచితంగా 3జి సిమ్‌లను అందిస్తున్నట్లు తెలిపింది. కొత్త సిమ్‌తో పాటు 351 ఎంబి ఉచిత డేటాను ఆఫర్ చేస్తున్నట్లు పేర్కొంది. అలాగే వినియోగదారులు ల్యాండ్ లైన్, బ్రాడ్‌బ్యాండ్, ఎఫ్‌టిటిహెచ్ కనెక్షన్లను ఈ మేళా ద్వారా తీసుకోవచ్చని బిఎస్ఎన్ఎల్ తెలిపింది.

నేడు పరేఖ్‌కు ఇన్ఫీ పగ్గాలు



న్యూఢిల్లీ: దేశంలోని రెండో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ ఇన్ఫోసిస్‌కు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా(సిఇఒ) సలీల్ పరేఖ్ నేడు బాధ్యతలు చేపట్టనున్నారు. గత ఏడాది ఆగస్టులో విశాల్ సిక్కా రాజీనామా చేయడంతో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సిఒఒ) యుబి ప్రవీణ్ రావుకు తాత్కాలిక సిఇఒగా బాధ్యతలు అప్పగించారు. ఇంతక్రితం క్యాప్‌జెమినీలో కీలక బాధ్యతలు నిర్వహించిన 53 ఏళ్ల పరేఖ్‌ని పూర్తి స్థాయి సిఇఒగా నియమించారు. జనవరి 2న ఆయన బాధ్యతలు చేపడతారని ఇన్ఫీ బోర్డు ప్రకటించింది. పూర్తి స్థాయి సిఇఒ కోసం సంస్థ బోర్డు దాదాపు మూడు నెలలపాటు 12 మంది పేర్లను పరిశీలించి, చివరికి పరేఖ్‌ను ఎంచుకుంది.

ఇన్ఫోసిస్ సిఇఒగా నియమితులైన వ్యవస్థాపకేతరుల్లో సలీల్ పరేఖ్ రెండో వ్యక్తి. ఐటీ రంగంపై అనిశ్చితి మబ్బులు కమ్ముకున్న నేపథ్యంలో సంస్థను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, ప్రస్తుత నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నందన్ నీలేకనితో కలిసి పరేఖ్ పనిచేయనున్నారు. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుల్లో ప్రధాన వ్యక్తి ఆర్ నారాయణ మూర్తితో విబేధాల కారణంగా విశాల్ సిక్కాతో పాటు మాజీ చైర్మన్ ఆర్ శేషశాయి తమ పదవులకు రాజీనామా చేయడంతోపాటు బోర్డు సభ్యత్వం నుంచి వైదొలిగారు. దాంతో సంస్థ సారథ్య బాధ్యతలను చేపట్టేందుకు నీలేకని ఇన్ఫోసిస్‌లోకి మళ్లీ వచ్చిన విషయం తెలిసిందే.

ఎస్‌బిఐ గృహ రుణాలు చౌక

» 80 లక్షల మందికి ప్రయోజనం

ముంబై: కొత్త సంవత్సరం తొలి రోజే ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) తన ఖాతాదారులకు శుభవార్త చెప్పింది. బేస్ రేటు, రుణాలపై వసూలు చేసే ప్రామాణిక కనీస వడ్డీ రేట్ల(బిపిఎల్ఆర్)ను 0.3 శాతం (30 బేస్ పాయింట్లు) తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. ఈ తగ్గింపు సోమవారం నుంచే అమల్లోకి వచ్చింది. దీంతో ఇంటి రుణాలతో సహా అన్ని రకాల రుణాలపై వడ్డీరేట్లు తగ్గుతాయి. పాత వడ్డీ రేట్ల ప్రకారం బ్యాంకు నుంచి రుణాలు తీసుకున్న 80 లక్షల మంది ఖాతాదారులు లబ్ధి పొందుతారని అంచనా. ఈ సవరణతో ఇప్పటి వరకు 8.95 శాతం ఉన్న ఎస్‌బిఐ బేస్ రేటు 8.65 శాతానికి, బిపిఎల్ఆర్ 13.70 శాతం నుంచి 13.40 శాతానికి తగ్గింది. అదనపు నిధుల సమీకరణ ఖర్చుల ఆధారంగా ఇచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటు (ఎంసిఎల్ఆర్)ను మాత్రం యథాతథంగా 7.95 శాతం వద్ద ఉంచింది. గత నెలాఖర్లో జరిగిన సమీక్షలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఎస్‌బిఐ మేనేజింగ్ డైరెక్టరు (రిటైల్ అండ్ డిజిటల్ బ్యాంకింగ్) పికె గుప్తా చెప్పారు.

మార్చి వరకు ప్రాసెసింగ్ ఫీజు లేదు

కొత్తగా హోమ్ లోన్లు తీసుకునే వారికి, ఇతర బ్యాంకుల నుంచి తమ గృహ రుణాలను ఎస్‌బిఐకి మార్చుకునే వారికి ఇస్తున్న ప్రాసిసెంగ్ ఫీజు మినహాయింపు గడువును కూడా బ్యాంకు పొడిగించింది. ఈ సంవత్సరం మార్చి వరకు ఈ మినహాయింపు వర్తిస్తుందని తెలిపింది.

300 పిఎన్‌బి శాఖలకు

మూసివేత ముప్పు

» లాభాల్లోకి రాకపోతే చర్యలు తప్పవన్న బ్యాంకు ఎండి


న్యూఢిల్లీ : నష్టాల్లో ఉన్న 300 పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) శాఖలకు మూసివేత ముప్పు ముంచుకొస్తోంది. ఏడాదిలోగా ఈ శాఖలు లాభాల్లోకి రాకపోతే వాటిని మూసివేయడమో లేకపోతే మరో బ్రాంచ్‌లో విలీనం చేయడమో తప్పదని బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ మెహతా హెచ్చరించారు. ప్రభుత్వ రంగ బ్యాంకు(పిఎస్‌బి)లు తమ శాఖలను హేతుబద్ధం చేయాలని ఆర్‌బిఐ సూచించిన వారం రోజుల్లోనే ఆయన ఈ హెచ్చరిక చేయడం గమనార్హం. 'శాఖల హేతుబద్ధీకరణ కొనసాగుతోంది. ఏడాదిలోగా లాభాల్లోకి రాకపోతే మూసివేయడం లేదా మరో బ్రాంచ్‌లో విలీనం చేయక తప్పదని నష్టాల్లో ఉన్న 300 శాఖలకు ఇప్పటికే నోటీసులు ఇచ్చాం' అని మెహతా చెప్పారు. అయితే ఈ 300 బ్రాంచ్‌ల్లో ఇప్పటికే కొన్ని స్వల్ప స్థాయిలో లాభాలు ఆర్జిస్తున్నట్టు తెలిపారు. పిఎన్‌బికి దేశ వ్యాప్తంగా 7,000 శాఖలు ఉన్నాయి. పిఎస్‌బిలు నష్టాల్లో ఉన్న శాఖలను మూసివేయడం లేదా మరో శాఖల్లో విలీనం చేయడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవాలని ఆర్‌బిఐ ఇటీవలే కోరింది. గత నెల జరిగిన పిఎస్‌బి మంథన్ సమావేశంలోనూ దీనిపై ప్రధానంగా చర్చ జరిగింది. దీంతో పిఎస్‌బిల్లో నియామకాలు మరింత తగ్గుతాయని ఉద్యోగ సంఘాలు భావిస్తున్నాయి.

దూసుకుపోతుంది..

2018లో వృద్ధి మరింత పైకి.. ముడి చమురు, ద్రవ్యోల్బణం గండికొట్టే ప్రమాదం

గత ఏడాది దేశ ఆర్థిక వ్యవస్థను పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు కుదిపేశాయి. ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న వృద్ధి 2018లో మరింత పుంజుకోవచ్చని విశ్లేషకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాకపోతే ముడి చమురు, ద్రవ్యోల్బణం అంశాలు ప్రగతి బాటలో స్పీడ్ బ్రేకర్లుగా మారవచ్చని వారు హెచ్చరిస్తున్నారు.

న్యూఢిల్లీ: పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు ప్రభావాల నుంచి క్రమంగా కోలుకుంటున్న ఆర్థిక వ్యవస్థ 2018లో వృద్ధిపథంలో పయనించనుంది. కాకపోతే, సెగలు కక్కుతున్న ముడి చమురు, ఎగిసిపడుతున్న ద్రవ్యోల్బణం వృద్ధి జోరుకు కళ్లెం వేసే అవకాశం ఉంది. డిమానిటైజేషన్, జిఎస్‌టి అమలు ప్రభావాలతో 2017లో ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. ఫలితంగా స్థూల దేశీయోత్పత్తి(జిడిపి)లో 2 శాతం మేర గండిపడి ఉంటుందని కొందరి అంచనా. 2016-17 ఆర్థిక సంవత్సరానికి జిడిపి రూ.152.51 లక్షల కోట్లుగా నమోదైంది. అంటే, పెద్ద నోట్ల రద్దుతో ఎకానమీకి రూ.3.05 లక్షల కోట్ల మేర నష్టపోయి ఉండవచ్చు.



చిగురిస్తున్న ఆశలు

వృద్ధి పునరుద్ధరణ బాట పట్టిందనడానికి ప్రాథమిక సంకేతాలందుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. 2015-16 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో 9 శాతంగా నమోదైన జిడిపి వృద్ధి ఆ తర్వాత వరుసగా 9 త్రైమాసికాలపాటు క్షీణిస్తూ వచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికం(ఏప్రిల్-జూన్)లోనైతే వృద్ధి మూడేళ్ల కనిష్ఠమైన 5.7 శాతానికి పడిపోయింది. అయితే, ఆ తర్వాత మూడు నెలల కాలానికి (జూలై-సెప్టెంబరు) వృద్ధి రేటు 6.3 శాతానికి పుంజుకుంది. ఎగుమతి వాణిజ్య వృద్ధి కూడా ఆశాజనకంగా ఉంది. దిగుమతులు కూడా తగ్గుముఖం పడుతున్నాయి. ఇక ఈ ఏడాదిలో వృద్ధి రేటు మరింత పైకి ఎగబాకవచ్చని ఆర్థిక సేవల సంస్థలంటున్నాయి.

ముడి చమురు ధరలే కీలకం

ఈ ఏడాది ప్రధానంగా దృష్టిసారించాల్సిన అంశం ముడి చమురు ధరల గమనం. గత ఏడాది ఆగస్టులో 52 డాలర్లు పలికిన బ్యారెల్ క్రూడ్.. 28 శాతం మేర ఎగిసి ప్రస్తుతం 67 డాలర్ల స్థాయికి చేరుకుంది. ఈ ఏడాది రిటైల్ ధరల ద్రవ్యోల్బణం ఆర్‌బిఐ నియంత్రణ లక్ష్యమైన 4 శాతానికి పైగా పెరగవచ్చని అంచనా. గతనెలలో ప్రకటించిన ద్రవ్యపరపతి సమీక్షలో ఆర్‌బిఐ.. మార్చి 2018 కల్లా రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాను 4.2-4.6 శాతానికి పెంచింది. పెరుగుతున్న ముడి చమురు ధరలతో ఇంధన ద్రవ్యోల్బణంతోపాటు కరెంట్ ఖాతా లోటును కూడా అదుపు తప్పే ప్రమాదం ఉంది.

అందరి కళ్లు బడ్జెట్‌పైనే

ఆర్థిక వ్యవస్థను ప్రగతి పట్టాలెక్కించేందుకు ఈ ఏడాది ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఏ ఎ ం చర్యలు చేపడతారని అన్ని వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఉద్యోగాల కల్పనతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునరుజ్జీవం పోసేందుకు భారీగా చర్యలు ప్రకటిస్తూనే అన్ని వర్గాలను సంతృప్తి పర్చడం జైట్లీకి కత్తి మీదే సామే. ద్రవ్యలోటు లక్ష్యాలకు కట్టుబడి ఉండటం ఆర్థిక మంత్రి ముందున్న మరో అతిపెద్ద సవాలు. ఈ ఏడాది ఆరు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతోపాటు 2019లో జరగబోయే లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఈసారి మోదీ సర్కారు ప్రజాకర్షక బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు అధిక అవకాశాలున్నాయని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థకు గడ్డు కాలం ముగిసింది. వచ్చే 4-6 త్రైమాసికాల్లో జిడిపి వృద్ధి మళ్లీ సాధారణ స్థితికి చేరుకోవచ్చు. మరికొద్ది త్రైమాసికాల్లో వృద్ధి 7 శాతానికి చేరుకోవచ్చు

– స్టాండర్డ్ చార్టర్డ్

ఈ ఏడాది వృద్ధిపై పలు సంస్థల అంచనాలు ఇవి..

జనవరి-మార్చి మధ్యకాలానికి జిడిపి అనూహ్య పెరుగుదలను నమోదు చేసుకోవచ్చు. ఈ ఏడాది మొత్తానికి వృద్ధిరేటు 7.5 శాతంగా ఉండవచ్చని భావిస్తున్నాం. అయితే, 7.5 శాతానికి కంటే అధిక వృద్ధి నమోదు చేసుకునేందుకు కొన్నేళ్లు పట్టవచ్చు. ఎందుకంటే, ప్రస్తుతం బలహీనంగా ప్రైవేట్ రంగ పెట్టుబడులు పుంజుకునేందుకు చాలా సమయం పట్టనుంది.

– నొమురా

జిఎంఆర్ చత్తీస్‌గఢ్‌లో వాటాల విక్రయానికి

రుణదాతల సన్నాహాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : జిఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనుబంధ సంస్థ.. జిఎంఆర్ చత్తీస్‌గఢ్ ఎనర్జీ లిమిటెడ్‌లో వాటాలను విక్రయించేందుకు రుణదాతల కన్సార్షియం సన్నాహాలు చేస్తోంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా స్ట్రాటజిక్ డెట్ రీస్ట్రక్చర్ (ఎస్‌డిఆర్) ప్రక్రియకు లోబడి రుణదాతలు ఈ వాటాలను విక్రయించనున్నారు. 2016 మార్చిలో కార్యకలాపాలు ప్రారంభించిన 1370 మెగావాట్ల సామర్థ్యం గల జిఎంఆర్ చత్తీస్‌గఢ్ ఎనర్జీ ప్రాజెక్ట్ ప్రస్తుతం వ్యూహాత్మక రుణ పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియలో ఉన్న సంగతి తెలిసిందే. నిర్దేశిత ఎస్‌డిఆర్ గడువు తేదీ నుంచి 18 నెలల కాలంలో రుణదాతలు వాటాలను విక్రయించటం ద్వారా కొత్త ప్రమోటర్‌ను తీసుకురావాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే యాక్సిస్ బ్యాంక్ సారథ్యంలోని కన్సార్షియం.. జిఎంఆర్ చత్తీస్‌గఢ్‌లో వాటాలను విక్రయించేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది. రుణాలను చెల్లించటంలో విఫలం కావటంతో రుణదాతలు ఎస్‌డిఆర్‌ను చేపట్టాలని నిర్ణయించుకున్నారని జిఎంఆర్ ఇన్‌ఫ్రా గత ఏడాది ఫిబ్రవరిలో వెల్లడించింది. ఎస్‌డిఆర్ స్కీమ్‌లో భాగంగా బ్యాంకుల కన్సార్షియం 8,800 కోట్ల రూపాయల మొత్తం రుణం (వడ్డీ కలుపుకుని) లో 2,992 కోట్ల రూపాయల రుణాన్ని ఈక్విటీలోకి మార్చుకోవాలని నిర్ణయించుకున్నాయి. ఈక్విటీ కన్వర్షన్‌తో కంపెనీలో రుణదాతల కన్సార్షియం వాటా 52.4 శాతానికి చేరుకోగా జిఎంఆర్ వాటా 47.6 శాతంగా ఉంది. ఒక్కోటి 685 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లను చత్తీస్‌గఢ్‌లోని తిల్దా వద్ద బొగ్గు ఆధారిత విద్యుత్కేంద్రాన్ని జిఎంఆర్ నిర్వహిస్తోంది. ఈ ప్లాంట్‌కు అవసరమైన బొగ్గును ఒడిశా, జార్ఖండ్‌లోని సొంత బొగ్గు గనుల నుంచి సరఫరా చేస్తోంది.

టన్ను ఉక్కు ధర రూ.50,000

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి) : దేశీయ మార్కెట్లో ఉక్కు ధరలు పెరిగిపోతున్నాయి. గత డిసెంబరులోనే టన్ను ఉక్కు ధర రూ.2,000 నుంచి రూ.9,000 వరకు పెరిగింది. విశాఖ ఉక్కు కర్మాగారమే గత డిసెంబరులో మూడుసార్లు ఉత్పత్తుల ధరలను పెంచింది. ప్రస్తుతం మార్కెట్‌లో నిర్మాణ రంగానికి ఉపయోగించే టిఎంటి బార్ల ధర టన్ను రూ.48 వేల నుంచి రూ.50 వేల వరకు పలుకుతోంది. జనవరిలోను రేట్లు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా. విశాఖ స్టీల్ ప్లాంట్ గత డిసెంబరులో రూ.2,046 కోట్ల విక్రయాలను నమోదు చేసింది. ఉక్కు ఫ్యాక్టరీ చరిత్రలో ఇప్పటి వరకు ఏ నెలలోను ఇంత భారీ స్థాయిలో అమ్మకాలు నమోదు కాలేదు. డిమాండ్ అధికంగా ఉండడంతో గత రెండు నెలల్లోనే 10 లక్షల టన్నుల ఉక్కును విక్రయించినట్టు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అధికార వర్గాలు చెప్పాయి. కర్మాగారం నుంచి ఉత్పత్తులు బయటకు రాగానే హాట్‌కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. దీంతో దేశంలో 23 స్టాక్‌యార్డుల్లో ఎక్కడా నిల్వలు కూడా లేవని చెప్పాయి.

విశాఖ ఉక్కు టర్నోవర్ రూ.11,405 కోట్లు

విశాఖ ఉక్కు కర్మాగారం డిసెంబరు నెలతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి రూ.11,405 కోట్ల టర్నోవర్ సాధించింది. సంస్థ సీనియర్ ఉద్యోగుల సమావేశంలో కంపెనీ సిఎండి మధుసూదన్ ఈ విషయం తెలిపారు. విస్తరణ పనులు పూర్తవడంతో విశాఖ స్టీల్ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 73 లక్షల టన్నులకు పెరిగిందన్నారు. గత ఏడాది ఇదేకాలంతో పోలిస్తే టర్నోవర్ 30 శాతం పెరిగినట్టు చెప్పారు.

జిఎస్‌టి @ 6 నెలలు

» భారీగా తగ్గిన సర్కారు రాబడి



న్యూఢిల్లీ : పరోక్ష పన్నుల్లో విప్లవంగా ప్రభుత్వం చెబుతున్న వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) అమల్లోకి వచ్చి ఆరునెలలైంది. కొత్త పన్నుల వ్యవస్థ ఇంకా కుదురుకోలేదు. ఈ ఆరు నెలల్లో ప్రభుత్వం ఈ కొత్త వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసం కలిగించేందుకు అనేకమార్పులు చేర్పులు చేపట్టింది. రిటర్న్ దాఖలుకు గడువును ప్రతినెలా పెంచుతూ వస్తోంది. జిఎస్‌టికి సంబంధించి ఏ నిర్ణయం తీసుకున్నా జిఎస్‌టి కౌన్సిల్ మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల జిఎస్‌టి కౌన్సిల్ సమావేశమైన ప్రతిసారి ఎజెండా ప్రధాన వార్తల్లో ఉంటోంది. నవంబరు 10న జరిగిన 23వ సమావేశంలో జిఎస్‌టి కౌన్సిల్ దాదాపు 178 వస్తువులకు సంబంధించి జిఎస్‌టి రేట్లను తగ్గించింది. దీనివల్ల నిజానికి రాబడి గణనీయంగా తగ్గినప్పటికీ ప్రభుత్వానికి మరోమార్గం లేకుండా పోయింది. అంతర్‌రాష్ట్ర సరుకుల రవాణాపై పన్నుల ఎగవేతను నిరోధించడం కోసం మాత్రం ప్రభుత్వం ఇ-వే బిల్లును ముందుగానే ప్రవేశపెట్టింది. అంతకుముందు నగదు లావాదేవీల ద్వారా సరుకుల రవాణాలో పన్నుల ఎగవేతకు ఆస్కారం ఉండేది. ఇప్పుడు 50 వేల రూపాయల విలువ పైబడిన సరుకుల విషయంలో పన్నుల ఎగవేతదాదాపు అసాధ్యమని నిపుణులు అంటున్నారు.

పన్నుల రాబడి తగ్గుముఖం

జిఎస్‌టి ప్రారంభమైన తర్వాత ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన పన్నుల రాబడి తగ్గుముఖం పట్టింది. జిఎస్‌టి ప్రారంభమైన తొలి నెల జూలైలో పన్నుల వసూళ్ల మొత్తం 95,000 కోట్ల రూపాయలుండగా ఆగస్టులో 91,000 కోట్ల రూపాయలుంది. సెప్టెంబర్‌లో 92,150 కోట్ల రూపాయలు, అక్టోబర్‌లో 83,000 కోట్ల రూపాయలు, నవంబర్‌కు సంబంధించి డిసెంబర్ 25 వరకు వసూలైన పన్నుల మొత్తం 80,808 కోట్ల రూపాయలు మాత్రమే. పన్ను రిటర్న్ దాఖలు తేదీని జనవరి 10 వరకు పొడిగించారు.


రేట్లు ఇంకా తగ్గకపోవచ్చు..

పన్నుల వసూళ్లు దారుణంగా పడిపోవడంతో జిఎస్‌టి రేట్లను ఇకముందు ప్రభుత్వం తగ్గించే అవకాశం లేదు. పన్నుల వసూళ్లు పెరిగితే రేట్లు తగ్గించవచ్చు గానీ వసూళ్లు నీరసంగా ఉన్న సమయంలో రేట్లను కూడా తగ్గిస్తే రెండు విధాలా నష్టమని ప్రభుత్వం భావిస్తోంది.

యాంటీ ప్రాఫిటీరింగ్ అథారిటీ

జిఎస్‌టి కింద రేట్లలో మోళీకి అస్కారం లేకుండా ప్రభుత్వం యాంటి ప్రాఫిటీరింగ్ అథారిటీని ఏర్పాటు చేసింది. వ్యాపారులు ఉద్దేశపూర్వకంగా జిఎస్‌టి లాభాన్ని వినియోగదారులకు చేరవేయకుండా అధికరేట్లకు సరుకులు, సర్వీసులను విక్రయిస్తే ఈ అథారిటీ చర్యలు తీసుకుంటుంది. వినియోగదారులకు వడ్డీతో సహా నష్టాన్ని వెనక్కి ఇప్పిస్తుంది. ఈ సంస్థ ఇంకా క్రియాశీల పాత్ర పోషించాల్సి ఉంది. జిఎస్‌టికి ఏడాది నిండేలోపు పెట్రోలియం ఉత్పత్తులను కూడా ఈ కొత్త పన్నుల పరిధిలోకి తెస్తారా వేచిచూడాల్సి ఉంది.

మారుతి, హోండా అమ్మకాల్లో రెండంకెల వృద్ధి



న్యూఢిల్లీ : గడచిన డిసెంబరు నెల ఆటో మొబైల్ కంపెనీలకు ఆశించిన ఫలితాలనే ఇచ్చింది. మారుతి సుజుకీ, హోండా కార్స్ వంటి కంపెనీల దేశీయ అమ్మకాల్లో రెండంకెల వృద్ధి నమోదైంది. హ్యుండయ్ మోటార్ మొత్తం అమ్మకాలు రెండంకెల వృద్ధిని నమోదు చేసినా దేశీయ అమ్మకాలు మాత్రం సాధారణ స్థాయిలోనే పెరిగాయి. మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) దేశీయ ప్యాసెంజర్ వాహనాల విక్రయాలు 7 శాతం మేర తగ్గాయి. డిసెంబరులో మారుతి సుజుకీ దేశీయ అమ్మకాలు 12.1 శాతం మేర పెరిగి 1,06,414 (2016 డిసెంబరు) నుంచి 1,19,286కు చేరాయి. స్విఫ్ట్, డిజైర్, బాలెనో వంటి మోడళ్ల ద్వారా మారుతి అమ్మకాలు పెరిగే అవకాశం ఏర్పడింది. డిసెంబరులో హోండా కార్స్ దేశీయ అమ్మకాల్లో 26 శాతం వృద్ధి నమోదైంది. ఈ నెలలో కంపెనీ 12,642 కార్లను విక్రయించింది. 2017 క్యాలెండర్ సంవత్సరంలో ఈ కంపెనీ కార్ల అమ్మకాలు 15 శాతం పెరిగి 1,56,107 నుంచి 1,78,755కు చేరుకున్నాయి.

గత ఏడాదిలో హోండా సిటీ అమ్మకాలు 62,573గా ఉన్నాయి. తమ కంపెనీకి చెందిన అన్ని మోడళ్లకు డిమాండ్ ఉందని, ముఖ్యంగా హోండా సిటీ, డబ్ల్యుఆర్-వి ఎక్కువ మంది కస్టమర్లను ఆకట్టుకున్నట్టు హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ ప్రెసిడెంట్, సిఇఒ యొచిరో యునో తెలిపారు. ఇక హ్యుండయ్ మోటార్ ఇండియా దేశీయ అమ్మకాలు 40,057 నుంచి 40,158కి పెరిగాయి. 2017 క్యాలెండర్ సంవత్సరంలో దేశీయంగా రికార్డు స్థాయిలో 5,27,320 కార్లను ఈ కంపెనీ విక్రయించింది. అంతకు ముందు ఏడాది అమ్మకాలతో పోల్చితే వృద్ధి 5.4 శాతంగా ఉంది. ఇక ఎం అండ్ ఎం ప్యాసెంజర్ వాహనాల అమ్మకాలు 7 శాతం తగ్గి 16,799 నుంచి 15,543కు చేరాయి. అంతర్జాతీయ ఆటోమోటివ్ ట్రెండ్స్ అయిన ఎలక్ట్రిక్ వాహనాలు, షేర్డ్ మొబిలిటీ వంటివి 2018 సంవత్సరానికి కీలకమైన సంకేతాలని ఎం అండ్ ఎం ప్రెసిడెంట్ (ఆటోమోటివ్ సెక్టార్) రాజన్ వధేరా తెలిపారు. తమ కంపెనీ ఇన్నోవేషన్‌కు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనుందని ఆయన చెప్పారు.

ఇక మరిన్ని ఆటో మొబైల్ కంపెనీలు డిసెంబరు నెలకు సంబంధించిన అమ్మకాల వివరాలను ప్రకటించాల్సి ఉంది. గడచిన నెలలో కంపెనీలు మంచి ఆఫర్లను, డిస్కౌంట్లను ప్రకటించిన నేపథ్యంలో అన్ని కంపెనీల అమ్మకాలు బాగానే పెరిగినట్టు పరిశ్రమవర్గాలు చెబుతున్నాయి.

డిసెంబరులో ఆటో కంపెనీల మొత్తం అమ్మకాలు

కంపెనీ	2017	2016	వృద్ధి (శాతంలో)
మారుతి సుజుకీ	1,30,066	1,17,908	10.3
హ్యుండయ్	62,899	57,164	10
మహీంద్రా	39,200	36,464	8
టీవీఎస్ మోటార్	2,56,909	1,84,944	39

విద్యుత్ కేంద్రాలకు సరిపడా బొగ్గు

» సింగరేణి సిఎండి శ్రీధర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అన్ని రంగాలకు 24 గంటల కరెంట్ సరఫరా చేస్తుండటంతో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరిపడా బొగ్గును అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సింగరేణి కాలరీస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ శ్రీధర్ వెల్లడించారు. సోమవారంనాడిక్కడ ఆయన డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి గాను సింగరేణి సాధించిన ప్రగతిని సమీక్షించారు. 2016 డిసెంబరు నాటికి సింగరేణి 427 లక్షల బొగ్గు రవాణా చేయగా ఈ ఏడాది డిసెంబరు నాటికి 9 శాతం వృద్ధితో 467 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసింది. ఇక ఒబి తరలింపులో కూడా 2016 డిసెంబరు నాటికి 221.7 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ (ఒబి) తొలగించగా... ఈ ఏడాది డిసెంబరు నెలాఖరుకు 28 శాతం వృద్ధితో 282.9 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబీని తీసేశారు. గతేడాది మార్చి నుంచి డిసెంబరు దాకా 461 లక్షల టన్నుల బొగ్గు లక్ష్యం కాగా... 467 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశారు. ఒబిలో కూడా 257.60 మిలియన్ క్యూబిక్ మీటర్లు కాగా... 282.98 మిలియన్ క్యూబిక్ మీటర్లు తొలగించారు. ఇదే వేగంతో మిగిలిన 90 రోజులకు రోజుకు 2.10 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.15 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయాలని శ్రీధర్ పిలుపునిచ్చారు.

చైనాకు 'గాడిద' కష్టాలు!

» స్థానికంగా గాడిద తోలుకు విపరీతంగా పెరిగిన డిమాండ్

» దిగుమతి సుంకం భారీగా తగ్గింపు

బీజింగ్: వస్తువేదైనా తనకే కాకుండా ప్రపంచదేశాల అవసరాలు తీర్చగలిగే స్థాయిలో ఉత్పత్తి చేసే చైనాకే ఈ మధ్య ఓ విషయంలో తీవ్ర కొరత ఏర్పడింది. అది మరేదో కాదు.. గాడిద తోలు. వాళ్ల దేశంలో లభ్యత భారీగా తగ్గడంతో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునేందుకు చైనా సిద్ధమైంది. ప్రపంచ దేశాల్లోని గాడిద తోలు విక్రయదారులను ఆకర్షించేందుకు వీలుగా వాటిపై దిగుమతి సుంకాన్ని 5 శాతం నుంచి 2 శాతానికి తగ్గించింది. ఈ పరిణామంతో రవాణా, వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగించే గాడిదలను వధించి లేదా దొంగిలించి చైనాకు ఎగుమతి చేయడం ఊపందుకోవచ్చని ఇతర దేశాల ప్రభుత్వాలు ఆందోళన చెందుతున్నాయి. ప్రస్తుతం చైనాలో గాడిద తోలు 3వేల యువాన్‌లు (460 డాలర్లు) పలుకుతోందంట. అంటే, మన కరెన్సీలో దాదాపు రూ.30 వేలు.

ఎందుకంత డిమాండ్ ?

గాడిద తోలు నుంచి వెలికి తీసే జెలిటిన్(చర్మ కండరాల నుంచి కాచి తీసిన, రుచిలేని జిగురు పదార్థం)కు చైనాలో డిమాండ్ చాలా ఎక్కువ. ఏటా చైనాలో గాడిద తోలు, మాంసం వ్యాపారం కొన్ని వందల కోట్ల డాలర్ల స్థాయిలో ఉంటుంది. ఎజియావోగా పిలిచే ఈ జెలిటిన్‌ను చర్మ సౌందర్యాన్ని పెంచే సంప్రదాయ చైనా ఔషధాల్లో వాడతారు. అలాగే దేశంలోని కొన్ని ప్రాంతాల్లో గాడిద మాంసాన్ని చాలా ఇష్టంగా తింటారు. 1996లో చైనాలో దాదాపు కోటి గాడిదలుండగా.. 2015 కల్లా 50 లక్షల స్థాయికి పడిపోయింది. ప్రపంచవ్యాప్తంగా గాడిదల సంఖ్య 4.4 కోట్లు కాగా.. అందులో అధిక శాతం ఆసియా, ఉత్తర ఆఫ్రికా, దక్షిణ అమెరికా ఇంకా కొన్ని యూరప్ దేశాల్లో ఉన్నాయి.



చిరు వ్యాపారులకు

ఉచిత డిజిటల్ మార్కెటింగ్ సేవలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన బిజినెస్ టు బిజినెస్ పోర్టల్ TradeHyd.com సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపారాలకు ఉచితంగా డిజిటల్ మార్కెటింగ్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రిటైల్, టెక్స్‌టైల్, బ్యూటీ అండ్ ఫ్యాషన్, టూరిజం, హెల్త్‌కేర్, హాస్పిటాలిటీ, రియల్ ఎస్టేట్, ఆటోమొబైల్, మానవ వనరుల నిర్వహణ, ప్రాథమిక విద్య, ట్యూషన్ మేనేజ్‌మెంట్, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, చిన్నతరహా పరిశ్రమల కోసం ఉచితంగా డిజిటల్ మార్కెటింగ్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు TradeHyd.com సిఇఒ వెంకట్ బులెమోని తెలిపారు. ఈ సేవల కోసం జనవరి 10వ తేదీలోగా తమ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, ఇందుకోసం ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. స్వయం సహాయక గ్రూపులు, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ వ్యాపారస్తులు కూడా ఉచిత డిజిటల్ మార్కెటింగ్ సేవలను పొందవచ్చని తెలిపారు.

S & D

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
33812.75	10435.55	29525	38720	63.68	66.87
↓ 244.08	↓ 95.15	↑ 135	↑ 295		

ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

ఇన్‌ఫ్రా పరుగు



నవంబరులో 6.8 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ఆర్థిక రంగానికి కీలకమైన ఎనిమిది మౌలిక వసతుల రంగాలు నవంబరులో 6.8 శాతం వృద్ధిని నమోదు చేశాయి. వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం రిఫైనరీ, ఉక్కు, సిమెంట్ రంగాలు ఈ వృద్ధికి దోహదపడినాయి. ఇది 13 నెలల గరిష్ఠ వృద్ధి. బొగ్గు, క్రూడాయిల్, సహజవాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్ ఈ ఎనిమిది కీలక రంగాల్లో ఉన్నాయి. గత నవంబరులో ఈ రంగాల వృద్ధి 3.2 శాతమే. 2017 నవంబరులో రిఫైనరీ ఉత్పత్తుల రంగం 8.2 శాతం, ఉక్కు రంగం 16.6 శాతం, సిమెంట్ రంగం 17.3 శాతం వృద్ధిని నమోదు చేశాయి. క్రూడాయిల్, సహజ వాయువుల ఉత్పత్తి కూడా పెరిగింది. బొగ్గు రంగంలో మాత్రం ప్రతికూల వృద్ధి నమోదైంది. ఈ ఎనిమిది రంగాలు ఆరోగ్యవంతమైన వృద్ధిని నమోదు చేయడం పారిశ్రామికోత్పత్తి సూచి కూడా సానుకూల జోన్‌లో ఉండేందుకు దోహదపడుతుంది. దేశంలోని పారిశ్రామిక ఉత్పత్తిలో ఈ రంగాల వాటా 41 శాతం ఉంది. ఇదిలా ఉండగా ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబరు మధ్య కాలంలో ఈ ఎనిమిది కీలక రంగాల వృద్ధి సంవత్సర ప్రాతిపదికన 5.3 శాతం నుంచి 3.9 శాతానికి దిగజారింది.

పెరిగిన పారిశ్రామిక కార్మికుల రిటైల్ ద్రవ్యోల్బణం

నవంబరులో పారిశ్రామిక కార్మికుల రిటైల్ ద్రవ్యోల్బణం 3.97 శాతానికి పెరిగింది. ఆహార వస్తువులు, కిరోసిన్, వంట గ్యాస్ ధరలు పెరగడం ఇందుకు దోహదపడింది. 2016 నవంబరులో ఈ విభాగంలో ద్రవ్యోల్బణం 3.24 శాతం ఉంది.

ఎగుమతులపై 8న సమీక్ష

దేశంలో ఎగుమతుల రంగాన్ని ఉత్తేజితం చేసేందుకు తీసుకోవలసిన చర్యలపై చర్చించేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ప్రతినిధులు, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు ఈ నెల ఎనిమిదిన తేదీన సమావేశంకానున్నారు. వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్ ప్రభు సారథ్యంలోని వాణిజ్య అభివృద్ధి, ప్రోత్సాహక మండలి మూడో సమావేశం ఇది. ఎగుమతులను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ మండలిని ఏర్పాటు చేశారు. చివరిసారిగా ఈ మండలి గత జనవరిలో సమావేశమైంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రులు, కేంద్రంలోని 14 కీలక శాఖల కార్యదర్శులు ఈ మండలిలో సభ్యులుగా ఉంటారు. గత అక్టోబరు నెలలో ఎగుమతులు అంతకు ముందు నెలలకన్నా క్షీణించిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. గత నవంబరులో ఎగుమతులు 30.55 శాతం పెరిగి 2619 కోట్ల డాలర్లకు చేరగా ఏప్రిల్-నవంబరు మధ్య కాలంలో 12.01 శాతం పెరిగి 19,648 కోట్ల డాలర్లకు చేరాయి.

గాయత్రి ప్రాజెక్ట్స్‌కు రూ.583 కోట్ల ఆర్డరు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) నుంచి 583 కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్టును పొందినట్టు హైదరాబాద్‌కు చెందిన గాయత్రి ప్రాజెక్ట్స్ వెల్లడించింది. ఆర్డర్‌లో భాగంగా ఒడిశాలోని కటక్-అంగుల్ సెక్షన్‌లోని జాతీయ రహదారి-42ను అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంటుందని తెలిపింది. జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌డీపీ) ఫేజ్-3 కింద ఒడిశాలో ఎన్‌హెచ్-42ను అప్‌గ్రేడ్ చేస్తోందని పేర్కొంది. కాగా భారత్‌మాల ప్రాజెక్టులో భాగంగా ఎన్‌హెచ్ఏఐ నుంచి బిడ్ జాయింట్ స్టాక్ కంపెనీ కెసిఎల్‌ట్రోల్ భాగస్వామ్యంతో గత ఏడాది డిసెంబరు 20న 1,139 కోట్ల రూపాయల కాంట్రాక్టు కొత్త కాంట్రాక్టు అదనమని గాయత్రి ప్రాజెక్ట్స్ దక్కించుకుంది.

GAYATRI

52 వారాల గరిష్ఠ స్థాయికి షేరు

ఎన్‌హెచ్ఏఐ నుంచి కాంట్రాక్టును గెలుచుకోవడంతో సోమవారం స్టాక్ మార్కెట్లో గాయత్రి ప్రాజెక్ట్స్ షేరు దూసుకుపోయింది. బీఎస్ఇలో కంపెనీ షేరు ప్రారంభంలోనే 4 శాతం వృద్ధి చెంది యాభై రెండు వారాల గరిష్ఠ స్థాయి 234.50 రూపాయలను తాకింది. ఇంట్రాడేలో అదే జోరును కనబరిచినప్పటికీ ట్రేడింగ్ చివరలో మాత్రం స్వల్ప లాభం (0.20 శాతం)తో 226.85 రూపాయల వద్ద క్లోజైంది. కాగా ఎన్ఎస్ఇలో కూడా కంపెనీ షేరు 0.15 శాతం లాభపడి 226.50 రూపాయల వద్ద ముగిసింది.

ఆర్బిమెడ్ నుంచి వివిమెడ్‌కు మరిన్ని నిధులు

Vivimed

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెల్త్‌కేర్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ఆర్బిమెడ్ ఏషియా నుంచి మరో 75 లక్షల డాలర్లు (47 కోట్ల రూపాయలు) సమీకరించినట్టు వివిమెడ్ ల్యాబ్స్ వెల్లడించింది. యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రీడియెంట్స్ వ్యాపారంలోని విదేశీ అనుబంధ సంస్థ వివిమెడ్ ల్యాబ్స్ (మస్కరెన్) కోసం ఈ మొత్తాలను సమీకరించినట్టు కంపెనీ తెలిపింది. గత ఏడాది సెప్టెంబరులో ఆర్బిమెడ్ ఏషియా నుంచి వివిమెడ్ 4.25 కోట్ల డాలర్లు సమీకరించిన సంగతి తెలిసిందే. హెల్త్‌కేర్ పరిశ్రమలో వివిమెడ్ వ్యాపార విధానం పట్ల ఇన్వెస్టర్లకున్న విశ్వాసాన్ని తాజా పెట్టుబడులు తెలియజేస్తున్నాయని వివిమెడ్ ల్యాబ్స్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్ వర్లావర్ అన్నారు. కాగా సోమవారం బీఎస్ఇలో కంపెనీ షేరు 1.88 శాతం లాభంతో 105.90 రూపాయల వద్ద స్థిరపడింది.

బులియన్



బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	30,400	---	30,370	---	29,480
క్రితం ముగింపు	30,420	30,280	30,260	30,400	29,610
22 క్యారెట్లు	28,150	---	27,940	---	28,070
క్రితం ముగింపు	28,170	28,100	27,830	28,200	28,200
వెండి (కిలో)	39,900	---	39,800	---	42,600
క్రితం ముగింపు	39,900	40,000	39,500	40,100	42,000

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.20 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	361.00	చిత్తూరు	378.00
వరంగల్	363.00	చెన్నై	385.00
విజయవాడ	372.00	నమక్కల్	375.00
గోదావరి	372.00	బెంగళూరు	365.00
విశాఖపట్నం	380.00	ముంబై	405.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	96.00	విజయవాడ	91.00
కరీంనగర్	97.00	గుంటూరు	91.00
వరంగల్	96.00	ఒంగోలు	93.00
మహబూబ్‌నగర్	96.00	చిత్తూరు	79.00
కర్నూలు	96.00	నెల్లూరు	89.00
విశాఖపట్నం	87.00	అనంతపురం	88.00
గోదావరి	89.00		

తొలి రోజే ఝలక్

ముంబై : చివరి గంటలో లాభాల స్వీకరణ స్టాక్ ఇండెక్స్‌లను చారిత్రక గరిష్ఠ స్థాయిల నుంచి దిగజార్చింది. ఈక్విటీ మార్కెట్ నష్టాలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికింది. సెన్సెక్స్ 244 పాయింట్లు నష్టపోయింది. డిసెంబరు ఒకటో తేదీ తర్వాత ఒక రోజులో సెన్సెక్స్ ఇంత భారీగా నష్టపోవడం ఇదే ప్రథమం. గత శుక్రవారంనాడు సెన్సెక్స్ చారిత్రక గరిష్ఠ స్థాయిలో 34056.83 పాయింట్ల వద్ద ముగిసి ఏడాదికి లాభాలతో వీడ్కోలు పలికిన విషయం విదితమే. అమెరికన్ క్రూడాయిల్ ధర 2015 తర్వాత తొలిసారిగా బ్యారెల్ 60 డాలర్ల కన్నా పైన ముగియడం ఇన్వెస్టర్లను ఆందోళనకు గురి చేసింది. దానికి తోడు విత్తలోటు పెరగవచ్చునన్న భయాలు కూడా ఇన్వెస్టర్లను లాభాల స్వీకరణకు పురిగొల్పాయి. మార్కెట్ కొత్త సంవత్సరం మొదటి సెషన్‌లో ప్రారంభం నుంచి బలహీనంగానే ఉంది. ఇండెక్స్‌లు రెండూ కీలక స్థాయిలు 34000, 10500 స్థాయిల కన్నా దిగజారాయి. సెన్సెక్స్ 244.08 పాయింట్ల నష్టంతో 33812.75 వద్ద ముగియగా నిఫ్టీ 95.15 పాయింట్ల నష్టంతో 10435.55 వద్ద క్లోజయింది. యంత్రపరికరాలు, రియల్టీ, హెల్త్‌కేర్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ విభాగాల్లో అడపాదడపా కొనుగోళ్లు కనిపించడంతో నష్టాలు కొంతమేరకు పరిమితం అయ్యాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి కూడా ఎలాంటి సంకేతాలు లేకపోవడం కూడా ఇన్వెస్టర్లను పొజిషన్లు తగ్గించుకునేలా పురిగొల్పినట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి.

రూ. 2,500 కోట్ల ఐపిఒకు బంధన్ బ్యాంక్ దరఖాస్తు

Bandhan Bank

కోల్‌కతా కేంద్రంగా పని చేస్తున్న బంధన్ బ్యాంకు 2,500 కోట్ల రూపాయల సమీకరణ లక్ష్యంగా పబ్లిక్ ఇష్యూకి దరఖాస్తు చేసింది. సెబీకి ఈ మేరకు దరఖాస్తు అందించినట్టు బ్యాంకు ప్రకటించింది. ఇష్యూలో భాగంగా ఒక్కోటి 10 రూపాయల ముఖ విలువ గల 11,92,80,494 ఈక్విటీ షేర్లు జారీ చేయనున్నట్టు తెలిపింది. బీఎస్ఇ, ఎన్ఎస్ఇల్లో షేర్లు లిస్టింగ్ అవుతాయి. చిన్న ఫైనాన్స్ బ్యాంక్‌గా రూపాంతరం చెందిన ఒక సంస్థ పబ్లిక్ ఇష్యూకు రావడం ఇదే ప్రథమం.

ఆగిన ఆర్‌కామ్ పరుగు


244 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

రిలయన్స్ కమ్యూనికేషన్ (ఆర్‌కామ్) మినహా అడాగ్ గ్రూప్‌లోని ఇతర కంపెనీల షేర్లు సోమవారం కూడా మంచి వృద్ధిని నమోదు చేశాయి. గత కొన్ని రోజులుగా సాగిన ఆర్‌కామ్ షేర్ల నిరంతర ర్యాలీకి మాత్రం బ్రేక్ పడింది. ఈ షేరు 2.26 శాతం నష్టపోయి 35.40 రూపాయల వద్ద ముగియగా రిలయన్స్ నావల్ అండ్ ఇంజనీరింగ్ 32.28 శాతం, రిలయన్స్ పవర్ 20.70 శాతం, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ 9.11 శాతం, రిలయన్స్ క్యాపిటల్ 3.48 శాతం లాభపడ్డాయి.

- సెన్సెక్స్ షేర్లలో 1.69 శాతం నష్టంతో టిసిఎస్ అగ్రస్థానంలో ఉండగా ఇండస్ ఇండ్ బ్యాంక్, హెచ్‌యుఎల్, హెచ్‌డిఎఫ్‌సి, టాటా స్టీల్, ఒఎన్‌జిసి, అదానీ పోర్ట్స్, ఐసిఐసిఐ బ్యాంక్, ఆర్ఐఎల్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఎస్‌బీఐ, కోటక్ బ్యాంక్, యస్‌బ్యాంక్ ఒక శాతానికి పైగా నష్టపోయిన షేర్లలో ఉన్నాయి.
- ఇన్వెస్టర్లు ద్వితీయ శ్రేణి స్టాక్‌లపై దృష్టి పెట్టడంతో స్మాల్ క్యాప్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు లాభాలతో ముగిశాయి.

ఇండస్ ఇండ్ బ్యాంక్ రూ.3190 కోట్ల సమీకరణ

వ్యాపార విస్తరణ కోసం విదేశీ సంస్థల నుంచి 50 కోట్ల డాలర్లు (రూ.3193.75 కోట్లు) సమీకరించినట్టు ఇండస్ ఇండ్ బ్యాంక్ ప్రకటించింది. మూడేళ్ల కాలపరిమితి కోసం తీసుకున్న ఈ రుణాలను సాధారణ బ్యాంకింగ్ అవసరాల కోసం వినియోగించుకోనున్నట్టు తెలిపింది.



జెపివిఎల్ డీల్‌కు జెఎస్‌డబ్ల్యు గుడ్‌బై

జైప్రకాశ్ పవర్ వెంచర్స్‌కు చెందిన బీనా థర్మల్ పవర్ ప్లాంట్ కొనుగోలు డీల్‌ను వదులుకుంటున్నట్టు జెఎస్‌డబ్ల్యు ఎనర్జీ ప్రకటించింది. డీల్ పూర్తి చేయడానికి గడువు ఆదివారంతో ముగిసినందు వల్ల ఈ డీల్‌ను రద్దు చేసుకుంటున్నట్టు తెలిపింది.

- స్టెయిన్‌లెస్ స్టీల్‌తో కిచెన్ సింక్‌లను తయారుచేసే ఆక్రిసిల్ సంస్థ యుకెకు చెందిన హోమ్‌స్టైల్ ప్రాడక్ట్స్ కంపెనీలో 3.75 శాతం వాటాలు కొనుగోలు చేసినట్టు బీఎస్ఇకి పంపిన సందేశంలో తెలిపింది.

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.10	67.37
పౌండ్	78.39	90.92
యూరో	69.73	80.89
ఆస్ట్రేలియా డాలర్	45.30	52.44
బహ్రెయిన్ దినార్	157.35	180.31
కువైట్ దినార్	174.71	217.49
ఒమని రియాల్	154.08	176.28
సౌదీ రియాల్	15.42	18.31
సింగపూర్ డాలర్	43.43	51.45
యుఎఇ దిరమ్	15.81	18.48

10500 దిగువన బలహీనం

టెక్ వ్యూ

నిఫ్టీ మైనర్ అప్‌ట్రెండ్‌లో ప్రారంభమైనా 10500 వద్ద సుదీర్ఘ కన్సాలిడేషన్ అనంతరం చివరి సెషన్‌లో ఆకస్మిక రియాక్షన్‌కు గురై ఆ కీలక స్థాయి కన్నా దిగువన క్లోజయింది. ఇది అప్రమత్త ధోరణి సంకేతం. స్వల్పకాలిక బలహీనతను కూడా సూచిస్తోంది.

మంగళవారం స్థాయిలివే...

నిరోధం : 10500 **మద్దతు :** 10400

- రికవరీ బాట పడితే ట్రెండ్‌లో సానుకూలత కోసం 10500 కన్నా పైన నిలదొక్కుకోవాలి.
- మద్దతు స్థాయి 10400. భద్రత కోసం ఈ స్థాయిలో నిలదొక్కుకోవడం తప్పనిసరి. అంతకన్నా దిగువన క్లోజయితే స్వల్పకాలిక కరెక్షన్ ముప్పు ఉంటుంది.
- బ్యాంక్ నిఫ్టీ మద్దతు స్థాయి 25400 కన్నా దిగువన బలహీనంగా క్లోజయింది. ఇది స్వల్పకాలిక కరెక్షన్ సంకేతం.

సూచన: స్వల్పకాలిక ట్రేడర్లు/ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.

■ వి.సుందర్ రాజా

సాధారణ నిస్తేజం

ఆస్ట్రో వ్యూ

తిథి : పుష్య బహుళ పాడ్యమి **నక్షత్రం :** ఆర్ద్ర, పునర్వసు

ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి; అశ్విని, మఖ, మూల నక్షత్ర జాతకులు, సింహ, ధనుస్సు రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10477.90 (-12.85)

ట్రెండ్ మార్పు వేళలు : 11.45

ధోరణి: గ్రహగతులను బట్టి నిలకడగా ప్రారంభమై 10.20 నుంచి 11.55 వరకు మెరుగ్గా ట్రేడవుతూ 12 చివరి వరకు నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి)పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 11.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12.15 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని 3.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2 గంటల తర్వాత తిరిగి ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవాలి. ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు : 10475, 10510

మద్దతు స్థాయిలు : 10395, 10360

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinanciala strologer.blogspot.in

బీఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ACI INFOCOM 9.89(9.86)1978
AGRO TECH FO 711.3(711.2)1033
AISHWARYA TE 7.38(7.43)36827
ALPHAGEO (I) 916.75(922.15)2924
ALU FLUORIDE 133.75(133.4)6426
AMAR RAJA BA 833.6(840.55)17087
ANDHRA BANK 58.35(58.15)82738
ANDHRA CEMEN 13.9(13.72)86340
ANDHRA PETRO 64.15(64)98759
ANJANI PORTL 240(243.45)2670
ASTRA MICRO 118.75(114.1)173940
AUROB.PHARMA 685.15(688.3)88861
AVANTEL LTD 466.55(455.15)8845
AVANTI FEEDS 2586.1(2533.35)12288
B.N.RATHI SE 54.15(52.5)79190
BALAJI AMINE 631.55(636.05)8352
BAMBINO AGRO 326.75(311.2)5225
BARTRONICSIN 15.17(14.87)41003
BHAGIRA.CHEM 299.05(302.3)1283
BHAGYA INL 52.1(52.2)55000
BHARATFIN 991.5(996.95)9318
BNR UDYOG 27.75(28.6)238
CAMBRIDGE 79.85(78.3)1557
CAT TECHN. 1.1(1.05)50586
CCHHL 20.25(19.24)594160
CCL PRODUCTS 298.95(299.3)2311
CELESTIAL 22.3(21)184377
CIL SECURITS 37.9(35.55)16795
COROM INTER 559.8(576.4)21987
CUBEX TUBING 28.9(28.5)7282
CYBERMATE 3.62(3.8)126803
CYIENT 577.5(579.2)6901
DANLAW TECH. 75.5(74.1)3370
DECAN CEMENT 556.5(555.1)605
DHAN ROTO SP 40.5(39)3126
DIAMONPOWER 18.75(18.3)173083
DIVI'S LAB. 1098.85(1098.2)64841
DIVYA.GRANIT 101.2(104.4)352
DQ ENT 18.2(18.15)12649
DR.REDDY'S 2411.5(2414.4)19391
EMPEE SUGARS 4.95(4.51)42353
EVEREST ORG. 138.85(140.25)628
FACOR ALLOYS 3.6(3.43)162400
FIRSTOBJ 15.15(15.7)7715
FOURTH GEN. 1.62(1.7)784
GATI LTD. 134.95(135.55)317947
GAYATRI PROJ 226.85(226.4)37727
GENNEX LAB 6.25(5.73)1036350
GMR INFRASTR 22.3(22.45)8716955
GODAVARI DRU 41.85(40.75)3644
GOLDST INFRA 206.85(198.05)137666
GOLDSTONE EN 17(16.23)82346
GRANULES (I) 137.1(137.3)85602
GVK POWERINF 19.4(18.55)1539265
HBL P SYS 73.6(71.85)541046
HERITGFOOD 821.55(826.05)798
HIND.FLUROCA 12.16(11.59)22684
HINDUSTN BIO .38(.37)300
I.C.S.A. IND 3.92(3.57)191333
IKF TECHNO .61(.64)52000
INCAP LTD. 109.5(104.3)4459
IPAPPM 317.4(319.75)7012
IVRCL LTD 7.02(5.95)4829208
KAKATIYA CEM 396.9(392.65)10078
KALLAM SPG. 23.95(23.15)33359
KAVERI SEED 548.4(549)19239
KCP LTD 138.2(137.35)65444
KERNEX MICRO 46.5(45.2)31095
KNR CONST 319.8(324.3)21252
KREBS BIOCHM 146.45(139.5)9991
LANCO INFRA 1.41(1.35)3140121
LOKESH MACH 72.7(72.85)36451
LOTUS CHOC 21(21.9)8696
MADHUCON PRJ 35.9(35.65)155458
MOLD-TEK TEC 76.8(78.25)10492
MOSCHIP SEMI 39.55(37.7)166383
MSR INDIA 36.6(35)13970
N C L IND. 249.9(251.05)10477
NACLIND 57.05(55.85)43725
NATCO PHARM 987.85(961.05)19946
NCC 131.55(133.8)918841
NEHA INTER. 10.05(11.07)272145
NETTLINX LTD 79.55(77.4)9534
NEULAND LAB. 886.55(891.75)7767
NILE LTD. 905.3(911)3564
NTL 4.82(4.74)42296
OIL COUNTRY 53.95(51.9)35865
PADMALAYA TE 5.88(5.67)28937
PALRED 91.6(88.7)796
PANYAM CEMEN 62.15(62.6)21448
PENNAR STEEL 68.2(68.8)136914
PFL INFOTECH 8.2(8.3)2363
PHYTOCHEM I. 73.8(71.7)69087
PITTI LAMIN. 102.85(106.65)28820
POKARNA LTD 214.3(213.5)7946
PRAJAY ENGS. 15.32(14.95)111137
PREMIER EXPL 430.55(432.3)1020
PRISM CEMENT 116.45(112.15)66386
RAIN 372.15(371)397354
RAJ PACKAGIN 40(40.15)1352
REG.CERAMIC 8.97(8.55)8506
RESTILE CER. 9.44(8.78)39400
SAGAR CEM. 887.85(848.4)11104
SAMKRG PIST. 348.9(349.1)12125
SAMPRE NUTRI 88.3(80.3)65982
SANGHI IND. 135.1(139.5)66030
SATVAH.ISPAT 34.8(34.65)18011
SAVEN TECHNO 24.8(25.1)7371
SMPL 1.74(1.66)120916
SMS PHARMACE 102.95(103.6)6207
SREE RAYALA 218.7(220.6)3683
STEEL EXCH 44.15(42.15)193289
SUJANA INDUS .9(.88)332530
SURANATP 6.18(6.13)17867
SURYACHAKRA 1.24(1.19)14532
SURYAMBA SP 70.85(68.15)4607
SURYLAK.COTT 96(96.75)9202
SUVEN LIFE S 205.05(203.3)81850
TAJ GVK HOTL 175.8(176)2024
TANLA 40.5(40.25)307500
TCI INDUS. 1080(1130.15)32
TRANSCORP IN 57.8(55.1)39648
TRANSGENE BI 2.37(2.28)61011
TRANSPORT CO 291.6(289.9)4860
USHER AGRO 8.63(8.27)19204
VICEROY HOTE 17.9(17.85)44072
VIJAY TEXTIL 42.95(44.15)4465
VIMTA LABS 167.45(167.85)9864
VIRAT CRANE 44.9(44.7)10252
VIRINCHI 125.5(121.5)206287
VISAKA IND. 655.6(652.8)15483
VISTA PHARMA 41.2(41.5)14937
VIVIMED LABS 105.9(103.95)252094
VST INDUS. 3167.35(3204.95)158
WATERBASE 397.65(361.5)493989
XLENERGY 4(4.1)11590
YBRANTDIGI 6.27(5.61)3441017
ZEN TECH 153(151.2)189546
ZENOTECH 47.05(46.1)16444

ఎన్ఎస్ఇ-500 (NSE) షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 634.15(641.3)18513
AARTIIND 1141(1133.9)106698
ABAN 201.3(202.95)624616
ABB 1399.65(1402.9)44720
ABFRL 170(172.45)289762
ABGSHIP 13.7(13.3)27903
ACC 1731.35(1758.4)123565
ADANIENT 166.05(166.35)4220395
ADANIPORTS 399.65(405.65)2701537
ADANIPOWER 42.6(41.7)34368848
ADANITRANS 219.7(224.15)1005616
AEGISCHEM 289.45(286.8)203299
AHLUCONT 383.5(390.8)41647
AIAENG 1536.65(1550.35)69536
AJANTPHARM 1493.75(1491.45)225361
AKZOINDIA 1860.05(1834.4)17137
ALBK 73.75(73.45)977504
ALLCARGO 209.15(208.8)778527
ALOKTEXT 4.05(3.9)1649310
AMARAJABAT 834.45(840.2)228683
AMBUJACEM 268.05(272.05)1408955
AMTEKAUTO 29.85(29.9)1103252
ANANTRAJ 72.2(71.7)3998139
ANDHRABANK 58.4(58.15)988753
APARINDS 806.25(810.05)6859
APLLTD 531.2(530.6)9061
APOLLOHOSP 1202.55(1204.8)117565
APOLLOTYRE 268.85(268.25)1308125
ARVIND 445.95(450.8)753084
ASHIANA 186.6(187.05)354636
ASHOKA 245.95(244.65)203618
ASHOKLEY 118.65(119.1)10218058
ASIANPAINT 1143.65(1158.5)591349
ASTRAL 835.55(844.65)11270
ASTRAZEN 1174.25(1167.15)13427
ATUL 2752.1(2735.7)6228
AUROPHARMA 683.95(687.95)1629631
AVANTIFEED 2585.25(2534.15)113531
AXISBANK 565.5(563.95)6943234
BAJAJ-AUTO 3289.25(3333.6)174560
BAJAJCORP 487.75(478.3)23617
BAJAJELEC 489.25(497.7)111959
BAJAJFINSV 5171.85(5230.4)44899
BAJAJHIND 16.1(15.4)11337498
BAJAJHLDNG 2864.45(2867.35)7651
BALKRISIND 1195.45(1194.15)195375
BALLARPUR 19.05(18)18445068
BALMLAWRIE 272.4(273.85)62926
BALRAMCHIN 135.3(132.4)2687573
BANKBARODA 161.5(160.65)7408273
BANKINDIA 169.9(169.75)4712424
BASF 2135.6(2141.85)7202
BATAINDIA 755.3(747.3)556099
BBTC 1659.8(1702.55)156937
BEML 1598.7(1618.25)193132
BERGEPAINT 268.9(273.75)1227447
BFUTILITIE 498.8(506.15)1259874
BGRENERGY 140.95(137.45)445161
BHARATFIN 990.4(1000.2)152885
BHARATFORG 723(731.5)372741
BHARTIARTL 527.9(529.65)4333190
BHEL 95.15(92.5)14221778
BHUSANSTL 69.6(70.05)2958295
BIOCON 538(537.3)642155
BIRLACORPN 1194.15(1152.45)63372
BLISSGVS 213.45(212)277869
BLUEDART 4600.3(4552.85)6581
BLUESTARCO 821.5(817.9)41917
BOMDYEING 286.05(277.9)6708713
BOSCHLTD 19791.9(20165.55)20401
BPCL 508.6(517.7)1940293
BRFL 117.7(123.85)3031546
BRIGADE 313.4(315.05)149147
BRITANNIA 4738.25(4709.25)56160
CADILAHC 432.55(433.5)803342
CANBK 360.7(360.4)876655
CAPF 694.9(692.95)156198
CARERATING 1342.25(1332.35)20858
CASTEXTECH 7.85(7.2)8526343
CASTROLIND 191.75(193.2)1062521
CCL 299.9(299.5)33944
CEATLTD 1943.7(1950.85)405491
CENTRALBK 74.7(72.15)8051264
CENTURYPLY 347.55(339.25)396889
CENTURYTEX 1417.05(1437.4)459843
CERA 3723.7(3728.4)2372
CESC 1064(1048)534835
CHAMBLFERT 157.05(152.45)1529319
CHENNPETRO 431.9(428.6)192488
CHOLAFIN 1317.85(1299.55)165858
CIPLA 611.5(608.5)873546
CLNINDIA 605.45(573.75)113356
COALINDIA 266.65(262.95)3079260
COLPAL 1102.6(1100)334274
CONCOR 1370.75(1379.35)68768
COROMANDEL 556.9(579.25)200142
CORPBANK 40.4(39.2)452777
COX&KINGS 273.45(272)275016
CRISIL 1895.05(1874.55)7843
CUB 178.35(179.8)195467
CUMMINSIND 913.05(901.9)339746
CYIENT 577.7(583.25)49668
DABUR 349(349.7)272884
DALMIABHA 3193.85(3208.05)22269
DBCORP 357.5(349.25)79449
DBREALTY 63.65(57.9)2226298
DCBBANK 197.9(196.05)1233341
DCMSHRIRAM 552.85(557.3)128604
DEEPAKFERT 427.85(426.65)201667
DELTACORP 307.15(308.2)1500573
DEN 108.6(105.9)595223
DENABANK 25.55(24.95)2964555
DHANUKA 745.2(733.2)25186
DHFL 590.85(582.7)2377449
DISHTV 81.7(82)1836892
DIVISLAB 1099.05(1098.35)429620
DLF 256.7(259.35)4935049
DREDGECORP 847.6(853.7)1340479
DRREDDY 2404.15(2414.2)242081
DYNAMATECH 2180.55(2178.45)481
ECLERX 1571.95(1571.6)72551
EDELWEISS 292.9(297)1135857
EICHERMOT 29893.15(30340.85)19847
EIDPARRY 379.2(371.1)170864
EIHOTEL 147.05(145.1)127847
ELECTCAST 37.65(37.7)1089022
ELGIEQUIP 309.7(309.1)17450
EMAMILTD 1335.8(1330.2)54222
ENGINERSIN 196(199.3)1106757
EROSMEDIA 203.3(199)744036
ESCORTS 774.35(787.45)1246643
ESSDEE 63.05(60.2)43548
ESSELPACK 295.7(295.8)21815
EVEREADY 440.25(439.15)53671
EXIDEIND 219.75(223.35)756083
FCONSUMER 76.1(75.3)5926558
FDC 248.5(252.5)71671
FEDERALBNK 108.7(108.5)2320304
FINCABLES 702.45(707.5)17353
FINPIPE 662.25(659.7)43367
FLFL 343.4(345.7)21200
FORTIS 157.4(160.45)2878195
FSL 40.95(40.85)3758227
GAIL 498.65(499.65)1639410
GATI 134.8(135.75)1423465
GDL 237.9(235.65)35207
GEPIL 740.95(727.5)22770
GESHIP 403.65(399.35)113210
GET&D 447.5(443.05)83589
GILLETTE 6771.75(6766.9)1646
GLAXO 2463(2489.3)8292
GLENMARK 596.1(594.75)512502
GLOBOFFS 38.75(38.1)41828
GMDCLTD 168(167.15)578704
GMRINFRA 22.3(22.45)104419392
GODFRYPHLP 989.3(987)38700
GODREJCP 986.25(999.45)150338
GODREJIND 602.25(606.45)286411
GODREJPROP 703.85(692.55)86821
GPPL 136.55(136.5)142325
GRANULES 137.45(137.45)1175335
GREAVESCOT 140.4(137.1)2617492
GREENPLY 354.7(337.6)236931
GRINDWELL 544.85(547.65)6630
GRUH 498.45(503.3)70356
GSFC 152.6(156)1611648
GSKCONS 6477.15(6538)13341
GSPL 224.7(227.5)222985
GUJFLUORO 897.15(911.3)43605
GUJGASLTD 844.15(840.55)17171
GULFOILLUB 982.55(987.4)2055
GVKPIL 19.25(18.65)5454220
HATHWAY 39.6(39.9)258899
HAVELLS 554.45(562.45)466717
HCC 42(41)16209405
HCL-INSYS 60.15(58.25)11197819
HCLTECH 878.7(890.5)643144
HDFC 1683.75(1710.4)1387222
HDFCBANK 1854.5(1872.4)1645129
HDIL 64.3(65.55)26430235
HEIDELBERG 151.7(153.1)194262
HEROMOTOCO 3749.1(3785.15)201102
HEXAWARE 341.65(340.65)792011
HFCL 32.25(28.65)39161526
HIMATSEIDE 400.35(399.35)101101
HINDALCO 271.15(273.55)4614411
HINDCOPPER 99.85(101)4391787
HINDPETRO 413.75(418.6)2087052
HINDUNILVR 1344.5(1367.85)746852
HINDZINC 308.95(308.85)637405
HMT 40.2(40.1)3640
HMVL 253.95(252.45)16637
HONAUT 19349.85(19433.6)493
HOTELEELA 21.5(20.8)1313739
HSIL 502.75(505.25)25467
HTMEDIA 101.6(102)888638
IBREALEST 219.2(223.3)3212698
IBULHSGFIN 1218.15(1196.6)1323659
ICICIBANK 310.3(314)7739502
ICRA 3946.5(3953.05)11057
IDBI 60.35(59.85)3765530
IDEA 104.6(108.15)10465979
IDFC 63(62.9)4893132
IFBIND 1362.5(1362.2)12502
IFCI 30.25(30.8)22756110
IGARASHI 853.65(858.8)6361
IIFL 666.75(667.55)48303
IL&FSTRANS 82.55(83.7)526457
INDHOTEL 118.5(117.8)442715
INDIACEM 180.6(183.45)1350029
INDIANB 377.15(376.7)343125
INDOCO 285.05(280.45)89306
INDUSINDBK 1623.85(1648.9)771099
INEOSSTYRO 1052.45(1066.1)7722
INFRATEL 369.95(378.75)1788442
INFY 1033.55(1042.05)2715670
INGERRAND 818.2(805.7)35368
INOXLEISUR 287.2(293.25)40597
INOXWIND 145.3(144.3)274970
INTELLECT 164.75(164.75)368382
IOB 22.45(22.1)970208
IOC 389.95(388.55)2218462
IPAPPM 316.75(320.25)38417
IPCALAB 599.8(598.3)282968
IRB 234.15(238)663061
ITC 262.3(263.25)10461011
J&KBANK 78.55(78.55)168386
JAGRAN 179.7(177.85)137718
JAICORPLTD 191.8(174.4)6079563
JBCHEPHARM 336.85(336.4)94223
JBFIND 232.8(224.3)272050
JCHAC 2690.35(2674.3)5284
JETAIRWAYS 841.75(831.95)4088653
JINDALPOLY 413.7(417.2)77222
JINDALSTEL 206.2(205.05)6556125
JISLJALEQS 126.2(125.75)5957340
JKCEMENT 1113.7(1110.7)28633
JKIL 306.35(300.05)98701
JKLAKSHMI 440.15(439.9)31627
JKTYRE 146.85(147.65)850509
JMFINANCIL 157.95(157.2)1262594
JPASSOCIAT 25.1(26)140366939
JPINFRATEC 23.6(23.8)17022676
JPPOWER 9.2(9.45)62722618
JSWENERGY 91.05(92.4)11091487
JSWHL 1779.2(1784.85)3803
JUBILANT 777.6(788.3)184178
JUBLFOOD 1776.6(1761.1)466361
JUSTDIAL 525.9(522.2)2468981
JYOTHYLAB 378.4(382.2)44862
KALPATPOWR 470.8(472.65)90537
KANSAINER 566.7(574.85)80427
KEC 383.15(383.4)364834
KESORAMIND 138.25(138.05)258431
KIRLOSENG 378.65(380.55)10133
KITEX 308(306.2)128177
KOLTEPATIL 364.9(365.95)208037
KOTAKBANK 999.95(1010.2)1317415
KPIT 184.75(180.75)2692705
KRBL 601.8(600.25)39095
KSCL 547.35(547.65)320298
KSK 13.45(12.85)1613342
KTKBANK 154.75(151.65)2789232
KWALITY 112.5(112.55)1231169
L&TFH 172.9(174)2468910
LAKSHVILAS 149.45(148.05)432830
LAOPALA 605.9(612.55)7188
LAXMIMACH 5856.45(5840.5)1742
LICHSGFIN 565.7(563.5)919832
LITL 1.4(1.35)6089076
LT 1260.7(1258.25)2048058
LUPIN 883.25(885.1)1032734
M&M 744.65(751.1)2476302
M&MFIN 470.7(473.1)403973
MAGMA 160.45(160.55)64032
MAHINDCIE 253.45(258.15)231623
MAHLIFE 475.75(459.25)49594
MANAPPURAM 121.3(123.4)3480443
MANPASAND 440.65(437.95)59612
MARICO 320.7(322.5)346559
MARKSANS 39.95(39.95)2709022
MARUTI 9651.9(9729.55)426354
MAYURUNIQ 495.65(515.75)37754
MCDOWELL-N 3643.8(3668.85)180738
MCLEODRUSS 203.2(205.1)185420
MERCK 1321.15(1289.75)41588
MHRIL 338.1(337.95)49054
MINDACORP 211.65(214.35)375083
MINDTREE 606.9(612.4)318744
MMTC 72.95(73.3)2515869
MOIL 243.05(242.5)917759
MONSANTO 2475.3(2535.1)5794
MOTHERSUMI 379.1(379.25)1834837
MOTILALOFS 1482.8(1493.5)31751
MPHASIS 738.25(725.65)51609
MRF 72402.85(72357.05)7348
MRPL 127.15(128.85)569509
MTNL 28.15(24.9)19430540
MUTHOOTFIN 470.3(474.65)155817
NATCOPHARM 986.3(961.7)271703
NATIONALUM 85.7(86)6930461
NAUKRI 1380.75(1390.6)32084
NAVKARCORP 190.7(187.75)98784
NCC 131.35(133.75)4165441
NETWORK18 59.85(60.95)2012239
NHPC 32.2(32.65)9844325
NIITTECH 653.8(645.05)213259
NITINFIRE 7.4(6.75)1542263
NLCINDIA 108.4(109.6)654101
NMDC 141.05(137.8)5570533
NTPC 176.55(177)5574802
OBEROIRLTY 480.2(481.2)224567
OFSS 4066.75(4098.05)6804
OIL 372.95(371.5)471037
OMAXE 229(230.5)537780
ONGC 192.35(195.2)5899565
ORIENTBANK 121.9(120.7)1441221
ORIENTCEM 167.7(170.95)100654
ORISSAMINE 1973.8(1974.55)3997
PAGEIND 25212.95(25541.55)13293
PARSVNATH 30.05(30.25)103348
PCJEWELLER 469.25(456.75)1506121
PEL 2844.5(2867.25)48303
PERSISTENT 711.8(718)101524
PETRONET 255.9(254.75)2140136
PFC 123.8(121.75)6640773
PFIZER 2046.65(2062.95)7453
PFS 37.85(37.3)2127885
PGHH 9475(9395.8)2646
PHOENIXLTD 633.65(626.95)136550
PIDILITIND 900(902.2)160477
PIIND 958.65(962.5)15293
PNB 169.75(171.4)7869149
POLARIS 393.2(392.6)50819
POWERGRID 200.2(200.35)3593261
PRAJIND 111.75(111.85)1466241
PRESTIGE 315.65(318.15)99704
PRISMCEM 117.05(112.95)328528
PTC 119.75(118.7)3292484
PUNJLLOYD 27.5(24.2)25972959
PURVA 164.85(167.15)577781
PVR 1423.75(1411.05)182104
RADICO 294.85(293.9)1688847
RAIN 371.75(370.35)2395828
RAJESHEXPO 804.7(804)346745
RALLIS 270.85(265.05)632669
RAMCOCEM 780.25(785.6)94919
RAMCOSYS 525.85(526.7)31225
RATNAMANI 1083.35(1096.45)124872
RAYMOND 1051.2(1057.45)210005
RCF 96.95(96.4)7406873
RCOM 35.35(36.15)352686945
RECLTD 158.4(155.75)4545949
REDINGTON 179.45(174.6)89956
RELAXO 686.85(677.8)8615
RELCAPITAL 600.35(579.15)20042075
RELIANCE 909.75(921.05)4321686
RELINFRA 572.65(553.85)9340782
RENUKA 16.9(16.35)7134944
REPCOHOME 695.4(685.25)178978
RIIL 640.3(539.75)8266293
RKFORGE 856.65(860.3)32322
RNAVAL 65.25(49.3)94898434
ROLTA 62.75(59.6)4882272
RPOWER 60.65(50.25)193482359
RTNPOWER 8(7.85)37834174
RUCHISOYA 18.7(18.65)7244320
SADBHAV 429.5(426.65)269817
SADBHIN 146.1(147.4)151966
SAIL 92.7(92.15)11912572
SANOFI 4699.2(4740.1)7319
SBIN 307.1(309.9)12182400
SCHAEFFLER 5841.05(5862.95)903
SCHNEIDER 131.55(126.35)551612
SCI 94.2(94.6)1004745
SHARDACROP 447.8(449.9)14187
SHILPAMED 615.3(619.1)8595
SHK 291.85(298.5)98449
SHOPERSTOP 551(560.35)45849
SHREECEM 17929.05(18074.5)3570
SHRIRAMCIT 2109.1(2106.9)2687
SIEMENS 1238.2(1238.05)92957
SIMPLEXINF 574.65(582.15)13977
SINTEX 27.1(27.25)14195144
SITINET 25.6(25.95)181499
SJVN 34.15(33.9)976628
SKFINDIA 1898.25(1930.8)7684
SMLISUZU 922.95(912.55)39871
SNOWMAN 59.5(57.35)2494544
SOBHA 606.7(619)143180
SOMANYCERA 918.45(910.1)5231
SONATSOFTW 278.35(278.45)277928
SOUTHBANK 31.45(31)9850786
SPARC 500.25(507.7)315612
SREINFRA 99.8(99.9)1697400
SRF 1967.2(1981.2)117434
SRTRANSFIN 1473.45(1481.4)212924
STAR 821.3(822.95)205110
STCINDIA 184.15(188.4)20884
SUNDARMFIN 1853.95(1878.35)7278
SUNDRMFAST 580.65(585.25)120145
SUNPHARMA 574.05(571.15)5314142
SUNTV 998(990.15)743452
SUPREMEIND 1305.45(1294.5)37101
SUVEN 204.85(203.4)428549
SUZLON 15.8(15.55)69982189
SWANENERGY 192.75(190.9)1286672
SYMPHONY 1721.9(1746.75)5066
SYNDIBANK 79.75(80.15)1819393
SYNGENE 547.85(541.35)99203
TAKE 163.3(161.15)277752
TATACHEM 726(731.55)186817
TATACOFFEE 164.7(166.95)506856
TATACOMM 677.95(681.55)340111
TATAELXSI 964.05(977.15)362876
TATAGLOBAL 312.9(316.4)1602814
TATAMOTORS 424.45(431.85)6807536
TATAMTRDVR 242.35(244.1)1779400
TATAPOWER 97.15(93.5)33659894
TATASPONGE 987.8(987.75)333000
TATASTEEL 722.2(732.4)1833942
TBZ 122.55(118.05)605960
TCS 2645.6(2701.2)675880
TECHM 503.1(504.05)1115837
TECHNO 411.7(411.85)26048
TEXRAIL 112.5(111.95)758073
THERMAX 1212.85(1223.75)4943
THOMASCOOK 256.9(256.35)248497
TIDEWATER 6995.3(7007.75)1687
TIMKEN 883.65(879.95)10288
TITAN 852.45(858.15)472607
TNPL 448.75(447.3)243137
TORNTPHARM 1390.45(1418.55)70969
TORNTPOWER 284.95(283.25)2175223
TREEHOUSE 15.2(14.6)88061
TRIDENT 89.5(89.4)688470
TRITURBINE 130.75(133.55)100727
TTKPRESTIG 7938.25(7702.25)5393
TTML 7.35(7.05)2395963
TV18BRDCST 60.7(61.4)7343069
TVSMOTOR 766.45(770.7)240613
TVSSRICHAK 3971.9(3922.65)13155
TVTODAY 435.15(431)217465
UBL 1060.3(1079)135482
UCOBANK 30.6(29.3)2226297
UFLEX 486.8(486.75)125597
ULTRACEMCO 4256.05(4320.6)166780
UNICHEMLAB 326.55(331.05)226336
UNIONBANK 144.9(144.3)1583719
UNITECH 11.3(9.6)268376516
UPL 755.75(762.7)1068067
VAIBHAVGBL 723.95(727.65)12805
VAKRANGEE 420.3(420.25)457000
VEDL 325.45(329.9)5729566
VIDEOIND 20.55(19.7)4049354
VIJAYABANK 69.05(68.35)2851576
VINATIORGA 991.15(997.9)9669
VIPIND 351.25(351.35)165930
VOLTAS 648.95(655.9)511241
VRLLOG 429.7(431.65)44536
VSTIND 3179.5(3207.05)681
VTL 1427.35(1378.85)45672
WABAG 628.95(610.65)93523
WABCOINDIA 7171.15(7337.35)2493
WELCORP 138.75(135.75)350672
WELSPUNIND 72.55(71.4)1676852
WHIRLPOOL 1625.2(1592.7)57690
WIPRO 316.55(314.25)3350397
WOCKPHARMA 924.6(931.35)1403328
WONDERLA 361.5(360.7)9563
ZEEL 579.2(581.8)1102118
ZEELEARN 44.1(44.35)314210
ZENSARTECH 871.95(890.55)5131
ZYDUSWELL 1041.8(1043.2)7737



హాంకాంగ్‌లో ట్యాక్సీలు వద్దు

ఏ దేశంలో ఏముంది? Foreign

హాంకాంగ్.. ఒకప్పుడు బ్రిటన్ ఆధీనంలోను.. ప్రస్తుతం చైనా పాలన కింద ఉన్న అత్యాధునికమైన ద్వీపం. అందమైన సందర్శన స్థలాల దగ్గర నుంచి అత్యాధునికమైన టెక్నాలజీ పార్కుల దాకా అనేక ఆకర్షణీయమైన స్థలాలున్న ఈ దేశంలో ఎలా మెలగాలో తెలుసుకుందాం..

అక్కడి సిమ్‌లు వద్దు..

హాంకాంగ్‌లో ప్రజలు కొత్తవారిని చాలా ఆత్మీయంగా పలకరిస్తారు. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లటానికి మెట్రో రైళ్లు.. బస్సులు ఉంటాయి. ట్యాక్సీలు కూడా దొరుకుతాయి. అయితే మెట్రోతో పోలిస్తే ట్యాక్సీల చార్జీలు చాలా ఎక్కువ. ఇక మొబైల్స్ విషయానికి వస్తే- స్థానికంగా సిమ్ కార్డులు వేసుకుంటే ఖరీదు ఎక్కువ అవుతుంది. నెట్ బ్రౌజ్ చేయాలంటే.. అక్కడి సిమ్ వేసుకుని మొబైల్ డేటా రీచార్జ్ చేయించుకోవక్కర్లేదు. హాంకాంగ్‌లో చాలా ప్రాంతాల్లో ఉచిత వైఫై లభిస్తుంది. దాన్ని వాడుకోవచ్చు.

నీళ్లు ఎక్కువ తాగాలి..

హాంకాంగ్ సముద్రతీర ప్రాంతం కావటం వల్ల ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. అందువల్ల అక్కడ పల్చటి దుస్తులను వాడాలి. అక్కడ ఉన్నంత కాలం ఎక్కువగా నీళ్లను తాగాలి. లేకపోతే సొమ్మసిల్లిపోయే అవకాశముంది. వీలైనంత వరకూ నడవకుండా ట్రైన్లను, బస్సులను వాడుకుంటే మంచిది. అంతేకాకుండా సౌకర్యవంతమైన షూలను కూడా వేసుకోవాలి.


షాపులు తెరవటం ఆలస్యమే..

హాంకాంగ్‌లో షాపులను ఆలస్యంగా తెరుస్తారు. అందువల్ల ఉదయాన్నే నెమ్మదిగా బ్రేక్‌ఫాస్ట్ చేసి ఆ తర్వాత షాపింగ్‌కు వెళ్తే మంచిది. హాంకాంగ్‌లో పెద్ద పెద్ద మాల్స్‌తో పాటు రోడ్ల పక్కన ఉండే షాపులు కూడా అనేకం ఉంటాయి. చిన్న చిన్న ఎలక్ట్రానిక్ వస్తువులు ఇలాంటి షాపుల్లో కొన్నా పర్వాలేదు కానీ ఎక్కువ ధర ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులను షోరూంలలోనే కొనుగోలు చేస్తేనే మంచిది. లేకపోతే మోసపోయే అవకాశం కూడా ఉంటుంది.

– స్పెషల్ డెస్క్

'ఫిదా' సినిమాలో హీరోయిన్ సాయి పల్లవి.. ట్రాక్టర్ తోలుతుంది. వ్యవసాయ పనులూ చేస్తుంది. తండ్రికి అన్ని విధాలా చేదోడువాదోడుగా నిలుస్తుంది. అయితే అది సినిమా. పాక్, అఫ్గానిస్తాన్‌లో కొందరు అమ్మాయిలు నిజంగానే అబ్బాయిల్లా పెరుగుతారు. తల్లిదండ్రులకు కొడుకులు లేని లోటు తీర్చడానికి! పురుషాధిక్యత, ఛాందస వాదం, ఉగ్రదాడులు, తాలిబన్ల ఫత్వాలు, తరతరాల వివక్షా పరదాల నుంచి తప్పించుకుని తల్లిదండ్రులకు అండగా నిలిచేందుకు! అక్కడ మాత్రమే కనిపించే బచ్చాపోష్ సంస్కృతి ఇది. బచ్చాపోష్ అంటే.. అబ్బాయి వేషంలోని అమ్మాయి!





కూతుళ్లే కొడుకులు



పాక్, అఫ్గాన్‌లలో 'బచ్చాపోష్' సంస్కృతి.. అమ్మాయిలను అబ్బాయిలుగా పెంచే వైనం

చాలా దేశాల్లో యువతులకు స్వేచ్ఛ లేదు. సమానత్వం అంతకంటే లేదు. కానీ మన పొరుగునున్న పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌లలో కనీసం అమ్మాయి అమ్మాయిలా కూడా పెరగలేదు. మారువేషాల్లో అబ్బాయిల్లా బతకాల్సిన దుస్థితి! వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం! ప్యాంటు చొక్కా వేసుకుని, చిన్న హెయిర్‌కట్‌తో అమాయకంగా చూసే అమ్మాయిలు.. పాక్, అఫ్గన్లలోని ప్రతి ఊరిలో కనిపిస్తారు..వివక్షను మౌనంగా ప్రశ్నిస్తూ!

వందల ఏళ్ల చరిత్ర

పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌లలో బచ్చాపోష్‌కి వందల ఏళ్ల చరిత్ర ఉంది. మగపిల్లలు లేని కుటుంబాల్లో ఓ ఆడపిల్లను బచ్చా పోష్‌గా మారుస్తారు. అబ్బాయి పేరుతోనే పిలుస్తారు. జుత్తు కత్తిరించి క్రాపు చేయిస్తారు. ప్యాంటు చొక్కా వేసి నెత్తిన టోపీ పెడతారు. ఇక ఆ ఇంటికి ఆ అమ్మాయే అబ్బాయికింద లెక్క! మగ సంతానం లేని సుల్తానులు, సంపన్నులు తమ ఆస్తులను కాపాడుకోవడానికి ఏనాడో మొదలుపెట్టిన బచ్చా పోష్ పద్ధతి ఇప్పటికీ అఫ్గానిస్థాన్‌లో కొనసాగుతూనే ఉంది. సోవియట్-అఫ్గాన్ యుద్ధం 1979 నుంచి 1989 వరకూ సాగింది. ఇక 2001 నుంచి తాలిబన్లకు-అమెరికా దళాలకు మధ్య పోరు సంగతి తెలిసిందే. పోరు ఏదైనా, ఆధిపత్యం ఎవరిదైనా.. కాబూల్లో మహిళల పరిస్థితి దయనీయం! భర్తలను కోల్పోయిన మహిళలు.. పిల్లలను సాకడానికి ఇంటి నుంచి ఒంటరిగా బయటకు రాలేని పరిస్థితి! మగపిల్లాడు లేని ఇంటిని అఫ్గాన్ సమాజం గుర్తించని దుస్థితి! గౌరవం ఇవ్వరు. భద్రత లేదు. దీంతో మగపిల్లలు లేని వేలాది తల్లులు.. ఈ పద్ధతిని అనుసరిస్తున్నారు.





నజ్లా తోఫాన్

కాబూల్‌కి చెందిన నజ్లా తోఫాన్‌ది మరో విషాద గాథ! ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిలో తండ్రి చనిపోయాడు. అమ్మ తప్ప ప్రపంచంలో ఆమెకు ఎవ్వరూ లేరు. అన్నదమ్ములు, అక్కా చెల్లెళ్లు ఎవ్వరూ లేరు. మగాడే అధికుడనే అఫ్గాన్ సమాజం కోసం నజ్లను బచ్చాపోష్‌గా మార్చింది తల్లి. ఇల్లు దాటితే కుర్రాళ్లు వింతగా చూస్తారు. వెకిలి వేషాలు వేస్తారు. అందుకే తనను తాను కాపాడుకోవడానికి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుంటోంది నజ్ల!



అసియా

పద్నాలుగేళ్ల అసియాను చూస్తే అమ్మాయంటే అస్సలు నమ్మలేం! 'నా గురించి తెలియని అమ్మాయిలు ఐ లవ్ యూ చెప్పిన సందర్భాలు కూడా ఉన్నాయి' అంటుంది అసియా నవ్వేస్తూ! అయితే నిత్యం ఎవరో ఒకరు నువ్వు అమ్మాయివా? అబ్బాయివా? అని ఏడిపిస్తూనే ఉంటారు. నువ్వు బచ్చా పోష్ అంటూ రోడ్డుమీద అరుస్తారు. ఆ మాట వినప్పుడల్లా అసియాకు మనస్సు చివుక్కుమంటుంది. 'ఏం ఇంట్లో మగపిల్లాడు పుట్టకపోతే నన్ను అలా మార్చేస్తారా? ఇతర దేశాల్లో అమ్మాయిలు, అబ్బాయిలు సమానం. అఫ్గాన్‌లో ఎందుకీ వివక్ష' అని అసియా ప్రశ్నిస్తూనే ఉంటుంది.

అబోస్ ఫాజిల్య

తండ్రి చేసిన తప్పులకు బాధితురాలిగా మిగిలింది అబోస్ ఫాజిల్య! డ్రగ్స్‌కి బానిసైన తండ్రి నడవలేని స్థితికి చేరుకున్నాడు. చెల్లి అమ్మ కడుపులో ఉన్నప్పుడే కుటుంబాన్ని వదిలేశాడు. దీంతో మగపిల్లాడు లేని ఇంటికి అబోస్ ఫిజిల్య పెద్ద దిక్కయ్యింది. ప్యాంటు చొక్కా వేసుకుని అమ్మకు ఇంటా బయటా అన్ని పనుల్లో సాయం చేస్తుంది. కటింగ్‌కి వెళ్లినప్పుడు మాత్రం ఏడుపు ముఖం పెట్టేస్తుంది. అన్నట్టు ఫాజిల్యాను చూసి..ఆమె చెల్లి కూడా అబ్బాయి బట్టలే వేసుకుంటోంది.

అమీనా హమీద్

పిల్లలకు మంచి బాల్యాన్ని అందించాల్సిన బాధ్యత తల్లి దండ్రులది! కానీ అమీనా హమీద్ కాబూల్ వీధుల్లో మంచి నీళ్లు అమ్ముతుంది. ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు సేకరిస్తుంది. నిండా పదేళ్లు కూడా లేని వయసులో తండ్రితో సమానంగా కష్టపడుతుంది. అమ్మకు కూరలు తెచ్చి ఇస్తుంది. ఇంట్లో పని చేస్తుంది. మగ సంతానం లేని తల్లిద్రండులు.. ఊహ తెలిసేలోపే అమీనాను బచ్చాపోష్‌గా మార్చేశారు! డబ్బు సంపాదించే యంత్రాన్ని చేశారు. ఆరుగురు చెల్లెళ్ల బాగోగుల బాధ్యత ఇప్పుడు అమీనాదే!

యుక్త వయసు రావడంతోనే మళ్లీ ఆంక్షల సంకెళ్లు

గ్రామీణులు, చదువుకోనివారే కాదు..నగరాల్లో చట్టసభలకు ఎన్నికైన విద్యావంతుల ఇళ్లలో కూడా బచ్చాపోష్‌లు సర్వసాధారణం! కానీ యుక్తవయసు రాగానే బచ్చాపోష్‌కు సమస్యలు మొదలవుతాయి. అంతవరకూ ప్యాంటు చొక్కా వేసుకుని స్వేచ్ఛగా తిరిగిన అమ్మాయిలను.. ఒక్కసారిగా పరదా చాటుకు నెట్టేస్తారు. పెళ్లి కూడా చేసేస్తారు. అంత వరకూ ఆడుతూ పాడుతూ స్వేచ్ఛగా బతికిన అమ్మాయిలు.. పురుషాధిక్యతను తట్టుకోలేక నరకం అనుభవిస్తారు. మానసికంగా కుంగిపోతారు. మరి.. వారి తర్వాత ఆ ఇంటి బాధ్యత ఎవరు తీసుకుంటారంటే.. ఆరేడుమంది ఆడపిల్లల్లో మరో చిన్న పాపకు అబ్బాయి వేషం వేసి బచ్చాపోష్‌గా మారుస్తారు.





బిహారీ యువకుడు లాటిన్ అమెరికా 'హీరో'

ప్రభాకర్ నటించిన సినిమా కోస్టారికాలో సూపర్ హిట్

ఓ బిహారీ యువకుడు లాటిన్ అమెరికా అమ్మాయిలతో రొమాన్స్ చేస్తున్నాడు. పట్నాకు చెందిన ప్రభాకర్ శరణ్ నటించిన తొలి స్పానిష్ సినిమా 'ఎన్రెడాడోస్: లా కన్ఫూజన్(ద కన్ఫ్యూజన్)' కోస్టారికాలో గతేడాది బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. కోస్టారికా, ముంబై, పనామా నగరాల్లో నిర్మించిన ఈసినిమాలో పాటలు, డ్యాన్సులను బాలీవుడ్ తరహాలో రూపొందించారు. ఇందులో ప్రభాకర్ హీరోగా, కోస్టారికా టెలివిజన్ నటి నాన్సీ డోబుల్ హీరోయిన్‌గా నటించారు. దర్శకత్వ బాధ్యతలు కూడా హీరో ప్రభాకర్ నిర్వహించాడు. భారతీయులను, లాటిన్ అమెరికా ప్రజలను కలపడమే ఈ సినిమా కథాంశమని ప్రభాకర్ తెలిపాడు. లాటిన్ అమెరికా సినీ పరిశ్రమలో ఇది ఓ మైలురాయిగా నిలుస్తుందన్నాడు. 2017 ఫిబ్రవరిలో కోస్టారికా, పనామా, నికరాగువా, హోండూరస్, గ్వాంటెమాలా, సాన్ సాల్వెడార్ దేశాల్లో విడుదలైన ఈ సినిమాను ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో లాటిన్ అమెరికాలోని మరో డజన్ దేశాలతో పాటు అమెరికాలోనూ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'ఏక్ చోర్ - దో మస్త్‌ఖోర్' అనే టైటిల్‌తో ఇంగ్లీషు, హిందీ, భోజ్‌పూరి భాషల్లోనూ నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పట్నాలో జన్మించిన ప్రభాకర్ తల్లిదండ్రులు ప్రభునాథ్ శరణ్, సుభద్ర ప్రసాద్ రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగులు. జార్ఖండ్‌లోని ఝుర్కుండా, రామ్‌నగర్‌ల్లో స్కూల్ విద్యనభ్యసించిన ప్రభాకర్ రోహతక్‌లో కాలేజీ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం 2000లో కోస్టారికా వెళ్లాడు. అక్కడ చదువు పూర్తయిన తర్వాత భారత వస్త్రాలు, రెస్టారెంట్ల చైన్‌ను ప్రారంభించాడు.

– పట్నా



నాడు దేశసేవలో.. నేడు ఆపన్నుల సేవలో...

- నిరుపేదల కోసం దుస్తులు, వస్తువుల సేకరణ
- ఇదీ జ్యోతయ్య త్యాగనిరతి

రోజూ ఉదయాన్నే శ్మశానాలకు వెళ్లి శుభ్రం చేయటం, మొక్కలకు నీరు పెట్టడంతో అతడు దినచర్య ప్రారంభిస్తాడు. తర్వాత బ్యాంకు వద్ద నిరక్షరాస్యులకు ఫారాలు పూర్తి చేయటంలో సహకరిస్తాడు. ఈలోపు ఎవరైనా ఫోన్ చేసి.. అన్నం మిగిలిపోయిందని కానీ, దుస్తులు, స్టీలు సామానులు ఉన్నాయనిగానీ చెబితే క్షణంలో అక్కడికి ప్రత్యక్షమవుతాడు. వాటిని తీసుకెళ్లి ఆపన్నులకు పంపిణీ చేస్తాడు. రాత్రి 11 గంటల సమయంలో కూడా నెట్టుడు రిక్షా తీసుకెళ్లి మిగిలిపోయిన ఆహార పదార్థాలన్నీ సేకరించుకొని ఆర్టీసీ బస్టాండ్‌కు అర్ధరాత్రి సమయంలో తీసుకు వచ్చి పంపిణీ చేస్తుంటాడు. అతడే ప్రకాశం జిల్లా అద్దంకి పట్టణానికి చెందిన పతంగి జ్యోతయ్య. తిండికి, కట్టుకోవడానికి లేని నిరుపేదల కళ్లలో ఆశాదీపంలా మెరుస్తున్నారాయన. మిలటరీలో పనిచేసి పదవీ విరమణ చేసిన జ్యోతయ్య తొలుత ఒక బ్యాంకు వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేశారు. ఆ తర్వాత పూర్తిగా సమాజసేవలో నిమగ్నమయ్యారు. శుభకార్యాలు జరిగినప్పుడు మిగిలిపోయిన భోజనాన్ని తోపుడు రిక్షాపై భిక్షాటకులు, నిరుపేదలు ఉండే ఆర్టీసి బస్టాండ్, పలు కాలనీలకు తీసుకు వెళ్లి పంపిణీ చేస్తుంటారు. ఖాళీ సమయంలో ధనవంతుల ఇళ్లకు వెళ్లి పాత దుస్తులు, స్టీలు సామగ్రి వంటివి సేకరిస్తారు. వాటిని ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో తిరుగాడే నిరుపేదలకు పంపిణీ చేస్తుంటాడు. అద్దంకి పరిసరాల్లో ఇటుక బట్టీల్లో గోదావరి జిల్లాల నుంచి వచ్చిన పెద్ద సంఖ్యలో నిరుపేద కార్మికులు ఉంటున్నారు. తాను సేకరించిన దుస్తులు, స్టీలు సామగ్రిని ఇటీవలే ఆయన పలు బట్టీల్లో పనిచేస్తున్న 200 మంది కార్మికులకు పంపిణీ చేశారు. ఇప్పటికీ కల్యాణ మండపాల నిర్వాహకులకు, శుభకార్యాలు నిర్వహించే కుటుంబాలవారికి.. అన్నం మిగిలిందంటే వెంటనే జ్యోతయ్య గుర్తుకు వస్తాడు. సామాన్యులు సైతం 9441229743 నంబర్‌కు ఫోన్ చేసి పాత చీరలు, దుస్తులు, స్టీలు సామానులు ఇస్తున్నారు. ఇలా జ్యోతయ్య నిస్వార్థ సేవకుడిగా నిలుస్తున్నాడు.

– అద్దంకి


ఇటుక బట్టీలలో పనిచేసే మహిళలకు చీరలు, డ్రస్సులు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సేవకుడు పంతంగి జ్యోతయ్య



దేవతామూర్తులకు వేడినీటి అభిషేకాలు

- గర్భగుడిలో రూం హీటర్లు

ఎముకలు కొరికే చలిలో చన్నీటి స్నానాలు సాధ్యమా? వామ్మో అనుకుంటాం. హీటర్లు, గీజర్లకు పనిచెబుతాం. ఈ సమస్య సాధారణ మానవులకే కాదు.. దేవుళ్లకు కూడా ఉంటుందని, అందుకే శీతాకాలం వెళ్లే దాకా దేవతా విగ్రహాలకు వేడినీళ్లతో అభిషేకాలు చేస్తున్నామని అయోధ్యలోని జానకీ ఘాట్ బడాస్థాన్ ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. అంతే కాదు.. దేవతా విగ్రహాలకు వెచ్చటి వాతావరణాన్ని కల్పించేందుకు గర్భగుడిలో హీటర్లను కూడా ఏర్పాటు చేశారు. ఉత్తరాదిలో చలితీవ్రత రోజురోజుకీ పెరగుతోందని, అయోధ్యలో పరిస్థితి మరీ దారుణంగా మారుతోందని, ఈ నేపథ్యంలో దేవతా విగ్రహాలకు జలాభిషేకాన్ని వేడినీటితో చేయాలని నిర్ణయించామని, అనుకున్నదే తడవుగా గీజర్లు, రూం హీటర్లు తెప్పించామని ఆలయ ప్రధానార్చకుడు జన్మేశరణ్ మీడియాకు తెలిపారు.





'ఒట్టు..! సిగరెట్ కాల్చను.. మందు కొట్టను'

స్కూలు అసెంబ్లీలో ఉపాధ్యాయుల ప్రమాణం

'భారత దేశం నా మాతృభూమి..భారతీయులందరూ నా సహోదరులు' అని స్కూల్లో పిల్లలు ప్రతిజ్ఞ సమయంలో చెబుతూ ఉంటారు. కర్ణాటకలో ఇప్పుడు టీచర్ల వంతు కూడా వచ్చింది. 'నేను ఉపాధ్యాయుడిని.. నేను సిగరెట్ కాల్చను..మద్యం సేవించను..చెడు అలవాట్లకు దూరంగా ఉంటాను' అని స్కూలు ఆవరణలో పిల్లలందరి ముందూ ప్రమాణం చేస్తున్నారు. పిల్లలకు నీతులు చెప్పే ఉపాధ్యాయులు సత్ప్రవర్తన కల్గి ఉండాలని కర్ణాటక విద్యాశాఖ భావించింది. అందుకే వారు చెడు అలవాట్లు మానుకోవాలంటూ సర్క్యులర్ జారీచేసింది. స్కూలు వేళల్లోనేకాదు.. ఆ తర్వాత కూడా ఉపాధ్యాయుల అలవాట్లపై కన్నేసి ఉంచుతామని స్పష్టంచేసింది. సిగరెట్, మద్యం అలవాట్లు ఉన్నాయని తేలితే.. వెంటనే వారిని డి-ఎడిక్షన్ కోర్సులకు పంపుతోంది. అటువంటి టీచర్లకు కౌన్సెలింగ్ ఇవ్వడంతోబాటు.. ధ్యానం, యోగా తరగతులు కూడా నిర్వహిస్తోంది. అయినా మాట వినకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించింది. మద్యం, సిగరెట్ అలవాటు ఉన్న ఉపాధ్యాయులు మూడు నెలలకోసారి స్కూలు అసెంబ్లీలో ప్రతిజ్ఞ చేయాలి. చెడు అలవాట్లు మానేశానని ఒట్టు వేయాలి. సిగరెట్, మద్యంతో అనర్థాలపై 30 నిమిషాలపాటు క్లాసు వినాలి. అంతేకాదు ఇంటికి వెళ్లిన తర్వాత సైలెంట్‌గా గుప్పుగుప్పుమని పొగ తాగడానికి వీల్లేదు. స్కూలు ప్యానల్స్ ఎప్పటికప్పుడు ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులతో టచ్‌లో ఉంటాయని కర్ణాటక విద్యాశాఖ ప్రకటించింది.

–సెంట్రల్ డెస్క్

S & D

కెరీర్ గైడ్



సంప్రదాయ కెరీర్‌లలో నేటికీ ఆకర్షణీయంగా ఉంది... న్యాయవాద వృత్తి. వాక్చాతుర్యం, సవాళ్లను స్వీకరించే గుణం ఉన్న వారికి సరిపడే వృత్తి ఇది. ప్రపంచీకరణ నేపథ్యంలో కెరీర్ పరంగా 'లా' సంప్రదాయ స్థాయి నుంచి కార్పొరేట్ స్థాయికి చేరింది. పేటెంట్ హక్కుల పర్యవేక్షణ, కాపీరైట్, పబ్లిషింగ్ సంస్థలు, ఎన్జీఓలు, కార్పొరేట్ కంపెనీల్లో మంచి వేతనాలతో అవకాశాలు లభిస్తున్నాయి. న్యాయ విద్యను అభ్యసించడానికి అత్యున్నతమైనవి జాతీయ స్థాయి న్యాయ విశ్వవిద్యాలయాలు. వీటిల్లో ప్రవేశానికి వీలు కల్పించే క్లాట్ (కామన్ లా అడ్మిషన్ టెస్ట్) - 2018కి నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో క్లాట్ పరీక్ష విధానం, అర్హత, తదితర వివరాలను తెలుసుకుందాం..

లా కెరీర్‌కు.. క్లాట్

జాతీయ స్థాయి న్యాయ విశ్వవిద్యాలయాల్లో అండర్ గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి క్లాట్‌ను నిర్వహిస్తారు. ఏటా ఒక్కో యూనివర్సిటీ ఈ బాధ్యతలను పర్యవేక్షిస్తుంది. ఈ ఏడాది క్లాట్‌ను కోచిలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ నిర్వహిస్తోంది. క్లాట్ పరీక్ష ద్వారా 19 జాతీయ స్థాయి యూనివర్సిటీల్లో పీజీ, అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. తెలంగాణలో నల్సార్ (హైదరాబాద్), ఆంధ్రప్రదేశ్‌లో (విశాఖపట్నం) దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం కూడా వీటిలో ఉన్నాయి.

అర్హత

- **అండర్‌గ్రాడ్యుయేషన్:** ఐదేళ్ల లా కోర్సులో చేరే విద్యార్థులు 45 శాతం మార్కులతో 10+2/తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.
- **పోస్ట్‌గ్రాడ్యుయేషన్:** ఎల్ఎల్ఎం కోర్సులో చేరేవారు 55 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ/ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు కూడా అర్హులే.

పరీక్ష విధానం - ప్రిపరేషన్

- **అండర్‌గ్రాడ్యుయేషన్:** ఈ విభాగం కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించే పరీక్ష 200 మార్కులకు ఉంటుంది. నెగెటివ్ మార్కింగ్ ఉంది. ప్రతి తప్పునకు 0.25 మార్కు కోత విధిస్తారు. మల్టిపుల్ చాయిస్ విధానంలో ప్రశ్నలు ఇస్తారు. వీటికి రెండు గంటల్లో సమాధానాలను గుర్తించాలి. ఇంగ్లీష్ - కాంప్రెహెన్షన్, జీకే అండ్ కరెంట్ అఫైర్స్, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్, లీగల్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. 150 మార్కులు సాధిస్తే ఏదో ఒక యూనివర్సిటీలో అడ్మిషన్ తప్పకుండా లభిస్తుంది. మార్కులు, ప్రశ్నల విభజన ఇలా ఉంటుంది.

విభాగం	ప్రశ్నలు	మార్కులు
ఇంగ్లీష్ - కాంప్రెహెన్షన్	40	40
జీకే అండ్ కరెంట్ అఫైర్స్	50	50
మ్యాథమెటిక్స్	20	20
లీగల్ ఆప్టిట్యూడ్	50	50
లాజికల్ రీజనింగ్	40	40
మొత్తం	**200**	**200**

- **ఇంగ్లీష్:** గ్రామర్, ఇంగ్లీష్ భాషపై ప్రాథమిక అవగాహన ఉంటే ఈ విభాగంలో చక్కని స్కోర్ చేయవచ్చు. కాంప్రెహెన్షన్‌లో మంచి మార్కులకు వొకాబులరీపై పట్టు సాధించాలి. జనరల్ ఇంగ్లీష్‌లో కేవలం వ్యాకరణమే కాకుండా పదాల వాడుక, సాధన మీద పట్టు ఉండాలి. టెన్సెస్, సెంటెన్స్ ఫార్మేషన్, సెంటెన్స్ కరెక్షన్, యాక్టివ్ అండ్ ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్ వంటి అంశాలపై ప్రధానంగా దృష్టిసారించాలి. ముఖ్యంగా నిత్య జీవితంలో ఇంగ్లీష్ భాష వినియోగం, సంబంధిత అంశాలాధారంగా ప్రశ్నలు ఇస్తారు. ఈ క్రమంలో గ్రామర్, వొకాబులరీ, కాంప్రెహెన్షన్, యూజ్ ఆఫ్ వర్డ్స్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఈ విభాగం కోసం వర్డ్ పవర్ మేడ్ ఈజీ - నార్మన్ లూయిస్; ఆబ్జెక్టివ్ జనరల్ ఇంగ్లీష్ - ఆర్.ఎస్.అగర్వాల్; రెన్ అండ్ మార్టిన్ పుస్తకాలను చదవడం ప్రయోజనకరం.
- **జీకే అండ్ కరెంట్ అఫైర్స్:** కరెంట్ ఈవెంట్స్‌పై అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. ముఖ్యంగా న్యాయ వ్యవస్థలో చోటు చేసుకుంటున్న పరిణామాలు, మార్పులు, కొత్త చట్టాలు, కేసులు తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. భారతదేశ చరిత్ర, రాజ్యాంగానికి సంబంధించిన ప్రశ్నలూ రావచ్చు. అందువల్ల జాతీయోద్యమంలో కీలక ఘట్టాలపై దృష్టిపెట్టాలి. రాజ్యాంగ రూపకల్పన నుంచి తాజా సవరణల వరకు అవగాహన పెంచుకోవాలి. కరెంట్ అఫైర్స్ కోసం మనోరమ ఇయర్ బుక్, ఇండియా ఇయర్ బుక్, సీఎస్ఆర్ ఇయర్ బుక్, ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాలతో పాటు దిన పత్రికలు రోజూ చదవడం అలవాటు చేసుకోవాలి.

క్లాట్-2018 ద్వారా ప్రవేశం కల్పించే సంస్థలు

- నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ - బెంగళూరు
- నల్సార్ - హైదరాబాద్
- నేషనల్ లా యూనివర్సిటీ - భోపాల్
- వెస్ట్ బెంగాల్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జ్యూరిడికల్ సైన్సెస్ - కోల్‌కతా
- నేషనల్ లా యూనివర్సిటీ - జోధ్‌పూర్
- హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ - రాయ్‌పూర్
- గుజరాత్ నేషనల్ లా యూనివర్సిటీ - గాంధీనగర్
- డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా నేషనల్ లా యూనివర్సిటీ - లక్నో
- రాజీవ్‌గాంధీ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లా - పాటియాలా
- చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ - పాట్నా
- నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్‌డ్ లీగల్ స్టడీస్ - కొచ్చి
- నేషనల్ లా యూనివర్సిటీ - ఒడిశా
- నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ స్టడీ అండ్ రీసెర్చ్ ఇన్ లా - రాంచీ
- నేషనల్ లా యూనివర్సిటీ అండ్ జ్యుడిషియల్ అకాడమీ - గువహతి
- దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ - విశాఖపట్నం
- తమిళనాడు నేషనల్ లా స్కూల్ - త్రిచీ
- మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ - ముంబై
- మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ - నాగ్‌పూర్
- మహారాష్ట్ర నేషనల్ లా యూనివర్సిటీ - ఔరంగాబాద్

- **ఎలిమెంటరీ మ్యాథ్స్:** ఈ విభాగంలో అడిగే ప్రశ్నలు మ్యాథమెటిక్స్‌లో ప్రాథమిక సామర్థ్యాలను పరీక్షించే విధంగా ఉంటాయి. కాబట్టి 6 - 10వ తరగతి వరకు మ్యాథమెటిక్స్ పుస్తకాల్లోని అన్ని అంశాలపై సమగ్ర అవగాహన ఏర్పర్చుకోవాలి. అందులోని సూత్రాలను, ప్రాథమిక భావనలను అర్థం చేసుకోవడానికి ప్రాధాన్యమివ్వాలి. వీలైనంత ఎక్కువగా మోడల్ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. ఇదే క్రమంలో షార్ట్‌కట్ మెథడ్స్ నేర్చుకోవాలి. తద్వారా సమాధానాన్ని వేగంగా, కచ్చితత్వంతో గుర్తించవచ్చు.
- గత పరీక్షల్లో అర్థమెటిక్ ఆధారిత విభాగాల నుంచి ఎక్కువగా ప్రశ్నలు అడిగారు. అందువల్ల శాతాలు, నిష్పత్తులు, టైం అండ్ వర్క్, టైం అండ్ డిస్టెన్స్, లాభనష్టాలు, వర్గ మూలాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి. దీని కోసం క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ - ఆర్.ఎస్.అగర్వాల్; ఫాస్ట్ ట్రాక్ ఆబ్జెక్టివ్ అర్థమెటిక్ - అర్హింత్ పుస్తకాలను చదవాలి.

లీగల్ ఆప్టిట్యూడ్

- ఇందులో న్యాయశాస్త్ర సంబంధ ప్రశ్నలు ఇస్తారనుకుంటే పొరపాటు. అభ్యర్థుల్లో న్యాయపరమైన దృక్పథాన్ని; ఒక అంశం, వివాదం పట్ల సహేతుక ఆలోచన, నిర్ణయం వెలిబుచ్చే నైపుణ్యాలను పరీక్షించేలా ప్రశ్నలు ఉంటాయి. ఒక వివాదాన్ని పరిష్కరించే క్రమంలో అందరికీ ఆమోదయోగ్య పరిష్కారం కనుగొనే నైపుణ్యం పొందాలి.
- చట్టాలు, న్యాయ వ్యవస్థకు సంబంధించి ఇటీవలి పరిణామాలు, లీగల్ టెర్మినాలజీపై అవగాహన ఏర్పరచుకోవడం ద్వారా మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు. ఈ విభాగం కోసం యూనివర్సల్ ఎల్ఎల్‌బీ ఎంట్రెన్స్ గైడ్, లీగల్ ఆప్టిట్యూడ్ - ఎ.పి.భరద్వాజ్. లీగల్ ఆప్టిట్యూడ్ - ఆర్‌కే గుప్తా పుస్తకాలను చదవాలి.
- **లాజికల్ రీజనింగ్:** అభ్యర్థుల తార్కిక శక్తిని పరీక్షించే విభాగం. ముఖ్యంగా సందర్భానుసారం సమయస్ఫూర్తిగా ఎలా వ్యవహరిస్తారో తెలుసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తారు. ఇందులో ప్యాసేజ్ ఆధారితంగా, అసెర్షన్ అండ్ రీజనింగ్ విధానంలో ప్రశ్నలు అడుగుతారు. సిలాజిజమ్, కోడింగ్, డీ కోడింగ్, డైరెక్షన్, అనాలజీ, సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలపై అవగాహన పొందాలి. ఈ విభాగం కోసం వెర్బల్ అండ్ నాన్ వెర్బల్ రీజనింగ్ - ఆర్ఎస్ అగర్వాల్, అనలిటికల్ రీజనింగ్ - ఎం.కె. పాండే పుస్తకాలను చదవడం ఉపయోగకరం.

క్యాంపస్ ప్లేస్‌మెంట్లు

జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో అత్యాధునిక కరిక్యులమ్, మౌలిక వసతులూ, అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది ఉంటారు. తద్వారా నాణ్యమైన బోధన లభిస్తుంది. ప్రాంగణ నియామకాలు (క్యాంపస్ ప్లేస్‌మెంట్స్) తప్పనిసరిగా ఉంటాయి. దాంతో కోర్సు పూర్తిచేసిన వెంటనే ఉద్యోగం గ్యారెంటీ అని చెప్పొచ్చు.

- హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ - రాయ్‌పూర్‌లో 2016 - 17లో 57 మందికి, వెస్ట్ బెంగాల్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జ్యూరిడికల్ సైన్సెస్ - కోల్‌కతా 2017లో 73 మందికి జాబ్ ఆఫర్స్ వచ్చాయి. బహుళజాతి సంస్థలూ, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులూ, ప్రైవేటు ఈక్విటీ కంపెనీలూ, కన్సల్టింగ్ సంస్థలూ, అకౌంటింగ్ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.

పోస్ట్‌గ్రాడ్యుయేషన్

ఈ విభాగం కోసం నిర్వహించే పరీక్ష 150 మార్కులకు ఉంటుంది. నెగెటివ్ మార్కింగ్ ఉంది. ప్రతి తప్పునకు 0.25 మార్కు కోత విధిస్తారు. మల్టిపుల్ చాయిస్ విధానంలో ప్రశ్నలు ఇస్తారు. వీటికి రెండు గంటల్లో సమాధానాలను గుర్తించాలి. కాన్‌స్టిట్యూషన్ లా, జ్యూరిస్‌ప్రుడెన్స్, లా సబ్జెక్టులు (క్రిమినల్ లా, ఇంటర్నేషనల్ లా, ఐపీఆర్ తదితరాలు) విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. మార్కులు, ప్రశ్నల విభజన ఇలా ఉంటుంది.

విభాగం	ప్రశ్నలు	మార్కులు
కాన్‌స్టిట్యూషన్ లా	50	50
జ్యూరిస్‌ప్రుడెన్స్	50	50
లా సబ్జెక్టులు	50	50
మొత్తం	**150**	**150**

ముఖ్య సమాచారం

- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31, 2018.
- అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్: ఏప్రిల్ 20 నుంచి మే 13 వరకు.
- ఆన్‌లైన్ పరీక్ష తేదీ: మే 13, 2018
- ఫలితాల వెల్లడి: మే 31, 2018
- వెబ్‌సైట్: www.clat.ac.in

జాబ్ కార్నర్ ట్రాన్స్‌కోలో ఇంజనీర్లు

హైదరాబాద్‌లోని ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీఎస్ ట్రాన్స్‌కో) అసిస్టెంట్ ఇంజనీర్, లైన్‌మెన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 1,604 ఖాళీలు ఉన్నాయి. దీనికి సంబంధించిన వివరాలను చూద్దాం....

సబ్ ఇంజనీర్

ఎలక్ట్రికల్ విభాగంలో మొత్తం 174 పోస్టులు ఉన్నాయి. సదరన్ జోన్‌లో 94, నార్తరన్ జోన్‌లో 80 ఖాళీలు ఉన్నాయి. 2017 జూలై 1 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఈ పోస్టులను రాత పరీక్ష ఆధారంగా భర్తీ చేస్తారు.

- **అర్హత:** ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా / డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **రాత పరీక్ష వివరాలు:** పరీక్ష సమయం 2 గంటలు. పరీక్షలో 80 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు (80 మార్కులు) ఇస్తారు. సెక్షన్ ఎ కింద డిప్లొమా స్థాయిలో ఎలక్ట్రికల్ విభాగానికి సంబంధించి 65 ప్రశ్నలు ఇస్తారు. సెక్షన్ బి కింద జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 15 ప్రశ్నలు ఇస్తారు.
- **దరఖాస్తు సమాచారం**
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: జనవరి 20 నుంచి
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 5
- రాత పరీక్ష: ఫిబ్రవరి 25

జూనియర్ లైన్‌మెన్

- **ఖాళీల వివరాలు:** ఈ కేటగిరీలో మొత్తం 1100 పోస్టులు ఉన్నాయి. సదరన్ జోన్‌కు 657, నార్తరన్ జోన్‌కు 443 ఖాళీలను కేటాయించారు. హైదరాబాద్‌లో 105, రంగారెడ్డిలో 163, సంగారెడ్డిలో 141, మహబూబ్‌నగర్‌లో 121, నల్గొండలో 127, వరంగల్‌లో 110, ఖమ్మంలో 63, నిజామాబాద్‌లో 92, ఆదిలాబాద్‌లో 56 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హత:** 2017 జూలై 1 నాటికి 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.
- టెన్త్‌తోపాటు ఎలక్ట్రికల్/ వైర్‌మన్ ట్రేడ్‌లో ఐటిఐ / రెండేళ్ల ఇంటర్ ఒకేషనల్ కోర్సు చేసి ఉండాలి.
- **రాత పరీక్ష వివరాలు:** పరీక్ష సమయం 2 గంటలు. ఇందులో కూడా 80 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు (80 మార్కులు) ఇస్తారు. సెక్షన్-ఎ కింద ఐటిఐ స్థాయిలో 65 ప్రశ్నలు, సెక్షన్-బి కింద జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 15 ప్రశ్నలు ఇస్తారు. రాత పరీక్షలో అర్హత పొందినవారికి పోల్/ టవర్ క్లైంబింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. క్లైంబింగ్ టెస్ట్ క్వాలిఫై అయితేనే పోస్టింగ్ ఇస్తారు.
- **దరఖాస్తు సమాచారం**
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: జనవరి 5 నుంచి
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: జనవరి 20
- రాత పరీక్ష: ఫిబ్రవరి 11న
- వెబ్‌సైట్: http://tstransco.cgg.gov.in

అసిస్టెంట్ ఇంజనీర్

- **ఖాళీల వివరాలు:** ఎలక్ట్రికల్, సివిల్, టెలికాం విభాగాలకు మొత్తం 330 పోస్టులు ఉన్నాయి. జనరల్ రిక్రూట్‌మెంట్ కింద 300, లిమిటెడ్ రిక్రూట్‌మెంట్ కింద 30 పోస్టులను భర్తీచేస్తారు.
- **జోన్‌లవారీ ఖాళీలు:** ఎలక్ట్రికల్ విభాగంలో సదరన్ జోన్‌కు 130, నార్తరన్ జోన్‌కు 120; సివిల్ విభాగంలో సదరన్ జోన్‌కు 26, నార్తరన్ జోన్‌కు 23; టెలికాం విభాగంలో సదరన్ జోన్‌కు 16, నార్తరన్ జోన్‌కు 15 పోస్టులను కేటాయించారు.
- **వయసు:** 2017 జూలై 1 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఎస్సీ/ ఎస్టీ/ బిసి అభ్యర్థులకు అయిదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.
- **అర్హత:** ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ సివిల్/ టెలికమ్యూనికేషన్స్ / ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ విభాగాల్లో బిఇ / బిటెక్/ ఎఎంఐఇ (సెక్షన్ఎ & బి) ఉండాలి.
- **ఎంపిక:** అభ్యర్థులను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు. ఇందులో అర్హులైనవారితో మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. రాత పరీక్షలో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులు 40 శాతం, బిసిలు 35 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు 30 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. రాత పరీక్షలో అత్యధిక మార్కులు సాధించి మెరిట్‌లిస్ట్ ప్రకారం మంచి ర్యాంక్ పొందినవారిని మాత్రమే ఎంపికచేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు.
- **రాత పరీక్ష వివరాలు:** పరీక్ష సమయం 2 గంటలు. రాత పరీక్షలో 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు (100 మార్కులకు) ఇస్తారు. ఇందులో రెండు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్-ఎ కింద సంబంధిత టెక్నికల్ సబ్జెక్ట్ నుంచి 80 ప్రశ్నలు, సెక్షన్ బి కింద జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఎబిలిటీ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సిలబస్ గేట్ సిలబస్ మాదిరిగానే ఉంటుంది.
- **దరఖాస్తు సమాచారం:**
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఫిబ్రవరి 1
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 16
- రాత పరీక్ష: మార్చి 11న



అత్యంత పురాతన ఆరావళి

పోటీ పరీక్షల ప్రత్యేకం జాగ్రఫీ

భారతదేశంలో అత్యంత పురాతనమైనవి ఆరావళి పర్వతాలు. ఇవి దేశానికి వాయవ్య భాగంలో సుమారు 800 కి.మీ పొడవున ఉన్నాయి. నైరుతి నుంచి ఈశాన్య దిశ వైపున గుజరాత్‌లోని పలన్‌పూర్ నుంచి ఢిల్లీ వరకు విస్తరించి ఉన్నాయి. వీటిలో అత్యంత ఎత్తైన పర్వత శిఖరం 'గురుశిఖర'. దీని ఎత్తు 1722 మీ. ఈ పర్వతాలు ప్రధానంగా గ్రానైట్, నీస్, ఛిస్ట్ శిలలతో ఏర్పడ్డాయి. ఉదయపూర్ వాయవ్య ప్రాంతంలో విస్తరించిన ఈ పర్వతాలను స్థానికంగా 'జర్గాకొండలు' అని పిలుస్తారు. ఇక్కడి 'గోరాన్‌ఘాట్' కనుమ, 'గురు శిఖర్'లను 'మౌంట్ అబూ' వేరు చేస్తోంది. 'గ్రేట్ బౌండరీ ఫాల్ట్', ఆరావళి పర్వతాలను వింధ్య పర్వతాలనుంచి వేరు చేస్తుంది. హిమాలయ పర్వత నదులు తీసుకువచ్చిన ఒండ్రు మట్టితో హిమాలయ పర్వతాలు రూపొందగా టెథిస్ సముద్ర భాగం విడిపోయి క్రమంగా 'ఉత్తర మైదానాలు' ఏర్పడ్డాయి.

ఉత్తర మైదానాలు

- ఇవి ప్రధానంగా సింధు, బ్రహ్మపుత్ర నదుల మధ్య సుమారు 3200 కిమీ పొడవున విస్తరించి ఉన్నాయి. సట్లెజ్, రావి నదుల నుంచి గంగానది మధ్యభాగంలోకి సుమారు 2400 కి.మీ. వరకు విస్తరించాయి. దీని వెడల్పు సుమారు 100 కి.మీ. నుంచి 300 కి.మీ. మధ్యలో ఉంటుంది. తూర్పు నుంచి పశ్చిమానికి వెళ్లే కొద్దీ వెడల్పు పెరుగుతుంది. దీని విస్తీర్ణం సుమారు 7.7 లక్షల చదరపు కిలోమీటర్లు.
- ఉత్తర మైదానాలను అవి ఏర్పడిన విధానం, వాటి లక్షణాలను బట్టి మూడు రకాలుగా వర్గీకరించారు. అవి... ఖాదర్ / కొత్త ఒండ్రు నేలలు, భంగర్ నేలలు/ పాత ఒండ్రు నేలలు, బాబర్ నేలలు.
- **ఖాదర్ నేలలు:** ఇవి సారవంతమైనవి. నదులకు ఇరువైపులా ఈ నేలలు ఏర్పడతాయి. తరచుగా వరదలకు గురవుతుంటాయి. పంజాబ్‌లో వీటిని బెట్స్‌గా పిలుస్తారు.
- **భంగర్ నేలలు:** ఇవి అంతసారవంతమైన నేలలు కావు. రసాయనిక ఎరువులు వాడడం వలన వ్యవసాయానికి అనుకూలంగా మారతాయి. ఇవి నదులకు దూరంగా ఎత్తైన ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి.
- **బాబర్ నేలలు:** శివాలిక్ పాదాల వద్ద విసనకర్ర ఆకారంలో ఉండే గులకరాళ్ల ప్రాంతాన్ని 'బాబర్' నేలలు అంటారు. ఈ నేలలు వ్యవసాయానికి పనికి రావు. ఇక్కడ పొడవైన వేర్లు ఉండే పెద్ద చెట్లు పెరుగుతాయి. శివాలిక్ ప్రాంతంలోని ఛోస్, రోస్ అనే తాత్కాలిక ప్రవాహాలు బాబర్ నేలల్లోకి విస్తరించి ఉన్నాయి.
- **తెరాయ్ నేలలు:** శివాలిక్ ప్రాంతంలో ఎక్కువ తేమతో ఉండే నేలలను 'తెరాయ్' నేలలు అంటారు. బాబర్ నేలల్లో అదృశ్యమైన చిన్నచిన్న నదులు తెరాయ్ నేలల వద్ద ఉద్భృతి చెందుతాయి. తెరాయ్ నేలలు ఎక్కువగా బాబర్ ప్రాంతానికి దక్షిణంగా విస్తరించాయి. వీటి వెడల్పు సుమారు 15 నుంచి 820 కిమీ వరకు ఉంటుంది. ఈ నేలల్లో దట్టమైన అడవులు ఉంటాయి. ఇక్కడ మలేరియా కారక శీతోష్ణ పరిస్థితులు ఉంటాయి. తెరాయి ప్రాంతంలో స్థానికంగా లవణీయత ఉన్న నేలలను రే, కల్లార్, ఊసర, తుర్ అని పిలుస్తారు.
- ఉత్తర మైదానాల్లో ఎండిపోయిన నదీ ప్రవాహ గుర్తులను 'దోరోస్'లని, ఆ ప్రాంతంలో ఏర్పడిన తాత్కాలిక సరస్సులను 'ధాండ్స్' లని అంటారు. జమ్ము కశ్మీర్ రాష్ట్రంలోని సరస్సులను 'టోరాన్స్' అని కూడా పిలుస్తారు

థార్ ఎడారి

- ఇది భారతదేశానికి వాయవ్య భాగంలో సుమారు 2 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. భారతదేశంలో సుమారు 1.75 లక్షల చదరపు కిలోమీటర్లు, పాకిస్థాన్‌లో దాదాపు 25 వేల చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉంది. థార్ ఎడారి దేశంలోనే అత్యంత దుర్భిక్ష ప్రాంతం. ఇక్కడ సరాసరి వర్షపాతం 20 సెం.మీ కంటే తక్కువ.
- రాజస్థాన్ రాష్ట్రంలో థార్ ఎడారి అధిక ప్రాంతంలో విస్తరించి ఉంది. పంజాబ్, హర్యాణా, ఉత్తర గుజరాత్‌ల్లో కూడా కొంత ప్రాంతంలో ఎడారి శీతోష్ణస్థితి విస్తరించి ఉంది. థార్ ఎడారి ప్రాంతంలో ఆరావళి పర్వతాలు నైరుతి నుంచి ఈశాన్యం వైపు విస్తరించాయి.
- ఆరావళి పర్వతాలకు తూర్పున గల అర్ధ శుష్క శీతోష్ణస్థితి గల సారవంతమైన ప్రాంతాలను 'రాజస్థాన్ బగర్'గా పేర్కొంటారు. ఈ మైదాన ప్రాంతానికి పశ్చిమ భాగంలో ఉన్న శుష్క శీతోష్ణస్థితి ప్రాంతాన్ని 'మరుస్థలి' అంటారు.
- రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంతంలో ఉన్న ఉప్పునీటి సరస్సులను ప్లమాలు లేదా దాండియాలు అంటారు. ఇక్కడ సాంబరు, దిద్వానా, దేబార్ అనే ప్రధాన ఉప్పునీటి సరస్సులు ఉన్నాయి.
- ఇక్కడ లూని నది పరివాహక ప్రాంతంలో కనిపించే సారవంతమైన మైదానాలను 'తాళీలు' అంటారు. సారవంతమైన ప్రాంతాలను స్థానికంగా 'రోహి'లని, కదిలే ఇసుక దిబ్బలను 'ద్రిమాన్'లు అంటారు.

ఎస్.వి. నారాయణ
సీనియర్ ఫ్యాకల్టీ





కొత్తజంట శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: కొత్త జంట విరాట్ కోహ్లీ, అనుష్క తమ అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దక్షిణాఫ్రికాతో శుక్రవారం మొదలయ్యే తొలి టెస్టు కోసం టీమిండియా కేప్‌టౌన్‌కు వెళ్లింది. 'అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. అందరి జీవితాల్లో ఆనందం, వెలుగులు నింపాల'ని కాంక్షిస్తూ విరాట్ ట్వీట్ చేశాడు. భార్య అనుష్కతో కలసి దిగిన ఫొటోను కోహ్లీ పోస్ట్ చేశాడు. అదే ఫొటోను అనుష్క కూడా ట్వీట్ చేసింది. అంతకు ముందు విరుష్క జంట కేప్‌టౌన్ వీధుల్లో షాపింగ్ చేస్తూ కనిపించారు. మరో వీడియోలో విరాట్, ధవన్ డ్యాన్స్ చేసి హల్‌చల్ చేశారు.



విదర్భ కొత్త చరిత్ర

ఫైనల్‌కు చేరిన తొలిసారే రంజీ టైటిల్ • ఢిల్లీపై ఘన విజయం

ఇండోర్: తొలిసారి ఫైనల్లో ప్రవేశించింది. అద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకుంది. టైటిల్ ఎగరేసుకుపోయింది. దేశవాళీ మెగా టోర్నీ రంజీట్రోఫీని విదర్భ కైవసం చేసుకుంది. సోమవారం ఇక్కడ ముగిసిన తుది పోరులో విదర్భ 9వికెట్ల తేడాతో ఏడుసార్లు చాంపియన్ ఢిల్లీపై ఘన విజయం సాధించి చరిత్ర సృష్టించింది. 29 పరుగుల సునాయాస లక్ష్యాన్ని ఆ జట్టు.. కెప్టెన్ ఫజల్ వికెట్ కోల్పోయి ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో హ్యాట్రిక్‌తో 6 వికెట్లు... మ్యాచ్ మొత్తంమీద 8వికెట్లు చేజిక్కించుకున్న విదర్భ పేసర్ రజనీష్ గుర్బానీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఓవర్‌నైట్ స్కోరు 528/7తో నాలుగోరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ మరో 19 పరుగులు జోడించి మిగిలిన 3వికెట్లు కోల్పోయింది. ఫలితంగా ప్రత్యర్థి 252 పరుగుల భారీ మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం కూడగట్టుకుంది. ముందురోజు 133 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్న వికెట్ కీపర్ అక్షయ్ వాడ్కర్ అదే స్కోరువద్ద అవుటయ్యాడు. ఢిల్లీ పేసర్ నవదీప్ సైనీ 135 పరుగులిచ్చి 5వికెట్లు పడగొట్టాడు. అయితే, ఇతను ఢిల్లీ రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడం గమనార్హం. ఇక రెండో ఇన్నింగ్స్‌లో ఢిల్లీ 280 పరుగులకు ఆలౌటైంది. షోరె (62), నితీష్ రాణా (64) అర్ధ సెంచరీలు చేశారు. ఆపై 29 పరుగుల స్వల్పలక్ష్యాన్ని విదర్భ అలవోకగా ఛేదించింది. అంతకుముందు 252 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఢిల్లీ 32 పరుగుల వద్ద ఓపెనర్ కునాల్ చందేలా వికెట్ చేజార్చుకుంది. అయితే టీమిండియా మాజీ ఓపెనర్ గంభీర్ ధాటిగా ఆడి (37 బంతుల్లో ఏడు ఫోర్లతో 36) చివరికి గుర్బానీ బౌలింగ్‌లో ఎల్బీగా అవుటయ్యాడు. షోరె, రాణా మూడో వికెట్‌కు 110 రన్స్ జోడించారు. వీరిద్దరు ఔటయ్యాక ఢిల్లీ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. రిషభ్ పంత్ (32), చివర్లో వికాస్ మిశ్రా (34) ఫర్వాలేదనిపించారు.

సంక్షిప్తస్కోర్లు

ఢిల్లీ తొలి ఇన్నింగ్స్: 295; రెండో ఇన్నింగ్స్ 280 (గంభీర్ 36, షోరె 62, రాణా 64, గుర్బానీ 2/92, వఖారె 4/94, సర్వాతే 3/30).

విదర్భ తొలి ఇన్నింగ్స్: 547 (ఫజల్ 67, జాఫర్ 78, వాడ్కర్ 133, సర్వాతే 79, నెరాల్ 74, సైనీ 5/135, సుడాన్ 2/102);

రెండో ఇన్నింగ్స్: 32/1 (సంజయ్ నాటౌట్ 9, జాఫర్ నాటౌట్ 17, కెజ్రోలియా 1/21)

టీమిండియాకి ఆడినట్లుంది: విదర్భ కెప్టెన్

రంజీట్రోఫీ గెలవడం టీమిండియాకు ప్రాతినిధ్యం వహించినంత గొప్పగా ఉందని విదర్భ కెప్టెన్ ఫయాజ్ ఫైజల్ అన్నాడు. 2016లో జింబాబ్వేలో పర్యటించిన భారత ద్వితీయశ్రేణి జట్టులో ఫజల్ సభ్యుడు. భారత్‌కు ఏకైకవన్డేలో ప్రాతినిధ్యం వహించాడు.

తొలిటెస్టుకు 'ఆ వికెట్' లేనట్లేనా?



కేప్‌టౌన్ స్టేడియం

ఓవైపు బౌన్సీ వికెట్ సవాల్‌ను ఎదుర్కొనేందుకు టీమిండియా వ్యూహరచనలో నిమగ్నమై ఉండగా.. ఈనెల ఐదున ప్రారంభమయ్యే తొలి టెస్టుకు వేదికైన కేప్‌టౌన్ పిచ్ మాత్రం బౌన్సీ కాదట. ఇక్కడి వికెట్ విరాట్‌సేనను అంతగా ఇబ్బంది పెట్టకపోవచ్చని సమాచారం. ఇక్కడ ఆతిథ్య జట్టుకు అనుకూలంగా పిచ్‌ను రూపొందించే పరిస్థితి లేదన్న వార్తలు వినిపిస్తున్నాయి. అందుకు కారణం.. చాన్నాళ్లుగా ఈ ప్రాంతంలో తీవ్ర కరువుండడమే. కరువు కారణంగా నీటి వినియోగం చాలా తక్కువగా ఉంది. దీంతో ఇక్కడ నీటి వినియోగంపై స్థానిక మున్సిపాలిటీ అధికారుల నుంచి ఆదేశాలున్నాయి. మైదానాన్ని తడిపేందుకు బోరు నీటినే వినియోగిస్తున్నా కూడా పరిస్థితి భిన్నంగానే ఉందని కేప్‌టౌన్ పిచ్ క్యూరేటర్ వాపోతున్నాడు. 'ప్రతిరోజు బోరు నీటితో పిచ్‌ను తడుపుతున్నాం. ఔట్‌ఫీల్డ్‌ను మాత్రం వారానికి రెండుసార్లే తడుపుతున్నాం. అందుకే మైదానంపై అంతగా పచ్చిక కనిపించకపోవచ్చు. పొడిగా ఉండే అవకాశముంది' అని పిచ్ క్యూరేటర్ ఇవాన్ ఫ్లింట్ చెప్పుకొచ్చాడు. వాండరర్స్, సెంచూ రియన్ తరహాలో కేప్‌టౌన్ పిచ్ తొలుత బౌలర్లకు అనుకూలించినా, తర్వాత వీళ్లకు అంతగా అవకాశం ఉండకపోవచ్చని ఇవాన్ అన్నాడు.

దక్షిణాఫ్రికాలో క్రికెట్ సిరీస్ అనగానే వెంటనే స్ఫురించేది అక్కడ ఎదురయ్యే పేస్, బౌన్సీ పిచ్‌లే. చండ ప్రచండమైన వేగంతో బ్యాట్స్‌మెన్ మీదికి దూసుకొచ్చే బంతులను ఎదుర్కోవడం నైపుణ్యం కలిగిన ఆటగాడికి కూడా అంత సులువు కాదు. ఇదే బలహీనతతో ఇప్పటిదాకా టీమిండియా అక్కడికి వెళ్లిన ప్రతిసారీ విఫలమవుతూ వచ్చింది. ఇప్పుడు నాలుగేళ్ల అనంతరం.. వరుస విజయాల జోష్‌తో పాటు నెంబర్‌వన్ హోదాలో విరాట్ సేన చరిత్ర సృష్టించేందుకు సఫారీ గడ్డపై అడుగుపెట్టింది. దీనికి తోడు ఎలాంటి పిచ్‌లపై ఆడాల్సి ఉంటుందో తమకు బాగానే తెలుసని భారత కెప్టెన్ ధీమా వ్యక్తం చేస్తున్నాడు.. మరి తమకు అంతగా అనుకూలించని ఈ తరహా పిచ్‌లపై ప్రత్యర్థిని ఎదుర్కొనేందుకు జట్టు ఎలాంటి ప్రణాళికలు రచిస్తోంది? పచ్చికతో కూడిన పిచ్‌లపై ఎలా చెలరేగబోతోంది?

బౌన్సీతో దోస్తీకి..

- టీమిండియా ముమ్మర సాధన
- 'బిగ్-5'పై ప్రధాన దృష్టి

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

90వ దశకానికి ముందు దక్షిణాఫ్రికా జట్టుపై అంతర్జాతీయ క్రికెట్ ఆడకుండా నిషేధం కొనసాగుతూ ఉండేది. అయితే ఐసీసీ 1991లో ఆ జట్టును టెస్టు ఫార్మాట్‌లోకి ఆహ్వానిస్తూ నిషేధం ఎత్తివేసింది. ఆ మరుసటి ఏడాదే భారత జట్టు నాలుగు టెస్టుల సిరీస్ కోసం సఫారీ పర్యటనకు వెళ్లింది. కానీ రెండు దశాబ్దాలపాటు వెలివేతలోనే ఉన్నప్పటికీ సూపర్ బౌలింగ్‌తో భారత్‌ను వణికించింది. అక్కడి బౌన్సీ ట్రాక్‌లపై పరుగులు సాధించేందుకు భారత బ్యాట్స్‌మెన్ ఆపసోపాలు పడ్డారు. చివరకు అలెన్ డొనాల్డ్, బ్రెట్ షుల్జ్ పేస్ ధాటికి 0-1తో సిరీస్ కోల్పోవాల్సి వచ్చింది. అదిగో.. అప్పటి నుంచి పాతికేళ్లుగా ఆరుసార్లు టీమిండియా సఫారీలపై దాడికి దిగినా రిక్తహస్తాలతోనే వెనక్కివచ్చింది. తీరని కోరికగా మిగిలిపోతున్న సిరీస్ విజయం కోసం తాజాగా భారత్ మరోమారు వెళ్లింది. ఇప్పటికే జట్టు తొమ్మిది వరుస సిరీస్ విజయాలతో ఊపు మీదుంది. నిజానికి శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో తొలి మ్యాచ్ కోసం బౌన్సీ పిచ్‌నే సిద్ధం చేశారు. కానీ లంక పేసర్ లక్మల్ ధాటికి దారుణంగా దెబ్బతినాల్సి వచ్చింది. అయితే ఆ మ్యాచ్‌లో ఆశించినట్టు రాణించకపోయినా తమకు అది ఓ అనుభవంలా ఉపయోగపడిందని టీమ్ మేనేజ్‌మెంట్ సమర్థించుకుంది.

పక్కా ఏర్పాట్లు

దక్షిణాఫ్రికా పరిస్థితులను ఆకళింపు చేసుకునేందుకు వామప్ మ్యాచ్‌లో ఆడడం కంటే నెట్స్‌లో శ్రమించడమే మేలనే అభిప్రాయంతో కోహ్లీ ఉన్నాడు. ఎందుకంటే వామప్ మ్యాచ్ కోసం ఎక్కడైనా బ్యాట్స్‌మెన్ పరుగులు చేసేలా రూపొందిస్తారు. కానీ సిరీస్ విజయం కోసం కసిగా ఉన్న టీమిండియా తమకు పచ్చికతో కూడిన పిచ్ కావాలని, దానిపైనే నెట్స్‌లో శ్రమిస్తామని ముందే దక్షిణాఫ్రికా క్రికెట్ (సీఎస్ఏ)కు తెలిపింది. దీంట్లో భాగంగా కేప్‌టౌన్‌లోని వెస్ట్రన్ ప్రావిన్స్ క్రికెట్ క్లబ్ (డబ్ల్యుపీసీసీ)ను తమ అడ్డాగా మార్చుకుంది. ఇక్కడ టర్ఫ్ వికెట్ నుంచి ఇండోర్ నెట్స్ వరకు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. భారత బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ మైదాన సిబ్బందితో నిరంతరం టచ్‌లో ఉంటున్నాడు. పిచ్‌ల పర్యవేక్షణతో పాటు, పచ్చిక ఉండేలా చూడడం, నీటి పిచికారీ, రోలింగ్ చేయించి వీలైనంత ఎక్కువగా బౌన్స్‌ను రాబట్టేలా చూస్తున్నాడు. ఒకవేళ భారత జట్టు సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన ఇవ్వలేకపోయినా కూడా బాగా సన్నద్ధమవలేదనే అపవాదురాకుండా ఉండేందుకు సంజయ్ జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. ఏదిఏమైనా ఈనెల 5న న్యూలాండ్స్‌లో జరిగే తొలి టెస్టుకు ముందే అక్కడి వాతావరణ పరిస్థితులకు అలవాటు పడేందుకు డబ్ల్యుపీసీసీలో సౌకర్యాలు ఉపయోగపడనున్నాయి.

'ఆ ఐదుగురి'పైనే..

భారత బ్యాట్స్‌మెన్‌కు అసలు సవాలు.. దక్షిణాఫ్రికా 'బిగ్ ఫైవ్' బౌలర్లను ఎదుర్కోవడమే. పేసర్లు డేల్ స్టెయిన్, కగిసో రబాడ, మోర్నీ మోర్కెల్, ఫిలాండర్‌లతో పాటు లెఫ్టార్మ్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్ ఈ జాబితాలో ఉన్నారు. స్టెయిన్ అపార అనుభవం.. రబాడ పదునైన యార్కర్లు, బౌన్సర్లు.. మోర్కెల్, ఫిలాండర్ కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్ బంతులు.. కేశవ్ సుడులు తిరిగే స్పిన్ భారత్‌ను ఉక్కిరిబిక్కిరి చేయనున్నాయి. అయితే పిచ్‌లు నిజంగానే బౌన్స్‌కు అనుకూలించినట్టయితే భారత పేసర్లు భువనేశ్వర్, ఇషాంత్, షమీ, ఉమేశ్, బుమ్రా కూడా సిద్ధంగానే ఉంటారు. గత ఏడాది భారత్ ఒక్క టెస్టు మాత్రమే ఓడి అన్నింటా విజయాలు సాధించగలిగిందంటే అందులో బౌలర్ల కృషిని తక్కువ చేయలేము. కానీ కూకాబుర్రా బంతులతో బౌలింగ్ చేయడం అంత సులువు కాకపోవచ్చు. ఎందుకంటే 30 ఓవర్ల అనంతరం ఆ బంతితో ఎలాంటి వైవిధ్యాన్ని చూపలేము. అన్నింటికన్నా ముఖ్యంగా బిగ్ ఫైవ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటూ జట్టు బ్యాటింగ్ ఆర్డర్ ముందుగా స్కోరు బోర్డుపై భారీ స్కోరు సాధించాల్సి ఉంటుంది. అయితే ఈ క్రమంలో ఒక్క చెడ్డ సెషన్ ఎదురైనా కుప్పకూలినట్టే. అందుకే ముందుగానే ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం నింపేందుకు కోచ్ రవిశాస్త్రి నడుం బిగించాడు. ప్రతీ మ్యాచ్‌ను స్వదేశంలో జరుగుతున్నట్టుగానే భావించాలని, అక్కడ ఆడినా కూడా పిచ్‌ను తమకు అనుకూలంగా మలుచుకోవాలని గుర్తుచేస్తున్నాడు. 'సత్తా కలిగిన జట్టు ఎలాంటి పరిస్థితులెదురైనా తమకు అనుకూలంగా మార్చుకుంటుంది. ఇక దక్షిణాఫ్రికాలో సిరీస్ నెగ్గేందుకు ఇంతకు మించిన తరుణం లేదని జట్టుకు కూడా తెలుసు. ఈ క్రమంలో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పర్యటనను ఆస్వాదిస్తూనే తమ శక్తిసామర్థ్యాలను చక్కగా వినియోగిస్తే విజయం దక్కకపోదు.



రోహిత్ శర్మతో కోహ్లీ (ఫైల్)

ఉగ్రవాదాన్ని ఆపితేనే పాక్‌తో ద్వైపాక్షిక క్రికెట్

కేంద్ర మంత్రి సుష్మ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: సీమాంతర ఉగ్రవాదానికి, సరిహద్దుల్లో కాల్పులకు స్వస్తి పలకనంత వరకూ పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాలు ఉండబోవని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ స్పష్టం చేశారు. సోమవారం ఇక్కడ జరిగిన విదేశీ వ్యవహారాల శాఖ పార్లమెంట్ సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆమె ఈ విషయం ప్రకటించారు. 'పొరుగు దేశంతో సంబంధం' అనే అంశం ప్రధాన అజెండాగా జరిగిన ఈ భేటీలో విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి ఎంజే అక్బర్, విదేశాంగ శాఖ కార్యదర్శి ఎస్. జైశంకర్ పాల్గొన్నారు. తటస్థ వేదికల్లో కూడా పాకిస్థాన్‌తో క్రికెట్ సిరీస్‌లలో పాల్గొనే అవకాశమే లేదని సుష్మ కుండబద్ధలు కొట్టారు. ఉగ్రవాదం, క్రికెట్ ఒకే బాటలో పయనించలేవని ఆమె అన్నారు.

సబ్బీర్‌పై వేటు



ఢాకా: ఓ అభిమానిపై దాడి చేసినందుకు బంగ్లాదేశ్ ఆల్‌రౌండ ర్ సబ్బీర్ రహమాన్ భారీ మూల్య మే చెల్లించుకున్నాడు. ఏకంగా బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ) సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోవడమే కాకుండా రూ.16 లక్షల జరిమానా కూడా అతనిపై పడింది. దీంతోపాటు దేశవాళీ క్రికెట్‌కు ఆరునెలల పాటు దూరం కానున్నాడు. బీసీబీ ఓ ఆటగాడిపై ఇంత కఠినంగా వ్యవహరించడం ఇదే తొలిసారి. ఈనెల 21న రాజ్‌షాహి డివిజన్ జాతీయ క్రికెట్ లీగ్ సందర్భంగా అంపైర్ అనుమతి తీసుకుని మరీ సబ్బీర్ గ్యాలరీలో ఉన్న ఓ అభిమానిపై చేయిచేసుకున్నాడు. అంతేకాకుండా ఈ ఘటనపై విచారణకు ఆదేశించిన రిఫరీతో కూడా అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో బీసీబీ తీవ్రంగా స్పందించింది.

బెంగళూరుకు 'అక్సెల్‌సెన్' విక్టరీ

లక్నో : పీబీఎల్‌లో సోమవారంనాటి మ్యాచ్‌లో బెంగళూరు బ్లాస్టర్స్ 6-(-1)తో ముంబై రాకెట్స్‌ను చిత్తుగా ఓడించింది. ప్రపంచ ఐదో నెంబర్ కొరియా ఆటగాడు సన్ వాన్ హో నుంచి ఎదురైన తీవ్ర ప్రతిఘటనను తిప్పికొట్టిన వరల్డ్ చాంపియన్ విక్టర్ అక్సెల్‌సెన్ 15-6, 15-13 విజయంతో తన జట్టుకు రెండు పాయింట్లు అందించాడు. అంతకుముందు మిక్స్‌డ్ డబుల్స్‌లో ఎన్.సిక్కిరెడ్డి, కిమ్ సా రంగ్, మహిళల సింగిల్స్‌లో గిల్మోర్ ప్రత్యర్థులపై విజయంతో బెంగళూరును 2-0 ఆధిక్యంలో నిలిపారు. కాగా ట్రంప్‌గా ఎంచుకున్న పురుషుల సింగిల్స్ మ్యాచ్‌ను ముంబై చేజార్చుకోవడంతో ఆ జట్టుకు -1 పాయింట్ లభించింది. ఇక ఆఖరి పురుషుల డబుల్స్‌లోనూ ముంబై రాకెట్స్‌ను ఓడించి బెంగళూరు తన జోరు కొనసాగించింది.

స్టార్ స్పోర్ట్స్‌కు స్కూల్ గేమ్స్ ప్రసార హక్కులు

న్యూఢిల్లీ: ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్ ప్రసార హక్కులను స్టార్‌స్పోర్ట్స్ దక్కించుకున్నది. 2018-2022 కాలానికి స్కూల్‌గేమ్స్‌ను ప్రసారం చేసే హక్కులను స్టార్ స్పోర్ట్స్‌కు కేటాయించినట్టు కేంద్ర క్రీడా మంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్ వెల్లడించాడు. ఖేలో ఇండియా ప్రణాళిక కింద జనవరి 31 నుంచి అండర్-17 బాలబాలికలకు 16 క్రీడాంశాలలో జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలను నిర్వహించనున్నారు. స్కూల్ గేమ్స్‌ను టీవీలలో, డిజిటల్ ప్లాట్‌ఫాంపై ప్రత్యక్ష ప్రసారం చేయనుండడం ఇదే తొలిసారి.

మాకో ద్రావిడ్ కావాలి



కరాచీ: భవిష్యత్ వనరుల అభివృద్ధి కోసం బీసీసీఐ బాటలో నడవాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు ఆ దేశ మాజీ ఆటగాడు రమీజ్ రజా సలహా ఇచ్చాడు. తమ అండర్-19 టీమ్‌కు రాహుల్ ద్రావిడ్ తరహా కోచ్‌ను నియమించాలని సూచించాడు. విజయాలకంటే జూనియర్ స్థాయిలో ఆటగాళ్ల ప్రతిభను పసిగట్టి వారిని సానబెట్టడం ఎంతో ముఖ్య మన్నాడు. ద్రావిడ్ లాంటి అనుభవజ్ఞుడు కోచ్‌గా, మెంటార్‌గా ఉంటే యువ ఆటగాళ్లు ఎంతో నేర్చుకోవచ్చన్నాడు.

డీజే.. శాస్త్రి!

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా పర్యటనలోనున్న టీమిండియా కొత్త ఏడాదికి ఘనస్వాగతం పలికింది. వేడుకల్లో ఆడిపాడింది. కోచ్ రవిశాస్త్రి డీజే అవతారమెత్తి పార్టీలో జోష్ నింపాడు. 'అందరికీ న్యూఇయర్ శుభాకాంక్షలు. వేడుకలు యమా కిక్‌గా సాగాయనుకుంటున్నా. అందరికీ భగవంతుడి ఆశీస్సులుండాలి' అని తాను డీజేగా ఉన్న ఫొటోను శాస్త్రి ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు.





త్వరలోనే తండ్రి కాబోతున్నట్లు క్రికెటర్ పుజారా వెల్లడించాడు. 'ఈ ఏడాది మాకు మరింత సంతోషం. నా భార్య పండంటి బిడ్డకు జన్మనివ్వనుంది' అని గర్భవతిగా ఉన్న భార్య పూజతో కలిసి దిగిన ఫొటోను పుజారా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు.

తెలంగాణ ముందంజ

• జాతీయ సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి: జాతీయ సీనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ పురుషుల జట్టు ముందంజ వేసింది. ఇక్కడి గచ్చిబౌలీ స్టేడియంలో సోమవారం జరిగిన పురుషుల విభాగంలో తెలంగాణ జట్టు 46-19 స్కోరు తేడాతో చండీగఢ్‌పై గెలుపొందింది. అంతకుముందు బిహార్‌తో మ్యాచ్‌ను 32-32తో డ్రాగా ముగించింది. అయితే ద్వితీయార్థంలో బిహార్ అనూహ్యంగా పుంజుకొని తెలంగాణ విజయాన్ని అడ్డుకుంది. మరో మ్యాచ్‌లో తమిళనాడు చేతిలో 23-35తో ఓటమిపాలైంది. మహిళల విభాగంలో పశ్చిమ బెంగాల్ జట్టు 42-27 స్కోరు తేడాతో తెలంగాణ జట్టుపై విజయం సాధించింది ఆరంభం నుంచే బెంగాల్ మహిళలు ఆధిక్యాన్ని చాటుకుంటూ మ్యాచ్‌పై పూర్తి పట్టు బిగించారు.



తెలంగాణ, చండీగఢ్ జట్ల మ్యాచ్ దృశ్యం

ఫిట్‌నెస్సే ప్రధానం

(రోహన్ బోపన్న)

గతేడాది నాకెంతో ప్రత్యేకమైనది. ఫ్రెంచ్ ఓపెన్‌తో నా కెరీర్‌లో తొలి గ్రాండ్‌శ్లామ్ టైటిల్‌ను గెలిచాను. అయితే ఆటలో నా భాగస్వామిని తరచూ మార్చుకోవాల్సి వచ్చింది. గతేడాది ఏటీపీ వరల్డ్ టూర్ టోర్నీల్లో వివిధ భాగస్వాములతో ఫైనల్స్‌కు చేరాను. కొన్ని వారాలుగా బెంగళూరులో జీవన్‌తో కలిసి ప్రాక్టీస్ చేస్తున్నాను. శిక్షణ ఎంతో కఠినంగా సాగుతోంది. ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడమేకాక సీజన్ మొత్తం రాణించే విధంగా ఈ శిక్షణ కార్యక్రమం రూపొందించారు. కొన్నిసార్లు గెలవచ్చు, కొన్నిసార్లు ఓడొచ్చు. ఏడాది పొడవునా ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ నిరంతరం ఆటను ఆస్వాదించడమే నిజమైన టెన్నిస్. పుణెకు రావడం సొంత ఇంటికి వచ్చినట్టుంది. 1994 నుంచి ఐదేళ్లపాటు ఇక్కడ ఉన్నాను. ఈ నగరంతో నాకు ఎన్నో మధుర జ్ఞాపకాలున్నాయి. ఇండియా ఓపెన్‌ను చెన్నైనుంచి ఇక్కడకు బదలాయించడం ముదావహం. ఇప్పుడు జరుగుతున్న మహారాష్ట్ర ఓపెన్‌లో జీవన్‌తో కలిసి డబుల్స్‌లో ఆడుతున్నాను. ఇక్కడ టైటిల్ నెగ్గుతామన్న విశ్వాసముంది.


S & D

మాతృభాషలో సైన్స్ బోధన!

▸▸ యువతలో ఆసక్తి పెంచేందుకు ఇదే మార్గం

▸▸ మన సైంటిస్టులు మన జాతిగౌరవం: మోదీ

కోల్‌కతా, జనవరి 1 : సైన్స్‌ను పెద్దఎత్తున ప్రోత్సహించాలన్నా.. యువతలో దానిపై ప్రేమ పెంచాలన్నా.. మాతృభాషలోనే దానిని నేర్పాలని ప్రధాని మోదీ భారత శాస్త్రవేత్తలను కోరారు. దేశంలోని ప్రతి శాస్త్రవేత్త, పరిశోధకుడు.. నవభారతం కోసం కొత్త ఆవిష్కరణలు, నూతన పరిశోధనలు చేయాలని ఆకాంక్షించారు. ప్రఖ్యాత శాస్త్రవేత్త సత్యేంద్రనాథ్ బోస్ 125వ జయంతిని పురస్కరించుకుని సోమవారం కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రధాని ప్రసంగించారు. బెంగాలీలో తన ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన.. రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. సౌర విద్యుత్, గ్రీన్ ఎనర్జీ, జలసంరక్షణ, వ్యర్థాల నిర్వహణ రంగాల్లో కేంద్రం వివిధ సైన్స్ సంస్థలతో పరిశోధన-అభివృద్ధి ప్రాజెక్టును ప్రారంభించిందన్నారు. స్టార్టప్ ఇండియా, నైపుణ్యాభివృద్ధి సంస్థ తరహాలో శాస్త్రీయ మౌలిక వసతుల యంత్రాంగాన్ని నెలకొల్పాలన్నది తమ లక్ష్యంగా పేర్కొన్నారు. ప్రతి శాస్త్రవేత్త కనీసం ఒక పిల్లవాడికైనా గురువుగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కొత్త సంవత్సరంలో ప్రతి సైంటిస్టూ తమ ఆవిష్కరణలు, పరిశోధనలను నవ భారత నిర్మాణం దిశగానే చేపట్టాలని సూచించారు. ఉన్నత విద్యారంగంలో 20 ఘనతర సంస్థలను కేంద్రం నెలకొల్పుతోందని, ఈ మిషన్‌లో ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థలు పాలుపంచుకోవాలని ప్రధాని ఆహ్వానించారు. భారతీయ శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులను 'జాతిగౌరవం'గా అభివర్ణించారు. 'భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో వంద ఉపగ్రహాలను ఒకేదఫా రోదసిలోకి పంపడంతో యావత్ ప్రపంచం దాని గొప్పతనాన్ని గ్రహించింది. శాస్త్రవేత్తలు కొత్త సాంకేతిక సవాళ్లను స్వీకరించేందుకు సిద్ధంగా ఉండాలి. నీరు, విద్యుత్, విమానాశ్రయాలు, రోడ్లు, డిజిటల్ మౌలిక వసతుల కల్పనలో ఆవిష్కరణల కోసం ఎదురుచూస్తున్నాం' అని తెలిపారు. ఉన్నతమైన బెంగాల్ భూమి జగదీశ్ చంద్ర బోస్, మేఘనాద్ సాహా, ఎస్ఎన్ బోస్ వంటి ప్రజ్ఞాశీలురకు జన్మనిచ్చిందని.. వారి అంకితభావం, సృజనాత్మకతల నుంచి ఇప్పటికీ ప్రజలు లబ్ధి పొందుతున్నారని ప్రధాని తెలిపారు. 1894 జనవరి 1న పుట్టిన ఎస్ఎన్ బోస్.. బోసన్ కణాలను కనిపెట్టారని.. శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో కలిసి పనిచేశారని గుర్తుచేశారు. మాతృభాష ప్రాధాన్యం తెలిసినందునే బెంగాలీ సైన్స్ మేగజైన్‌ను ప్రారంభించారని తెలిపారు.



కమలం గూటికి ఇష్రత్ జహాన్

▸▸ మోదీని ప్రశంసించిన తలాక్ ఉద్యమకారిణి



న్యూఢిల్లీ, జనవరి 1: తక్షణ ట్రిపుల్ తలాక్ రద్దు కోరుతూ సుప్రీం కోర్టులో న్యాయ పోరాటం చేసిన ఇష్రత్ జహాన్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇష్రత్.. ఆదివారం బీజేపీలో చేరినట్టు రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి సయంతన్ బసు సోమవారం వెల్లడించారు. హౌరాలోని పార్టీ కార్యాయానికి వచ్చిన ఆమె బీజేపీ సభ్యత్వం తీసుకుని పార్టీలో చేరారని తెలిపారు. ఆమె చేరికను పురస్కరించుకుని త్వరలోనే ఓ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇక, ఇదే విషయాన్ని పార్టీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు కూడా ధ్రువీకరించారు. ప్రస్తుతం తాను జిల్లాల పర్యటనలో ఉన్నానని, త్వరలోనే హౌరా వెళ్లి.. ఇష్రత్ చేరికను పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. తక్షణ ట్రిపుల్ తలాక్ రద్దు కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించిన ఐదుగురిలో ఇష్రత్ ఒకరు. కాగా, ఈ సందర్భంగా ఓ మీడియా సంస్థతో మాట్లాడిన ఇష్రత్.. బెంగాల్ సీఎం మమతపై విమర్శలు గుప్పించారు. 'నేను బెంగాల్‌కి చెందిన వ్యక్తిని. మా రాష్ట్రాన్ని ఓ మహిళ పాలిస్తున్నారు. అయినప్పటికీ మాకు అండగా నిలవలేకపోయారు. నేను ఒంటరిగానే పోరాడాను. అధికార పార్టీ, సీఎం నుంచి కానీ నాకు ఎలాంటి మద్దతూ లభించలేదు' అని విమర్శించారు. ముస్లిం మహిళలకు అండగా నిలిచిన ప్రధాని మోదీకి ఇష్రత్ ధన్యవాదాలు తెలిపారు.

సంక్రాంతికే 'విడుదల'

'బాబా' గుర్తే పార్టీ చిహ్నం!.. సభ్యత్వ నమోదుకు వెబ్‌సైట్


చెన్నై, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): 'రాజకీయాల్లోకి రావడం తథ్యం' అంటూ ఇరవైయేళ్ల అనిశ్చితికి తెరదించిన తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్....పార్టీ ఏర్పాటు దిశగా వేగంగా కదులుతున్నారు. సంక్రాంతి పర్వదినానే పార్టీ ప్రారంభించేలా సన్నాహాలు చేస్తున్నారు. దీనిని రజనీ సోదరుడు సత్యనారాయణరావు కూడా ధ్రువీకరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "2019లో జరగబోయే ఎన్నికల్లో రజనీ అభిమాన సంఘాల తరఫున అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను బరిలో నిలుపుతాం. కొత్త పార్టీ, గుర్తు, సిద్ధాంతాలను త్వరలోనే వెల్లడిస్తాం. సంక్రాంతి రోజున రజనీ తన పార్టీ పేరును, చిహ్నాన్ని ఆవిష్కరించే అవకాశముంది" అని తెలిపారు. రాజకీయాల్లో తిరుగులేని విజయాలు సాధించి, ప్రజలకు మెరుగైన సేవలందించే సత్తా తన సోదరుడికి ఉందని సత్యనారాయణ ధీమా వ్యక్తం చేశారు.

'బాబా' చిహ్నం..

సుమారు రెండు దశాబ్దాలుగా ఆధ్యాత్మికత పట్ల ఆసక్తి కనబరుస్తున్న రజనీకాంత్.. తన పార్టీకి కూడా ఆధ్యాత్మిక వాసనలు అద్దే సూచనలు కనిపిస్తున్నాయి. రజనీ పార్టీ చిహ్నంగా 'బాబా' చిత్రంలో ఆయన చూపించిన గుర్తునే పెట్టే అవకాశముందని విశ్వసనీయ సమాచారం. కుడి చేతి చిటికెన, చూపుడు వేళ్లు తెరచి, మిగిలిన వేళ్లు మడిచి ఉండే చేతిచిహ్నం... కమలం నుంచి ఆవిర్భవించినట్లుగా ఉంటుంది.

కొత్త వెబ్‌సైట్ ప్రారంభం...

పార్టీ సభ్యత్వ నమోదు కోసం కొత్త వెబ్‌సైట్‌ను కొత్త సంవత్సరం తొలి రోజున రజనీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ట్విట్టర్‌లో ఒక వీడియో విడుదల చేశారు. "రిజిస్టర్ అయిన అభిమాన సంఘాలు, రిజిస్టర్ కాని సంఘాల అభిమానులు, మార్పు కోసం ఎదురుచూస్తున్న ప్రజల నుంచి సభ్యత్వ నమోదును ఆహ్వానిస్తున్నాం" అని తెలిపారు. www.rajinimandram.org వెబ్‌సైట్‌లో పేరు, ఓటరు గుర్తింపు కార్డు నెంబరును నమోదు చేసి సభ్యులుగా చేరవచ్చన్నారు.



రజనీ వెనుక ఉన్న 'బాబా' చిహ్నం

రజనీ మా వాడే: బీజేపీ

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రజనీ పార్టీ ఎన్డీయేలో భాగస్వామిగా ఉంటుందని బీజేపీ తమిళనాడు అధ్యక్షురాలు తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. తమ పార్టీ నేతలతో రజనీకి సన్నిహిత సంబంధాలున్నాయని ఆమె గుర్తు చేశారు. బీజేపీతో రజనీ మైత్రీబంధంపై విపక్ష డీఎంకే భిన్నంగా స్పందించింది. బీజేపీ ఏం చేసిందని ఆ పార్టీ ఇక్కడ పాగా వేయాలనుకుంటుందో అర్థం కావడం లేదని డీఎంకే ప్రతినిధి శరవణన్ వ్యాఖ్యానించారు. బీజేపీతో పొత్తుపై రజనీకాంతే స్పష్టత ఇవ్వాలన్నారు. కాగా, రజనీతో కలిసి ప్రయాణం చేయనున్నట్లు తమిళ రచయిత తమిళరువి మణియన్ ప్రకటించారు.

మా సొమ్ముతో 'ఉగ్ర' పోషణా?

33 బిలియన్ డాలర్లిచ్చి వెర్రి వెంగళప్పలయ్యాం... అమెరికన్లను చంపే తాలిబన్లకు ఆశ్రయమిస్తారా?

▸▸ పాకిస్థాన్ పచ్చి మోసకారి

▸▸ నిప్పులు చెరిగిన ట్రంప్



వాషింగ్టన్, జనవరి 1: అమెరికాకు ఇన్నేళ్ళ తర్వాత జ్ఞానోదయమైనట్లుంది... పదిహేనేళ్ళ పాటు పాకిస్థాన్‌కు భారీగా సాయం చేసి అవివేకులమయ్యామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. "ఇప్పటిదాకా పాకిస్థాన్‌కు 33 బిలియన్ డాలర్లు సాయంగా ఇచ్చాం. సైనిక పరంగానే కాదు, అభివృద్ధి కోసం, మానవత రూపేణా కూడా ఇచ్చాం. కానీ వారు ఆ సొమ్ముతో ఉగ్రవాదులను పెంచి పోషించారు. దేశాన్ని ఉగ్రవాదానికి స్వర్గధామంగా మార్చారు. మేం ప్రశ్నించినపుడు అన్నీ అబద్ధాలే చెప్పారు. ఇంత సాయానికి పాక్ నుంచి దక్కినది అబద్ధాలు, మోసాలు.. పాక్ మమ్మల్ని వెర్రివాళ్ళుగా జమకట్టింది. మోసం చేసింది. ఇక నుంచి పాక్‌కు ఇచ్చే సాయంలో భారీగా కోత విధించాలని నిర్ణయించాం" అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు ట్రంప్. 2018లో ట్రంప్ చేసిన తొలి ట్వీట్ ఇదే. "అఫ్గానిస్థాన్‌లో ఏ ఉగ్రవాదులనైతే మేం వేటాడామో అదే టెర్రరిస్టులకు పాక్ ఆశ్రయమిచ్చింది. వారు సుఖంగా జీవించడానికి అవకాశమిచ్చింది. ఇక చాలు.. కోత పెడ్తున్నాం" అని ఆయన దక్షిణాసియా పట్ల అనుసరించదల్చిన విధానంపై చేసిన ప్రసంగంలో కూడా తేల్చిచెప్పారు. పాక్‌కు 255 మిలియన్ డాలర్ల రుణాన్ని అమెరికా గతంలో వాగ్దానం చేసింది. దాన్ని ఇపుడు నిలుపుదల చేసింది. చాలా మార్లు పాక్ టెర్రర్ మూకలకు సాయపడింది.. వాటికి సురక్షిత కేంద్రంగా మారింది. అని ట్రంప్ తీవ్రంగా విమర్శించారు. "కోట్ల డాలర్లు పాక్‌కు కుమ్మరించాం. ఉగ్రవాదంపై మా పోరాటంతో కలిసి రమ్మన్నాం. కానీ వారు చేసిందేమిటి? మాతో సహకరిస్తే పాక్‌కు కూడా లాభపడుతుంది. క్రిమినల్స్‌తో కూడితే నష్టపోతుంది. అఫ్గానిస్తాన్‌లో మా పోరాటం ఎంతో వ్యయప్రయాసలకు, ప్రాణత్యాగానికి సంబంధించినది. తాలిబాన్లతో మేం పోరాడుతుంటే మా నుంచి సాయం అందుకున్న పాక్- అదే తాలిబన్‌కు ఆశ్రయమిస్తోంది. అంటే ఓ రకంగా అమెరికన్లను చంపడానికి పాక్ సహకరిస్తోంది. ఇంకా మౌనంగా ఉండలేం. ఈ పరిస్థితి మారాలి.. తక్షణం మారాలి..దక్షిణాసియాకే ప్రమాదకారిగా పరిణమించిన ఉగ్రవాదులు తలదాచుకునేందుకు ఆశ్రయమివ్వడాన్ని తక్షణం నిలిపేయాలి. నాగరికతకు, మానవ జీవన పద్ధతికి, శాంతికి తాము కట్టుబడి ఉన్నట్లు పాక్ నిరూపించుకోవాలి.. ప్రపంచదేశాలతో మమేకం కావాలి. మా సైనికుల్ని, ఆఫీసర్లను చంపుతున్న వర్గాలకే సాయపడడం అసాధ్యం" అని చాలా స్పష్టంగా తేల్చిచెప్పేశారు ట్రంప్.

లష్కరే, జేయూడీ సభ్యులు దేశ భక్తులు: ముషారఫ్



ఓ పక్క ప్రపంచమంతా హఫీజ్ సయీద్ ను, అతని పార్టీ జమాత్ ఉద్ దావా సభ్యులను ఉగ్రవాదులుగా పేర్కొంటుంటే- పాక్ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ మాత్రం వారు పరమ దేశభక్తులని కీర్తిస్తున్నారు. 'కుల్‌భూషణ్ జాదవ్ భారత గూఢచారి అనే విషయాన్ని భారత్ ఒప్పుకోవడం లేదు. అలాంటపుడు లష్కరే తోయిబా,ను దాని అనుబంధ సంస్థ జమాత్-ఉద్-దవానూ ఉగ్రవాద సంస్థలనే భారత ఆరోపణలను మేమెలా అంగీకరిస్తాం? వాస్తవానికి ఈ రెండు సంస్థల సభ్యులు గొప్ప దేశభక్తులు. పాకిస్తాన్ కోసం కశ్మీర్‌లో వారు ప్రాణాలు కోల్పోయారు' అని ముషారఫ్ వ్యాఖ్యానించారు.

సయీద్ సంస్థల విరాళాలపై నిషేధం

ఇస్లామాబాద్: డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన డోసు పాకిస్థాన్‌కు చాలా గట్టిగా తగిలింది. సాయం పొందడానికి కొత్త నాటకం మొదలెట్టింది. ఉగ్రవాద నేత, జమాత్-ఉద్-దావా (జేయూడీ) అధిపతి హఫీజ్ సయీద్‌కు చెందిన సంస్థలు విరాళాలు సేకరించకుండా నిషేధం విధించింది. నిషేధంపై సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజి కమిషన్ ఆఫ్ పాకిస్థాన్ (ఎస్ఈసీపీ) ఓ నోటిఫికేషన్ జారీ చేసింది. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి ఆంక్షల జాబితాలో ఉన్న జేయూడీతో పాటు దాని మాతృసంస్థ లష్కరే తయిబాను, మరో రెండు సంస్థలనూ నిషేధించింది. ఇవి కాశ్మీర్ స్వతంత్ర్య పోరాటానికి మద్దతుగా విరాళాలు సేకరిస్తున్నాయని డాన్ పత్రిక తెలిపింది. తమ నిర్ణయాలను పాక్ సర్కార్- అమెరికాకు తెలియపర్చింది. జేయూడీ మరింతగా విస్తరించకుండా కట్టడి చేస్తామనీ వాగ్దానం చేసింది. అయితే వీటిని అమెరికా ఎంత వరకూ విశ్వసిస్తుందనేది ప్రశ్నార్థకమే.. ఎందుకంటే పాక్‌లో సయీద్ నెట్‌వర్కు, తాలిబన్ అనుకూల గ్రూపులు పాతుకు పోయి ఉన్నాయి. వాటిని పెకలించడం పాక్ తరం కాదని అమెరికాకు తెలుసు.





నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబరు 31న రాత్రి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారుల నుంచి స్వాధీనం చేసుకున్న కార్లు ఇవి.. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ ముందు వీటిని వరుసగా ఉంచారు.



ప్రదీప్‌కు బ్రీత్ ఎనలైజర్ పరీక్ష నిర్వహిస్తున్న ఎస్ఐ రాంబాబు

రాతిరంత జాతర

▸▸ డ్రంకెన్ డ్రైవ్‌లో చిక్కిన యాంకర్ ప్రదీప్

▸▸ 3 కమిషనరేట్లలో 2400కుపైగా కేసులు

▸▸ 420.46 కోట్ల మద్యం అమ్మకాలు

బంజారాహిల్స్/హైదరాబాద్, జనవరి 1: తాగి ఊగారు..ఊగి తాగారు..న్యూ ఇయర్ జోష్‌లో మునిగి తేలారు. మద్యం మత్తులో రాతిరంతా జాతర చేశారు. చివరకు డ్రంకెన్ డ్రైవ్‌లో ఎంతోమంది యువకులు అడ్డంగా దొరికిపోయారు. ఆదివారం అర్ధరాత్రి నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో నటుడు, యాంకర్ ప్రదీప్ పోలీసులకు చిక్కాడు. మాదాపూర్‌లో ఓ పార్టీలో పాల్గొన్న ప్రదీప్.. మద్యం సేవించి కారు నడుపుతూ.. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 45 దగ్గర నిర్వహించిన తనిఖీల్లో దొరికిపోయాడు. పోలీసులు నిర్వహించిన బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో..బ్లడ్ అల్కాహాల్ కంటెంట్(బీఏసీ) 178 గ్రాములుగా నమోదైంది. ప్రదీప్ బీఎండబ్ల్యూ కారును సీజ్ చేసిన పోలీసులు.. కేసు నమోదు చేసి మంగళవారం జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని చెప్పారు. ప్రదీప్‌కు జరిమానాతోపాటు జైలుశిక్ష కూడా పడే అవకాశాలున్నాయని చెబుతున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో జరిగిన డ్రంకెన్ డ్రైవ్‌లలో..2400కుపైగా కేసులు నమోదయ్యాయి. తనిఖీల్లో సీజ్ చేసిన ఖరీదైన కార్లతో బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ రోడ్డు నిండిపోయింది. కాగా, యువతను లక్ష్యంగా చేసుకుని నగరంలో దాదాపు 180 వరకూ పార్టీలు నిర్వహిస్తే..వాటిలో 70శాతానికిపైగా పార్టీలు ఫుల్ జోష్‌తో జరిగాయన్నది ఈవెంట్ ఆర్గనైజర్ల మాట! సెలబ్రిటీల జోరు లేకపోయినా.. జోరు మాత్రం తగ్గలేదు. పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో.. పార్టీకి వచ్చిన అతిథులను సురక్షితంగా ఇం టికి చేర్చడానికి నిర్వాహకులు క్యాబ్ సేవలను ఏర్పా టు చేశారు. కాగా, కొత్త సంవత్సర వేడుకల్లో మందు ప్రియులు మజా చేసుకున్నారు. 3 రోజుల్లో రూ.420.46 కోట్ల మద్యం లాగించేశారు. డిసెంబరు ఒక్క నెలలోనే రాష్ట్రంలో రూ.1649.62 కోట్ల లిక్కర్ సేల్స్ జరిగినట్లు తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ వెల్లడించింది. అటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఒక్క డిసెంబరు 31న రూ.100 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు అధికారులు అంచనాకు వచ్చారు. న్యూ ఇయర్ వేడుకల్లో ఏపీ రాజధాని అమరావతి ప్రాంతంలో విక్రయాలు భారీగా పెరిగాయి.

ఆ బటన్.. నా ముందే ఉంది!

▸▸ రెచ్చగొట్టేలా మాట్లాడితే ఒక్కనొక్కు నొక్కుతా

▸▸ హడలెత్తించిన కిమ్ కొత్త సంవత్సర ప్రసంగం



సియోల్, జనవరి 1: నూతన సంవత్సరం తొలి రోజే ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ శత్రుదేశాలకు వణుకు పుట్టించారు. తమ దేశం జోలికొచ్చి వినాశనాన్ని కోరి తెచ్చుకోవద్దని తీవ్రంగా హెచ్చరించారు. న్యూక్లియర్ వార్‌హెడ్స్, బాలిస్టిక్ మిస్సైల్స్‌ను భారీగా తయారు చేయాలని పిలుపునిచ్చారు. ఉత్తర కొరియాతో యుద్ధానికి గతంలో ఎన్నడూ లేనంతగా అమెరికా దగ్గరవుతోందంటూ యూఎస్ మిలిటరీ మాజీ ఉన్నతాధికారి మైక్ ముల్లెన్ తాజాగా చేసిన వ్యాఖ్యలపై తన నూతన సంవత్సర ప్రసంగంలో కిమ్ ఘాటుగా స్పందించారు. తన ఎదురుగా ఉన్న టేబుల్‌పైనే ఎప్పుడూ ఒక న్యూక్లియర్ బటన్ ఉంటుందని, దాన్ని ఒక్కసారి నొక్కితే మొత్తం బుగ్గిపాలవుతుందని హెచ్చరించారు. తమ దేశాన్ని గురించి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే దాన్ని ప్రయోగించాల్సి ఉంటుందన్నారు. అమెరికా మొత్తం తమ మిసైల్స్ పరిధిలోకి వచ్చిందని, ఇది కేవలం బ్లాక్‌మెయిల్ చేయడానికో, భయపెట్టడానికో తాను చెప్పడం లేదని, ఇందులోని వాస్తవాన్ని గుర్తిస్తే అందరికీ మంచిదని వ్యాఖ్యానించారు. అణ్వాయుధ సామర్థ్యం ఉన్న ఖండాంతర క్షిపణుల ప్రయోగాలను ఇకముందు కూడా కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. అణ్వస్త్రాల తయారీని ఇంకా వేగవంతం చేయాలని, ఖండాంతర క్షిపణులను పెద్దఎత్తున మోహరించాలని పిలుపునిచ్చారు. అయితే వాటిని కేవలం తమ దేశ క్షేమం కోసం మాత్రమే ఉపయోగిస్తామని ఆయన పేర్కొన్నారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో దక్షిణ కొరియాతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని కిమ్ ప్రకటించారు. ఈ వ్యాఖ్యలను దక్షిణ కొరియా అధ్యక్ష కార్యాలయం స్వాగతించింది. చర్చలకు తాము ఎప్పుడైనా సిద్ధమేనని ప్రకటించింది.

అంతర్జాతీయ అంశాల్లో మేమే కీలకం: జిన్‌పింగ్



బీజింగ్, జనవరి 1: అంతర్జాతీయంగా అన్ని ప్రధాన అంశాల్లో తమ పాత్ర ఉంటుందని చైనా స్పష్టం చేసింది. ఆ దేశ అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఇచ్చిన నూతన సంవత్సర సందేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. అంతర్జాతీయ అంశాల్లో బాధ్యతాయుతమైన పెద్ద దేశంగా చైనా చెప్పాల్సింది ఎంతోకొంత ఉంటుందన్నారు. ఐక్యరాజ్యసమితి అధికారాలు, హోదాకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని.. అదేసమయంలో అంతర్జాతీయంగా తమ బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వర్తిస్తామని పేర్కొన్నారు. వాతావరణ మార్పుల విషయంలో తాము చేసిన ప్రతిజ్ఞకు కట్టుబడి ఉంటామని, బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్(బీఆర్ఐ) అంశంలో చురుగ్గా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

'పుల్వామా' హంతకుల్లో పదో తరగతి విద్యార్థి!

▸▸ ఉగ్రదాడిలో పాల్గొన్న 16ఏళ్ల కుర్రాడు



న్యూఢిల్లీ, జనవరి 1 : కశ్మీర్‌లోని పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ శిబిరంలోకి చొరబడి, జవాన్లను కాల్చిచంపిన ఉగ్రవాదుల్లో చివరి మిలిటెంట్‌ను ఎట్టకేలకు భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఆదివారం తెల్లవారుజామున మొదలయిన ఈ ఎన్‌కౌంటర్ సోమవారం సాయంత్రానికి ముగిసింది. మృతి చెందిన ముగ్గురు ఉగ్రవాదుల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి ఉండటం భద్రతా బలగాలను కలవరపరుస్తోంది. ఆదివారం తెల్లవారుజామున అవంతిపోరా ప్రాంతంలోని సీఆర్‌పీఎఫ్ శిబిరంపై గ్రెనేడ్ లాంచర్లు, ఆటోమేటిక్ ఆయుధాలతో ముగ్గురు దాడిచేసి.. ఐదుగురు జవాన్లను కాల్చిచంపిన విషయం తెలిసిందే. ఈ దాడిలో ఓ పోలీసు కుమారుడు కూడా పాల్గొన్నట్టు ప్రకటించిన సైనిక అధికారులు, అతడిని 16 ఏళ్ల ఫర్దీన్ అహ్మద్ ఖండేగా సోమవారం గుర్తించారు. ఈ దాడికి ముందు ఖండే మాట్లాడిన 8 నిమిషాల వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. 'దేవుని ఇచ్ఛ మేరకు నడుచుకొంటున్నాను. మీరు ఈ వీడియో చూసే సమయానికి స్వర్గంలో భగవంతుని రాజ్యానికి కాపలా కాస్తుంటాను" అని ఆ వీడియోలో ఖండే పేర్కొన్నారు. ఈ దాడి తమ పనేనని జైషే మహ్మద్ తెలిపింది.

పొగమంచుతో.. ఢిల్లీలో విమానాలు ఆలస్యం

▸▸ నేడు ఆలస్యంగా బయలుదేరనున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్

న్యూఢిల్లీ, జనవరి 1: పొగమంచు కారణంగా ఢిల్లీ విమానాశ్రయంలో వరసగా రెండోరోజూ పలు విమానాలు రద్దవ్వగా, మిగతా విమానాల రాకపోకల్లో ఆలస్యం చోటుచేసుకుంది. సోమవారం ఎనిమిది విమానాలను రద్దు చేశామని, 265 దేశీయ, 67 అంతర్జాతీయ గమ్యాలకు చేరే విమానాలు ఆలస్యంగా నడిచాయని అధికారులు తెలిపారు. మరోవైపు ఉత్తరాదిలో పొగమంచు కారణంగా 400 రైళ్లు ఆలస్యంగా నడిచాయని, 15 రైళ్లను రద్దు చేశామని భారత రైల్వే అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం 6.55లకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరనున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌ను మధ్యాహ్నం 1.55లకు రీషెడ్యూల్ చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

2వేల లోపు డెబిట్‌కార్డు లావాదేవీలపై చార్జీలు రద్దు

న్యూఢిల్లీ, జనవరి 1: నగదు రహిత లావాదేవీలను పోత్సహించే దిశగా కేంద్రం మరో అడుగు ముందుకేసింది. డెబిట్ కార్డు ద్వారా 2 వేల లోపు జరిగే లావాదేవీలకు జనవరి 1 నుంచి చార్జీలను ఎత్తివేసింది. 2వేల లోపు డెబిట్‌కార్డు, భీమ్ ఆధారిత లావాదేవీలపై చార్జీలను రద్దు చేస్తున్నామని కేంద్ర ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్‌కుమార్ ట్విట్టర్‌లో వెల్లడించారు.



వాట్సాప్.. హ్యాండ్సప్!

▸▸ సందేశాల వెల్లువతో చేతులెత్తేసిన యాప్

▸▸ కొత్త ఏడాది మొదటి గంట అంతరాయం

న్యూఢిల్లీ, జనవరి 1: కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టిన క్షణంలో ఒక్కసారిగా వెల్లువెత్తిన శుభాకాంక్షల ధాటికి ప్రఖ్యాత మేసేజింగ్ యాప్ వాట్సాప్ అంతరాయంతో చేతులెత్తేసింది. 2017 డిసెంబరు 31 అర్ధరాత్రి 12 గంటల సమయంలో వెల్లువలా వచ్చిన సందేశాల ట్రాఫిక్ దెబ్బకు గంటపాటు వాట్సాప్ సర్వర్ డౌన్ అయింది. రాత్రి 1 గంట తర్వాత మళ్లీ యథాస్థితికి వచ్చింది. ఒక్క భారత్‌లోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లోనూ ఈ పరిస్థితి ఏర్పడింది. అయితే కొత్తఏడాది ఆరంభంలో వినియోగదారులకు కలిగిన అసౌకర్యానికి వాట్సాప్ సంస్థ క్షమాపణలు కోరింది. ప్రపంచవ్యాప్తంగా చాలా చోట్ల వాట్సాప్ వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అయితే ఈ సమస్యను పరిష్కరించి సేవలు పునరుద్ధరించామని సంస్థ అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు. టెక్స్ట్ మెజేస్‌లు, ఫొటోలతోపాటు ఎంత నిడివి ఉన్న వీడియోలనైనా సులువుగా చేరవేసే వాట్సాప్‌ను భారత్‌లోనే సుమారు 20 కోట్ల మంది వినియోగిస్తున్నారు.



ఫ్లోరిడా కీస్ దీవుల్లోని కీవెస్ట్‌లో నూతన సంవత్సరాన్ని ఇలా వినూత్నంగా ఆహ్వానించారు. 8 అడుగుల పొడవు, 4 అడుగుల ఎత్తు మడమ ఉన్న ఎర్రని బూటుపై 'సుశి' భువికి దిగి వచ్చింది! 11 గంటల నుంచి కొద్దికొద్దిగా కిందికి దించుతూ 12 గంటలు కొట్టేసరికి ఈ బూటును భూమిపైకి చేర్చి కొత్త ఏడాదిని స్వాగతిస్తారు. 'సుశి' వేషంలో ఉన్నది గ్యారీ మారియన్ అనే పురుషుడంటే ఎవరూ నమ్మరు కదూ? అదే ఈ వేడుకలో విశేషం. 1996 నుంచీ అక్కడి ప్రజలు ఏటా ఇలాగే కొత్త ఏడాదిని ఎంతో సందడిగా ఆరంభిస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.